
# అన్నమయ్య సంకీర్తనా సౌరభం

(Annamayya Samkeerthana Sowrabham)



(తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆర్థిక సహాయంతో ప్రచురితం)

శ్రీమతి ఆర్. శోభాదేవి

# అన్నమయ్య సంకీర్తనా సౌరభం

## (Annamayya Samkeerthana Sowrabham)



DISCOUNT-50%

(తిరుమల తిరుపతి దేవస్థానం వారి
ఆర్థిక సహాయంతో ప్రచురితం)

శ్రీమతి ఆర్. శోభాదేవి
Smt. R. Sobha Devi

**అన్నమయ్య సంకీర్తనా సౌరభం**

తొలి ముద్రణ : 2012

ప్రతులు : 1000

వెల : రూ. 150

హక్కులు : రచయిత్రివి ©

# DISCOUNT-50%

ప్రతులకు :

**ఆర్. శోభాదేవి**

బి. 408, సాయికృపా రెసిడెన్సీ

మోతీనగర్, హైదరాబాద్ - 500 018.

ఫోను : 040-23831112

లేదా

విశాలాంధ్ర బుక్ హౌస్,

హైదరాబాద్.

టైప్‌సెట్టింగ్ & కవర్ డిజైనింగ్


టి. రాజేంద్రప్రసాద్

సెల్: 9989890588

ముద్రణ :

విజన్ ప్రింటర్స్,

చిక్కడపల్లి, హైదరాబాద్.



ఈ గ్రంథం తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆర్థిక సహాయంతో ముద్రించబడినది.

ఈ గ్రంథముద్రణ అనంతరం వచ్చే విమర్శలకు, చట్టరీత్యా తీసుకునే చర్యలకు

గ్రంథకర్తగా నాదే బాధ్యత

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | అన్నమయ్య పదసంపద | 7 |
| 2. | దైవసంబంధ కీర్తనలు | 11 |
| | - నృసింహుడు | |
| | - శ్రీరాముడు | |
| | - హనుమంతుడు | |
| | - శ్రీకృష్ణుడు | |
| | - దశావతారాలు | |
| 3. | ఆధ్యాత్మ కీర్తనలు | 48 |
| 4. | అలమేలుమంగ సొబగులు | 82 |
| 5. | శ్రీ వేంకటేశ్వర కీర్తనలు | 104 |
| 6. | అన్నమాచార్యునిపై స్తుతి కీర్తనలు | 183 |
| 7. | నామమహిమ, కల్యాణ కీర్తనలు | 193 |
| 8. | బ్రహ్మోత్సవ వాహనములు | 206 |
| 9. | వివిధ కీర్తనలు | 211 |

# నివేదన

అన్నమయ్య భక్తి సామ్రాజ్యం పుస్తకాన్ని 2011లో తిరుమల తిరుపతి దేవస్థాన సౌజన్యంతో ప్రచురించాను. పాఠకులు, మిత్రులు విశేషంగా ఆదరించారు.

ప్రముఖ సాహితీవిమర్శకులు డా॥ ద్వా.నా. శాస్త్రి "నవ్య" వారపత్రికలో సమీక్షిస్తూ ప్రశంసించారు. సప్తగిరి మాసపత్రికలో సమీక్ష వచ్చింది.

ఇది నా రెండో ప్రయత్నం. కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖవారి సౌజన్యంతో నేను చేసిన రెండేళ్ల పరిశోధనా ఫలితమే నా మొదటి ప్రచురణ, ఈ మలిప్రచురణ. తిరుపతి అన్నమాచార్య ప్రాజెక్టులో అన్నమయ్య కీర్తనలు రాజమోహన్ సార్ వద్ద నేర్చుకున్నాను. మా శ్రీవారు డా॥ ఆర్. అనంతపద్మ నాభరావుగారు పని చేసిన టి.టి.డి. దృశ్యశ్రవణ ప్రాజెక్టు వారు వెయ్యి దాకా కీర్తనలు ఆడియో సి.డి.లుగా తయారు చేయించారు. వాటిని మూడు గ్రంథాల రూపంలో దేవస్థానం ప్రచురించింది. ఆ పాటల్ని ఈ పరిశోధనకు ప్రణాళికగా ఎంచుకొన్నాను. మా వారు డా॥ ఆర్. అనంత పద్మనాభరావు గారి ప్రోత్సాహం ఈ రచనకు, ప్రచురణకు వెన్నెముక.

గ్రంథ ప్రచురణకు ఆర్థిక సహకారం అందించిన తి.తి.దే. వారికి, సప్తగిరి సంపాదకులు సి. శైలకుమార్‌గారికి కృతజ్ఞతలు. ఆ దేవదేవునికి ఇది నివేదన.

**ఆర్. శోభాదేవి**

# మా ఇలవేలుపు

విష్ణుమూర్తియే కలియుగంలో వేంకటేశ్వరస్వామిగా వెలసి భక్తుల కోర్కెలు తీర్చేందుకు తిరుపతిలో కొలువయ్యాడు. తిరుపతియే కలియుగ వైకుంఠం. ఆ స్వామిని కీర్తించే భక్తులలో ప్రప్రథమంగా మనకు గుర్తుకు వచ్చేది అన్నమయ్య. ఆ 'పదకవితా పితామహుడు' 32 వేల సంకీర్తనలు వ్రాసారు. త్యాగయ్య, రామదాసు, అన్నమయ్య వంటి ప్రసిద్ధ వాగ్గేయకారులు మన తెలుగులో రచనలు చేయడం మన అదృష్టం. శ్రీమతి ఎం.ఎస్. సుబ్బలక్ష్మి, శ్రీమతి శోభారాజు, శ్రీ బాలకృష్ణ ప్రసాద్ లాంటివారు ఆ సంకీర్తనలను ప్రాచుర్యంలోకి తీసుకువచ్చి ప్రతి నోటా పలికేలా చేశారు. అన్నమయ్య తాను చేసే ప్రతిపనిలో స్వామిని తలచేవారు. అందుకే ఆయన పాటలలో వైవిధ్యభరిత భావాలు కనిపిస్తాయి. 'జో అచ్యుతానంద జోజో ముకుంద' – అనే తల్లి జోల 'అంతర్యామి అలసితి సొలసితి' – అనే వైరాగ్య గీతం 'మెండైన బ్రాహ్మణుని మెట్టు భూమి ఒకటే – చండాలుండేటి సరిభూమి ఒకటే' – అనే సామాజిక దృష్టి కల కీర్తనలు భావగర్భితాలు. ఆ భక్త శిరోమణి అన్నమయ్య మీద పరిశోధన చేసింది మా అమ్మ. అమ్మకు చిన్నప్పటి నుంచే దైవచింతన అలవడింది. అమ్మ భక్తిశ్రద్ధలతో చేసే వరలక్ష్మి పూజ, అనంతపద్మనాభ వ్రతం నాకు బాగా గుర్తు. మా నాన్నగారి సాంగత్యంతో సాహితీ పరిమళాలు అంటాయి. మా నాన్న తి.తి.దే.లో పని చేస్తున్న కాలంలో మా ఇలవేలుపైన ఆ వేంకటేశ్వరస్వామి మీద, అన్నమయ్య వ్రాసిన సంకీర్తనల మీద ఆమెకు ఎంతో మక్కువ ఏర్పడింది. అదే ఆమెకు నిత్యజీవితంలో కొండంత బలం. ఆ భక్తి భావమే 'అన్నమయ్య భక్తి సామ్రాజ్యం'గా రూపం దాల్చింది. 40 వసంతాల మా నాన్న సాహిత్య ప్రయాణంలో భాగస్వామిగా ఉంటూ ఇప్పుడు ఈ విధంగా ఆమె రచయితగా, పరిశోధనాకర్తగా మారడం ఎంతో ఆనందంగానూ, స్ఫూర్తిదాయకంగానూ ఉంది. ఈ 'అన్నమయ్య సంకీర్తనా సౌరభం' ఇంటింటా ఆ ఇలవేలుపు ధ్యానానికి నెలవు కావాలి. పరలోకంలోని మా నానమ్మ శారదాంబకు ఇదే నివాళి.

అన్నమయ్య జయంతి
మే 2012.

**కె. శైలజ**
బళ్లారి

# అన్నమయ్య పదసంపద

అన్నమయ్య సంకీర్తనలలో విలక్షణమైన ప్రత్యేకతలున్నాయి. మొదటిది సంస్కృతాంధ్ర కీర్తనలు, రెండవది ప్రబంధకవులకు స్ఫూర్తి నిచ్చిన వూహాచిత్రాల కల్పన. మూడవది సంగీత సాహిత్యాలకు సమప్రాధాన్యం. నాల్గవది సమకాలీన జానపద గేయఫణితుల ఆధారంగా మాండలిక భాషకు పట్టంగట్టడం. అన్నమయ్య వాడిన కవితా సంప్రదాయాలు తరువాతి కాలపు అలంకారికులను ఆశ్చర్యపరిచాయి దైవారాధన ఒక యజ్ఞవిశేషం. అన్నమయ్య చేసింది సంకీర్తనాజ్ఞానయజ్ఞం. నవవిధ భక్తి మార్గాలలో కీర్తనను లక్ష్యంగా ఎంచుకొని అన్నమయ్య ముందుకు సాగాడు.

అన్నమయ్య సంకీర్తనలు 'వచోనూత్నక్రియలు' – వచనంలో కొత్త సాహిత్య రూపాలు. అవి వేంకటపతిరతిక్రీడారహస్యాలు. ఆయన సంకీర్తనలు ముక్తకాలు. ఒక్కొక్క సంకీర్తనలో ఒక్కొక్క లోకానుభవం కనిపిస్తుంది. ఆయన సంకీర్తనాయజ్ఞానికి వేదిక సమాజం. సమాజంలో శృంగార ఆధ్యాత్మభావనలు ప్రధానం. శృంగారానికి వున్నంత తీవ్రత ఆకర్షణ ఆధ్యాత్మభావానికి లేవు. శృంగారభావాలను అతివేలంగా వర్ణించి తద్వారా దానిపై వెగటుకలిగించి ఆధ్యాత్మదిశకు మరలించే ప్రయత్నం అన్నమయ్య చేశాడు. స్వామికి అభిగమ్యుని చేయడమే ఈయన శృంగార సంకీర్తనాయజ్ఞప్రయోజనం. ఈయన శృంగార సంకీర్తనలలో అది మౌలికము, లౌకికము అయిన లక్షణం.

ఆత్మ, పరమాత్మల కలయికలను అన్నమయ్య రెండు దేహాలకలయికగా చెప్పాడు. రెండు ఆత్మలు ఒక ద్వంద్వం. ఒకటి ఆత్మ. మరొకటి పరమాత్మ. రక్తితో ప్రారంభమై భక్తిగా పరిణమించే మోక్షకాముకత్వం వైష్ణవ సిద్ధాంతం.

అన్నమయ్య సంకీర్తనలో పౌరాణికగాధావిశేషాలు కూడా అనేకం కనిపిస్తాయి. శ్రీహరి పురాణ పురుషుడు. ఆయన కథ పురాణకథలన్నింటికీ మూలమని అన్నమయ్య భావించినట్లు ఆచార్యగల్లాచలపతి అభిప్రాయ పడ్డారు.[1] అన్నమయ్యకు పురాణ వాఙ్మయం కరతలామలకం. సందర్భానుసారంగా ఆయన సంకీర్తనలలో పురాణ కథలు తమంత తాముగా చోటు చేసుకుంటాయి. వాటిలో విశిష్టాద్వైతవేదాంత విషయాలు వ్యాఖ్యానింప బడతాయి.

సంకీర్తనలలో కనిపించే వేద ఇతిహాస పురాణాల ప్రస్తావన, అసమాన పాండిత్యమూ అలవోకగా, అప్రయత్నంగా కనిపిస్తుంది. పురాణకథలను ఆయన నిర్దిష్ట ప్రయోజనాలకోసం వాడుకున్నాడు. రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అంశాలతో బాటు కుటుంబ వ్యవస్థ,

1. పదసాహిత్యవైభవం ఆచార్య గల్లా చలపతి (ముద్రణ 2009)

వ్యక్తుల నడవడిక పూసలలో దారంవలె ఇమిడిపోయాయి. చెప్పదలుచుకున్న విషయాన్ని దృష్టాంత పూర్వకంగా వివరించడానికి పురాణకథలు ఆయన ఎంచుకున్నాడు.

అన్నమయ్య శ్రీనివాసతత్వం రెండు రకాలు : 1. అంతర్యామితత్వం, 2. అర్చా మూర్తితత్వం. శ్రీనివాసతత్వాన్ని అర్చాతత్వంగా రూపొందించి ఆయన అనంతకల్యాణ గుణగానం చేశాడు. అన్నమయ్య విశిష్టాద్వైతిగా రామానుజ మతప్రవర్తకుడుగా ఎన్నో సంకీర్తనలలో మనకు దర్శనమిస్తాడు. విశాష్టాద్వైతులకు "ఓం నమోనారాయణాయ" అనే అష్టాక్షరి మూలమంత్రం. అన్నమయ్యకు శ్రీ వేంకటేశ్వరుడే పరతత్వం. అన్నమయ్య దార్శనికుడైనకవి. ఆపైన వాగ్గేయకారుడు. ఈ కవి - వాగ్గేయకారునిలో తాత్వికజిజ్ఞాస అంతర్గతంగా వుంది. అన్నమయ్యకు శ్రీనివాసతత్వం అనంతముఖాలతో దర్శన మిచ్చింది. శ్రీనివాసుని సర్వవ్యాపకత్వము, సర్వేశ్వరత్వము అన్నమయ్య సంకీర్తనల ద్వారా తనను తాను ప్రకటించాడు. అన్నమయ్య గొంతుక భక్తజనులు తరించడానికి ఒక వాహిక. ఈ ఘనకార్యసాధనకు స్వామి అన్నమయ్యను ఎంచుకున్నాడు.

## శృంగారతత్వం

అన్నమయ్య శృంగార సంకీర్తనలలో అతివేలంగా శృంగారం కనిపిస్తుంది. అయితే అది మొదటిరెండు చరణాలకే పరిమితమై చివరిచరణంలో అలమేలుమంగా శ్రీనివాసుల కలయికతో సమన్వయం పొందుతుంది. లౌకిక నాయికానాయకులను స్ఫురింపజేసి చివరగా వాళ్ళను అలౌకికంగా మార్చటం అన్నమయ్య ప్రత్యేక సరళి. తాళ్ళపాక సాహిత్య పరిశోధకులు అన్నమయ్యది భక్తిశృంగారము, మోక్ష శృంగారము అని రెండు రకాలుగా వింగడించారు. దివ్యశృంగారంలో సామాజికశృంగారం కలిసిపోయింది.

అన్నమయ్య విన్నకన్న విషయాలు, అనుభవాలు అలవోకగా సంకీర్తనలలోకి ఎక్కించాడు. బహుభార్యాత్వము, పరస్త్రీ సంపర్కము, మరుగులేని శృంగారము నాటి సామాజిక వ్యవస్థలో భాగాలు. ఆయన అక్కడక్కడా ఈ స్త్రీ పురుషుల జాణతనాన్ని పదాల రూపంలో కూర్చాడు.

వాడవనితలు, ఉమ్మడివాడు, సందడి జారొడు, సందడి సవతులు, వూరపొత్తులవాడు వంటి పదబంధాలు నాటి కామకళాస్వేచ్ఛతను స్పష్టం చేస్తున్నాయి.

అన్నమయ్యకు ముందు కావ్యకవులు, పదకవులు శృంగార, ఆధ్యాత్మరచనలు చేశారు. శృంగారభావాలలో ఆధ్యాత్మభావాలు చెప్పడం కొత్త ఏమీకాదు. అయితే అవి సామాజికాంశాలకు దూరంగా వుండేవి. అన్నమయ తద్భిన్నంగా సామాజికాంశాలకు పెద్దపీట వేశాడు. వేంకటశైలవల్లభురతిక్రీడా రహస్యాలతో బాటు సామాజికపార్శ్వాన్ని స్పృశించాడు. అందుకే ఆయన శృంగార సంకీర్తనలలో లౌకిక విషయాలు అధికం.

**శరణాగతితత్వం :-** వైష్ణవోత్తముడైన అన్నమయ్య త్రికరణశుద్ధిగా శ్రీనివాసునినమ్మి తనను అర్పణచేసుకొని తరణోపాయం ఇతరులకు చూపాడు. ఆత్మపరమాత్మ ప్రకృతి అనే మూడంశాల సంబంధాన్ని సమన్వయాన్ని ఆయన ఆధ్యాత్మ సంకీర్తనలలో ప్రధాన విషయం. ఆయన శృంగార సంకీర్తనలలో ఆధ్యాత్మికత తొంగి చూస్తుంది. ' కామిగాక మోక్ష గామికాడు.' అనే తత్వం ఆయన సంకీర్తనలకు సరిపోతుంది. శృంగార ఆధ్యాత్మ భావసమ్మేళనమే మానవ జీవితం. ఆయన తన జీవితాన్ని శరణాగతితత్వంతో పండించుకున్నాడు.

అన్నమయ్య శాస్త్రకారుడు. మతప్రవక్త కాడు. మహాకవి, మహాపండితుడు. మీద మిక్కిలి వాగ్గేయకారుడు. తత్వాన్ని కవిత్వం ద్వారా చెప్పటం ఆయన ప్రత్యేకత. శ్రీ వేంకటేశ్వరుడు – చరాచర సృష్టి అనే రెండంశాలకు వారధి అన్నమయ్య.

**కవితావైభవం :-** అన్నమయ్య పరిపూర్ణకవి. తిరుమలేశునితో సాన్నిధ్యాన్ని ఆయన ఎంచుకున్న మాధ్యమం. పదం ఉత్కృష్టపథం. లౌకికాలౌకిక జగత్తులో సమస్తవిషయాలు ఆయన కవితకు వస్తువులయ్యాయి. వైవిధ్య భరిత వస్తుసంపద అనేపూలమాలలో సూత్రంహరిభక్త. అన్నమయ్య పదాలు 'వరకవిత్వవాణీ వీణానాదంబులు'. ఆయనది వరకవితా గుణ చతురత. చాటూక్తి పదబంధకవితా ధురీణుడాయన.

భావుకతా చమత్కార వైభవము, వర్ణానావైవిధ్యము, ఆలంకారిక శైలీ విన్యాసము ఉత్తమ కవితా లక్షణము. ఇవన్నీ అన్నమయ్య కవిత్వంలో పుష్కలంగా వున్నాయి. ఆలంకారిక పద్ధతిలో ఆలోచించిచూస్తే లక్షణలక్ష్య ప్రాయంగా ఆయన కవిత్వం కనిపిస్తుంది. పైకి శృంగారంగా కనిపించి లోపల ఆధ్యాత్మవాసనలు గుబాళింపజేయడం ఆయన ప్రత్యేకత.

అలంకారాలను సాభిప్రాయంగా వాడుకోవడం, తెలుగు నుడికారాన్ని జాతీయాలను, వాడుక భాషను ప్రయోగించటం ఆయన విశిష్టత. అన్నమయ్య భావుకత ఆయనను రససిద్ధుడుగా, జరామరణరహితకవిగా నిలబెట్టాయి. అందుకే ఆయన తర్వాతివారు ఆయనవలె రసశిల్పులు కాలేకపోయారు.

## మధురభక్తి

తెలుగుసాహిత్యంలో మధురభక్తిమార్గానికి ఆద్యుడు, ఆధ్యుడు అన్నమయ్య. మధురభక్తిని మోక్షమార్గంగా నిర్ణయించి తన సంకీర్తనలద్వారా ప్రచారం చేసినవాడు అన్నమయ్య. ఉత్తర భారతంలో చైతన్యమార్గంలో వాగ్గేయకారులు మధురభక్తి సాధనంగా నడిచారు. వీరికి వారధి ఆంధ్రుడైన వల్లభాచార్యుడు. ఆయన అన్నమయ్యకు సమకాలీనుడు. అందువల్ల వీరిప్రభావం అన్నమయ్యపై వుండవచ్చునని డా. యద్దనపూడి రెడ్డి శ్యామల పేర్కొన్నారు.[2] వాగ్గేయ

[2] అన్నమాచార్య పదకవితలు – మధురభక్తి డా. యద్దనపూడి రెడ్డి శ్యామల 1998.

కారులందరూ క్షేత్రాలకు ప్రాధాన్యమిచ్చారు. చైతన్యుడు మధురను నామదేవుడు పండరిపురాన్ని అన్నమయ్య తిరుపతిని తమ ఆశ్రయ కేంద్రాలుగా చేసుకున్నారు.

## దార్శనిక నేపథ్యం

దార్శనిక సిద్ధాంతాలకు సంబంధించి రామానుజుల విశిష్టాద్వైత దర్శనాన్ని అన్నమయ్య తనకు అంగీకారమైన మార్గంగా ఎంచుకున్నాడు. సంకీర్తనలరూపంలో సులభంగా అందరికి అందుబాటులో వుండేవిధంగా నిర్వచించాడు. సామాన్యులకు అర్థంగాని భాషలో వున్న దార్శనిక భాష్యాన్ని సంకీర్తనలరూపంలో ప్రచారం చేశాడు. పరబ్రహ్మ, జీవుడు, జగత్తు, మోక్షమార్గము, సాధనము వంటి గహనమైన విషయాలను సులభపదాలలో చెప్పాడు.

మధురభక్తి మార్గాన్ని సూరదాసు, అష్టచాప్‌కవులు, చండీదాసు, మీరా మొదలైనవారు అనుసరించారు. వీరితో అన్నమయ్యను పోలిస్తే ప్రముఖంగా కనిపించేది - దాంపత్యలీల - మాధుర్యం. సమాజంలోని కట్టుబాట్లకు లోబడి అలమేలుమంగా వేంకటేశ్వరుల దివ్యదాంపత్యాన్ని ఆయన వర్ణించారు.

సంయోగ లీలలో వారి ప్రణయాన్ని సఖిగా చెలికత్తెగా దూతికగా పాలుపంచుకొని వారి ఆనందాన్ని చూచి తద్భావాన్ని పొంది మాధుర్యాన్నిపొందాడు. తానేనాయికగా మారి భగవత్సంయోగ లీలలో మాధుర్యాన్ని పొందటం మధుర భక్తిలో భాగం. ఇదే భగవంతుని నాయకునిగా భక్తుని నాయికగా భావనచేయడంలో వున్న తత్వరహస్యం. తద్వారా భగవత్ప్రాప్తిని భావప్రాప్తిని పొందాడు అన్నమయ్య. ప్రణయలీలామాధుర్యాన్ని వర్ణించే సందర్భంలో అన్నమయ్య నాయికగా మారాడు. బాల్యలీలలు వర్ణించినపుడు యశోదగా గోపికగా మారాడు. యవ్వనలీలలు వర్ణించినపుడు సఖంగా, నాయికగా మారాడు. మధురభక్తి ననుసరించి వాగ్గేయకారులందరూ రెండు రకాల సంకీర్తనలు వ్రాశారు. ఆధ్యాత్మిక తత్వాన్ని తెలుపటానికి ఆధ్యాత్మిక కీర్తనలు, లక్షణానికి లక్ష్యాలుగా శృంగార సంకీర్తనలు వ్రాశాడు.

అన్నమయ్య సగుణోపాసనకు పెద్దపీట వేశాడు. తిరుమలలోని ఆలయసేవలను ఉత్సవాలను నిత్యపూజలను వర్ణించాడు. మధురభక్తిలో విగ్రహ వర్ణనలు, క్షేత్రవర్ణనలు, అవతారపురుషుల వర్ణనలు అంగీకార యోగ్యమని నిర్ధారించాడు. మధుర భక్తి రసానికి రూపగోస్వామిలా లక్షణ గ్రంధాన్ని రాయలేదు. కాని వేల సంఖ్యలో లక్ష్యాలను చూపాడు.

## పరిశోధనా ప్రణాళిక - పరిధి

అన్నమాచార్య సంకీర్తనలు వేలాదిగా లభ్యమౌతున్నప్పటికి నా పరిశోధనా పరిధిని తిరుమల తిరుపతి దేవస్థానం వారు ప్రచురించిన అన్నమయ్య సంకీర్తన స్వర మాలిక మూడు భాగాలకు ( ప్రచురణ 2008, 2008, 2009) మాత్రమే పరిమితం చేసుకున్నాను. అందులోని

వివిధ సంకీర్తనలు దాదాపు 900పైగా వున్నాయి. ఇవి దృశ్యశ్రవణప్రాజెక్టువారు స్వరబద్ధం కూడా చేశారు. వివిధ గాయనీ గాయకులు వీటిని గానంచేసి ప్రపంచవ్యాప్తంగా ప్రచారంలోకి తెచ్చారు. ఆయా కీర్తనలు వినేవారికి ఒక్కొక్కచోట కొరుకుడు పడని పంటికింది రాయిలా అనిపిస్తాయి. సాధ్యమైనంతలో ఈ పరిశోధనా పరిమితిని వాటికి నిబద్ధం చేసి కొన్ని విభాగాలుగా క్రోడీకరించి ఆకీర్తనలకు సంక్షిప్త భావాన్ని పుస్తక పరిధి, దృష్టిలోపెట్టుకొని వ్రాస్తున్నాను. ప్రధానవర్గీకరణ ఆధ్యాత్మిక కీర్తనలు – శృంగారకీర్తనలు అనే రెండు అంశాలుగా వుంటుంది. వీటిలో ఈక్రింది వర్గీకరణ సౌలభ్యం కోసం నేను తయారుచేసుకున్నాను.

దైవ సంబంధ కీర్తనలు

ఎ. నృసింహుడు

బి. శ్రీరాముడు

సి. హనుమంతుడు

డి. శ్రీకృష్ణుడు

ఇ. దశావతారాలు

అధ్యాత్మ కీర్తనలు

అలమేలుమంగ సొబగులు – శృంగారం

## ధైవసంబంధ కీర్తనలు

**ఎ. నృసింహ కీర్తనలు :** అన్నమయ్య అహోబలమఠానికి చెందిన శ్రీమాన్ ఆదివన్శఠ గోప యతీంద్రుల వల్ల వైష్ణవ మంత్రోపదేశం పొందాడు. ఆయన వద్ద 12 సంవత్సరములు శిష్యరికంచేసి నృసింహమహామంత్ర సిద్ధిని పొందాడు. 32 బీజాక్షరములు కలిగిన నృసింహమంత్ర సిద్ధికి సంకేతంగా 32000 సంకీర్తనలు తన యిష్టదైవమైన శ్రీవేంకటేశ్వరుని పాదాంకితం చేశాడు. ఆ నృసింహదేవుని ఆయన ఎన్నోకీర్తనలలో ప్రస్తుతించాడు. వాటిలో కొన్ని.....

" అహోబలేశ్వరుడు అరికులదమనుడు
మహా మహిమలను మలసీవాడే " ( 2-119)

నృసింహావతారము విశేషమైన అవతారము. దశావతారాలలో మానవావతారమైన వామనామతారానికి ముందురూపం. ఇందులో వాడియైన గోళ్ళు, దీర్ఘజిహ్వా, శంఖచక్రము కలిగిన కరాళవదనుడైన నృసింహుని అన్నమయ్య వర్ణించాడు.

అహోబలం నవనారసింహక్షేత్రాలలో ప్రసిద్ధం. అక్కడ వెలసిన నృసింహుడు, అచలము ప్రసిద్ధం. దానిని అన్నమయ్య కీర్తనలో పొదిగాడు.

"అనిశము దలచరో అహోబలం
అనంతఫలదం అహోబలం " ( 3-290)

అహోబలక్షేత్రము హరినిలయము. దైత్యహరణము, పాపహరణము యతిమత సిద్ధం. ఇక్కడ యతి భగవత్‌రామానుజులు, ఆయన మతం విశిష్టాద్వైతం. ఇది అన్నమయ్య ఎంచుకున్న మతం. అది పర్వతశ్రేష్ఠమని అన్నమయ్య ఎలుగెత్తి చాటాడు. అందులో అధివసించిన నారసింహుడు పురాణ పురుషుడు, కాలాంతకుడు, ఏకాంగ వీరుడు ఈ భావనను

" అహోబలేశ్వరుడు అఖిలవందితుడు
మహినితని గొలిచి మనుడిక జనులు " (4-346)

త్రిమూర్తులకు మూల పురుషుడు, చక్రాయుధవరదుడు, దాసులకు సులభుడు, ఇహపరదాత. అతడు దైవశిఖామణి. అభయదాయకుడు

" అభయదాయకుడ వదె నీవే గతి
ఇభరక్షక నన్నిపుడుకావవే " (3-273)

సంస్కృతపద భూయిష్టమైన ఈకీర్తన నారసింహుని వీరప్రతాపాన్ని గుర్తుకు తెస్తుంది. ఎల్లప్పుడు నీపాదములే మాకు గతియని, మమ్మేలి కష్టములను తొలగించమని కోరుతున్నాడు. నీవేశరణమని శరణాగతితత్వాన్ని ప్రభోదిస్తున్నాడు.

ఆనారసింహునిపై అన్నమయ్యకు అపారభక్తి. వేంకటేశ్వరుని తరువాత ఎక్కువ మొత్తంలో చెప్పిన కీర్తనలు అహోబలనారసింహునిపైనే. విశిష్టాద్వైత సంప్రదాయంలో లక్ష్మీనారసింహునికి విశేష ప్రాధాన్యం వుంది.

" ఆరగించి కూచున్నాడల్లవాడే
చేరువనే చూడరె లక్ష్మీనారసింహుడు " ( 26-141)

ఇందులో అచ్చతెనుగు పదాల పోహళింపు గుబాళిస్తుంది. బహుశా ఆరగించి కూర్చున్న ఆస్వామి విందుభోజనాల వాసనలేమో. ఆరిగించకూచున్నాడు, అల్లవాడు, చేరువ, చూడరె, తొడమీదనిడుకొని, కొలువిచ్చి, అందపునవ్వులు, పచ్చలగద్దియల మీద, రంగగు సొమ్ముల తోడ వంటి పదాలు అచ్చతెనుగు నారసింహుణ్ణి మన కనులముందుచుతాయి. అంతకుముందు కీర్తనలో సంస్కృత పదాడంబరం చూసిన అన్నమయ్య యిక్కడ తెలుగు పదాలను వాడటం విశేషం.

ప్రహ్లాదవరదుడైన నృసింహుడు ఉగ్రరూపధారి. కాని ఈ కీర్తనలో నవ్వుమోముతో జవ్వనిని తొడమీద వుంచుకొని కొలువైయున్నాడు.

"ఆదిమూర్తి యితడు ప్రహ్లాదవరదుడు

ఏదెసచూచిన తానె ఈతడిదె దేవుడు " (4-390)

లక్ష్మీనారసింహుడై అభయహస్త ధారియై ప్రతాపంతో వెలుగొందే ఆస్వామి కంకణహారాలతో, కిరీటధారియై ప్రతాపాలు వెలయిస్తున్నాడు. అతడు ఆది దేవుడైన శ్రీమన్నారాయణుడు. దాసులకు వరాలిచ్చే దేవుడు.

ఉగ్రనారసింహుని వేడుక నవ్వుల నవ్వి సిగ్గులు కురిపించే అందగానిగా అన్నమయ్య చిత్రించాడు.

"ఔనయ్య జాణడవు ప్రహ్లాదవరద

ఆనలు వెట్టకుము ప్రహ్లాదవరద" ( 4-497)

నళినాక్షియైన లక్ష్మీదేవిని తొడలపైకి నెక్కించుకొని అంటువాయని రీతిలో కౌగిలించుకొని కైవసము చేసుకున్నాడు. చేయి చేయి కలుపుకొని సుద్దులు చెబుతున్నాడు. ఎంత చక్కని శృంగార భావన.

హిరణ్యకశిపుని కడుపుచీల్చి పేగులు జందెముగా ధరించిన ఉగ్రనారసింహుని ఈకీర్తనలో అన్నమయ్య పేర్కొన్నాడు.

"కంభమున వెడలి ఘన నరసింహము

కుంభిని హిరణ్యుగూలిచెను" (3-506)

ఇది ఉగ్రనారసింహావతార వర్ణన. అంతకుముందు కీర్తనలలో లక్ష్మీదేవిని తొడలపై వుంచుకున్న నారసింహుడు ప్రత్యక్షమైతే, ఈ కీర్తనలో తొడలపై హిరణ్యకశిపుని పట్టి వాని పేగులు జందెముగా మెడదగిలించుకున్న స్వామి దర్శనమిస్తాడు. పెనుగోళ్ళతో గుండెలు చప్పరిస్తూ దేవతల భయాన్ని తీర్చిన అహోబలదైవత మతడు.

ప్రహ్లాదవరదుడైన ఆస్వామి ప్రహ్లాదుని మనవులకు మన్ననలందించిన నరహరి.

"కొలువరో మొక్కరో కోరినవరములిచ్చే

సులభు డిన్నిటా వీడె సుగ్రీవనరహరి" (4-492)

స్తంభంలో పుట్టి హిరణ్య కశిపుని దురిమి, దేవతలకభయమిచ్చిన ఆదిమ నరహరికీర్తనయిది. ఆనందంతో వున్న నరహరిరూపమిది. నానాభూషణములు ధరించి మిక్కిలి ప్రతాపంతో మహిమలు చూపే రూపవర్ణన యిది.

భక్త సంరక్షణార్థం శ్రీమన్నారాయణుడు అవతరించిన రూపమే నరసింహావతారం.

"ఘోరవిదారణ నరసింహ! నీ

వీరూపంలో ఎట్లుండితివో ! (1-68)

ఉగ్రరూపంతో స్తంభం నుండి భయంకరంగా ఆవిర్భవించిన నారసింహుని శబ్దాలంకారయుతంగా అన్నమయ్య వర్ణించాడు. ఆవూహలు అత్యద్భుతం. నారసింహుని ఉచ్ఛ్వాస నిశ్వాసాలకు కొండలు పొడిపొడియై ఆపొడి ఆకాశాన్ని అంటుతోంది. స్వామి నేత్రాలు అగ్నికీలలను వెదజల్లుతున్నాయి. వీరరౌద్రరసాలతో పదాడంబరంతో శబ్దానుప్రాసలతో ఈకీర్తన పాడుతున్నప్పుడు సాక్షాత్తు ఆ ఉగ్రరూపాన్ని దర్శింపగలం. ఉడికెడి, పొడిపొడి, గుటగుట, గిటగిట, తటతట, ఇటువలె, గోళ్ళ, వేళ్ళ, నీళ్ళ, ఉచ్చిళ్ళు వంటి అనుప్రాసలనువాడి ఉగ్రనారసింహుని కనుల ముందు ఆవిష్కరించాడు.

నారసింహుని ఉగ్రరూపాన్నిచూసి దేవతలందరూ భయంచెందారు. ఉగ్రరూపాన్ని ఉపసంహరించుకోమని వివిధ రకాలుగా స్తుతించారు.

"చిత్తజగురుడవో శ్రీనారసింహా

బత్తిసేసేరు మునులు పరికించవయ్యా.... ( 4-29)

ఆశ్చర్యచకితులైన దానవులు సమసిపోయారు. దేవతల జయజయధ్వానాలమధ్య లక్ష్మీదేవి నారసింహుని అంకభాగంపై ఆసీనమైంది. ఇకనైన నీకోపం ఉపసంహరించుకోమని బ్రహ్మాదులు, అప్సరలు, తుంబుర నారదాదులు, యక్షగంధర్వసిద్ధ సాధ్యులు శరణుజొచ్చారు.

అన్నమయ్య వ్రాసిన అనేక సంస్కృత సంకీర్తనలలో నృసింహ వర్ణన గల మరొక సంకీర్తనయిది :

"జయజయ నృసింహ సర్వేశా

భయహరవీర ప్రహ్లాదవరదా " (2-289)

ప్రహ్లాదవరదుడైన ఓ సర్వేశ్వరా! సూర్యచంద్రులు కనులుగా గలిగి మృగ నరసింహాసనాధిష్టితుడవై మునులచే ప్రణుతింపబడుతున్నావు. వామాంకస్థిత అయిన లక్ష్మితో రాజసఠీవితో కొలువైయున్నావు. ఇందులో చటులపరాక్రమ, నిటలనేత్ర, కుటిలదైత్య, పటువజ్రవంటి టకారప్రాసల పదాలువాడి ఉగ్రనారసింహుని ప్రకటితం చేశాడు.

జయజయ ధ్వానాలతో శాంతపడిన నారసింహుడు జనుల భయములను పారద్రోలి శుభాలు ఇహపరాలలో అందించాడు.

జయము జయము ఇక జనులాల

భయములు వాసెను బ్రతికితిమిపుడు ( 4-521)

ఇందులో వ్యావహారిక పదబంధాలు మనకు కనిపిస్తాయి. జనులాల, ఏపడచె, కొలిచేరు వంటిపదాలు దొర్లాయి. శివుడు, విష్ణువు వేరుకాదని చెప్పడానికన్నట్లు "హరుడును బ్రహ్మయు అదె కొలిచేరు" అని అన్నమయ్య వాడాడు.

ఇది మరొక సంస్కృత కీర్తన. అన్నమయ్య అటు సంస్కృతంలోను యిటు తెలుగులోను దేశ్యపదజాలంలోను సవ్యసాచి. నందకాంశసంభూతుడైన ఆయన నోట వెలువడిన పదజాలం ముత్యాలహారాలవలె వాగ్గేయకారవైభవాన్ని చాటిచెప్తూ వున్నాయి. పూర్ణానుస్వారంతో కూడిన నరసింహం అనే పదాన్ని ప్రతి చరణంలోనూ వుంచి వుగ్రనరసింహుని తేజోమూర్తిని అన్నమయ్య మరోమారు దర్శింప జేశాడు.

"నమితదేవం భజే నారసింహం

సుముఖ కరుణేక్షణం సులభనరసింహం " ((3-514)

సుదీర్ఘ సమాసాలతో చరణాన్ని నడిపి ఉగ్రన్నృసింహరూపాన్ని ప్రస్ఫుటింపచేశారు. వారు కల్యాణ నిశ్చల నృసింహం సారయోగానంద చతుర నారసింహం వంటివి యిందుకు ఉదాహరణ.

అదే బాణీలో సాగిన మరొక సంస్కృత కీర్తన :

"నమోనమో లక్ష్మీనరసింహా

నమో సుగ్రీవనరసింహా" ( 2-348)

సంస్కృత పదాల కోసం వెదుకులాడుకోకుండా ధీరగంభీరంగా చరణాలు కదిపిన వైనం యిందులో చూడవచ్చు.

చరణం - కులిశ నఖరముఖఘోషిత సింహం

తిలకితబహురవిదీపిత సింహం

వైశాఖపూర్ణిమ నారసింహ జయంతిగా వైష్ణవ క్షేత్రాలలో ఆనందంతో చేసుకుంటారు వైశాఖ శుద్ధ చతుర్దశి శనివారం సంధ్యాకాలం అహోబలేశుడు కంబంలో ఉద్భవించాడు.

నరులాల నేడువో నారసింహజయంతి

సురలకు నానందమై శుభములొసగెను" (4-310)

భావము ఒకటే అయినా, భాషలో మార్పు తెచ్చే పదజాలంతో వినూత్నతతో కీర్తనలు ముందుకు సాగాయి. సర్వసింహాసనంపై కొలువై యిందిరారమణుడు దర్శనమిచ్చిన వైనం. 'నరులాల' అనే సంభోధనతో ప్రారంభమైన మరో కీర్తన యించుమించు అదే భావంతో ముందుకు సాగింది:

"నరులాల మునులాల నానా దేవతలాల"

మరొక సంస్కృత పదభూయిష్టమైన కీర్తన.

"నవనారసింహా నమోనమో

భవనాసితీర యహోబల నారసింహా " (1-453)

ఇందులో యోగానంద నరసింహుని, పరిపూర్ణశృంగార నారసింహుని ప్రస్తుతించాడు. జ్వాలా నరసింహ, మట్టెమళ్ళనారసింహా, వరాహనరసింహా అని స్వామిని వేనోళ్ళ కొనియాడాడు.

జానపదాలలో సోబనాలు ఒకప్రక్రియ. ఆకోవలో నారసింహుని స్తుతిస్తూ లక్ష్మీ నారసింహుల కల్యాణాన్ని అచ్చతెనుగు పదాలలో అవతరింపజేశాడు:

"పాడరే సోబనాలు పడుతులాల

వేడుక లిద్దరిని వెలసెజూడరె" (2-286)

ఇక్కడ వేదాద్రి, గరుడాద్రులపై భవనాశిజలములతో వధూవరులు అభ్యంగన స్నానాలు చేసి పువ్వుల సేసలు పెట్టుకొని సుముహూర్తాన పరస్పరం వీక్షించుకున్నారు. కనకావతీ, భోగవతీ నదీజాలలో వసంతాలాడారు. ఎంతటి చక్కని భావన.

వేదమయుడైన శ్రీనివాసుని దివ్య స్వరూపాన్ని నారసింహావతారంలో దర్శించటం ఈకీర్తనలో విశేషం :

"వేదములేనీ నివాసములు విమలనారసింహా

నాదప్రియ సకలలోకపతి నమోనమో నరసింహా" (15-131)

పురాణపురుషుడైన లక్ష్మీవల్లభుని పరతత్వాన్ని తెలుసుకోవడం బ్రహ్మాదులకు కూడా తరం కాదని వర్ణిస్తూ దాసులకు సులభుడైన రవిచంద్రనేత్రుని, బ్రహ్మాదిసేవితుని ఇందులో వర్ణించాడు.

స్తంభంలో నుంచి క్షణకాలంలో బయటికి వచ్చిన నారసింహుడు మరుక్షణంలో ఝటితస్ఫూర్తితో హిరణ్యకశిపుని సంహరించాడు. ఆఉద్వేగాన్ని, ఉద్రేకాన్ని, ఆవేశాన్ని చెప్పడానికి పోతన భాగవతంలో నారసింహావతారఘట్టం అద్భుతంగా రచించాడు. ఇక్కడ అన్నమయ్య ఆమహోగ్రరూపాన్ని మన కళ్ళముందు చూపించాడు. అనంతపురం సమీపంలో కదిరి నరసింహుడున్నాడు. ఖాద్రినరసింహుడుగా ఈయనకు పేరు. ఆస్వామిని ఈకీర్తనలో అన్నమయ్య వర్ణిస్తున్నాడు:

"కదిరినృసింహుడు కంభమున వెడలె

విదితముగా సేవించరో మునులు " (4-32)

ఆ నృసింహుడు ఎలావున్నాడు. ఫాలలోచనము, ఉగ్రరూపము జ్వాలామయ కేసరములు కాలరుద్రుని దంతములు ధరించివున్నాడు. శబ్దానుప్రాసద్వారా అన్నమయ్య కీర్తనలో వేగాన్ని

పెంచాడు. ముడివడు, గడగడ, నిడుదనాలిక, నడియాలపురూపు వంటి మాటలు తీవ్రతను తెలుపుతున్నాయి.

ప్రసన్నుడైన ఆ నరసింహునికి బ్రహ్మాది దేవతలు నమస్కరించారు. నవరసాలంకార నరకేసరి అని అన్నమయ్య ఈకీర్తనలో సంస్తుతించాడు.

"నగుమోముతోడి ఓనర కేసరి
నగరూప గరుడాద్రి నరకేసరి " (1-421)

ఇందులో కూడా అంతకు ముందు కీర్తనలలోవలె భవనాసినీ తీర్థప్రస్తావన వచ్చింది. జానపదధోరణిలో దరువులాసాగే ఈ కీర్తన చిత్రవిచిత్రంగా సాగింది.

"చిత్తగించు మా మాట శ్రీనరసింహా
చిత్తజజనక ఓ శ్రీనరసింహా" (7-495)

అచ్చతెనుగు పదాలైన చిత్తగించు, సెలవులు, చిందీని, మైచెమటలు, చెందమ్మి రేకులు, చిందులు, కాశిటి, చెర్నాలాటలు వంటి పదాలు ఇందులో ముత్యాలహారంలో మణులలా పొదిగాడు అన్నమయ్య.

అహోబలేశ్వరుడు అన్నమయ్యకు ఆరాధ్యదైవం. అతణ్ణి స్తుతిస్తున్నప్పుడు అన్నమయ్య మైమరచిపోతాడు.

"ఈతని మహిమలు ఎంతని చెప్పద
చేతల మొక్కెద చెలగుచునేను " ( 4-527)

చిన్మయమూర్తియైన అహోబలనారసింహుడు ఇహపరము లొసగే ఏలికఅని, సుజన పాలకుడని అతని సాష్టాంగ నమస్కారం చేస్తానని అన్నమయ్య అభినందించాడు.

అన్నమయ్యమరో సంస్కృత రచన అతిప్రౌఢంగా ఇలా సాగింది:

"ఫాల నేత్రానల ప్రబలవిద్యుల్లతా
కేళీవిహార లక్ష్మీ నారసింహా" (1-281)

స్తంభం నుండి అతిప్రచండంగా ధగధగిత దంష్ట్రానల విస్ఫులింగంవలె బయలు పడిన నిశ్చల నారసింహుని వివిధ జంతువ్రాత భువన మగ్నీకరణ అని శౌర్యప్రతాపాలను అద్భుతంగా ఆవిష్కరించాడు అన్నమయ్య. భూమ్యాకాశాలను, సూర్యచంద్రులను తన ఉచ్ఛ్వాసనిశ్వాసాలతో వూయలలూపుతూ తాను మాత్రం నిశ్చలంగా వున్నాడు.

మరొక సంకీర్తన

"నగధర నంద గోప నరసింహా వో
నగజవరద శ్రీనారసింహా" (1-259)

ఇక్కడ కృష్ణావతార ప్రస్తావనవచ్చింది. నారసింహావతారంతోబాటు నరకాంతక నవనీతచోరకృష్ణావతారము, నమకచమక హిత అనీ వేదమంత్రాల ప్రస్తావన కూడా చేశాడు అన్నమయ్య. నారసింహుడు నవరసాలంకార ప్రియుడు, నవమూర్తి, ఇక్కడ మండెము అనే గ్రామంలోని నరసింహావతార ప్రస్తావన వచ్చింది.

ఈ సంస్కృత కీర్తనలో అహోబలంలో (గరుడాచలం) భవనాశీ నదీతీరంలో ప్రహ్లాదవరదుడై కొలువైన నారసింహుని స్తుతించాడు. స్వామిగుణాలు విశేషభూషణాలు యిందులో ప్రస్తావించబడ్డాయి.

"పరిపూర్ణ గరుడాద్రి పంచాననం
పరంసేవే పంచాననం " ( 1-428)

నరసింహావతారాన్ని వివిధ భంగిమలలో వివిధకోణాలలో అన్నమయ్య దర్శించాడు. ఒకే భావంకానీ భాష వేరు. వాడిన పదజాలం వేరు, చెప్పిన తీరు వేరు. భయదలిస్ఫులింగమైన ఆ భయంకర రూపాన్ని అన్నమయ్య ఎన్ని రకాలుగా చెప్పాడు. ఆయన చేతులలో చక్రముశార్ఙ్గము ఆయుధాలు ధరించాడు. వరద అభయహస్తాలు కలిగివున్నాడు.

"సిరి తొడపైనిడి శ్రీనరసింహుడు
ఇరువుగ వరముల నిచ్చేనివాడే" (2-113)

ఈ కీర్తనలో నారసింహుడు యోగపట్టబంధాన్ని కటితటి ధరించినవాడుగా చెప్పబడింది.

అహోబలనరసింహుని కీర్తించే ఈకీర్తనలో సూర్యచంద్రులు స్వామినేత్రాలుగా ప్రహ్లాదవరదుడుగా దర్శనమిచ్చాడు.

"దిక్కునీవే జీవులకు దేవసింహమా
తెక్కుల గద్దియ మీది దేవ సింహమా" (2-363)

ముల్లోకాలనేలే దేవసింహమతను, వేంకటాద్రిమీద ( అహోబలం) తెప్పలపైతేలే వరదుడు. దేవతలు, ప్రహ్లాదుడు కొలిచేదైవం. ఇహపరదైవమైన సుగ్రీవనారసింహుడు వివిధ ఆకృతులలో అన్నమయ్యకు దర్శనమిచ్చిన చిన్మయమూర్తి.

ఈ కీర్తనలో కదిరి నారసింహుని ప్రస్తుతించాడు. రోజుకొక వేడుకతో ఆస్వామి దర్శనమిచ్చాడు. హిరణ్యకశిపుని చర్మాన్ని వొలిచి తనశరీరంపై కప్పుకున్న స్వామి అతడు. పేగులను జంధ్యాలవలె ధరించి కంఠరక్తాన్ని వసంతంగా చల్లిన ప్రహ్లాదవరదుడతడు.

"తనదాసునికొరకు ధరించెనీరూపము
దినదిన వేడుక కదిరి నారసింహుడు" (10-1-37)

చెలులు నారసింహునితో పరాచికాలాడటం ఈ కీర్తనలో ప్రధానం.

"శిరసెత్త గదవయ్య శ్రీనారాసింహా నీ
సిరులెల్లనేనేకానా శ్రీనారసింహా" (15-254)

చెంచులక్ష్మితో సయోధ్యతకు చెలులను పంపినాడు నారసింహుడు. నారసింహుని దర్శించిన ఆమె చిత్తరువులోని ప్రతిమే అయినది. చిత్తవాన చెమటలు నారసింహుని మేన కనిపించాయి. ఇవి కందుకూరి రుద్రకవి జనార్ధనాష్టకానికి స్ఫూర్తి దాయకం.

ఈ కీర్తనలో శృంగారమూర్తి అయిన నరసింహ దేవుని ప్రస్తుతి కనిపిస్తుంది. హిరణ్యకశిపుని కాంచనదైత్యుడు అని చెప్పటం విశేషం. చెంచెతలపై స్వామి మోహపడ్డాడని ప్రహ్లాదునిపై కరుణ చూపాడని అద్భుతంగా చెప్పాడు అన్నమయ్య.

"సింగారాలమించీ నరసింహదేవుడు
చెంగటనున్నాడు నరసింహదేవుడు" (2-228)

ఈ కీర్తనలో కూడా భవనాశినీ నదీ ప్రస్తావన వచ్చింది.

నవనారసింహులలో వైష్ణవతత్వం ఈకీర్తనలో చెప్పబడింది. కదిరినరసింహము, జ్వాలానరసింహము, నగరినరసింహము, యోగానంద నరసింహము, వేదాద్రి నరసింహము, భార్గవూట నారసింహము, మట్టెమళ్ళ నారసింహము, కానుగమాని నరసింహము, వరాహ నారసింహము, అహోబల నారసింహము, బొమ్మిరెడ్డిచర్ల నారసింహము. ఆయాగ్రామాలలోని నరసింహులను ఈ కీర్తనలో స్తుతించాడు.

"నవమూర్తులైనట్టి నారసింహుడు వీడు
నవమైన శ్రీకదిరి నరసింహము వీడు" (4-182)

నారసింహుణ్ణి మెల్లని చిరునవ్వుల తెల్లనిమేని సింహంగా చెప్పటం ఈకీర్తనలో ప్రత్యేకత. నారసింహుడు గద్దెపై కూర్చుని పుట్టుజడలతో పూర్ణసింహంగా కనిపిస్తాడు. దాసులకు అతడు శాంత సింహం. నరసింహ క్షేత్రాలన్నీ కొండలపైనే వున్నాయి. ఈకీర్తనలో కొండలమీది ఆదిసింహము అనే ప్రస్తావన్న వచ్చింది.

"పరగీనదివో గద్దెపై సింహము వాడె
పరమైన ఔభలనారసింహము " (4-415)

తుంగభద్రా నదీతటంపై తొడపై ఇందిరను పెట్టుకొని దేవతల జయజయధ్వానాల మధ్య శంఖచక్రాల వేవేల హస్తాలతో జవ్వనపుమనుజకేసరి నవ్వు మోముతో వున్నాడు. అతడు దాసులకు నిధానము.

"సులభుడైవున్నాడు సుగ్రీవనారసింహుడు
నెలకొన్న దాసులకు నిధానము వీడే" (4-512)

హిరణ్యకశిపుని కనకకశిపుడనటం విశేషం. భవనాశి నదీ ప్రస్తావన యిందులోనూ వుంది. నారసింహుడు వేంకటాద్రికాంతలలో గుంపుకట్టి మహిమలు చూపుతున్నాడు. అలాంటి స్వామిని మొక్కితే కోరివరమిస్తాడు.

"చేరి మొక్కరో నరులు శ్రీమంతుడీతడు
కోరివరము లిచ్చు కొండవంటి సింహము" (15-132)

పరబ్రహ్మమే తానైన నరసింహుడు మూడు మూర్తులొక్కటై నిలుచున్నాడు.

"నానాటికి పెరిగీని నరసింహము
ఆనుక వరములిచ్చీ నౌభళపుసింహము" (3-153)

"అనాది జగమున కౌభళము
అనేకాద్భుతం బౌభళము" (4-29)

నారసింహవతారము ప్రత్యేకావతారము. అటుసింహము, ఇటు నరుడు, అటు రౌద్రము ఇటు శాంతము. హిరణ్యకశిపునకు సంహారకుడు. ప్రహ్లాదునికి వరదదాయకుడు. దాదాపు 40 కీర్తనలలో నరసింహస్వామి వర్ణన చేయబడింది. నృసింహుడంటే అన్నమయ్యకు ఇష్టం కలగడానికి కారణం అహోబలమఠానికి చెందిన ఆదివన్ శఠగోపయతీంద్రుడు తన గురువు కావడమే. దశావతారవర్ణనను ప్రత్యేకించి నృసింహ రామకృష్ణావతారాలను అన్నమయ్య చెప్పాడు. అన్నమయ్య తాను అర్చించిన వెంకటేశ్వరుని బహుముఖంగా సందర్శించి ఆయారూపాలను వేంకటాద్రి విభునికి అన్వయం చేసి చెప్పాడు. నృసింహపురాణంలో హిరణ్యకశిపుణ్ణి సంహరించిన తరువాత నారసింహుడు ప్రహర్షసాముఖ్యనయాసౌందర్య నూతనాకారుడైనాడని ఎఱ్ఱన వర్ణించాడు. అన్నమయ్య ఆ ధోరణిలోనే 'భావింప ఎట్టెదుట ప్రహ్లాదుడుండగాను వేవేలు నవ్వునవ్వి విజయ సింహము! కలియుగంలో ప్రతిదానికి వెలకట్టుకొని జీవిస్తారు. ఒక్క వేంకటేశ్వరునామమే వెలేనిది, అమూల్యము. భక్తి అనే ధనం వుంటేచాలు. సులభంగా ఉచితంగా గురూపదేశం ద్వారా అది లభిస్తుంది. ఈ విషయాలను అన్నమయ్య కీర్తనలలో స్పష్టం చేశాడు.

అన్నమయ్య పదాలు వెన్నెల జలపాతాలు. భక్తి శిఖరాలు. వాఙ్మయసౌందర్య సాధనాలు. జుర్రుకోగలిగినంత మధురిమను అన్నమయ్య అందిస్తాడు. ఆయన దేవుణ్ణి భక్తుడిగా ప్రార్థిస్తాడు. నాయికగా శాసిస్తాడు. హితునిగా సందేశమందిస్తాడు. సేవకునిలా తనపదాల ఆస్తిని స్వామికి సమర్పిస్తాడు.

**బి. శ్రీరామ కీర్తనలు :** ధర్మానికి ప్రతిరూపం శ్రీరామచంద్రుడు, దేవదేవుడైన ఆరాముని దివ్యప్రభావం మహామహిమాన్వితం. అందుకే 'రామో విగ్రహవాన్ ధర్మః" అన్నారు. ఈ సంస్కృత కీర్తనలో శ్రీరామచంద్రుని వర్ణన వుంది. ఇలా ఎన్నో కీర్తనలలో (33) శ్రీరామచంద్రుని గుణగణాలను, రామాయణగాధను వర్ణించాడు అన్నమయ్య.

"దేవదేవం భజే దివ్యప్రభావం

రావణాసురవైరి రఘుపుంగవం" (1-314)

సూర్యవంశసుధాకరుడు, ఆజానుబాహుడు, కోదండదీక్షాగురుడు, రాజీవలోచనుడు, నీలమేఘశరీరుడు, ధర్మసంస్థాపకుడు, శివధనుర్భంగకర్త అయిన రామచంద్రుడు విబుధులచే స్తుతింపబడుతున్నాడు.

"నమోనమో రఘుకులనాయక దివిజవంద్య

నమోనమో శంకర నగజానుతా" (4-471)

ఈ సంస్కృత కీర్తనలో రామాయణగాధ సంక్షిప్తంగా ప్రస్తావించబడింది. విజయనగరపుర విహారా అనడం వల్ల హంపీలోని శ్రీరాముణ్ణి అన్నమయ్య చెప్పినట్లైంది. పితృవాక్యపరిపాలన, తాటక సంహరణ, అహల్యాశాపవిమోచన, విశ్వామిత్ర యాగరక్షణ, శివధనుర్భంగము, సీతాకల్యాణము, ఖరదూషణ సంహారము వాలి సంహారణము వారివిబంధనము రావణవధ విభీషణపట్టాభిషేకము, శ్రీరామ పట్టాభిషేకము ఈకీర్తనలో ప్రస్తావితమయ్యాయి.

హంపీలోని రాముణ్ణి దర్శించి అన్నమయ్య చెప్పినమరోపాటయిది. ఇది వేదాంతపరంగా సాగింది. ఎక్కడ ఏదేవుణ్ణి చూసినా వెంటాద్రిరమణుడే గుర్తుకు వస్తాడు. తాను ఎక్కడికి వెళితే అక్కడి దైవాన్ని స్తుతించడం అలవాటు.

"రాముడు రాఘవుడు రఘుకులు డితడు

భూమిజకు పతియైన పురుషనిధానము" (4-169)

పుత్రకామేష్టిలో పాయసం లభించింది. తద్వారా పరబ్రహ్మ అయిన విష్ణువు అసురులను శిక్షించి సురలను రక్షించడానికి రాముడుగా ఉదయించాడు. ఆయనను యోగీంద్రుల చిత్త సరోజాలలో నిలిచిన సాకారంగా పేర్కొన్నాడు. మునులు వెదికే కైవల్యపదంగా కీర్తించాడు. వేదవేదాంతాలలో విజ్ఞానశాస్త్రాలలో పాదుకొన్న పరమార్థంగా పోల్చాడు. ఇది తత్వపరమైన రాముని వర్ణన.

ఇది కూడా రామాయణగాధను సంస్కృత కీర్తనలో వివరించే సన్నివేశమిది. ఇందులో కథ సాకల్యంగా చెప్పబడింది. కౌసల్యానందనుడు సీతాపతి. విశ్వామిత్రయాగ సంరక్షకుడు,

వారధి నిర్మాత, సుగ్రీవవరదుడు, రావణభయంకరుడు అయిన రాముని శ్రీవేంకటగిరి రామునిగా కీర్తించాడు.

"భళిభళిరామా పంతపురామా నీ

బలిమికెదురులేరు భయహర రామా" (4-357)

ఇక్కడ ఖరసంహారానికి వాడిన పదం అచ్చదైన అచ్చతెనుగుపదం. 'ఖరుని తలగుండుగండ'. కొండలచే జలధి గట్టిన సన్నివేశాన్ని కూడా వర్ణించాడు.

మరోకీర్తనలో సీతామంగళసూత్రము అని రాముని వర్ణించడం అద్భుతం. భక్తులపాటి కొంగుబంగారము, తారకబ్రహ్మము అయిన రాముని గుణగానం యిందులో చేయబడింది.

"కొలిచినవారల కొంగుపైడితడు

బలిమి తారక బ్రహ్మమీతడు" (3-419)

పాయసభక్షణం ద్వారా రాముడు జన్మించాడు. పరమాన్నములోపలి సారపుచవి అని చెప్పటం చక్కని ఊహ. దానవుల సంహార చక్రంగా, దశరథుని భాగ్యంగా అన్నమయ్య చేసిన వూహ అద్భుతం.

సీతారాముల కల్యాణఘట్టాన్ని చెలుల ద్వారా చెప్పించాడు. పెండ్లిపాటగా పాడుకోవటానికి యిది అనుకూలం.

"సిగ్గరిపెండ్లి కూతుర సీతమ్మ

దగ్గరి సింగార బొమ్మ తలవంచకమ్మ" (26-40)

ఇందులో హరుని విల్లు విరవడం. జనకుని కన్యాదానం, తెరపచ్చడం పట్టడం, సేసలు చల్లడం, తలంబ్రాలుపోయడం, కంకణదారాలుకట్టి కాలు తొక్కడం, బువ్వంబంతులు, అచ్చమైన తెలుగువారి పెండ్లితంతు. ఇది కూడా వావిలిపాటి రామచంద్రుని మీద కీర్తన.

"దేవదేవోత్తమ తేనమో నమో

రావణదమన శ్రీరఘురామా" (4-491)

ఇది సంస్కృత కీర్తన. కౌసల్యానందవర్ధన, సీతారమణ, జనకభూపాలజామాత, అహల్యాశాపమోచన వంటి సంస్కృతపదబంధాలతో అన్నమయ్య శ్రీరాముని అభినుతించాడు.

"ఇతడే పరబ్రహ్మమిదియే రామకథ

శతకోటి విస్తరము సర్వపుణ్యఫలము ( 4-519)

చకచకాసాగిపోయే పదబంధాలతో రామాయణగాథ వర్ణితమైంది. రాముడు పుట్టడం, సీతను పెండ్లాడటం, అరణ్యవాసుల కభయం, శూర్పణఖ ముక్కు చెవులు కోయటం, ఖరదూషణ

వధ సుగ్రీవపట్టాభిషేకం, వారధిబంధనం, రావణకుంభకర్ణవధ, అయోధ్యాఆగమనం, రామపట్టాభిషేకం, విభీషణపట్టాభిషేకం, కుశలవజననం. పన్నెండు పంక్తులలో సంపూర్ణ రామాయణాన్ని సంక్షిప్తంగా అందించాడు.

"ఇదె శిరసు మాణిక్యమిచ్చిపంపె నీకు నాకె
అదనెరిగి తెచ్చితి నవధరించవయ్యా" (20-229)

ఈ కీర్తనలో అన్నమయ్య ఆంజనేయుడయ్యాడు. ఓరామా!సీతమ్మ యిచ్చిన శిరోమణి యిదిగో, లంకలో రామనామస్మరణ చేస్తూ ఉన్న సీతమ్మను చూశాను. నీవిచ్చిన వుంగర మామెకిచ్చి క్షేమసమాచారం చెప్పాను. నిన్నే తలుస్తూ చంద్రుణ్ణి దూషిస్తూవున్న ఆమెను చూశాను. దశకంఠుని దునిమి సీతమ్మను తీసుకురా! అని ఆంజనేయుడు చెప్పినట్లుగా వర్ణించాడు.

శరణాగతరక్షకుడైన రాముని చరితమును వర్ణించే కీర్తనయిది:

"సీతాసమేత రామశ్రీరామ
రాతినాతి జేసిన శ్రీరామరామ" (3-516)

ఈ కీర్తనలో రాముడు చేసిన ఘనకార్యాలు వర్ణించబడ్డాయి. కోదండభంజనము, యాగ సంరక్షణము, సుగ్రీవపట్టాభిషేకము, సముద్రునిపై బాణం సంధించడం, రావణవధ, విభీషణ పట్టాభిషేకము చెప్పబడ్డాయి. ఇవి అన్ని రాముని పరాక్రమ వర్ణనలే.

"నమోనమో దశరథనందనరామా
కమనియ్య యాగభాగకర్త రామా" (4-144)

ఇందులో కాకాసుర వృత్తాంతము విభీషణ పట్టాభిషేకము, యాగభాగ కర్తృత్వము కొత్త అంశాలు. రాముని వేంకటాద్రిరామునిగా అన్నమయ్య అభివర్ణించాడు.

ఈ సంస్కృత కీర్తనలో రాముని ఉన్నతోన్నత విగ్రహాన్ని ప్రస్తుతించాడు.

"శ్రీపతి పురనాయకా జయచింతితాభీష్టదాయకా (10-1-51)

సంబోధనలతో కూడిన ఈకీర్తనలో రాముని కోదండాన్ని అభంగమంజులచాపకా అని కీర్తించాడు. మానుషాహిమారకా, రఘుకులదీపకా, జానకీప్రియకారకా, మామకాఘ నివారకా, అని శబ్దానుప్రాసాలతో రాముని స్తుతించటం విశేషం.

ఈ సంస్కృత కీర్తనలో కూడా రాముని చరిత్రాన్ని సమస్తం (రామాయణం) ఆవిష్కరించాడు. వావిలిపాటిరాముడే ఇందులో రాముడు.

'వావిలిపాటి వీరరామా' అనే ముద్రకూడా వేంకటేశ్వరముద్రతో పాటు చేర్చాడు.

"రాజీవనేత్రాయ రాఘవాయ నమో
సౌజన్యనిలయాయ జానకీశాయ" (2-273)

మరో సంస్కృత కీర్తనలో రామునిచేత సంహరించబడిన వివిధ వ్యక్తుల ప్రస్తావన వచ్చింది.

"శరణుశరణు విభీషణవరద
శరధిబంధనరామా సర్వగుణస్తోమ" (2-220)

ఇందులో మారీచ సుబాహువధ, ఇంద్రజిత్‌వధ, కుంభకర్ణవధ వంటి విశేషాలు వచ్చాయి. ఇంద్రజిత్తులగుండుగండ అని వాడాడు. "ఓంకారరూపరామా! అనడం మరో విశేషం.

"అవధారు రఘుపతి అందరిని చిత్తగించు
ఇవలనిండె కొలువిదె నదె సముఖ" (3-492)

శ్రీరామపట్టాభిషేక సన్నివేశాన్ని ఈకీర్తనలో ఒక చిత్రపటంలోలా చూపించాడు. అయోధ్యారాముడు పట్టాభిషిక్తుడై కొలువున్నాడు. నారదుడు పాడుతున్నాడు. రంభాదులు ఆడుతున్నారు. కపులు మొక్కుతున్నారు. మునులు దీవిస్తున్నారు. భరతలక్ష్మణులు వింజామరలు వీస్తున్నారు. కుశలవులు రామాయణ గానం చేస్తున్నారు. రాజసంతో రాముడు అందరినీ చిత్తగిస్తున్నాడు.

"జయజయరామ సమర విజయరామా
భయహర భక్త పారీణరామా" (3-300)

ఈ కీర్తనలో రామచంద్రుని గుణగణాలు ప్రస్తావించబడ్డాయి. యుద్ధంలో విజయం సాధించాడు. భక్తులపట్ల అనురక్తి ప్రదర్శించాడు. సుగ్రీవుని రక్షించాడు, రావణుని సంహరించాడు. ఇది రాముని శౌర్యవర్ణన.

"రామచంద్రుడితడు రఘువీరుడు
కామితఫలము లీయగలిగె నిందరికి" (4-147)

రామచంద్రుని అపారకరుణ ఈకీర్తనలో ఆవిష్కృతమైంది. ఆయన ఆశ్రితభక్తులపాలి చింతామణి, కల్పవృక్షం, కామధేనువు, పరమబంధువు, ఘనపారిజాతము, కామితార్థ ప్రదాయకుడు. ఇన్ని లక్షణాలుగల రామచంద్రుని భక్తులపాలి ప్రత్యక్షదైవంగా వర్ణించాడు.

"అదెలంక సాధించె నవనిభారము దించె
విదితమై ప్రతాపము వెలయించె" (4-514)

ధర్మసంస్థాపనకోసం అవతారాలను ఎత్తుతూనే వున్నాడు మహావిష్ణువు. ఆకోవలోనిదే త్రేతాయుగంలోని రామావతారం. విజయనగరంలోని రామచంద్రునిపై కీర్తన యిది.

సూర్యవంశతిలకుడైన రాముడు దశరథపుత్రుడు, శివధనుర్భంగం చేసిన ఏకాంగవీరుడు. ఆరాముడే కలియుగ వేంకటేశ్వరుడు.

"ఈతడు తారకబ్రహ్మమితడు మాదేవుడు
కౌతుకాన చెప్పే వినగదరే ఓజనులు" (2-208)

ఇందులో రాముని పరాక్రమాన్ని శౌర్యాన్ని సౌందర్యాన్ని కరుణ్యాన్ని ఓ జనులారా! వినమని ఎలుగెత్తి చాటుతున్నాడు.

రాముడు మాదేవుడు అని అన్నమయ్య ఆప్యాయంగా అంటున్నాడు. బ్రహ్మకు తారక బ్రహ్మమంత్రమని, కోదండా దీక్షా గురుడని దివ్యామోఘశరుడని కీర్తించాడు అన్నమయ్య.

"రాముడు లోకాభిరాముడు త్రైలోక్య
ధాముడు రణరంగభీముడు వాడె " (2-219)

ఈకీర్తనలో అనుప్రాసాలంకారంతో రాముని గుణగణాలను కీర్తించడం జరిగింది. లోకాభిరాముడు, రణరంగభీముడు మహోగ్రశరుడు, రాక్షస సంహరుడు, సర్వగుణాకరుడు, కోదండ దీక్షా గురుడు, లోకైక వీరుడు, శూరుడు, ధర్మ విచారుడు అయిన విజయనగరములోని శ్రీరామచంద్రుని కీర్తించాడు.

నాటకీయశైలిలో రాముడు హనుమంతుడు ఒకరితో ఒకరు సంభాషించినట్లు అందంగా ప్రదర్శించాడు. లంకలో సీతమ్మను చూచి తిరిగివచ్చిన హనుమంతునితో జరిగిన సంభాషణ ఇది.

"అపుడేమనె నేమనేమనెను
తపమే విరహపుతాపమనె" (6-97)

ప్రశ్నోత్తర రూపంలో సాగిన కీర్తన యిది.

రాముడు : ఓ హనుమా! సీత అపుడేమంది? నాతో ఏమని చెప్పమంది!

హనుమ : రామా! నీవులేక నీకు దూరమై అనుభవిస్తున్న విరాహమే తపస్సు అని చెప్పమంది.

రాముడు : ఇంకాఏమని చెప్పమంది?

హనుమ : రామా! ఈప్రాణం భారంగా వుంది. ఈ భారాన్ని ఎలా మోసేది అని చెప్పమంది.

రాముడు : ఇంకా ఏం చెప్పింది?

హనుమ : మాయామోహితమైన జింక ఇలా చేసిందని చెప్పమంది.

రాముడు : నాగురించి ఏమని అడిగింది?

హనుమ : కలియుగంలో ఈప్రేమ కూటమిని వేంకటాద్రిపై చూశానని చెప్పమంది.

"రామ మిందీవరశ్యామం భజే"

దామం సురసార్వ భమం భజే" (4-452)

చిన్నచిన్న సంస్కృత పదబంధాలతో రాముని శౌర్యం వర్ణితమైంది. రణరంగధీరుడు, ధర్మకులో ద్ధారుడు, దానవసంహారుడు, సుగుణోదారుడు, భక్త సేవితుడు అయిన రామునికి స్తోత్రరూపంలో ఈ కీర్తన సాగింది.

"ఈతడువో రాముడు ఏకాంగ వీరుడు

ఏతలజూచిన తానై ఇరవుకొన్నవాడు" (29-6)

బాల్యంలోనే శివధనుర్భంగం చేసి సీతను పెండ్లాడినాడు. తానొక్కడే 14000 మంది రాక్షసులను చంపినాడు. సప్తతాళభేదనం చేసినాడు. రావణసంహారం చేసి అయోధ్యకు పట్టాభిషిక్తుడైనాడు.

"రాముడు లోకాభిరాముడు వీడిగో

వేమారు మొక్కుచూ సేవించరో జనులు" (4-515)

సహస్రనాముడైన ఆనీలమేఘశ్యాముడు-జితకాముడు, సమరభీముడు, హిమధాముడు, దేవతాసార్వభౌముడు. తులసీదాముడు, భక్తప్రియుడు. అతణ్ణి సేవించమని జనులను కోరుతున్నాడు అన్నమయ్య.

"శరణు వేడెద యజ్ఞసంభవరామ

అరసి రక్షించు మమ్ము నయోధ్యరామ" (3-155)

రామావతారంలోని వివిధ ఘట్టాలను మరోకోణంలో ఈకీర్తనలో ప్రదర్శించాడు. ఆయన తారక బ్రహ్మమైన సీతాపతిరాముడు. వేదశాస్త్ర పురాణాది వినుత రాముడు, ఆదిత్యకులాంబుధి మృగాంకరాముడు ఇలా సాగింది ఆ కీర్తన.

"ఈతదేరఘురాము డీతదేకాంగ వీరుడు

ఈతడు చేసిన చేత లెన్నియైనా గలవు" (29-196)

రాముని చరిత్రను చెబుతూ ఒక చక్కని మాట వాడాడు :

"తనంతలేసి కొడుకుల గాంచెను కుశలవుల"

సీతాదేవితో కూడి పుష్పక విమానంపై అయోధ్యకువచ్చి పట్టాభిషిక్తుడైన రాముడు ఇందులో వర్ణింపబడ్డాడు.

"వీడివో అల విజయరాఘవుడు

పోడిమి కొలువున పొదలీ చెలియా " (26-52)

వావిలపాటిలోని రామచంద్రుని వర్ణనయిది. ఆదశరథ తనయుడు తామర కన్నులవాడు. అతనికి మొక్కమని సీతమ్మకు చెలి సలహాయిస్తోంది. అతడు ఆదిమ పురుషుడు, అంబుదవర్ణుడు, నీ దెసచూపులు నించినాడు. అరాజశేఖరుని కొలువుదీరిన వానిని చూడమని చెలి బోధిస్తోంది.

"రాముడీతడు లోకాభిరాముడీతడు
కామించిన విభీషణుకాచిన వాడీతడు" (28-503)

తలగుండ గండ అనే మాటను సంహరణానికి మారుగా అన్నమయ్య ఈకీర్తనలో కూడా వాడినాడు. నిగమములు నుతించే నిత్యునిగాను, భక్తులపాలి తారక బ్రహ్మగాను, లోకాభిరామునిగాను, వీరాధివీరునిగాను ఈ కీర్తనలో చెప్పటం విశేషం.

"శరణు శరణు రామచంద్ర నరేంద్ర
సరిమమ్ముగావు రామచంద్రనరేంద్ర" (3-505)

ఈ కీర్తనలో లక్ష్మణభరతశత్రుఘ్నులతో బాటు హనుమంతునిగూడ సమానంగా సంభావించడం విశేషం. శరణాగతిరూపంలో నడిచిన ఈకీర్తనలో రామావతారకథ సంక్షిప్తంగా చెప్పబడింది.

దశావతారాలలో రాముడు పూర్ణావతారం. తిరుమలలోని వెంకటేశ్వరుని సన్నిధిలో సీతారామ లక్ష్మణహనుమత్ విగ్రహాలున్నాయి. కులశేఖరాళ్వర్ పడిముందు రాములవారి మేడ వుంది. రామునికి అన్ని ఉత్సవవిశేషాలతోను ప్రాధాన్యం వుంది. పునర్వసునాడు శ్రీరామచంద్రుడు తిరుమాడ వీధులలో సంచరిస్తాడు. తెప్పలపై పుష్కరణిలో ప్లవోత్సవం నాడు తొలిరోజు శ్రీరామచంద్రునికీ ప్రాధాన్యం. ఇంత అనుబంధంగల వేంకటరాముని అన్నమయ్య వివిధ సన్నివేశాలలో సంభావించడం సహజమే. రామచంద్రునితో బాటు హనుమంతునిపై గూడ అన్నమయ్య అనేక కీర్తనలు వ్రాశాడు.

"రామా దశరథరామా నిజ సత్యకామా
నమోనమో కాకుత్సరామా" (4-156)

శ్రీరామచంద్రుడు తారకబ్రహ్మ మంత్రిమై మునులకు ఋషులకు అభయమొసగిన మూలమూర్తియై వెలసిన తీరును ఈ కీర్తనలో వివరించాడు. కరుణానిధి. కౌసల్యతనయుడు, పరమపురుషుడు, సీతాపతి, వారధికట్టినవాడు. రవివంశమున జన్మించిన కోదండరాముడు. రాక్షససంహారకుడు, దశరధసుతుడు ఆంజనేయునికి ప్రీతి కలిగించే అయోధ్యారాముడు. వేదగోచరుడైన ఆ సుగ్రీవవరదుడే ఈ వేంకటగిరిరాముడు.

"దీనరక్షకుడఖిల వినుతుడు దేవదేవుడు రాముడు
జానకీపతి గొలువుడీ ఘన సమరవిజయరాముడు" (2-178)

రవికులజుడైన శ్రీరాముడు సరయూనదీతీరంలో జనులకు ముక్తి నొసగాడు. ఇతడు హరవిరించులకు ఆదిపురుషుడు, పరమయోగులకు నిధానము. మునులకు ఋషులకు అభయమొసగినవాడు. హనుమంతునకు బ్రహ్మపట్టము నొసగినవాడు, మనుజవేషంలో పార్వతికి మంత్రమయ్యాడు. భక్తసులభుడు, నిగమవంద్యుడు శ్రీరాముడు ఈ కీర్తన వావిలా పాటిలోని రాముని గూర్చిన కీర్తన.

"ఎంతని నుతియింతు రామరామ యిట్టినీప్రతాపము రామరామ
పంతాన సముద్రము రామరామ బంధించ వచ్చు నారామరామ" (4-485)

తన బంటుచే సంజీవనీ పర్వతాన్ని తెప్పించడం, వాలి సంహరణం, శివధనుర్భంగము, రావణసంహరణ, విభీషణునికి అభయ మివ్వడం వంటి ఘనకార్యములను ఈ కీర్తనలో చక్కగా ప్రస్తుతించాడు. కామితఫలముల నిచ్చే కౌసల్యానందనుడే వేంకటాద్రిరాముడు.

"నమో నమో జగదేకనాథ తవ సర్వేశ
విమల విశ్రుత అసద్విఖ్యాత కీర్తే" (4-494)

నమోనమో జగదేకనాథ సర్వేశా! రాజీవలోచన, సీతాపతి, రణరంగభీమ, దైత్యాంతక, దశరథతనయ, కౌసల్యానందన, సుగ్రీవవరద సాకేతపురివాసా, తారక బ్రహ్మ, భక్తవత్సలుడువైన ఓ వేంకటరామా నీకు నమస్కారములు.

**సి. హనుమంతుడు:** ప్రస్తుత పరిశోధనా ప్రణాళికలో వున్న కీర్తనలలో దాదాపు 20 కీర్తనలు హనుమంతునిపైనే వున్నాయి. వైష్ణవ సంప్రదాయంలో దేవుని ముందు నైచ్యానుసంధానం - తననుతాను తక్కువ చేసుకోవడం లోకంలో గొప్పవాణ్ణి చేస్తుంది. ఈ సూక్ష్మాన్ని ఆచరణలో చూపిన హనుమంతుడు లోకానికి ఆరాధ్యుడయ్యాడు. రాముని సేవలో తరించిన హనుమంతుడు వేంకటేశ్వరసేవాగ్రగణ్యుడయ్యాడు.

"మంగాంబుధి హనుమంతా నీశరణ
మంగలించితివి హనుమంతా" (4-444)

ఈకీర్తనలో హనుమంతుని శౌర్యప్రతాపాలు ప్రస్తావించబడ్డాయి. బాల్యంలో బాలసూర్యబింబాన్ని పండుగా భావించి అందుకో బోయాడు చిన్నతనంలోనే బ్రహ్మాదులచే వరాలు పొందాడు. ఆకాశాన్నంటేరూపంతో బుద్ధిబలంతో సముద్రలంఘనం చేశాడు. పాతాళంలో నిక్కిన మైరావణుని చంపాడు. అలాంటి హనుమంతునికి చేతులు మోడుస్తున్నాను.

"ఓపవనాత్మజ! ఓ ఘనుడా
బాపుబాపనగా పరగితిగా" (4-327)

బ్రహ్మజ్ఞానంగల ఓపవనకుమారా! నీవు బుద్ధిబలంతో ప్రకాశిస్తున్నావు. నీసాహసమెంత

గొప్పది. సూర్యునికి గ్రహణ కారకుడయ్యావు. నిన్ను గరుత్మంతాదులు గౌరవిస్తారు. రావణుణ్ణి సంహరించిన శ్రీరాముని పాదసేవకుడవు. ఇక్కడ ఆంజనేయుడు సూర్యునిమింగే ప్రయత్నంలో గ్రహణకాలం ఏర్పడింది అనే విషయం గమనించాలి.

"శరణుకపీశ్వర శరణం బనిలజ
సరవినెంచ నీసరి ఇకలేరీ" (3-421)

ఈ కీర్తనలో కూడా హనుమత్ప్రతాపం వర్ణించబడింది. చిన్నతనంలో సూర్యుని కబళించటం, చుక్కలు ముట్టేలా శరీరం పెంచడం, సముద్రలంఘనం చేసి సీతకు అంగుళీయకం యివ్వడం, సంజీవిని తేవడం ప్రధానఘట్టాలు. అట్టి హనుమంతుడు నా ఎదుట నిలబడి కృపనుజూపాడు అంటాడు అన్నమయ్య.

"ఒక్కడే ఏకాంక వీరు డుర్వికి దైవమౌనా
ఎక్కడా హనుమంతునికెదురా లోకము" (4-462)

ఇక్కడ హనుమంతుని యితర దేవతలతో పోల్చినాడు. బ్రహ్మపట్టాన్ని పొంది బ్రహ్మ అయినాడు. దైత్యులజంపి హరి అయినాడు, రుద్రవీర్యముతో జనించి శివుడైనాడు. దిక్కులుతాకి సూర్యుడైనాడు. పాతాళము దూరి శేషుడైనాడు. వాయుజుడై అనిలుడైనాడు. సముద్రముపై కెగసి చంద్రుడైనాడు. మేరువు దగ్గర సింహమైనాడు. అట్టి హనుమంతునికి ఈలోకంలో ఎదురేలేదు.

"పెరిగినాడు చూడరో పెద్దహనుమంతుడు
పరిగి నానావిద్యల బలవంతుడు" (4-528)

హనుమంతుడు అనేక విద్యల సంపన్నుడు. రాక్షసులపాలి ఏకాంగవీరుడు. అవసరమైనపుడు సంజీవని తెచ్చిపెట్టిన ధీరుడు. తపఃఫలంగా జన్మించిన వాడు. ఈ కీర్తనలో ఏకాంగ వీరుడు, లంకానిర్ధూమధాముడు. కపికుల సార్వభౌముడు అనే విశేషణాలు విలక్షణం. ఏకాంగ అంటే మిత్రుడు. కుమారుడు భార్య మొదలైనవారి సంబంధం లేకుండా దేవునిసేవ పరమావధిగా కలవాడు. ఆయన వేదవేదాంగపారగుడు. కామగమనవిద్య తెలిసిన వాడు. తాను రామ బాణాన్ని అన్నాడు. రాముడికి దాసుడనని అన్నాడు. అందుకే ఆయన బుద్ధిమతాం వరిష్ఠుడు.

"అవధారుదేవ హరికులరామ
వివిధమై నీబంటు వెలయుచున్నాడు" (3-144)

ఇందులో కలశాపురంలో వెలసిన హనుమంతుని స్మరణవుంది. రక్కసులను చంపిన ఏకాంగవీరుడతడు. పండ్లగొలలను పిడికిటపట్టుకొని శరీరాన్ని పెంచి పెద్దజంగను చాచాడు.

తనవాలంతో రావణుని కొలువులో ఎత్తుగా కూర్చున్నాడు. అట్టి హనుమంతుడు వేంకటాద్రిపై కొలువైయున్నాడు.

"శరణుశరణు వేదశాస్త్రనిపుణ నీకు
అరుదైన రామకార్య ధురంధరా" (2-347)

ఇందులో పల్లవితప్ప మిగిలినమూడు చరణాలు సంస్కృతంలో నడిచాయి. హనుమంతుడు వేదశాస్త్ర ప్రవీణుడు. రామకార్యసాధనలో సాటిలేని మేటి వాయువేగం కలిగిన బలవంతుడు. బుద్ధిమంతుడు. శ్రీవేంకటేశ్వరునిదయతో బంగారుకలశమువంటి దేహకాంతి కలవాడు. ఈ కీర్తనలో కలశాపుర ఆంజనేయుని ప్రస్తుతి వచ్చింది. ఆస్వామిపైనే మరో కీర్తన.

"కలశాపురము కాడ కందువసేసుకొని
అలరుచునున్నవాడు హనుమంతరాయుడు" (4-467)

వీరభక్తుడైన హనుమంతుని అనంతశౌర్యప్రతాపాలు ఇందులో వర్ణించబడ్డాయి. అంతటి వీరుడు శ్రీవేంకటేశ్వరుని వాకిట దాసుడై కాచుకొన్నాడని అన్నమయ్య అంటాడు. తిరుమలలో వెంకటేశ్వరుని ఆలయానికి ఎదురుగా బేడి ఆంజనేయస్వామి విగ్రహం వుంది. దానిని అన్నమయ్య చమత్కారంగా వాకిట దాసుడై కాచుకున్నాడు అని చెప్పాడు.

"అన్నిటా నేరుపరి హనుమంతుడు
పిన్ననాడే రవినంటె పెద్దహనుమంతుడు". (3-138)

ఇందులో కూడా ఏకాంగవీరుని ప్రస్తావన ఉంది. రామునిసేవలో బిరుదుబంటు సుగ్రీవ ప్రధానులలో లావరి, వానరులలో ఏకాంగవీరుడు, కుంభకర్ణుచేతిశూలము విరిచిన భీషణుడు, బ్రహ్మపట్టాన్ని ముల్లోకాలలో ధరించినవాడు అయిన హనుమంతుడు ఇప్పుడు శ్రీవేంకటేశ సేవకుడైనాడు. ఈకీర్తన విజయనగర రామాలయంలోని హనుమత్ ప్రశస్తి.

"ఏలనయ్య లోకమెల్లయిట్టిరాము దీవెనచే
నీలవర్ణ హనుమంతా నీవుమాకు రక్ష" (4-459)

భక్తులకు హనుమద్రక్ష అధికంగా వుండాలని కాబోలు అన్నమయ్య సాధారణంగామూడు చరణాలతో ముగించేవాడు. దీనిలో ఐదు చరణాలు పెట్టాడు. శిఖనఖపర్యంతం దేవతలను వర్ణిస్తారు. ఇందులో కూడా హనుమంతునికి ఏఏదేవతలు రక్షయో చెప్పాడు. మోమునకు ఇంద్రుడు, శిరసునకు రవి, కనులకు గ్రహతారకలు మేనికి శ్రీరాముడు, వాలమునకు శక్తి, కరయుగములకు గరుడుడు, పాదములకు వాయుదేవుడు, తొడలకు వరుణుడు. మదికి వేదరాసులు, గళానికి నలువ, నాలుకకు భూదేవి, సంధులకు హరుడు, రోమములకు దేవతలు, తేజమునకు అగ్ని, శృంగారమునకు శ్రీసతి, సర్వకాలములకు శ్రీవేంకటేశ్వరుడు నీకు శ్రీరామరక్షయని అన్నమయ్య సుదీర్ఘంగా, సుమనోహరంగా వర్ణించాడు.

"అంజనాతనయుడైన హనుమంతుడు
రంజితపు మతంగ పర్వతపు హనుమంతుడు" (3-143)

ఈకీర్తనలో హనుమంతుడు సూర్యుని వద్ద చదవడం అద్భుతంగా వర్ణితం. ఉదయాస్తశైలముల కొక్కజంగగా జాచి అదె సూర్యుతో చదివె హనుమంతుడు. నిత్యం రామజపంతో కనిపించే హనుమంతుణ్ణి రామజపాన పెదవులు గదిలించి అని చెప్పడం బాగుంది. ఆముకొని వున్నాడు అనే అచ్చతెనుగుమాట వాడబడింది.

నేల మిన్నునొక్కటైన నీబంటు ఒక్క
వేలనే యక్షుని తెగవేశగా నీబంటు" (1-69)

ఇందులో తేటతెలుగు పదాలతో హనుమత్ప్రతాపాన్ని చెప్పినాడు. హనుమంతుడు వుంగరాన్ని ఎగరవేసి సముద్రంలో పడకుండా నింగికి చెయిజాచినాడు. చెంగున సముద్రం దాటి జంబుమాలిని కుంగ దొక్కినాడు. రావణు రొమ్ము విరగగుద్దినాడు. లోకాలనే కాచిన నీ బంటు అని రాముతో అంటున్నాడు.

"కలశాపురముకాడ గంధపుమాకులనీడ
నలరేవు మేలుమేలు హనుమంతరాయ" (3-521)

ఈకీర్తనలో కూడ ఆంజనేయుని శౌర్యప్రతాపాలు ప్రశంసించబడ్డాయి. హనుమంతరాయ అనే విశేషణాన్ని వాడాడు అన్నమయ్య. కలశాపుర ఆంజనేయస్వామి ప్రతాపం యిందులో చెప్పబడింది. రవికుల తేజుడైన రాఘవుని మెప్పించితివి అని సాభిప్రాయమైన పదాన్ని వాడాడు.

"ఇతడేయతడు గాబో లేలిక బంటునునైరి
మితిలేని రాఘవుడు మేటిహనుమంతుడు" (4-443)

ఇందులో రామునితో హనుమంతుని పోల్చి చెప్పడం విశేషం.

రాముడు : సముద్రాన్ని బంధించి దాటాడు

హనుమ : సముద్రాన్ని అవలీలగా దాటాడు

రాముడు : రావణుని చంపాడు

హనుమ : మైరావణుని చంపాడు

రాముడు : గోవర్ధనగిరి ఎత్తాడు ( కృష్ణావతారంలో)

హనుమ : సంజీవనీపర్వతం తెచ్చాడు.

రాముడు : అహల్యకొరకు రాతిని తాకాడు

హనుమ : రాయి కరిగేలాపాడాడు

రాముడు : అంజనాద్రిపై వేంకటేశుడైనాడు

హనుమ : అంజనీతనయుడైనాడు -

చక్కని కల్పన

"అందరికీ నెక్కుడైన హనుమంతుడు

అందుకొనే సూర్యఫలమని హనుమంతుడు " (4-155)

లంకలో ప్రవేశించి రాక్షసులను కొట్టి అల్లకల్లోలము జేసి సీత ఆనవాలు తెలుసుకొని వచ్చిన హనుమంతుని - కలశాపుర హనుమంతుని వర్ణన యిది. ఆకెముందర, కొంకక, దానొక, అల్లదె, వొల్లనే, తెంకినే వంటి అచ్చతెనుగు పదాలు ఇందులో కనిపిస్తాయి.

"అదె చూడరయ్య పెద్ద హనుమంతుని

గుదిగొని దేవతలు కొనియాడేరయ్యా" (4-509)

శిరస్సు ధృవమండలాన్ని తాకేలా శరీరాన్ని పెంచిన హనుమంతుడు సూర్యునివెంట మోహం తిప్పుతూ చదువుకున్న మహిమాన్వితుడు. బ్రహ్మాండముదాకా తోక మీది కెత్తినాడు. దిక్కులు పిక్కటిల్లేలా దేహరోమాలు పెంచాడు. ఇప్పుడు శ్రీవేంకటేశుని హితవరి బంటైనాడు.

"పదియారువన్నెల బంగారుకాంతులతోడ

పొదిలిన కలశాపుర హనుమంతుడు" (4-167)

ఇందులో పల్లవిలోను చరణాలలోను కలశాపురహనుమంతుడు అనే పదాన్ని వాడాడు. ఎడమచేతి పండ్ల గొలను బట్టి కూడా చేత రాకాసి గుంపులను కొట్టాడు. అక్షకుమారుని చంపాడు. దివ్యాంబరాలతోను కవచ కుండలాలతోను వేంకటేశ్వరుని బంటు అయినాడు.

"అరుదీ కపీంద్రుని యధికప్రతాపము

సురలకు నరులకీ సుద్దులెందుగలవా" (4-470)

ఇందులో ఒక చమత్కారం చేశాడు. ఒక మొలగంట చంద్రుడు మరొక మొలగంట రవి, మొలపూసలు చుక్కలుకాగా వాలాగ్రమున బ్రహ్మలోకముండగా పెరిగినాడు. కుడిచేత దశదిక్కులూ వున్నాయి. అంతటి భీకరశరీరాన్ని చూపాడు హనుమంతుడు.

"అవధారు చిత్తగించు హనుమంతుడు వీడె

భువిలోన కలశాపురహనుమంతుడు" (4-490)

అనుపమ జయశాలియైనహనుమంతుడు రణరంగధీరుడు. అతనిని గూర్చి రామునికి అన్నమయ్య చిత్తగింపులు చెబుతున్నాడు. సప్తజలధులు లంఘించి సంజీవితెచ్చాడు. భానుకోటికాంతితో ప్రకాశించాడు. బ్రహ్మపట్టానికోసం నీ అనుమతి కోరుతున్నాడని అంటాడు.

"తలచరో జనులు ఈతని పుణ్యనామములు

సులభముననే సర్వశుభములు కలుగు" (4-483)

పై రెండు కీర్తనలు కలశాపురహనుమంతునిపై చెప్పబడ్డాయి. ఇందులో అష్టోత్తరశతనామావళి వలె హనుమంతునివిశేషణాలు వివరించబడ్డాయి హనుమంతుడు, వాయుజుడు, అంజనాతనయుడు, వనధిలంఘనశీలుడు, దనుజాంతకుడు, సంజీవనశైలసాధకుడు, లంకా సాధకుడు, లక్ష్మణప్రబోధకుడు, సుగ్రీవ సచివుడు, అర్జునసఖుడు, రామునిబంటు. సీతాదూత, జాతరూపవర్ణుడు, నమ్మినసేవకుడు.

సేవ్యసేవక భావంతో అన్నమయ్య వేంకటేశుని కొలిచాడు. అందువల్ల సేవకులలో ప్రధముడైన హనుమంతునిపై అయనకు అపారభక్తి. ఈకీర్తనలన్నింటిలోనూ భక్తిభావం తొణికిసలాడుతూ కనపడుతుంది.

దాసస్య దాసః అన్న రీతిలో అన్నమయ్య హనుమంతుని కీర్తనాదాసుడయినాడు.

**డి. శ్రీకృష్ణుడు:** ఆనందనిలయుడైన శ్రీవేంకటేశుని విగ్రహం ముందు నిత్యం అర్చనలందుకొనే వారిలో శ్రీకృష్ణుడు ఒకడు. చేత వెన్నముద్ద ధరించి నాట్య భంగిమలో వున్న బాలకృష్ణుడు రుక్మిణీసమేతుడై భక్తులకు దర్శనమిస్తాడు. రోహిణీ నక్షత్రంనాడు రుక్మిణీ సమేత శ్రీకృష్ణుని తిరుమాడ వీధులలో సంచరింపచేస్తారు. జన్మాష్టమి తిరుమలలో ప్రశస్తంగా జరుగుతుంది. అన్నమయ్య అనేక సందర్భాలలో అనేక కీర్తనలలో వేంకటకృష్ణుని ప్రస్తుతించాడు. దాదాపు 50 పాటలు మన పరిశోధనాపరిమితిలో లభించాయి.

నారాయణతీర్థులతరంగాల కోవలో సంస్కృతంలో నడచిన ఈ కీర్తన గమనిద్దాం:

"భావయామి గోపాలబాలం మన

స్సేవితం తత్పదం చింతయేయం సదా" (1-137)

మణులు పొదిగిన చిరుగజ్జెల మొలతాడుతో చిటిపొటి అడుగులు వేస్తూ నర్తనం చేస్తున్న బాలకృష్ణుని మొదటిచరణంలో ఆవిష్కరింపజేశాడు. రెండవచరణంలో వెన్నముద్ద చేత దాల్చి బ్రహ్మాదిదేవతల భావనామయప్రపంచలో విహరించే గోపాలబాలుడు తిరువేంకటాచలంపై పరమ పురుషుడై కొలువున్నాడని కీర్తించాడు. సాధారణంగా మూడు చరణాలు వుంటాయి. ఇందులో రెండు చరణాలేవున్నాయి.

"రారా చిన్నన్న రారోరి చిన్నవాడ

రారముద్దులాడ రారోరి బాలకృష్ణ" (5-214)

గ్రామ్య భాషలో సాగిన కీర్తన యిది. లక్ష్మీదేవిని లకిమమ్మ అంటాడు. గోపికా స్త్రీలతో వలపు చేసి గోకులంలోని వారికి విందైనాడు చిన్నకృష్ణుడు. ఇందులో సుదతుల సిగ్గు, కొదలు

మాటలు, చిదుగు చేతలు, పెదవి చవులు, కలికితనము, చెలుల కౌగిట అనే మాటలు వున్నాయి.

మరో కీర్తనలో (కొలనిలోన మునుగోపికలు (5-214)). ఇక్కడ రవివర్మ వర్ణ చిత్రంలా స్నానమాడుతున్న గోపికల కచకుచవర్ణన సర్వాంగసుందరంగా చేయబడింది. పిరుదులు దాటిన పించపుటలకలు, వీడిన తురుములు, అందినితంబములు ముద్దుటుంగరములు మురిపపుకరములు, పాలిండ్ల పెను భారములు, కరమూలపు మెరుగులు కలిగిన ఆకాంతలు వేంకట కృష్ణుని మూలకు బిలుచుచు మ్రొక్కిరి - అంటాడు అన్నమయ్య చీరలిమ్మని వేడుకుంటూ మొలకనవ్వులతో కృష్ణస్వామికి గోపికలు మ్రొక్కారు.

"ముద్దుగారేయశోద ముంగిట ముత్యము వీడు
తిద్దరాని మహిమల దేవకీ సుతుడు" (3-577)

ముద్దులొలికే బాలకృష్ణుడు దేవకీ సుతుడనే విషయం గుర్తుచేస్తున్నాడు. అతడు యశోదముంగిట ముత్యము. ఆయా సందర్భాలలో నవరత్నాలతోపోల్చి చెప్పటం విశేషం. గొల్లెతల అరచేతి మాణిక్యము, కంసునిపాలి వజ్రము, కాంతులలో గరుడపచ్చ. రుక్మిణికి మోవిపగడము, గోవర్ధనపు గోమేధికము, శంఖచక్రాలమధ్య వైఢూర్యము, కాళింగునితలలపై పుష్యరాగము, వేంకటాద్రి ఇంద్రనీలము, జలనిధిలోని దివ్యరత్నము. ఇట్టి వర్ణన మరేకవి చేయలేదు నవరత్నశోభితుడైన ఆ వేంకటాద్రీశునికి కృష్ణునికి అభేదం చెప్పబడింది.

"బండివిరిచి పిన్నపాపలతోనాడి
దుండగీడు వచ్చె దోబూచి" (5-227)

ఇది దోబూచిపదం జానపదం. సామాన్య జన జీవితంలో చిన్న పిల్లలను భయపెట్టడానికి దోబూచి పదాలు పాడుతారు. అది గమనించిన అన్నమయ్య ఇదే శైలిలో ఈకీర్తన వ్రాశాడు. కృష్ణావతారం మనోహరం. అన్నమయ్య సంకీర్తనలలో ఆబాలకృష్ణుని చేష్టలు అతి రమణీయము లయ్యాయి. శకటాసురుణ్ణి చంపి పిల్లపాపలతో నాడి దుండగీడైన ఆకృష్ణుడు వచ్చాడు. నవనీత చోరుడైన ఆదొరదొంగ వచ్చాడు. గొల్లెతలతో నిదురించిన ఆతొడుకుదొంగ వచ్చాడు. గొల్లపల్లెలో ఇల్లిల్లు తిరిగి కొల్లలాడిన తొల్లిటి దొంగ వచ్చాడు. తెలుగువారికి ప్రియమైన మాటలతో చిన్నికృష్ణుని మనకనుల ముందుంచాడు.

"సువ్వి సువ్వి సువ్వాలమ్మా
నవ్వుచు దేవకి నందునిగనియె" (5-361)

ఇందులో శ్రీకృష్ణుని జననవిశేషం జానపదసరళితో దంపుడు పాటల్లా చెప్పబడింది. నడురేయివేళ దేవకికి పరమాత్ముడు పుట్టాడు. అర్ధరాత్రివేళ చంద్రోదయమైంది. దేవతలబాధలు

తొలగి కంసునికి కష్టకాలం దాపురించింది. పుష్పవృష్టికురిసింది. జగమంతా ఆనందయమైంది. యమునానదిని దాటి వసుదేవుడు నందవ్రజంలోకి ప్రవేశించాడు.

"ఉగ్గువెట్టరే వోయమ్మ చె
యొగ్గినిదె శిశువోయమ్మ" (5-97)

అన్నమయ్య తానే యశోద అయినాడు. ఓఅమ్మలార! బాలకృష్ణునికి ఉగ్గు పెట్టండి. ఇతడు సామాన్యుడుకాడు ఉగ్గుపెట్టిన తరువాత గట్టిగా వూపకండి పదనాల్గుభువనాలు కడుపులో దాచుకున్నాడు. అవికదులతాయి. వేడిపాలతో ఉగ్గుపెట్టకండి. నెత్తిన మొత్తకండి. ఆకసంలో బాలుని ఎగరేస్తూ అలసటకు గురిచేయకండి. ఉయ్యాలలో పడుకోబెట్టండి. తిట్టకండి, వూయల వూపండి. అన్నమయ్య నిశితపరిశీలనాదృష్టి ఇందులో కనిపిస్తుంది. తల్లులు పిల్లలకు చేసే ఉపచారాలు ఆయన బాగా గమనించాడు.

"సతులాల చూడరే శ్రావణ బహులాష్టమి
కతలాయ నడురేయికలిగె శ్రీకృష్ణుడు" (14-453)

ఒక గోపిక సాటి గోపికా స్త్రీలతో శ్రీకృష్ణజన్మను గూర్చి ఆశ్చర్యంగా చెబుతున్న సన్నివేశం ఇతది. ఓ సతులాల! శ్రావణ బహుళాష్టమినాడు అర్ధరాత్రి శ్రీకృష్ణుడు జన్మించాడు ఎన్నో వింతలు కలిగాయి. పుట్టుకతోనే చతుర్భుజాలు, శంఖచక్రాలు ఎలా ధరించాడే. కిరీటము ఆభరణాలు దరించి ఎట్టఎదుట నిలిచాడు. బ్రహ్మరుద్రులు నుతించారు. దేవకీవసుదేవులు ఆమహిమలను చూశారు. యశోదానందులకు కొదవలు తీర్చే బిడ్డడైనాడు. ఆకృష్ణుడే అలమేలు మంగతో కూడి వెంకటేశుడైనాడు.

"చిన్నశిశువు చిన్నశిశువు
ఎన్నడు జూడమమ్మ ఇటువంటి శిశువు" (6-1)

చిన్నికృష్ణుని ముగ్ధమనోహరరూపాన్ని యిందులో దర్శించవచ్చు. సామాన్యశిశువుకు, పరమాత్ముడైనశిశువుకు స్వరూపగుణ ప్రవర్తనాదులలో వ్యత్యాసం కనిపిస్తుంది. అన్నమయ్య తాను గోపికయై శ్రీకృష్ణుని దివ్యచేష్టలను వర్ణించాడు. ఇలాంటి శిశువును ఏనాడూ చూడలేదమ్మా. అందమైన శిరోజాలతో, తూగులాడేశిరస్సు, చింతకాయలవంటి జడలగములతోడ, ధ్వనిస్తున్న బంగారు గజ్జెలపాదాలు, ఉంగరాలుతొడిగిన మృదువైన వేళ్ళు బంగారు కడియాల లేతచేతులు, అద్దంవంటి చెక్కులు, పాలచారలు గట్టినపొట్ట, నులివెచ్చని వెన్న, తిన్న నోరు కలిగిన చిన్న కృష్ణుడు యశోదవెంట పోరాడుతున్నాడు. అప్పాఅప్పా అన్నంతనే వచ్చి యశోదను కౌగలించుకొనే శిశువు అతడే ఇప్పుడు వెంకటాచలాధిపతి.

"పలుమరు ఉట్లు పండుగను
చిలుకు చిడుక్కని చిందగను" (5-57)

ఇప్పటికీ తిరుమలలో జన్మాష్టమినాడు ఉట్లపండుగ జరుగుతుంది. బాలకృష్ణుడు ఉట్లుతాళ్లు తెగేలా కఠిల్లు, పెఠిల్లు, చిటిల్లని తెంచాడు. బంగారు బిందెలలో వున్న పాలు పెరుగు కంగు కళింగు, కటింగు, ఖణింగు అని మోదాడు. వుట్టిపాలు పగిలాయి. ఆదుడుకు కృష్ణుని ఈకీర్తనలో చూడవచ్చు.

"చూడవమ్మా యశోదమ్మ
వాడలవాడల వరదలివిగో" (5-226)

చిన్నికృష్ణుని ఆగడాలను గోపకాంతలు యశోదమ్మకు ఫిర్యాదు చేస్తున్నవైనం. పాలుపెరుగు మీగడలు వంచిన కాగులివిగో, నేతులు, జున్నులు సగభాగం అరగించి పారవేసిన బానలివిగో, చల్లలమ్మే జవ్వనులకొల్లలాడిన గురుతులివి- అనివారు ఏకరువు పెట్టారు.

"కానరటె పంచరటె కటకటా బిడ్డలను
నేను మీవలెనే కంటి నెయ్యమైన బిడ్డని" (5-253)

చిన్నకృష్ణుడు తమ యిండ్లలో జొరబడి పాలు, వెన్న పెరుగు, జున్ను తినేశాడని గోపికలు యశోదకు ఫిర్యాదు చేశారు. ఆమె పుత్రమమకారంతో వారివారి తప్పులను ఎత్తిచూపింది. అయ్యో మీరు బిడ్డలని కనలేదా? పెంచలేదా? నేనూ మీలాగే ఈ ప్రియమైన బిడ్డని కన్నాను అంటుంది. బయట పారవేసిన పాలు వెన్నలను చిన్ని బిడ్డలు చేయి పెట్టరా! మీయిల్లు మీరు సర్దుకోలేకయిలా అంటారా? మూసినకాగులలో వున్న నేయి, పెరుగు ఆడేబిడ్డలు ఆశపడరా? జున్నులు చిక్కితే విడుస్తారా చిన్నిబిడ్డలు. అతణ్ణిపూజించి మెచ్చించకూడదా అంటుంది.

"గురుతెరిగిన దొంగ కూగూగు వీడె
గురిలోనె దాగీని కూగూగు" (6-56)

ఇది జానపదశైలిలోని కూగూగు పదం. కొంటె కృష్ణుడు గురుతెరిగిన దొంగ అని ఆటపట్టిస్తున్నాడు అన్నమయ్య. చిన్నికృష్ణుని వింతచేష్టలు ఇందులో చెప్పాడు. గోపకాంతల చీరలు దొంగలించడం, ఉట్లపాలు దొంగలించడం, చల్లలమ్మే గొల్లెతల చనుకట్టులు తడవడం, ఇల్లాళ్ళపాలిండ్లు కొల్లలాడటం వంటిపనులు చేసిన దొంగను పట్టుకోండి అంటున్నాడు.

కూగూగు అనేది కన్నడంలో ఒకరిని పిలవడం. ఇక్కడ అన్నమయ్య భగవంతుని 'దొంగ' అని అనవలసిన అవసరం వుందా? విష్ణుసహస్రనామంలో 'అనర్థః' అనే పదం వుంది. దాని అర్థం అర్తుడు. జిజ్ఞాసువు, అర్థార్థి. ఈముగ్గురిచేతి కోరబడేవాడుస్వామి. ఆయన్ను ఆశ్రయిస్తే ఈసంసార తాపత్రయాలను దొంగలిస్తాడు. గోపికల దేహాభిమానాలు అనేవస్త్రాలను దొంగిలించిన

దొంగకృష్ణుడు. అడవిలోవున్న అవుదూడలను, గోపబాలకులను బ్రహ్మదేవుడు ఒకసారి దాచాడు. శ్రీకృష్ణుడు ఆమోసాన్ని గ్రహించి అవుదూడల ఆకారాన్ని తానే ధరించాడు. (భాగవతం దశమ స్కంధం 509) ఈ ఘట్టాన్ని గుర్తుచేస్తూ అన్నమయ్య గోవులలో దాగిన దొంగవీడు అన్నాడు.

"కొలనిదోపరికి గొబ్బిళ్ళో యదు
కులస్వామికిని గొబ్బిళ్ళో" (5-98)

ఇది గొబ్బిళ్ళపాట. ఆవుపేడతో గొబ్బెమ్మలను అలంకరించి కన్నెపిల్లలు గొబ్బిళ్లుపాడతారు. కృష్ణునిపై అన్నమయ్య ఈబాణీలో ఈకీర్తన సమకూర్చాడు. గోవర్ధనగిరిధారణ కాళీయ మర్దనము, శిశుపాలవధ, కంసవధ ఇందులో ప్రస్తావించాడు. దైత్యుల తలగుండుగండడు అనటం విశేషం. వేంకటగిరిపై కొండలయ్యకును గొబ్బిళ్ళో అంటాడు.

"ఇట్టిముద్దులాడె బాలు డేడవాడు వాని
పట్టితెచ్చి పొట్టనిండ పాలువోయ రో" (4-20)

అన్నమయ్య యశోదగా గోపకాంతగా భావించుకొని కృష్ణతత్వకీర్తనలెన్నో వ్రాశాడు. అచ్చతెనుగుపదాల కీర్తనయిది. చిన్నకృష్ణుని చిలిపి చేష్టలు వర్ణిస్తూ ఆ కొంటె కృష్ణుని పట్టి తెచ్చిపాలు పట్టించండని గోపకాంత అంటోంది. అన్ని తెలిసిన ఆరిందాలా వచ్చి కాగుతున్న వెన్నగిన్నెలో చేయి పెట్టాడు. అందరూ చూశారని చీమకుట్టిందని కన్నీరు కార్చాడు. దొంగవలెవచ్చి చిలుకుతున్నపెరుగు కుండలో చేయిపెట్టి కవ్వం తగిలిందని బాధపడుతూ జొల్లుగారుస్తున్నాడు. మాయింటికి ఎప్పుడు వచ్చాడో పెట్టెలో చేయి పెట్టాడు. ఆపెట్టెను వాని తలకెత్తండి. ఇక్కడ సూక్ష్మార్థం సంపదల పెట్టెలు సర్వేశ్వరునికే అర్పించమని భావము.

"మొత్తకురో యమ్మలాల ముద్దులాడెవీడె
ముత్తెమువలె నున్నాడుముద్దులాడు" (6-144)

యశోదచిన్నకృష్ణుని మొత్తబోయింది. అతడు కాళ్ళకు మొక్కబోయాడు.వ్రేపల్లెలో వెన్నలన్నీ వెక్కసంగాతిన్నాడు. తల్లిరోటకట్టివేసింది. గోపసతుల చన్నుగుడిచాడు. ఇప్పుడు వేంకటగిరిమీద మూలభూతి తానైవున్నాడు ఇది జానపదశైలిలో వున్నకీర్తన.

నందవ్రజమన్నా చిన్నికృష్ణుడన్నా అన్నమయ్యకు మమకారం. వెన్న దొంగఅయిన ఆ చిన్ని కృష్ణుడు ఆలమందల మధ్యలో పెరిగాడు. బృందావనంలో గోపికలతో సంచరించాడు. రేపల్లెలో కమ్మని నేతులు కాగుతుంటె ఘుమ్మని వేణునాద శృతులు కూడా జతకూడాయి. ఈ సుందరదృశ్యాన్ని అన్నమయ్య మాటలలో ఆలకిద్దాం.

"ఝుమ్మని యెడిశృతి కూడగను
కమ్మని నేతులు కాగగ చెలగె" (6-81)

మందర ధరుడైన మాధవుడు నందవ్రజంలో ఆలమందల శబ్దాలు, గోపకాంతల గానాల మధ్య సందడిగా పెరిగాడు. ఆ భావమే మరో రూపంలో

"కొండ వేలనెత్తినట్టి గోవిందా నిన్ను .
కొండించేరు యశోదకు గోవిందా" (16-325)

ఆణిముత్యాలవంటి అన్నమయ్య కీర్తనలలో ఇది వొకమేలిముత్యం. ఉత్కృష్టమైన గోపికా భక్తిని ప్రకటించే కీర్తన యిది. గోవర్ధన గిరిని చిటికెన వ్రేలిపై నిలబెట్టిన గోవిందుని గొల్లెతలు మ్రొక్కుతున్నారు. మధుర భక్తికి సంకేతాలైన గోపికలు గోవిందుని పిల్లన గ్రోవిని వలచారు. భక్తి ప్రపత్తులను ప్రకటించారు. యశోదకు కృష్ణునిపై కొండెములు చెప్పుటను అన్నమయ్య ప్రస్తావించాడు.

"ముద్దులుమోమున ముంచగను
నిద్దపుకూరిమి నించీని" (5-303)

బాలకృష్ణుని లీలా విలాసాలు యిందులో ఆవిష్కృతమయ్యాయి. ముద్దులొలికే చిన్నికృష్ణుడు మొలచిరుగంటలు, మువ్వలగజ్జెలు, గలగలమని కలకలధ్వనులు చేయగా పద్మాలవంటి చేతులు జాచి ముత్యాలహారాలు, చంద్రాభరణాలు ధరించి నేలకు నింగికి పొడవై ఆడుతున్నాడు.

"కొలిచితెరక్షించె గోవిందుడితడు
ఇలకు లక్ష్మికి మగడీ గోవిందుడితడు" (4-180)

కృష్ణావతారంలో లీలావిలాసాలు యిందులో ప్రస్తావించబడ్డాయి. గోవర్ధనగిరిధారణ, పశుపాలన, కంసవధ, కాళింగమర్ధన, చక్రాయుధధారణ చేసిన గోవిందుడే తిరుపతిలో పవళించిన గోవిందరాజస్వామియని గొప్పగా చెప్పాడు.

"పాలుదాగె వెన్నదినె బానల పెరుగుజుర్రె
సోలికాగుల నేతులు చూరలాడెనమ్మా" (10-2-87)

చిన్ని కృష్ణుని ఆగడాలు, పోకిళ్ళు యిందులో ప్రస్తావించబడ్డాయి. బాలుడుగదా అని కన్నెలు ముద్దాడ బోతే, మోవిపై గంటుపెట్టి, తాను కానట్లుగా నటిస్తున్నాడు. మగువలు ఎత్తుకుంటే నఖక్షతాలు చేశాడు. చెలులు కౌగిలించితే వారితో వలపించినాడు. ఇన్ని ఆగడాలు చేసిన అతడుపాలు పెరుగు వెన్న జుర్రుకున్నాడు.

"గోవింద నందనందన గోపాలకృష్ణ నీ
భావము మాకు జిక్కె గోపాలకృష్ణ" (17-233)

గోపికలు కృష్ణతత్వాన్ని తెలుసుకొని మాట్లాడుతున్నారు. తాను కొసరికొసరి గోపకాంతలతో పంతాలాడుతున్నాడు. వారికొంగుపట్టి నరసాలాడుతున్నాడు. చీరలవహరించి సిగ్గునభినయిస్తున్నాడు నీపస నాకు తెలుసునని ఒక గోపకాంత ఎద్దేవా చేస్తోంది.

"కొమ్మలు చూడరే గోవిందుడు

కుమ్మరించే ముద్దు గోవిందుడు" (3-142)

శ్రీకృష్ణుని బాల్యచేష్టలను వర్ణించిన కీర్తనయిది. సరిజోడు బాలలతో వీధులు తిరిగివుట్లు కొట్టాడు. గొల్లయిండ్లపాలు తాగి కులికి నవ్వాడు, ఇంతుల మానధనాన్ని కొల్లగొట్టాడు. అట్టి ముద్దుగోవిందుని వర్ణన యిది.

"నందగోపనందనుండే నాటి బాలుడు

ఇందునేడే రేపల్లె నేచిపెరిగెను" (2-387)

వటపత్రశాయి అయిన శ్రీకృష్ణుని బాల్యచేష్టలు వర్ణించబడిన మరోకీర్తన యిది. రేపల్లెలో పెరిగిన ఆనందగోపనందనుడు, ఎవరూ చెప్పకనే వేదార్థాలను తెలుసుకున్నాడు. తప్పటడుగులు వేసేటప్పుడు భూమ్యాకాశాలను తాకాడు. రెప్పలెత్తి చూసే వయసులోనే సూర్యచంద్రులను చూడగలిగాడు. వృక్షస్థలముపై లక్ష్మీకాంత వున్నప్పటికీ యితరకాంతలను కౌగలించుకున్నాడు. అట్టి బాలకృష్ణుని చేష్టలివి.

"మోవుల చిగురులచిమ్ముల వేదము

ఆవుల మందలలోని అవేదము" (5-271)

వేదవేద్యుడైన ఆబాలుని ప్రతి చేష్టలోనూ వేదార్థాలు తొణికిసలాడాయి. ఆలమందలోని ఆవేదము, మోవిచిగురుల వేదనాదము, బుడిబుడి పలుకుల తొలివేదము, గొల్లపల్లెలో నేర్చినవేదము, వావివరుసలులేని పిల్లనగోవి వేదనాదము వెల్లివిరిసిన ఆకృష్ణుడు వేదమూర్తి అని అన్నమయ్య భావన.

"పరతత్వంబగు బాలుడు

పరిపరివిధముల బాలుడు" (6-146)

ఈబాలుడు సామాన్యుడా! పరతత్వస్వరూపం. చల్దిమూటలు చంకలో వ్రేలాడగా ముద్దుల పడతులతో ఆలగాచిన నటనాధురీణుడు. వెన్నలు తింటూ కన్నెలలు దూరగా కలకలనవ్వుతూ మాయబాలుడు వేంకటనగరముపై కొలువున్నాడు.

ఇదివోసుద్దులు ఈరేపల్లెను

కదిసి ఇందరివీ గైకొనవయ్యా" (22-77)

గోపకాంతలు పరిపరివిధములుగా రేపల్లెలో శ్రీకృష్ణునితో సరససల్లాపాలాడారు. ఒక కన్నె కనులారా చూసి తరించింది. మరొక వనిత దండెమీటి పాడినది. మరొకతె సైగ చేస్తూ నవ్వింది. ఇంకొకతె గేదగివూరేకులు విసిరింది. మరొకరిని కౌగలించగా ఇంకొకతె గొణుగుతూ అలుకబోయింది.

"పరమపురుషుడీబాలుడట
హరవిరుంచులు మొక్కేరదివో వాకిటను" (2-509)

గోపికలకు కృష్ణునకు సంబంధం ఏయుగం నాటిదో అని అన్నమయ్య ఆశ్చర్యపోతున్నాడు. దేవకీ వసుదేవులు ఇతనిని కొడుకుగా కనడానికి ఎంత భాగ్యవంతులో. సకల దేవతా రాధ్యుడితడు. సర్వవ్యాపకుడు స్వతంత్రుడు. ఆదియు అంతము లేని ఆదిమూర్తి యశోదానందులు ఎంతటి పుణ్యవంతులో గొల్లెతలందరికీ యితడు మరిది అయినాడు. శ్రీకృష్ణజననంతో చేసుకున్న పుణ్యంవల్ల యిలా జరిగిందని చెబుతున్నాడు.

"అబ్బురంపు శిశువు ఆకుమీది శిశువు
దొబ్బుదురోలశిశువు త్రువ్వి త్రువ్వి...(5-220)

దృష్టిదోషం తగలకుండా తల్లులు బిడ్డలకు దిష్టితీస్తూ "త్రువ్వ్, త్రువ్వ్, త్రువ్వ్ " అని మూడుసార్లు అంటారు. ఈకీర్తనలో శ్రీకృష్ణునికి దృష్టి దోషం లేకుండా తల్లిభావనతో చేస్తున్నాడు కవి. ప్రతిచరణంలో మూడుసార్లు త్రువ్వి అనే ధ్వన్యనుకరణం వల్ల శివువుకు రూపగుణాదుల వల్ల కలిగిన దృష్టిదోషం పోవడానికి చేసిన ప్రయత్నమిది.

"పిల్లగ్రోవి పట్టుమంటా పెరరేచీని మా
గొల్లవారి పిల్లగోవి కోరోచల్ల" (6-109)

ఇది చల్లలనమ్మే పదం 'చల్లాచల్లా' అనేపదం పల్లవిలోనూ, చరణాలలోను కనిపిస్తుంది. శ్రీకృష్ణుడు గోపికలతో దక్షిణ నాయకుడుగా తిరగటం యిందులో కనిపిస్తుంది. ఎవతెపాటనో వినివచ్చి నన్ను పాడమంటున్నాడు. చల్లలమ్మే వనితను కూడినన్ను పాడమంటున్నాడు. ఎవరి ఆటనో చూచివచ్చి నా చెక్కు నొక్కి ఆడ మంటున్నాడు. ఎవ్వతో కిన్నెర మీటి గిలిగించితే నన్ను కిన్నెర మీట మంటున్నాడు అని ఒకరినొకరు చెప్పుకుంటున్నారు.

'వలచి వచ్చితినేను వానికిగాను
నెలవై మీగొల్లవాడనే తానునుండునంట" (18-14)

మాయదారినల్లనయ్య గొల్లవాడలో దూరితే అతణ్ణి వెదుకుతూ ఒకగోపవనిత వ్రేపల్లె వనితలను యిలా ప్రశ్నిస్తోంది. పిల్లనగ్రోవి ధరించిన అరవిందాక్షుని మీరు చూశారా? నెమలి ఫింఛమువానిని రమ్మనరమ్మా శంఖచక్రధారిని చూపరమ్మా, ఆగరుడవాహనుడు ఆనవాలుగా

నాకిచ్చిన వుంగర మిదిగో అతడు కోనేటిరాయుడై నన్ను కూడినాడు అని దీనంగా వేడుకొంటోంది.

"రాధామాధవ రతిచరిత మిది

బోధావహం శృతిభూషణం" (5-166)

ఈ కీర్తన జయదేవుని అష్టపదిబాణీలో సంస్కృతంలో సాగింది. ఇందులో పదమూడు చరణాలున్నాయి. నృత్యానుకూలంగా సాగింది. ఎక్కువ భాగం అష్టపదులలోని మాటలే యిందులో కనిపిస్తాయి. పొదరిండ్లలో సైకత పల్వశయనాలపై రాసక్రీడలు సేసిన కృష్ణుని లీలావినోదాలు ఇందులో కనిపిస్తాయి. లతాగృహాలలో నవసైకత వైభవసౌఖ్యాన్ని పొంది కేళీవ్రతచర్యకు పూనుకున్నాడు. రాధాపరిరంభసుఖాన్ని సుస్థిరంగా పొందాడు. ఇలా రాసక్రీడా వినోదాలతో సాగిన గోపాలుని చరణాలివి.

"జాణతనా లాడేవేలే జంపు గొల్లత వోరి

ఆణిముత్యముల చల్లలవి నీకు కొల్లలా" (6-113)

ఇది చల్లసుద్దులకోవలో నడిచింది. చల్లలకోసం యిల్లిల్లుతిరిగిన ఆకృష్ణునితో సరసాలాడుతున్నారు గోపికలు.

కృష్ణుడు : చల్లబోయవేగొల్లెతా!

గొల్లెతా : మాయింటి చల్లలేల మనసాయరా?

కృష్ణుడు : మూయకువే చల్ల గొల్లెతా!

గొల్లెత : మాచల్ల పులుసేలనీకు!

కృష్ణుడు : చల్ల చిలకవే గొల్లెతా !

గొల్లెత : పలచని చల్ల మంచిదికాదురా!

ఇలా ప్రశ్నోత్తరరూపంలో సాగిన కీర్తన.

"కానీవేగొల్లెతా గబ్బిగొల్లెతా

ఆనుక తెలుసుకొంటి వవునవురా గొల్లడా" (19-13)

సంభాషణాత్మక రూపంలో సాగిన మరో కీర్తనయిది. గోపికాకృష్ణులు గొల్లెత, గొల్లడుగా సంవాదం జరుపుకున్నారు.

గొల్లడు : పంతకారి గొల్లెతా! పదరకు

గొల్లెత : గొల్లడా అట్టె రంతులకానీరా

గొల్లడు : నీ సాదుతనాలు సంతలో విన్నాలేరా

గొల్లడు : ఓ మంకులాడీ మతకారీ

గొల్లెత : మాయింటికి రతులకు రారా!

గొల్లడు : నీ కథలన్ని నాకు కానవచ్చాయి.

గొల్లెత : నీచతురతలు మోమున కనిపిస్తున్నాయి.

ఇలా సాగుతుంది సంవాదం.

"మూలమూల నమ్ముదు చల్ల ఇది
రేలుబగలు గొనరే చల్ల" (5-229)

ఇందులో చల్లనమ్మబోయేగొల్లెత అందచందాలను శృంగారంగా వర్ణించాడు. ఆమె వీధి వీధులా తిరుగుతూ రేలుపగలు చల్లనమ్ముతోంది. గబ్బిగుబ్బ చన్నులు గల ఆమె చిలికిన చల్ల నెత్తిన బెట్టుకొని ఒళ్ళంతా చెమటకారగా నడుస్తోంది. ఆమె శరీరపు కదలికలకు చల్ల తడబడి కమ్మని వాసనలు వీస్తున్నాయి. ఆమె వయ్యారంగా చిలికినచల్ల అమ్ముతోంది. అది వేంకటపతికి వేడుక అయింది.

"ఒక్కొకసతి నడుమ నొక్కక్కరూపుగైకొని
ఎక్కువైతి కృష్ణా నిన్నెట్ల నమ్మేదిరా" (22-146)

పలువురు గోపికలతో రాసక్రీడలాడే ఆకృష్ణుని ఎలా నమ్మేదిరానిన్ను అని ఒక గోపిక నిలదీస్తోంది. ఒకతెతో మాటలాడి, ఒకతెను చూచి, ఒకతెతో నవ్వి గొల్లెతల గుంపులో వున్న నీమోహాన్ని ఎలా నమ్మేది. ఒకతెకు కనుగీటి, ఒకతెను కౌగలించి, వేరొకతెకు వెన్నదిన్న మోవియిచ్చి మా అందరితో రాసక్రీడలో వున్నావు. నీవలపు నాపై వుందని ఎలా నమ్మేదిరా? ఒకతెకు తాంబూలమిస్తావు. ఒకెతను తెగమెచ్చుకుంటావు. ఇంకొకతె చన్నులంటుతావు. నేను నమ్మితినిగాక మరో మార్గమేది అని వాపోతుంది.

"కుందణంపుమై గొల్లెత తా
నెందును బుట్టని ఏతరిజాతిక" (5-92)

ఆ గొల్లెత స్త్రీ జాతికి చెందిన ఏజాతి వనిత అని ప్రశ్నించుకొని స్త్రీజాతులలోని నాలుగురకాలైన హస్తిని, చిత్తిని, శంకిణి, పద్మిని జాతికి చెందినదని సమర్థిస్తున్నాడు.

అన్నిటికన్నా పద్మినీజాతి ఉత్తమం. చల్లనమ్మ బోయిన ఆమె చప్పుడు మట్టెలతో కస్తూరి సువాసనలతో హస్తినీజాతి స్త్రీ, పెద్దతురుముగలిగి వయ్యారంగానటనలాడే ఆచల్లలనమ్మి చిత్తిణిజాతి. కోపపు చూపుల గొల్లెత శంకిణిజాతి. వేంకటపతి కౌగిటచేరి అలసిపోతూచల్లలమ్మే ఆమె పద్మినీజాతి స్త్రీ.

"ఆదరమ్మా పాదరమ్మా అందరు మీరు
వేడుక సంతసములు వెల్లివిరియాయను" (3-112)

బాలలీలా వినోదాలు చూపిన ఆవెన్నదొంగ భూభారాన్ని అణచి, ధర్మాన్ని పరిపాలించడానికి విష్ణువే కృష్ణుడుగా జన్మించినపుడు సతులంతా వేడుకగా ఆడారు, పాడారు. దేవకీ గర్భంలో జన్మించి కంసుని మదమణిచాడు. రేయి పగలుగా జేసి రేపల్లెలో పెరిగాడు. ఆలను కాచాడు. కడుపులోని ముల్లోకాలు చూసాడు. అతడే బాలలీలలు నటించినదైవం.

"పాలదొంగవద్ద వచ్చి పాడేరు తమ
పాలిటిదైవమని బ్రహ్మాదులు" (1-311)

శ్రీమన్మహావిష్ణువే శ్రీకృష్ణుడుగా జన్మించినపుడు తమపాలిదైవమని బ్రహ్మాదులు పాడారు. రోటగట్టిన బాలుని ముందర ఆకాశంలో నిలిచి నారదాదులు గానం చేశారు. జొల్లుగారుస్తూ పారాడే బిడ్డను చూచి శేషుడు మొదలైన వారు వేదాలు వల్లించారు. ముద్దులు మూటగట్టే ఆబాలుని వద్ద చద్దికివచ్చిన సనకాదులు యితడు తిరువేంకటాధీశుడని ప్రశంసించారు.

"పిలువరే కృష్ణుని పేరొకొని యింతటాను
పొలసి యారగించే పొద్దాయెనిపుడు" (26-136)

విందు ఆరగించే సమయానికి కృష్ణుడు కనిపించటంలేదు. వేడికూరలు చల్లనైతాయి అతడెక్కడున్నాడో పిలవండని ఒకగోపిక ఆదేశిస్తోంది. వెన్నలారగించడానికి వీధులలో తిరుగుతున్నాడా! యమునలో ఈదులాడుతున్నాడా? సాందీపనివద్ద చదవబోయినాడా? చిన్నిబాలుడు ఆకలిగొని వుంటాడు. మగువల కౌగిళ్ళలో మరిచినిద్రపోయాడో? ఆవులగాచే చోటవున్నాడో? ఉట్లకెక్కి ఇంతులకు చిక్కాడో శిఖిపింఛధారియై ఏయింట దేవరవలెవున్నాడో ఇదిగో మా వద్దకు విందుకు వచ్చే వేళైంది అని అంటోంది.

"బడిబడి తిరగాడీ బాలకృష్ణుడు
ఎడయని జాణగదె యీ బాలకృష్ణుడు" (11-141)

జాణ అయిన బాలకృష్ణుడు సుదతులు ఎత్తుకొంటే ఫక్కున నవ్వి తొంగిచూచి కామించేవాడు. ముద్దులుబెట్టి చన్నులంటి పైటతీసేవాడు. కౌగిలించి బందమాటలాడి వారితోకూడేవాడు.

"చూడవమ్మా కృష్ణుడు నీ సుతుడోయమ్మ
ఆడివీధుల వెంట యశోదమ్మ" (4-161)

గొల్లెతలు యశోదకు చిన్నికృష్ణుని ఆగడాలు వివరిస్తున్నారు. ఓయశోదమ్మా వద్దన్నా వినకుండా వుట్లుగొట్టి పాలు పెరుగు కాలువలుగా పారించాడు. చక్కిలాల కుండలు

పగులుగొట్టాడు తేనెకుండలు పగులగొడితే జోరున కారుతున్నాయి. టెంకాయలు వల్లెతాళ్ళువేసి వంచిన అల్లిబిల్లి నీ తనయుడు. అదే ధోరణిలో

"ఏటి బిడ్డ గంటివమ్మ యశోదమ్మ
గాటపు దేవత లెల్ల కాచుకున్నారితని" (4-237)

గొల్లెతలందరు అతని మాయాజాలాన్ని చూచి వెరచారు. పాలుపోయడానికి నోరుతెరిస్తే బ్రహ్మాండాలు కనిపించాయి. హత్తుకుంటే మదనతాపం అనిపించింది. పొత్తులలో వున్న బిడ్డకు చతుర్భుజాలు కనిపించాయి. ఇతడు చేసేవి దేవలోకము పనులు అని ఆరడిపెట్టారు.

"అనుచమునులు ఋషులంతనింత నాడగాను
వినియు వినని యట్టె వీడెయాడీ గాని" (4-249)

రేపల్లెలో సంచరించిన నందుని కొడుకైన ఇతడు ముకుందుడు గరుడగమనుడు, వేదమూర్తి, విష్ణుదేవుడు, పసులకాపరియైనా, రోటకట్టబడినా, వెన్నదొంగయైనా, బాలుడైనా ఈపరమాత్ముడు గొల్లెతలచే తిట్టబడినా, వేంకటాద్రిపతియైవున్నాడు

"మాయామానుష మహిమయిది
యే యెడ నీతడెఈశ్వరుడు" (17-470)

మాయమానుషసూత్రధారుడైన శ్రీకృష్ణుడు యశోదకు ముద్దులబాలుడు. మునులకు పరమాత్ముడు, గోపికలకు మన్మధమన్మధుడై ఎదుట తిరగేదేవుడు. గోపబాలురకు గొల్లడు లక్ష్మీపతి అసురులకు మృత్యువు. పాండవులకు బావ. వసుదేవుని కుమారుడు. ఇన్ని రూపాలూ అతడు ధరించాడు.

"అని ఆనతిచ్చె కృష్ణుడర్జునునితో
విని యాతని భజించు వివేకమా" (2-438)

గీతోపదేశం చేసిన శ్రీకృష్ణుడు అర్జునితో ఇలాచెబుతున్నాడు. సర్వప్రాణులను మోచే దేవుడను నేను. చంద్రుడనై సస్యాలను పండించే దేవుడను నేనే. అన్నాన్ని జీర్ణంచేసే అగ్నిని నేనే. అందరి హృదయాలలో నిలిచిన పరదైవం నేనే. వేదాలచేత వేదాంతవేత్తలచేత తెలుసుకోదగిన ఆదేవుడను నేనే.

ఇన్ని రకాలుగా శ్రీకృష్ణుని లీలావిశేషాలను బాల్యంనుండి గీతోపదేశం వరకు క్రమానుగతిలో చెప్పిన పుణ్యపురుషుడు అన్నమయ్య. అతనికంటికి శ్రీకృష్ణుడు వేంకటకృష్ణుడుగా కనిపించాడు.

**ఇ. దశావతారములు:** అన్నమయ్య సంస్కృత కీర్తనలలో ఇది బాగా ప్రసిద్ధం. నిత్యమూ జరిగే డోలోత్సవంలో భారతరత్న ఎం.ఎస్.సుబ్బలక్ష్మి సుమధుర గాత్రంతో అలరించిన ఈ కీర్తన దశావతారాలను ప్రస్తుతిస్తుంది.

"డోలాయాంచల డోలాయాం హరే డోలాయాం" (2-374)

మత్స్యకూర్మ వరాహ నారసింహాది అవతారాలను యిందులో అన్నమయ్య వర్ణించాడు. వైష్ణవ సంప్రదాయంలో బుద్ధావతారం లెక్కకురాదు. అయినా యిందులో ప్రస్తావించబడింది.

అచ్చతెనుగు పదాలతో తేట తెలుగులో దశావతారాలను వర్ణించిన ఈకీర్తనలోని శబ్దచాతుర్యాన్ని గమనిద్దాం.

"శిరుత నవ్వులవాడు శిన్నెకా వీడు
వెఱపెరగడు సూడవే శిన్నెకా" (5-182)

పొడుపుకథ రూపంలో జానపదశైలిలో సాగిన కీర్తన.

పొలసుమేనివాడు : మత్స్యావతారం

బోరవీపువాడు : కూర్మావతారం

శలసుమోరవాడు : వరాహావతారం

వంకల కోరలవాడు : నరసింహావతారం

మేటి కురచవాడు : వామనుడు

మెడమీద గొడ్డలివాడు : పరశురాముడు

అడవిలో రాకాసి వేటలాడిన వాడు : రాముడు

పిల్లగోవివాడు కృష్ణుడు, కల్కియై కల్కి అవతారము. ఇంత సరళ సుందరంగా దశావతారాలను వర్ణించిన తీరుమనోహరం.

"నేనెందువోయె తానెందు వోయీ
రానీలేరానీలే రానీలే" (5-276)

అద్భుతమైన భావుకతతో సాహిత్యమర్మ గర్భంగా దశావతారాలను వర్ణించాడు. ఇక్కడ రానీలే, కానీలే, వంటి పదాలను ఆమ్రేడితంచేసి ఒక సొగసుదనం తెచ్చాడు. ఇందులో చెప్పిన విశేషాలు వివిధ అవతారాలలో ఆయన శౌర్యం నాముందు పనికిరాదు అనే భావం వస్తుంది. మీనైన నాటి తలమిడుకు దిగవలెనని, తలచూపేనాటి ( కూర్మం) తలపు దిగవలెనని, కిరి అయిననాటి (వరాహం) కిటుకు దిగవలెనని, హరియైన నాటి (నృసింహ) అదటు దిగవలెనని, వడుగైననాటి (వామన) వస విడువాలని, కలుషించే నాటి (పరశురాముడు) కడమెల్లదిగవలెనని, సతిబాసేనాటి(రాముడు) చల్లమెల్ల దిగవలెనని, ముసలైన నాటి (బలరాముడు) ముసుపెల్ల దిగవలెనని మానైనాటి (బుద్ధుడు) మదమెల్ల దిగవలెనని, కల్కి అయిననాటి గజరెల్ల దిగవలెనని సఖి చెలితో అంటోంది.

"ఇందరికీ నభయంబు లిచ్చుచేయి
కందువగు మంచి బంగారు చేయి" (1-334)

శ్రీమహావిష్ణువు శిష్టరక్షణ దుష్టశిక్షణ కోసం దశావతారాలు ధరించాడు. ఇందులో వాటి వర్ణన వుంది. వేదములు వెదకి తెచ్చిన చేయి (మత్స్య) చిలుకు గుబ్బలి కిందచేయి (కూర్మ) భూకాంత కౌగిలించిన చేయి (వరాహ) కొనగోళ్ళవాడిచేయి(నృసింహ) బలిచేత దానమడిగిన చేయి (వామన) జలనిధి అమ్ము మొనకు తెచ్చినచేయి(రామ) నాగేలు ధరించు చేయి (బలరామ) పురసతుల మానములు పొల్లసేసినసేయి (బుద్ధుడు), తురగముపై బరపెడి చేయి (కల్కి) అని దశావతారముల ద్వారా శ్రీమహావిష్ణువు హస్త ప్రాశస్త్యాన్ని వర్ణించాడు.

"ఓహో యెంతటివాడే వొద్దనున్నవాడే హరి
సాహసపు గుణముల చతురుడా యితడు" ( 4-393)

ఇక్కడ జలధి, ధరణి, కొండ, అని మూడు పదాలతో వివిధ అవతారాలను స్మరించాడు. సముద్రునికి ఆయనకు సంబంధం పాలసముద్రముపై పవళించాడు, సముద్రాన్ని బంధించాడు. సముద్రతనయను పెండ్లాడాడు జలనిధిలో ఈది, జలనిధిమథించి, జలది బంధించాడు, ధరణీపతియై ధరణిక్రుంగిన ఎత్తి ధరణిజను పెండ్లాడి, ధరణిమీద పాదము మోపి, ధరణభారాన్ని దించిన ధరణీదరుడు ఇతడు. కొండను గొడుగుగా ఎత్తి, కొండకు తూటువేసి, కొండక్రింద కుదురై కూర్చున్నాడు. అతడే కొండల కోనేటిరాయుడు.

"వీడివో యిదె వింత దొంగ
వేడిపాలు వెన్నవెరజిన దొంగ" (1-322)

అచ్చతెనుగులో సాగిన దశావతార వర్ణన యిది. నీట బొప్పువేసిన దొంగ - మత్స్య తలగాన నీకదాగు దొంగ(కూర్మ), నేలతవ్వేటిదొంగ(వరాహ) సందెకాడ తిరిగే దొంగ(నృసింహ) అడుగుకింద లోకమడచేదొంగ(వామన) తల్లికై అలిగే దొంగ(పరశురాముడు) అడవిలో నెలవైన దొంగ(రామ) నీలికాసెతో వుండే దొంగ(బలరాముడు) ఇంతుల వోసము చేసిన మునిముచ్చుదొంగ(బుద్ధుడు) గుర్రపుదొంగ(కల్కి) ఇలా ఆయా అవతారాలలోని ప్రాశస్త్యాన్ని చెప్పడం సుందరంగా వుంది.

"తెప్పగా మఱ్ఱాకు మీద తేలాడువాడు
ఎప్పుడు లోకము లెల్ల నేలేటివాడు" (5-295)

సృష్టిఆదిలో ప్రళయ జలధిలో మఱ్ఱిఆకుపై శయనించి కాలిబొటనవేలు నోటిలో పెట్టుకొని నారాయణుడు పాలిస్తున్నాడు. ఆయన అవతారాలు ఇవి : నీటిమడుగులో ఈత గలచిన వాడు (మత్స్య) నూతికిందివాడు (కూర్మ) మంటిముద్ద పెల్లగించినవాడు(వరాహ) పేగుల

పేరులవాడు(నరసింహ) కుఱ్ఱతమ్ముడు(వామనుడు) శివభక్తుడు(పరసురాముడు) లేడివెంట వెళ్ళినవాడు(రాముడు) ఆలగాచిన దొర(కృష్ణుడు) అతివలమానములు దొంగలించినవాడు (బుద్ధుడు) తురగముపై వాడు(కల్కి) ఇప్పుడు వేంకటేశ్వరుడుగా వున్నాడు కోడికూతనోరివాడు అని ఇంద్రుని గూర్చి చెప్పడం విశేషం.

"పురుషులకు పురుషుడవు పురుషోత్తమా
పురుడు లేదిక నీకు పురుషోత్తమా" (2-283)

పురుషోత్తముడు దశావతారాల తర్వాత వేకంటేశ్వరుడుగావున్నాడుకాని మళ్ళీ అవతరించవలసిన అవసరం లేదని (పురుడులేదిక) అని వ్యంగ్యంగా చెబుతున్నాడు. 'పురుషోత్తమా' అని సంభోదిస్తూ పది అవతారాలను ప్రస్తావించాడు పొలసులాడకు (మత్స్య) పులిసిలోగగ(కూర్మ) పొలమురాజవు(వరాహం) కంబమునపొలకువ(నరసింహ) పొడవులకుపొడవు(వామన) పుడిసిళ్ళజల్లితివి(పరశురామ) సతిగ్గైకొంటి(రామ) చీకటితప్పు(కృష్ణ) బూటకపు బుద్ధి(బుద్ధ) గుఱ్ఱపుపసల(కల్కి) తేట తెలుగుపదాలలో దశావతార వర్ణన అతిక్లిష్టం.

ఇతనికంటె మరి దైవము గానము ఎక్కడ వెదకిననితడే
అతిశయమగు మహిమలతో వెలసెను అన్నిటికాధారము తానే" (3-370)

ఎక్కడ వెదకినా సర్వాంతర్యామి విష్ణువు కనిపిస్తాడు అంటూ పది అవతారాలను పేర్కొన్నాడు. జలధులలో మత్స్యము, పాతాళమున ఆదికూర్మము, అడవులలో వరాహము, కొండ గుహలలో శ్రీనరసింహము, భూనభోంతరాళమున త్రివిక్రమాకృతి, వీరులలో పరశురాముడు శివపార్వతుల తలపున రాముడు, ఆవులమందలలో బలరామ కృష్ణులుగా, అసురకాంతలలో బుద్ధుడు, మించిన కాలములో కల్కి, ఇహపరములలో వేంకటేశ్వరుడు అంతర్యామిగా వెలుగొందుతున్నాడు.

"శ్రీవేంకటేశ్వరునికి చెలి అలమేలుమంగ
వోవరిగానెలకొని నురముపై నున్నది" (7-198)

ఇన్ని అవతారాలెత్తిన అతనికి వివిధరకాల కంపులు అంటుకున్నాయి. వాటి పన్నీటితో జలకమాడించి పోగొట్టమని ఒక చెలి మరొకరితో అంటున్నట్లు భావన. మత్స్యమైన నాటి పొలసుకంపులు, కూర్మవరాహములనాటి సొగటు, నృసింహుని గదరు, వామనజిడ్డు, పరశురాముని గబ్బు, యాదవుల జిడ్డు, బుద్ధునిసిగ్గు, గుఱ్ఱపుచొల్లు పోగొట్టటానికి పరిమళపు గిన్నెలు తెచ్చి జలకమాడించమని కోరుతున్నాడు. ఈవిధంగా దశావతారాలలోని విశేషాలను ఎన్నోకోణాలలో చెప్పడం అన్నమయ్య ప్రత్యేకత. ఆయన భావుకతకు పరిధిలేదు.

# ఆధ్యాత్మ కీర్తనలు

అన్నమయ్య కీర్తనలు ఆధ్యాత్మిక భావసంపదతో నిండివున్నాయి. తత్త్వవిచారం తెలిసిన ఆయన చిన్నచిన్న మాటలలో వేదాంత సారాన్ని చెప్పాడు. వేలకొలది ఆధ్యాత్మిక సంకీర్తనల్లో కొన్నింటిని (160) గమనిద్దాం.

"మనుజుడైపుట్టి మనుజుని సేవించి
అనుదినమును దుఃఖ మందనేలా...(1-196)

నరస్తుతి చేస్తూ నరుడు జీవితనాటకరంగంలో మాయలోపడుతున్నాడు. పట్టెడుకూటికై సగటుమానవుడు తిరుగుళ్ళు తిరుగుతున్నాడు. పుట్టినచోటనే పుట్టి లంపటంలో పడుతున్నాడు. శాశ్వతుడై శ్రీవేంకటేశ్వరుని సేవిస్తే జీవుడు పరమపదాన్ని అందుకుంటాడని తత్త్వసారాన్ని బోధించాడు అన్నమయ్య.

చావుపుట్టుకలు నిజమైనప్పటికీ మధ్య జీవితకాలము ఒక నాటకము. ఉభయకర్మములు ఒడిగట్టుకొని పాపపుణ్యాలు మోసుకొని జీవి వెళిపోతున్నాడు.

"నానాటి బతుకు నాటకము
కానక కన్నది కైవల్యము" (3-576)

మనకళ్ళెదుట వున్నది అశాశ్వత ప్రపంచము. శాశ్వత కైవల్యము ఎగువనే వుంది. తింటున్న ఆహారము కట్టుకుంటున్న బట్టకోసం అనేక కర్మలు చేస్తున్నాం. ప్రారబ్ద సంచితకర్మలను దాటగలిగితే కైవల్యం సిద్ధిస్తుంది. పాపపుణ్యాలు ఎంతకూ తెగవు. శ్రీవేంకటేశ్వరుని సేవిస్తేనే కైవల్యం.

"నటనల భ్రయయకు ఓ మనసా
ఘటియించు హరియే కలవాడు" (4-317)

మనసును సంభోదిస్తూ మోసపోవద్దని హెచ్చరిస్తున్నాడు. ఈజగము మోహినీగజము. ఆశలు పుట్టిస్తుంది. భ్రమను కలిగిస్తుంది. మరునాటికి మంచువలె అవి మాయమౌతాయి. సంసారమనేది సంతల కూటమి. ఆ వేంకటేశ్వరుణ్ణి శరణు పొందితే మాయతెర తొలగిపోతుంది.

"దీనుడనేను దేవుడవునీవు
నీనిజమహిమే నెరపుటగాక" (3-474)

ఓదేవా! నేను దీనుడను. నీ నిజమహిమతో నన్ను గట్టెక్కించు. జననమరణాల గురించి తెలియని మూర్ఖుడను. నన్నుపుట్టించిన నీవే నాపై దయనుప్రసాదిస్తావని నమ్మిక. జీవునికి భగవంతునితో శాశ్వత సంబంధం వుందని యిందులో నొక్కి చెప్పబడింది. శ్రీమాన్ రాళ్ళపల్లి

అనంతకృష్ణ శర్మగారు ఈకీర్తనలకు చక్కని భావాలందించాడు.

"కన్ను లెదుటిదే ఘనవైకుంఠము

వెన్నుని గొలిచిన విజ్ఞానికిని" (46-06)

తత్వరహస్యము తెలిసిన యోగి మాట్లాడినదెల్ల పరమమంత్రము. పట్టినదెల్లా బ్రహ్మాత్మకము. శరణాతుడైనవాడికి వినినదంతా వేదాంతము. పుట్టుక గెలిచిన పుణ్యునికి మెట్టినదల్లా మిన్నేటినిధి. ఈకీర్తనలో హరిభక్తితో సమానము లేదని చాటి చెబుతున్నాడు.

"ఓహో డేండేం వోగి బ్రహ్మ మిదియని

సాహసమున శ్రుతి చాటెడిని" (1-396)

ఢంకాబజాయించి ఘోషించినట్లుగా డేండేం అనే మాటలను వాడి అన్నమయ్య శృతి వాక్యాన్ని చాటి చెప్పాడు. పరాపరాలను, ప్రకృతిని తెలుసుకోవడమే వివేకము. జ్ఞానము జ్ఞేయము గమ్యము తెలియుటే యోగము. క్షరము అక్షరము సాక్షి పురుషుడని తెలియడమే సాత్వికము. ప్రకృతిని జ్ఞానాన్ని ప్రపంచాన్ని తెలియజెప్పే కీర్తనయిది.

"గాలినేపోయకలకాలము

తాలిమికి కొంతయు పొద్దులేదు" (1-14)

జీవి సంసార లంపటంలో ఎంత చిక్కుకుపోయాడో, కాలమంతా ఎలా గాలిలో కలిసిపోతోందో ఈకీర్తన చెబుతోంది. సంసారమనే బురదలో పడి దానిని కడుగుకోవడంతోనే కాలం వెళ్ళబుచ్చుతున్నాడు. పరమాత్మను తలపోసే సమయమే లేదు. దేహబాధలతోనే కాలం సరిపుచ్చి దైవాన్ని తలచే సమయం లేకపోతోంది. కపటాల కలకాలం మాయమయం. హరి దరిచేరే పొద్దులేదు.

"తందనాన ఆహి తందనానా పురే

తందనాన భళా తందనాన" (2-385)

ఇది ఆరుచరణాలు గల కీర్తన. శాశ్వతమైనది బ్రహ్మమొకటే. అంతా బ్రహ్మమయమయిన ఈసృష్టిలో తెగలుగా విడదీసి చూపడానికి తరతమబేధాలు లేవు. శ్రీహరియే అంతరాత్మ. రాజు హంసతూలికా తల్పంపై నిద్రిస్తాడు. పక్కనే బంటు కటికనేలపై నిద్రస్తున్నాడు. వీరినిద్రలో తేడా లేదు. విప్రునికి చండాలునికి విద్యావృత్తులలో వ్యత్యాసమున్నా ఆధారమైన నేల వొకటే ఇలా లోకంలోని గాలి, ఆకలి, కామసుఖాలలో తేడాలు లేవని శ్రుతి వాక్యాన్ని అన్నమయ్య ఈ కీర్తనలో విపులంగా చెప్పాడు.

"కడలుడిపి నీరాడగా దలచువారలకు

కడలేని మనసునకు కడమ యెక్కడిది" (1-226)

సంసారభోగాలు అనుభవించిన తరువాత వేదాంతాన్ని తెలుసుకోవచ్చునని చాలామంది అనుకుంటారు. అది సముద్రంలో అలలు నిలిచిన పిమ్మట స్నానం చేద్దామనుకోవడం వంటిది.

"ఎన్నడు విజ్ఞానమిక నాకు
విన్నపమిదే శ్రీవేంకటనాథా" (4-343)

ఈ తత్వకీర్తనలో జీవుని వేదన తెలుపబడింది. అనురాగమమకారాలు, భౌతిక బంధాలు తీరడం లేదు. చిత్తభ్రాంతి వున్నంతకాలం కోరికలు తొలగడం లేదు. పోలిక లేని విరుద్ధ భావాలలో ఒకదానికొకటి సంబంధం లేదు. అయితే దానికి విరుగుడు వేంకటేశ్వరుని శరణు కోరటమే.

"ఎక్కడి మానుషజన్మం బెత్తిన ఫలమేమున్నది
నాపాలిటిహరి నమో నమో" (4-100)

ఓస్వామీ! పాపపుణ్యాల గురించి నాకింతగా తెలియదు. అయినా నీవు నాపాలిటవుండగా వాటితో అవసరములేదు. త్రికరణములుగా త్రిసంధ్యలలో నేను నీకు దాసుడను. నీకు శరణాగతుడను. నీవేనాకు దిక్కు.

"ఏదితుద నికేదిమొదలు
పాదుకొని హరిమాయ బరగు జీవునికి" (1-102)

మాయాలోకంలో తిరిగే జీవికి తుద మొదలు లేవు. బాధలు, లంపటాలు, వేదనలు దుఃఖాలు ఎన్నయినా వున్నాయి. ఎన్నింటికి చింతిస్తాడు ఎన్నిటికి హర్షిస్తాడు. ఎన్నింటికి తిరుగుతాడు. అన్నీ వేంకటేశుని లీలలే.

"తెలియ జీకటికి దీపమెత్తక పెద్ద
వెలుగులోపలికి వెలుగేలా" (1-53)

ఆపదపాలై దుఃఖంచేవానిని రక్షించాలి. చీకటికమ్ముకున్నట్టుప్పుడు దీపము పట్టుకోవాలి అంతేగాని ప్రకాశానికి దీపం చూప నవసరం లేదు. పాపాలు చేసిన వానికి ఉద్ధరించటాని భగవంతుడు కావాలి కానీ సుకృతాత్మునికి కాదు. దీనుని రక్షింపలేకపోతే వేంకటేశ్వరుడుండి ప్రయోజనమేమి?

"నిమిష మెడదెగక హరి నిన్నుదలచి
మమత నీమీదనే మరపి బదుకుట గాక" (10-59)

విషయవాంఛలతో కాలం వెళ్ళబుచ్చి భగవత్సేవను మరచిన భక్తుని వేదనయిది. కొన్నాళ్ళు నిదుర, నేరాలు, మిగతా ముదిమి. గడిచిపోయినకాలం రాదు. కాంతాపుత్రులకోసం కాలం వృధా చేసి ప్రయోజనమేమి? నీ సేవలే జేసి బ్రతకాలి. ధనధాన్యాలు, బంధుమిత్రులతో కాలం

వెళ్ళబుచ్చి ప్రయోజనమేమి? నిన్ను కొలిచి బ్రతకాలి అంటాడు చిన తిరుమలాచార్యుడు.

"ఎవరెవ్వరివాడొ యీ జీవుడు చూడ
ఎవ్వరికి నేమౌనో యీ జీవుడు" (1-97)

జననమరణచక్రంలో జీవుడు ఎంతో మందితో బంధుత్వం నెఱపుతాడు. పాపపుణ్యాలు చేస్తాడు. ఎన్నటికీ చేటు లేనిది జీవునికే. అదేశాశ్వత స్థితి. వేంకటేశుని మాయలు దగిలి అతడు ఎన్నో పదవులు పొందుతాడు. ఇదీ తత్వరహస్యం.

"సామాన్యమా పూర్వసంగ్రహంబగు ఫలము
నేమమున బెనగొనియె నేడు నీవనక" (1-200)

తొల్లితాజేసిన కర్మఫలము సామాన్యమైనదికాదు. దేవాదిదేవుడవైన నీకుకూడా అది తప్పలేదు. లోకంలో ప్రాణులకు నీవు సంసారబంధాన్ని తగిలించావు. దాని ఫలంగా నీ యెదపై ఒక కాంతను తగుల గట్టారు. జీవులను భవసాగరంలో ముంచినదోషానికి నిన్ను సముద్రంలో పండబెట్టారు. (జీవులను) మమ్ము నీవు కొండకోనల్లో తిప్పినందుకు ఫలితం నీవు తిరుమలకొండపైనే ఉండవలసి వచ్చింది. ఇందులో భగవంతునితో ఎకసెక్కమాడటం కనిపిస్తుంది. భగవంతుని మిత్రునిగా భావించి అన్నమయ్య ఆత్మీయతను పెంచుకున్నాడు.

"భక్తి కొలదివాడె పరమాత్ముడు
భుక్తి ముక్తిదానే యిచ్చు భువిబరమాత్ముడు" (1-410)

పరమాత్ముడు భక్తికొలదివాడు. భుక్తినిముక్తిని ప్రసాదించేవాడు. పట్టిన వారికి చేతి బిడ్డ వంటివాడు. బట్టబయటి ధనము. పట్టపగటి వెలుగు పచ్చి పాలలో వెన్న పైపూతలేని రూపు (నిర్మలుడు, శాశ్వతుడు) బంగారానికి ఒరపిడిరాయి. ఆయన అనుగ్రహం చూపువాడు. ఇంతేల జీవులలోని ప్రాణమే శ్రీవేంకటాద్రి పరమాత్ముడు.

"కడుపెంత తాగుడుచు కుడుపెంత దీనికై
పడనిపాట్ల నెల్ల బడిపొరలనేలా" (1-302)

జానెడు పొట్టకై పడరానిపాట్లు పడటమెందుకు. ఇతరులను కష్టపెట్టడమెందుకు. భగవత్సేవకై వినియోగించక చంచలమైన జీవితంపై భ్రాంతి యేల? ఆశలు పెంచుకొని అందులో మునిగి తేలడ మెందుకు?

"చీచీ నరుల దేటి జీవనము
కాచుక శ్రీహరి నీవే కరుణింతుగాక " (1-396)

మానవులది ఎంత హీనమైన బ్రతుకు. నీవేమమ్ములను దయతో చూడాలి. క్షుద్రమైన జీవితంతో మానవులను సేవించేకంటే, పశువు, పక్షి, చెట్టుగానైనా జీవించవచ్చు. నరులకలవాటైన

పరులసేవాదులు నికృష్టములని ఛీత్కరించు కుంటున్నాడు.

"పురుషోత్తముడ వీవు పురుషాధముడ నేను
ధరలో నాయందు మంచితనమేది". (2-53)

ఇది నైచ్యాను సంధానప్రక్రియ. వైష్ణవమతంలో జీవుడు భగవంతుని ఎదుట తన నీచత్వాన్ని ప్రకటించుకుంటాడు? ఓస్వామీ! నేను అపరాధినైనా నన్ను వదలని గుణము నీది. నీదయ ఎంత గొప్పది. నేను నిన్ను నిందించినా నీవు నన్ను కాచి రక్షిస్తున్నావు. నేను అజ్ఞానిని. నీవు జ్ఞానివి. భగవంతుని మహోన్నతునిగా భావించడమే ఇందులో రహస్యం. "పాపోహం పాపకర్మాహం పాపాత్మా పాపసంభవః" అని భక్తుడు చెప్పుకుంటాడు.

"ఎవ్వరి భాగ్యం బెట్టున్నదో
దవ్వు చేరుకు తాను గురుతు" (2-43)

వారి వారి భాగ్యవిశేషాలవల్ల భగవంతుని సాన్నిహిత్యం కలుగుతుంది. తెలుసుకుంటే భగవంతుడు ఎదుటేవున్నాడు. మరచిన వారికి అది మాయ. సాధించేవారికి సర్వసాధనం. కాదంటే శూన్యం. భగవంతుడు చేతినిధానం. పాతకులకు భవసాగరము. ఇది విష్ణు భక్తిలో ఇమిడిన వేదాంతసారం.

"ఇన్నియు జదువనేల యింతావెదక నేల
కన్ను దెరచూ టొకటి కన్నుమూయు టొకటి" (4-64)

తత్వసారాన్ని తెలుసుకోవడానికి అనేక శాస్త్రాలు చదువ నవసరం లేదు. జననమరణాలు అనివార్యం. ప్రపంచనాటక రంగస్థలంపై భగవంతుడాడించే బొమ్మలు జీవులు. ఇంద్రియ సుఖాలకు అంటిపెట్టుకోవడం బంధం. దూరమవడం మోక్షం. కావాలి, వద్దు అనే భావాలు సంవాదపడుతుంటాయి. పుట్టుక తరువాత చావునిత్యం. ఈవిజ్ఞత భక్తులలో జ్ఞానులకు మాత్రమే తెలుసు.

"ఎంత చదివిన నేమి వినిన తన
చింత ఏలమాను సిరులేల కలుగు" (1-62)

ఎన్ని విద్యలు నేర్చినా తన చింతమానదు. సిరులు ఏలకలుగుతాయి. ఇతరులను దూషించడం, అతిగా కామించడం, మతిచాంచల్యము మానితే తప్ప దుర్గతులు మానవు పరధనములపై ఆశలేక పోవడము, పరనింద చేయకపోవడము కలిగినపుడే ఆపదలు పోయి పరము కలుగుతుంది. అసత్య జీవనాన్ని వదలిపెట్టి వేంకటపతిని ఆత్మలో అన్వేషించినపుడే జయం కలుగుతుంది.

"సారిది సంసారంబు సుఖమా యిందరికి
వెరవెరంగక వగల వేగేరుగాక" (1-248)

సంసార సుఖాలలో బాధలు తెలుసుకోకుండా జనులు వేగుతున్నారు. ప్రాణులకు దేహాలు సుస్థిరమా? వాటిపై లోభము మాత్రమే. మోహంతో దేహ సుఖాలు మరిగి తిరుగుతున్నారు. సంపదలు నిలుపుకోవాలని ఆశతప్ప అవినిలుచునా? భ్రాంతితో తిరుగుతున్నారు తప్ప ఈసంపదలు నిజముకాదు. వేంకటేశ్వరునిపై ఎఱుకతో కొలవడం ఒక్కటే మార్గం.

నగవులు నిజమని నమ్మేదా
వొగినడియాసల వద్దనవే" (4-353)

నగవులు నిజమని నమ్మడం ఏల? స్వామీ! పూర్వజన్మకర్మలు దొంతరలుగా ఉన్నాయి. అయినా యిందులోనే ఛీ యనకుండా తిరగడమెందుకు? సహస్రనాముడవైన నీమాయ లికచాలు. నీ నామజపం వుండగా యితరములు స్మరించ నవసరం లేదు. నాలోని చంచలతను స్వామీ! వదలించు.

"తెలిసినవారికి తెరువిది మరిలేదు
నలినాక్షు పొగడెడి నామములో నున్నది" (15-60)

జ్ఞానులైన వారికి నామజపంతోనే ముక్తి మార్గముంది. భూమ్యకాశాలలోనూ పాతాళంలోనూ లేని మోక్షము ఆశాదూరుడై శ్రీకాంతుని పొగడితే లభిస్తుంది. సురలవద్ద దిక్కులందు జలధిలో లేని అమృతము హరిదాసుల పూజించేవారి అరచేత వున్నది. సుఖాన్ని, కర్మను వదలి నియతుడైవుండే వాని విజ్ఞానదేహంలో తేజము వుంది.

"కలలోని సుఖమే కలియుగమా వెన్న
కలిలో నెక్కడిదే కలియుగమా" ( 1-118)

కలియుగంలోని వింతలను ఈ కీర్తనలో ప్రస్తావించాడు. కలియుగ సుఖాలు కలలోని సుఖాలవంటి భ్రమలు. 'గండంగా కాలాన్ని గడుపుతూ సంసారపు బురదను కడుగొకొనడం కలియుగమా? పరాన్ని చూపని యిది కలియుగమా? మమతానురాగాలకు బద్ధులను జేసి ముక్తిమార్గపు త్రోవను మూసివేస్తున్నావు? కపటాలను యిస్తున్నావు. వేంకటపతి దాసులన్న విషయాన్ని నీవుకానవా? అని ప్రశ్నిస్తున్నాడు?

" ఏ పురాణముల నెంత వెదకినా
శ్రీపతి దాసులు చెడరెన్నడునూ" (2-88)

'నమేభక్తః ప్రణస్యతి' - నా భక్తుడెన్నడూ చెడదు- అని గీతాచార్యుడు చెప్పిన భావాన్ని ఈకీర్తనలో వివరించాడు.

హరిని కొలిచిన వారి జీవితాలు ఎప్పుడూ ఆనందంగానే వుంటాయి. కమలాక్షుని కానని చదువులు నిస్సారము. అచ్యుతసమారాధన విమలము. శ్రీవేంకటపతిని సేవించే సేవలే అధికభాగ్యపు సిరులు.

"నాటికినాడే నాచదువు
మాటలాడుచును మరచేటి చదువు" (1-9)

చదువులలో మర్మము భాగవతతత్వం తెలుసుకోవడానికే. కలియుగంలో చదువు ఆతత్వాన్ని తెలుపకపోతే ప్రయోజనమేమి? సంపదలతో భగవంతుని మరచే విరసపు జీవుల చదువు నిష్ప్రయోజనము.

"వననిధి గురిసినవానలివి మతి
పనిలేని పనులభారములు" (1-24)

సముద్రంలో వర్షంకురిస్తే నిరుపయోగమయినట్లే, అడవిగాచిన వెన్నెలవలే అశాశ్వతమైన వాటిని ఆశ్రయిస్తే దూరపుకొండలు నునుపువలె పరితాపాన్ని కలిగిస్తాయి. ఆ వేంకటరమణుని కొలువని జన్మములు జీవన్మృతుల వంటివి.

ఎన్ని బాధలబెట్టి ఏచెదవు నీవింకనెంతకాలము దాక కర్మమా
మన్నించుమనుచు నీ మరగుజొచ్చితిమి మామాటాలకించవో కర్మమా" (1-284)

ఓ కర్మమా! చిరకాలంగా పీడలకులోనైన మమ్ము యింకా ఎంతకాలం బాధిస్తావు. నీవల్ల మేము అనేక పాపాలకు లోనయ్యాము. ఆశాపాశాలతో బంధించి విధికి అప్పగించావు. హరికి దాసులైన వారిని మాత్రమే ఆదరిస్తావు. సామాన్యులకు ఈకర్మబంధం తొలగదోయరానిదని భావం.

"అజ్ఞానుల కివి యరుహములింతే
సుజ్ఞానుల కివి సొరనేలయ్యా" (4-260)

ఈ చెప్పబోయేవి అజ్ఞానులకే తగినవి. సుజ్ఞానులైనవారు ఇందులో ప్రవేశింపవలసిన పనిలేదు. భగవంతుని నమ్మిన భాగవతులకు తర్వాత చేయదగినపని యేమీ లేదు. గురు కృపకు పాత్రుడైన వానికి పుణ్యపాపాలు లేవు. వేంకటేశ్వరుని సేవించిన మాకు అన్నిలోకాలలోనూ ఎదురేదయ్యా!

నాటక మంతా నవ్వులకే
పూటకు పూటకు పొల్లైపోవు (4-339)

సంసారనాటకం చివరికి నువ్వుల పాలుకావలసిందే ప్రతిపనీ ఏపూటకాపూట వ్యర్థమైపోతున్నది. కోటివిద్యలు కూటి కొరకేగాని తత్వజ్ఞానంకోసం కావు. దేహమనే చెరసాలలో

చిక్కుకున్న జీవుడు సంసారిగా చేసే మెరుగులన్నీ స్త్రీల కోసమే. చదువులలో మర్మం తెలుసుకున్న ఆసుజ్ఞానికి మెన్నెలమాయలు విడిపోతాయి.

"విజాతులన్నీ వృధావృధా
అజామిళాదులకది ఏ జాతి" (2-383)

ప్రతిజీవిలోనూ శ్రీహరి అంతరాత్మగా వున్నప్పుడు కులమతజాతి భేదాలు ఎందుకు? నారాయణ నామజపంతో ఉన్నత లోకాలకు చేరిన అజామిళునిది ఏజాతి? అరిషడ్వర్గాలు భవవికారమని పరమయోగులు భావించారు. పరిశుద్ధమైన ఆత్మ భగవంతుని దాస్యాన్ని చేరుకున్నప్పుడు ఆనామమే సుజాతి.

"ఏది నిజబంబని ఎటువలె నమ్ముదు
పోది తోడనను బోధింపవే" (3-2)

ఇది తత్వ బోధకీర్తన. సత్తు అసత్తు సమస్తము భగవంతుడేనని శ్రుతులు చెబుతున్నాయి. అయినా ఏది నిజమని నమ్మేది ఎలా? సకల రూపాలూ ఆవిష్ణువువేనని పురాణాలు చెబుతున్నాయి. భావాభావము అతడేనని దైవజ్ఞులు భావిస్తారు. నిన్న మసులో ధ్యానించడమే మార్గము.

"ఇరవగువారికి ఇహపర మిదియే
హరిసేవే సర్వాత్మలకు" (1-439)

శ్రవణం మొదలైన నవవిధ భక్తులలో నామ సంకీర్తనమే పాపాలను పోగొడుతుంది. ఇందులో వరుసగా కీర్తనాన్ని స్మరణాన్ని ఆత్మనివేదనాన్ని ప్రస్తావించాడు. విష్ణుదాస్యమే లోకులకు కొంగుబంగారమని రూఢిగా చెప్పాడు.

"నిగమ నిగమాంత వర్ణిత మనోహరరూప
నగరాజధరుడ శ్రీనారాయణ" (1-243)

వేద వేదాంతాలు కీర్తించే ఓ నారాయణా! వైరాగ్య సుఖాన్ని ఇవ్వకుండా నాకు సంసార బంధాలు కట్టావు. నాకు చిత్తశాంతినివ్వక నీ లీలలలో ముంచావు. భవసాగరంలో తడబడేలా చేశావు.

"అందరికి సులభుడైన అంతరాత్మ యున్నవాడు
ఇందునే శేషగిరిని యిరవై విష్ణుడు" (3-281)

భక్త సులభుడైన ఆపరమాత్మ శేషగిరిపైనే యున్నాడు. యోగీశ్వరుల హృదయాలలో వున్నవాడు, పాలకడలిపై పవళించినవాడు భాగవతాధీనుడు, వైకుంఠవాసి, వేదాంతవేద్యుడు కర్మఫలాలను పండించే అండ, లోకబంధుడు.

"చాలనొవ్వి సేయునట్టి జన్మమేమి మరణమేమి
మాలుగలిపి దొరతనంబు మాన్పుటింత చాలదా" (1-297)

కష్టాలపాలుజేసే జనన మరణాలు వుండిఏమి? దొరతనాన్ని మానిపితే చాలదా? బంధాలకు కారణమైన పాపపుణ్యకర్మలు ఎందుకు? నిరంతరము బంధాలలో దగిలివుండే సంకెల పసిడిదైన యినుపదైనా ఒకటే. దుఃఖభాజనమైన ఆపద సంపద రెండు ఒకటే. కర్మఫలము మీదకాంక్ష గలిగిన చాలును. వేంకటేశుని మహిమలు తెలిసిన నిర్మలాత్మునకు ఇహపరాలు నేడు కలిగాయి. అది చాలదా!

"సచరాచరమిదె సర్వేశ్వరుదే
పచరించి యితని భావింపుమనసా" (4-116)

స్వామి సగుణనిర్గుణతత్వాలను ఇందులో కీర్తిస్తున్నాడు. చరాచరలన్నీ సర్వేశ్వరాధీనమే ఓమనసా! అది తెలుసుకొని నీవు అతని కీర్తించు. గోచరమయ్యే చైతన్యము కనిపించని నిశ్చేష్ట, జగత్తు ఆకమలారమణుని మహిమలే. ఇహపరాలకు అధినాధుడైన శ్రీవేంకటేశ్వరుని కీర్తనయే కైవల్యదాయకము.

"ఏది వలసె నీవదిసేయు యిందులోననో జీవాత్మ
పొదగు మనలో నంతరాత్మయై పరగిన శ్రీహరి పనుపునను" (2-128)

ఓ జీవాత్మా! అంతరాత్మయైన శ్రీహరి పనుపున ఏమార్గాన్ని ఎన్నుకుంటావో ఆలోచించు. సంసారబంధమా? మోక్షమా? మనవంటి జీవులు పాపకర్మల ననుసరించి కుక్కలుగా పందులుగా పరిభ్రమిస్తున్నాయి. మరికొందరు సనకసనందనాది మునీంద్రులంపలె ముక్తిని పొందారు. మనతోటివారే కొందరు సేవకావృత్తిలో వున్నారు. మరికొందరు నారదాదిమునులై ముక్తులైనారు. ఈజన్మలోనైనా శ్రీవేంకటేశ్వరుని దయతో ముక్తులమౌదాం.

"ఇహపరసాధ్య మీతలపు
సహజజ్ఞానికి సత మీతలపు" (2-225)

ఈతలపు ఇహపరసాధనము. అది సహజజ్ఞానికి మాత్రమే తెలుసు. సిరసంపదలతో తులతూగుతూ హరిని మరవనిది అసలైన తలపు. స్త్రీ మద్యంలో భ్రమపడనిది తలపు వయోగర్వంతో మదించనిది తలపు. సుఖదుఃఖాలలో నామస్మరణ మరవకపోవడమే తలపు. సంసారపు మాయలో కోరికలు చొరనిదే తలపు. భగవంతుని శరణుకోరడమే తలపు.

"జీవాతుమై యుండుచిలుకా నీ
వావలికి పరమాత్మయై యుండు చిలుకా" (1-50)

సాధారణంగా అన్నమయ్య కీర్తనలలో మూడ చరణాలు వుంటాయి. ఇందులో ఆరు చరణాలున్నాయి. దండెమీటుతత్వాలు పాడుకున్న రీతిలో దీనిని పాడుకోవచ్చు.

జీవాత్మను ఇందులో చిలుకగా సంబోధిస్తున్నాడు. ఓ చిలుకా! నీవు నాలోని జీవాత్మవు. బయట పరమాత్మవు. ఆత్మపంజరంలో నాచేత పెంచబడ్డావు. కర్మ సంకెళ్ళలో బడి పేదవైనావు. నాచే రేయిబగుళ్ళు చదివించి నాశరీరంలో రెక్కల మధ్యన వుండిపోయావు. కూటికోసం పెక్కుమాటలు మాట్లాడి కోరికలతోరణాలు విరియగా నాతోగూడి మెలిగావు. నీవు, నేను వేరుగాదు. దైవమానుషాలు నిత్యము నాతలపున నిలిపావు. అవియేవీ నిజంకాదని నాకు ఎఱిగించావు.

"ఇతరములన్నియు నడుమంత్రములే
యెంచి చూచినను యింతానూ
హితవగు బందుగు డీశ్వరుడొకడే
ఇతని మరువకుమీ జీవాత్మా" (4-399)

పరమాత్మ వొక్కడే ఆత్మబంధువు. ఈవిషయాన్ని మరువక మిగిలినవి నడుమంత్రములని తెలుసుకోవలసినదిగా జీవాత్మ పేరుతో హెచ్చరిస్తున్నాడు. భవకూపంలో నుండి బయటపడినపుడు జీవాత్మం ఒకడే బంధువు. స్వర్గంలో తేలేటప్పుడు, నరకంలో నలిగేటప్పుడు వదలినిది ఇతడొక్కడే. పశుపక్ష్యాదులుగా జన్మించినపుడు దుఃఖసమయంలో బాల్యంలో వృద్ధాప్యంలోనూ ఇతడొక్కడే బంధువు. ఇహపరాలలో సమస్త కర్మలలో బంధువైన జీవాత్మయే శరణ్యము.

"అప్పులవారే అందరునూ
కప్పగతిప్పగకర్తలు వేరీ" (1-81)

ఋణానుబంధరూపేణా యేర్పడినవారే అందరు. నటన సూత్రధారి వేరు. ఈ ప్రపంచమంతా చింతలే. దేవుడొక్కడే దిక్కు. సూదుల మూటల వంటి సుఖాలు అన్ని కాలాలలోనూ వుంటాయి. అంత్యంలో కనిపించేది పరమాత్ముడే. వేంకటవిభుడు వొక్కడే బంధాలనుండి విముక్తి చేయగల సమర్థుడు.

"వెఱ్ఱులాల మీకు వేడుక కలిగితేను
అఱ్రుపంచి తడు కల్లంగరాదా" (2-494)

సుదీర్ఘ జీవితంవలె ఈకీర్తనకూడా సుదీర్ఘంగా పది చరణాలతో నిండివుంది. సమకాలీన కవులను, వారి కవితలను హాస్యంచేస్తూ చెప్పిన కీర్తన. ఓ వెర్రి కవులారా! మీకు వేడుకైతో మీకిష్టమైన కవితలు చెప్పుకోండి. ఇతరులను అనుకరించవద్దు. ఒకరు ధరించిన పూవును మరొకరు ధరించరు. ఒకరు తిన్న విస్తరిలో మరొకరు తినరు. ఒకరు చెప్పిన కవిత్వంలోని భావాలను మరొకరు అనుకరిస్తే అది భగవంతునికి అర్హముకాదు. గంపెడు పొట్టుతిన్నా ఒక

వరిగింజ అందులో కలిసివున్నట్లుగా ఏదేదో పలవరించిన కవితలో ఒక మంచి మాట వుండి ప్రయోజన మేమి? ఒకరి కవితాచ్ఛాయలో మరొకరు వ్రాస్తే దేవుడు పరిహసింపడా? నిస్సారమైన కవితలను చూసి దేవుడు పరిహసిస్తాడు. పుచ్చిపోయిన పండును ఎవరూ ఆశింపరు. బొల్లికైత చెప్పినవారు దానిపై ప్రశ్నవేయగా సమాధానం చెప్పలేరు. మీవంటి విరసులను దేవుడు పరిగ్రహించడు. అన్నమయ్యకాలంలో ఆయనను కొందరు అనుకరించడానికి ప్రయత్నించారు. దానిని అన్నమయ్య ఈసడిస్తున్నాడు.

"తెలిసితే మోక్షము తెలియకున్న బంధము
కలవంటిది బ్రతుకు ఘనునికిని" (2-19)

ఇదిమరో తత్వకీర్తన. జీవులకు తత్వం తెలిస్తే మోక్షం. తెలియకుంటె బంధం. ఆత్మతత్వం తెలిసినవానికి జీవితం స్వప్న సదృశం. శరీరంపై ఆశలేని వానికి సుఖదుఃఖాలు లేవు. ఫలాసక్తి లేని కర్మికి పాపపుణ్యాలులేవు. నిరాహారికి అమృతము, విషము ఒకటే. దైవాన్ని నమ్మినవానికి వెరపు, మరపులేదు. వానికి ఐహికఆముష్మికాలతో సంబంధం లేదు. తత్వసారాన్ని అలతిఅలతిమాటలతో అందించాడు అన్నమయ్య.

"ఏమిగలదిందు నెంతగాలంబైన
పామరపు భోగ మాపదవంటిదరయ" (1-112)

పామరభోగము ఆపదవంటిది. ఆశకొండవంటిది. తగులు గోడవంటిది. సంపదలు మంచువంటివి. మేడిపండు వంటిది సరసభావము. చింత అడవి వంటిది. కర్మ బంధము పాకు వంటిది. వేంకటేశ్వరునిపై కోర్కె సౌఖ్యములున్న గని వంటిది.వేదాంతార్థాలను చిన్న చిన్నభావాలలో అన్నమయ్య అద్భుతంగా చిత్రీకరించాడు.

"అయ్యోపోయే బ్రాయము కాలము
మొయ్యంచు మనసుననే మోహమతినైతి" (1-179)

మాయామోహంలో నలిగిన జీవుడు కాలము ప్రాయము పోయిన తరువాత బాధపడతాడు. సతులు, సుతలు, బంధువులు రుణానుబంధరూపేణా వచ్చినవారే. వారిని నమ్ముకొని భగవంతుని మరచుట వృథా. బంధుమిత్రులు బాధలకు గురిచేసేవారే. భగవంతునిపై దృష్టి తగిలించాలి. వారు తమవంతుకోసం పెనగులాట పడేవారే. ఇది అంతా సంతకూటముల అలజడి.

"ఎక్కువ కులజుడైన హీనకులజుడైన
నిక్కమెరిగిన మహానిత్యుడే ఘనుడు" (1-318)

ఉన్నత కులంలో జన్మించినా హీనకులంలో జన్మించినా భగవత్తత్వం తెలిసిన

నిత్యుడేఘనుడు. హరిభక్తిలేని సోమయాజికంటె భక్తుడైన కులహీనుడు ఘనుడు. హరిభక్తిలేని సన్యాసికంటె విష్ణునివెదికే అంత్యజాతివాడు ఘనుడు. సకలశాస్త్రపారంగతుడై శరీరాన్ని తపింపజేసే వాని కంటే వేంకటేశ్వరుని ప్రసాదాన్ని అనుభవించినవాడే ఘనుడు.

"నీతితో నడచితేను నెగులే లేదు
జాతి తప్పకుండి తేను చెలమే ఫలము" (14-42)

నీతిమంతుడైనవానికి కష్టమేలేదు. జాతి తప్పనివానికి అన్నిఫలాలే. ఆత్మజ్ఞానికి దేవుడెరుక. మంచి మాట్లాడిన వానికి శత్రువులు కూడా చుట్టాలే. స్తుతిస్తే రాయి కూడా కరుగుతుంది. వేంకటేశుని కొలిస్తే ప్రతిబంధకాలే లేవు.

"ఇందువల్లనేమి గద్దు ఇనుపగుగ్గిళ్ళింతే
ఇందిరా రమణుసేవే ఇరవైన పదవి" (2-268)

సంసారసుఖం ఇనుపగుగ్గిళ్ళవంటిది. హరిసేవయే పరమావధి. స్త్రీల నవ్వులు చందమామ గుటకలు. రతిలో మాటలు రావిమానిపువ్వులు. స్త్రీల అనురాగం గోడమీది సున్నం. స్త్రీల వేడుకలు వడగండ్లగుండ్లు, వేంకటేశ్వరుని మాయలు అద్దంలో నీడలు. ఇంత సూక్ష్మంగా తత్వార్థాన్ని తెలియజేసిన అన్నమయ్య ఘనుడు.

"విష్ణుడేయింతానని భావించుటే బుద్ధి
వైష్ణవుడైయాచార్య సేవసేయుటే బుద్ధి" (2-195)

అంతా విష్ణుమయమని భావించి వైష్ణవాచార సేవ చేయడమే ఉత్తమం. విపరీతమైనకోపం వచ్చినపుడు మౌనం వహించడం బుద్ధి. పరకాంతలపై భ్రమ లేకుండుటే బుద్ధి, గృహారామాదులపై ఆశలేకుండుటే బుద్ధి. బంధుసంబంధ బాధలు లేకుండుటే బుద్ధి తన వద్దనున్నవారి తప్పులు పట్టనిదే బుద్ధి.

మహినుద్యోగిగావలె మనుజుడైనవాడు
సహజివలెనుండేమి సాధింపలేదు" (2-212)

మానవుడు ప్రయత్నశీలుడు కావాలి. ఏ ప్రయత్నమూ చేయనివాడు ఏమీ సాధింపలేడు. భగవదన్వేషణ చేసేవానికి విష్ణువు ప్రత్యక్ష మౌతాడు. వేడుకగా చదివేవాడు విద్వాంసుడౌతాడు. చదవనివాడు మూఢుడౌతాడు. శరణన్న వానిని వేంకటేశ్వరుడు రక్షిస్తాడు. పురుష ప్రయత్నము ప్రధానమని ఈకీర్తన చెబుతోంది.

"గడ్డపార మింగితే నాకలి తీరేనా యీ
ఒడ్డినభవము తన్ను వొడకమ్ము గాక" (1-177)

గ్రామ్యపదజాలంతో నడచిన సామెతలతో కూడిన కీర్తనయిది. గడ్డపారమింగితే ఆకలి తీరనట్లే భవసంచితము ఎంతకూ తీరదు. ఆకాశంలో పరుగెత్తే జింకలను బండికట్టడం వశమా? ఇంద్రియాలు లౌల్యానికి గురిచేస్తాయి తప్ప చిక్కవు. అగ్నిని మసిగుడ్డలో మూటగట్టి దాచగలమా? మమకారం బంటునుజేసి ఆశాపాశంతో బంధిస్తుంది. విషసర్పాన్ని తలకింద బెట్టుకుంటే అది వదలదు. వేంకటేశ్వరునిపై భక్తిలేని సంసారి బాధలకు లోనుగాక తప్పదు.

"తనలో నుండిన హరి తాకొలువడీ దేహి
ఎనలేక శరణంటే నితడే రక్షించును" (2-213)

అంతర్యామియైన పరమాత్మను జీవుడు భజించడు. అతనిని శరణంటే ఆయనే రక్షిస్తాడు. వార్ధక్యాన్ని పోగొట్టుకోవడానికి చేదుమందులు తింటాడు. మంత్రసిద్ధుడు కావడానికి అనేక అగచాట్లు పడతాడు. భూతవైద్యాలతో జీవహింసలు చేస్తాడు. సిరులకై శక్తిని ఉపాసిస్తాడు. వేంకటేశ్వరుడు చేపట్టేదాకా ఆశలతో పరుగులు తీస్తాడు.

"అతనిమూలమే జగమంతా నిది
ఆతుమలో హరికీలు అయివుంటుగాని" (2-362)

అంతా విష్ణుమయం. ఆత్మలో హరి కీలుగా వున్నాడు. మాత్సర్య రహితునికి మనసేరామరాజ్యం. హెచ్చుతగ్గుల భావన లేని వాడికి ఎక్కడైన సుఖమే. హరి ఈవలెనుగానీ తాపత్రయపడి ప్రయోజనం లేదు. అధర్మ కార్యాలతో సంపాదించనిదే సొమ్ము. ఈతత్వం హరిదాసులు శోధించి చూచినది.

"వెలుపల మరవక లోపల లేదు వెలుపలగలిగిన లోపల మరచు
చెలమున నిదియే ఘడియ ఘడియకును సాధించిన సుఖమటుతోచు"(2-137)

అంతర్యామితత్వాన్ని తెలుసుకోవడమే పరమావధి. వెలుపలి వెలుగును చూస్తే లోపల చీకటి కనిపించనట్లే లోకజ్ఞానికి ఆత్మజ్ఞానము కనిపించదు. చీకటినే చూచినవానికి బయట అంతా వెలుగు కనిపించినట్లు లోపల చూపుగలవాడు అంతరంగంలో భగవంతుని దర్శిస్తాడు. జాగరం చేసే అలవాటు గలవానికి నిదురరానట్లు ఇంద్రియాలలో తిరిగిన వానికి చిత్త వికారాలు నశించవు. జనన మరణాలతో వుండే జీవుడు ఆత్మయందు హరిని నిలుపుటే సూత్రము.

"కలుషపు చీకటి గలుగగను
వెలుగు లోకముల వెలసినయట్లు" (4-51)

దోషభూయిష్టమైన చీకటివుండగా వెలుగులోకములో విరజిమ్మినట్లుగ, ఇనుము వుండగా బంగారము సంతోషదాయకమైనట్లు పాతకములుండగా పుణ్యము రుచికరమైనది. దుఃఖము కలుగగా సంతోషము కనిపించుట ఆశ్చర్యకరమైనట్లే విషముండగా అమృతము మేలైనది.

వేంకటేశ్వరుడు ఇహాన్ని యివ్వగా పరముపై కోరిక పెరిగినది.

"ధర్మమునకే మము దయ గావలే యిక
నిర్మలుడవు నినునే మెరిగేమా" (4-290)

నిర్మలుడువైన నిన్ను మేము తెలుసుకోలేకుండా వున్నాము. మముదయతో కాపాడుట ధర్మము. శరీరధారులము, కర్మబద్ధులము, మాయాలోలురము, మదించినవారము అయినందున మనసు నీపై నిలుచుటలేదు. చపలురము, జడులము, పాపపుణ్యబద్ధులము, వాంఛాలోలురము అయిన మా బ్రతుకు నీపనులకు ఎక్కుతుందా? ప్రాకృతులము అహంకారులము, చంచలులము అయిన మమ్ము నీభక్తి మరచినను ఏలినావు.

"ఏమిగల దిందు నెంత పెనగినను వృధా
కాముకపు మనసునకు కడమొదలు లేదు" (1-328)

సంసారంలో ఎంతపెనగినా వృధా, కామించే మనసుకు ఆది అంతము లేవు. వత్తిలో నూనె జీవనము. విత్తనము మీది పొల్లు దేహము. బాంధవ్యాలలో పొరలడంవంటిదని చంచలమైన సంపదలు చాకలి ఉతికిన బట్టవంటివి అవీ స్వీకరించినా, చదరినా ఒకటే. కర్మియైనవాని సంసారము గాదెలో ధాన్యము వంటిది. వేదనలు పోగొట్టుకొనుట వేంకటేశ్వరుని దయతో మోక్షము పొందుటవంటిది.

హరిశరణాగతి యాతుమది
సరుస నిదియపో సతమయ్యెడిది" (4-81)

ఆత్మకు హరి శరణాగతి ఒక్కటే సత్యము. దేహము భిన్నరుచులు గలది. చిత్తము కోరికల పుట్ట. ఇంద్రియాలు కాంతు లెనసేవి. ఆత్మకు వీరితో బనిలేదు. కోపముపాపానిది. నిద్ర తమోగుణ నిలయము. ఆత్మకు ఇవి సంబంధములేదు. దేహజననము కర్మానిది. కోర్కెలు మాయలంపటము. వేంకటేశుని కృపయే ఆత్మకు ప్రమాణము. ఇంద్రియాలూ వికారాలు అశాశ్వతాలు. శాశ్వతమైన ఆత్మతత్వంతో స్వామి కృపకు పాత్రులు కావాలి.

"నీవనగ నొకచోట నిలిచివుండుటలేదు
నీవనుచు కనుగొన్న నిజ మెల్లనీవే" (1-232)

భగవత్ స్వరూపము ఒకచోట నిలచి వుండదు. నిన్ను దర్శింపగలిగితే సత్యంనీవే. అన్ని భూతములలోని ఆత్మ తన ఆత్మవంటిదేనని కనుగొన్నవాడే నీవు. ఇతరకాంతలను తల్లితో సమానంగా చూచేవాడే నీవు. సత్యవ్రత సంపన్నుడుగా మెలగేవాడే నీవు. ధనాన్ని తృణప్రాయంగా చూసే వాడే నీవు. సుఖదుఃఖాలను సమానంగా ఆదరించే వాడే నీవు ఆద్యంతాలు అంతా నీవే.

"మఱచితిమంటే మరిలేదు
తరితో తలచవో మనసా" (4-412)

మానవజన్మ దుర్లభం. అట్టిజన్మను సద్వినియోగం చేసుకోవాలి. ఆదమరచితే అంతే జనన మరణాల వలలో పడి విలువైన కాలాన్ని కోల్పోతాము. ఈమధ్యకాలాన్ని నామస్మరణతో సద్వినియోగం చేసుకోవాలి. సూర్యోదయ సూర్యాస్తమయాల వంటివే జీవన్మరణాలు. మధ్యకాలాన్ని భగవత్సేవకు వినియోగించు అని మనసును హెచ్చరిస్తున్నాడు.

"దైవమా నీచేతిదే మాధర్మపుణ్యము
పూవువంటి కడులేత బుద్ధివారము" (3-249)

ఓదైవమా! సున్నిత మనస్కులమైన మాపుణ్యము నీకృపయే. మేము చేసిన కర్మ ఎంత? నీవు పుట్టించగా పుట్టాము. తోలు శరీరాలు ధరించి నడుస్తున్నాము. నీచేతిలో చిక్కిన జీవులము. నీ మాయలు దాటగలమా! మాకు తుది మొదలు లేదు. నీవారమైన మాపై నీదయ కలిగింది.

వేవేలు బంధములు విడువ ముడువ బట్టి
దైవమా నిన్నెట్టు తగిలేమయ్యా" (3-46)

వేలకొలది బంధాలు మమ్ములను బంధించాయి. ఓదైవమా నీపై మన సెట్లు తగులుతుంది. పూర్వజన్మపాశములు ఊరుతున్నాయి. సుజ్ఞానాన్ని ఏవిధంగా తెలుసుకునేది. పంచేంద్రియాలు నాకొంగుపట్టుకొనగా పాపము నన్ను వెంబడించింది. మాయలు భ్రమలు కలిగిస్తున్నాయి. ఇక మోక్ష మెన్నడు అందుకునేది. ఇహము వెనకకు తీయగా వైరాగ్యము అరచేతి కందనిది. ఇకనేను ఏవిధంగా భోగించగలను.

"ఏమని చెప్పినో కాక యిలగల శాస్త్రాలు
కామించి వాదించేవారి కడమేదో" (3-294)

శాస్త్రాలు ఏమని ఘోషిస్తున్నాయో గాని, వాదించేవారికి అంత్యమేదో తెలియదు. లోకాలకు ఆధారము హరియే. వేదార్థముల పురుషార్థమతడే. ప్రాణులను పుట్టించేది కర్మ సాధనము, మందలించే సాధనము, మాయలకు కారణము ఆసర్వసాక్షియే. ఆయనకు ఇంక సాక్షి ఎవరు?

"ఇన్నియును ముగిసెను యిటు నీలోననె
పన్ని పరుల చెప్పగ చోటేది" (3-87)

సమస్తజగత్తు నీలోనే లయమౌతుంది. మరి యితరుల చెప్పేచోటేది? నీరోమకూపాలలో బ్రహ్మాండకోట్లు ఉన్నాయట. మరి ఎందరు బ్రహ్మలో, ఎంత ప్రపంచమో! నీకొన చూపులో కోటిసూర్యు లుదయిస్తారట. నీఉనికి ఎక్కడో తెలియదు. నీ మాయలో జీవకోటి పుడుతుంది. మరి యితరులకు ఆధిక్యత ఎక్కడిది.

"కొనమొదలేదో గుతిగాన రొరులు

మునుకొను సంసార మోహాంధమందు ( 2-118)

సంసార మోహాంధకారంలో మునిగినవారు అద్యంతములు తెలుసుకోలేరు. సంసార వృక్షంలో ఆశాపుష్పాలు విరబూస్తాయి సంసార సాగరంలో ఉభయకర్మలు చేస్తూ పుట్టిన జీవి ఈదుతాడు. శ్రీవేంకటేశ్వరుడు గతి అయితే శరీర భాగాలలో తగులుకొన్న జీవి సంసారానందాన్ని పొందగలుగుతాడు. ఈకీర్తనలో సంసారసుఖంలోని ఈతి బాధలను ఆధ్యాత్మికరీతిలో చెప్పాడు.

పట్టలేని మన భ్రమగాక నెట్టన తాకరుణించిన వాడా ( 2-472)

పరమాత్ముడు భక్తుడు మనసుపెడితే కరుణించడా? అని ప్రశ్నిస్తున్నాడు. అంతరాత్మయై ఈశ్వరుని తానే గతియని తలపోస్తే తప్పక రక్షిస్తాడు. నమ్మిన వానిని ఇహపరాలలో బంధువై దయదలుస్తాడు అనడంలో సందేహం లేదు.

హృదయంలో శ్రీనివాసుడున్నప్పుడు బయట వెదకాలా? ఆయన ప్రత్యక్షమై వరమీయడా?

"కోరికె దీరుటెన్నడు గుణమునకు నవగుణమును చెడి

ఊరక ఈమది నీపై నుండుట ఎన్నడొకో" (1-176)

కోరికల దొంతరలు ఎన్నడు తీరుతాయి. నీపై మనసు నిలబడే దెప్పుడు. మనసుకు ఆకలి తీరదు. మనసులో చింత తొలగదు. దుఃఖానికి అంతులేదు. పుణ్యపాపాలు తాత్కాలిక సుఖాల కోసరమే. రోజులు బొటాబొటిగా దొర్లిపోతున్నాయి. పరతంత్రుడైన జీవుడు నిన్నెపుడూ చింతించడు. శరీరధారులకు చావు పుట్టుకలు సహజము. ప్రాణులు పుణ్యకార్యాలు చేసి బ్రతికేదెన్నడో?

"ఎవ్వరివాడా గాను యేమందునిందుకు

నవ్వుచు నాలోని హరి నన్నుగావవే" (4-142)

ఓ శ్రీహరీ ! నే నెవరివాడను. గాను అంతరాత్మవైన నీవు నన్ను రక్షించాలి. రాజసేవలో కాలముగడిపి పూట గడిపాను. సంసారమనే బంధంలో చిక్కుకున్నాను. పూర్వజన్మ కర్మలకు మోసబోయి ఈబ్రతుకు కుదువబెట్టాను. విషయసుఖాలకు నావయసంతా ఖర్చయిపోయింది. నామనసు నావరించిన గురుడు నీకు క్రయమిచ్చాడు. అప్పులన్నీ తీరి నేను నీసొమ్మయ్యాను.

"కరుణించవే నిజగతి బోధించవే

హరి నిన్ను గొలువక యలసీబ్రాణి" (4-381)

ఓహరీ! నిన్ను కొలువక ప్రాణము అలసిపోయినది. నన్ను కరుణించి సద్గతి బోధించు. ఈలోకంలో స్త్రీలతో వేడుకలు కలలో స్త్రీలతో కలిసినటువంటివి. అందుకోసమై లంపటములలోబడి ప్రాణి బడలిపోయినాడు. ఆహారపు రుచి నిన్ననేడుఒకటే. ఐనా దీనికోసమై

ప్రాణి ఇడుముల పాలవుతున్నాడు. పరుసవేది సోకిన బంగారమువలె భాగవతుల కృపవలన ప్రాణి గట్టెక్కుతున్నాడు.

"సకల భూతదయ చాలగ గలుగుట
ప్రకటించి దేహసంభవమైన ఫలము" (1-223)

శరీరధారణ ఫలము సమస్తప్రాణుల పట్ల దయగలిగివుండటమే కర్మ లొనర్చుటకు ముఖ్య ప్రయోజనము వాటి ఫలాలపై ఆశపడకుండా మనస్సును స్వాధీన పరుచుకోవడమే. శ్రీహరికృప కలిగినందులకు ఫలము ఆకర్మఫలాలను బ్రహ్మార్పన మొనర్చే బుద్ధి అతనికి కలగటమే. తాను జీవుడైనందులకు నిరంతరము వేంకటేశుని సేవకుడగుటయే. తనకు విజ్ఞానము లభించినందుకు ఫలము సుఖదుఃఖాలపట్ల సమభావం కలిగివుండటమే.

"చాటెద నిదియే సత్యము సుండో
చేటు లేదీతని సేవించినను" (2-164)

అన్నమయ్య తిరుమల కొండపైకెక్కి తానుకనుగొన్న సత్యాన్ని లోకానికి చాటుతున్నాడు. భగవంతుని కాదన్న వారు రాక్షసులు. భగవద్దాసులు దేవతలు పరమాత్మయేప్రాణము. అతనిని మరచినచో ఇక మరిలేరు. వేదరక్షకుడు, బ్రహ్మజనకుడు అతడేనని శోధించి శుకుడు కనుగొన్నాడు. ఇహపరాల నొసగేది అతడేనని పార్వతి నుతించింది.

"దేహినిత్యుడు దేహము లనిత్యాలు
ఈహల మనసా ఇది మరవకు మీ" (2-419)

"వాసాంసి జీర్ణాని" అనే గీతాశ్లోక సారమిది. దేహినిత్యుడు. దేహాలు అనిత్యాలు అనే విషయాన్ని మరవకూడదు. పాతవస్త్రం వదలి కొత్తది కట్టుకున్నట్లు పాతదేహం వదిలి కొత్త దేహంలోకివస్తాడు. దానిని గాలి, నీరు, అగ్ని, ఆయుధాలు చంపలేవు. అతడు అగ్నిలో కాలడు, నీటిలో మునగడు, చేతనాత్మకుడై సర్వాంతర్యామిగా వుంటాడు. అదృశ్యుడు, అచింత్యుడు అయిన వాడతడే అని సారం తెలుసుకోవడమే సత్యం, జ్ఞానము.

"పరమాత్ముడొక్కడే పరమ పావనుడు గన
పరిపూర్ణుడనెడి ఈ భావమే చాలు" (2-136)

పరమాత్ముడొక్కడే పరమపవిత్రుడు, పరిపూర్ణుడు అనే భావమేచాలు. ఇందులో హేయమేది ఉపాధేయమేది? మరి సర్వాంతర్యామి గదా! జీవితము రోత అయితే తన శరీరమే రోత. అన్ని జాతులకును ఆత్మ సర్వేశ్వరుడే. శౌచము, అశౌచము అనేవి తెలియని వెలితి. జ్ఞానియైన వానికి ఈ సంశయాలు తీరుతాయి.

"పరమ సుజ్ఞనులకు ప్రపన్నులకు
మరుగురుని మీదట మనసుండవలదా" ( 15-46)

పరమజ్ఞానులైనవారికి, ప్రపన్నులకు హరిమీద మన సుండవలెను గదా! ఆకలిగా వున్నవానికి అన్నముపై మనసు వున్నట్లు భక్తునికి ఈశ్వరునిపై మనసుండాలి. కాంతలపై విటుల చూపులున్నట్లుగా దేవుని మీద చూపు భక్తుని కుండాలి. పసిబిడ్డలకు పాలచన్నుపై ఆశవున్నట్లు గోవిందునిపై భక్తి నెలకొనాలి. బాటసారికి సత్రాలపై కోరిక వున్నట్లు శ్రీపతిపై భక్తుని మనసుండాలి. ధనవంతుడైనవాడు నిధిని కాపాడినట్లు భక్తుడు వేంకటేశునిపై గురి కలిగివుండాలి.

"అదినే నెఱగనా అంతలో భ్రమతుగాక
మదన జనక నాకు మంచిబుద్ధి ఈయవే" (2-185)

అన్నీ తెలిసి నేను భ్రమపడుతున్నాను. ఓహరీ! నాకు మంచిబుద్ధిని ప్రసాదించు. లోకానుభవమంతా వృధా. బ్రహ్మచింత కోటి లాభదాయకము. విటజనులతో వినోదము వృధా. సజ్జన సంగతి సరియైన ఆదాయము. ఆయాదేశాలవార్తలు చింతలకు మూలము. పురాణగోష్టి పుణ్యప్రదము. వ్యవసాయ వాణిజ్యాలు వెట్టిచాకిరి. ఆచారవర్తన ఆత్మకు సరియైనది. బాంధవ్యాలన్నీ బంధాలు. ఆచార్యులసేవ జీవన్ముక్తి దాయకము. ఓ వేంకటేశా! నీవే అన్నిటికి నిశ్చలమైనవాడవు.

"సేయని వాడెవ్వడు చేరి చిల్లర దోసాలు
యే యెడ జీవుల జాడ లీశ్వర కల్పితమే" (2-72)

చిన్న చిన్న తప్పులు చేయనివాడు లోకంలో వుండడు. జీవుల జాడలన్నీ ఈశ్వర కల్పితాలే! భగవంతుని నమ్మినవానికి ఎంతటిపాపమైనా ఏమీ చేయగలదు? అన్ని నేరాలు అతనే పరిహరిస్తాడు. సూర్యకాంతికి అంధకారము ఎదురా? పూజలందుకునేవాడు భువనరక్షకుడు. అతడు పాపాలను పోగొట్టగలడు. రాజు చేసిన ఆజ్ఞ రాజుకంటె గొప్ప కాదుగదా! పర్వతాలు వజ్రాయుధాన్ని ఆపలేవు. గరుడునికి పాములు లెక్కలేనట్లే కష్టాలమయమైన జన్మకు కార్యకారణ సంబంధమేముంది.

"విష్ణుడొక్కడే విశ్వాత్మకుడు
వైష్ణవమే సర్వంబును" (2-345)

విష్ణువొక్కడే సమస్త విశ్వస్వరూపుడు. చరాచర సృష్టి అంతా విష్ణువుకు సంబంధించినదే. బ్రహ్మజేసే బ్రహ్మాండ సృష్టి శివునిలో గల జగత్ సంహారశక్తి. ఇంద్రునికిగల లోక పరిపాలనా సామర్థ్యము శ్రీహరి మహిమలే. పంచభూతాల గుణాలు నవగ్రహ విహారాలు, భూత భవిష్యత్ వర్తమాన కాలధర్మాలు శ్రీహరి ప్రభావాలే. లోకంలో మాయావిలాసాలు వైకుంఠంలో

నిత్యసుఖానుభూతి అంతా వేంకటేశ్వరుని మహిమలే.

"పాపముచేరువ ప్రాణునికి
ఏపున పుణ్యంబేదోకాని" (15-50)

ప్రాణికి పాపము దగ్గర. పుణ్యము ఎక్కడుంటుందో తెలియదు. కోపము ముక్కుపై వుంటుంది. శాంతము ఎక్కడో తెలియదు. ఆశలు చేతిలో వున్నాయి. విరక్తి కానరాదు. కామాంధకారం కనులలోనే వుంది. విజ్ఞానము జాడ తెలియదు. దైన్యము నాలుకపై వున్నది. ధైర్యము తోవ తెలియదు. శరీరంలో అనాచారాలు ఎక్కువ సద్ధర్మ ఎక్కుడుందో భగవంతుడు రక్షించగా బ్రతికాను.

"ఎంత పుణ్యమో యిటు మాకు కలిగె
చెంతనే నీకృప సిద్ధించబోలు" (2-322)

మా పుణ్యఫలం వల్లన నీకృప సిద్ధించింది ఓశ్రీపతీ! నీకథ వినడంద్వారా పాపాలు తొలగి భయము నశించింది. తులసీతీర్థ సేవనతో శాపం తీరిపోయింది. నిన్ను సేవిచండం వల్ల నీపాదాలకు మ్రొక్కడంవల్ల పావనుల మయ్యాము. నిన్ను సేవించడంవల్ల ముమ్మాటికి నీపై ప్రేమతో నీవారమై వచ్చి నిలచాము. ఇక్కడ శరణాగతి సిద్ధాంతాన్ని అన్నమయ్య ప్రతిపాదించాడు.

"వెగ్గలమంతా వృధావృధా
తగ్గి పరులతో దైన్యములేలా" (4-242)

ఈలేనిపోని ప్రయాసలన్ని వృధా! నీచంగా ఇతరుల వద్ద దైన్యంగా జీవించడమెందుకు? ఆశలు మనం పెంచుకొనే కొద్దీ పెరుగుతాయి. తగ్గించుకుంటే తగ్గుతాయి. ఈమోసకారి శరీరానికి కూడుగుడ్డ కావలసిందే! ఈబంధాలన్నీ ఎప్పుడో ఒకప్పుడు వీడిపోతాయి. ఏదో ఒకరోజు కుక్కిమంచంలో శల్యావస్థతో వుండవలసిందే. ఈజగమంతా మాయామయం. ఆపరమాత్ముడొక్కడే మనకు కాణాచి. ఆశకు అంతములేదు- అని ఈకీర్తనలో స్పష్టం.

"ఎన్నడు దీరవుయీపనులు
పన్నిన నీమాయ బహుళంబాయ" (3-348)

ఓదేవా! నీమాయ అధికం కావడంవల్ల సంసారతాపత్రయం ఎన్నడూతీరదు. పెద్దలు అనేక మతాలు సృష్టించి ఒక అంగీకారానికి రాలేకున్నారు. అనేక దేవతల పేర్లు వాడుతూ తామే ఘనులమని భావిస్తున్నారు. పలికే చదువులు వివిధములైనందున ఏకవాక్యత లేకుండా పోయింది. జనులు వాదోపవాదాలు తర్కాలతో కాలంగడుపుతున్నారు. ఓదేవా! శరణాగతులకు నీవే మార్గం.

"అతిసులభంబిది యందరిపాలికి
గతి యిది శ్రీపతికైంకర్యంబు" (2-10)

భగవత్కైంకర్యము అతిసులభము, అందరికీ గతి. దేవతలు పాలసముద్రాన్ని కష్టపడి చిలికి అమృతాన్ని సాధించారు. నాలుకమీదవున్న హరినామామృతాన్ని ఎందుకు గుర్తించలేదో? దేవతలు యజ్ఞభాగాలకై వెంపర్లాడతారు. చేతిలో వున్న విష్ణుప్రసాదాన్ని గమనించలేరు? సప్తలోకాలూ తిరిగి తపస్సులతో బడలిపోతారు? వేంకటేశ్వరుడే తుదిపదమని యెరుగరుకదా?

"పురుషోత్తముడ వీవు పురుషాధముడ నేను
ధరలో నాయందు మంచితనమేది" (2-53)

ఓస్వామీ! నేను నీచుడను అపరాధిని అయినా, నాదుర్గుణాలు ఎంచక నన్ను రక్షిస్తున్నావు. నీ దయ ఎంత గొప్పది! నిన్ను తెలుసుకోలేని నైచ్యమునాది. నన్నువదలని గుణము నీది. అన్నీ యాచించడమే నాపని. అన్నీ రక్షించడమే నీపని. నిన్ను దూషించడమే నాపలుకు. నన్ను కావడమే నీవిధి. నేరమంతా నాది. నేరుపంతా నీది, నేను అజ్ఞానిని. నీవు జ్ఞానివి. నీప్రతాపం భూమండలమంతానిండింది. ఇందులో నైచ్యానుసంధాన ప్రక్రియ వాడబడింది. అన్నమయ్య సామన్యమానవ తత్వాన్ని తనలో ఆరోపించుకున్నాడు. భగవంతుని సర్వోత్కృష్టత సకల రక్షకత్వము యిందులో చెప్పబడ్డాయి.

"ఊరకే దొరకునా ఉన్నతోన్నత సుఖము
సారంబు తెలిసికా జయము చేకొనుట" (2-104)

మోక్ష సుఖము ప్రయత్నం లేకుండా చేజిక్కదు. ఒకపనిలో జయాన్ని సాధించటానికి అందులో సారము తెలుసుకోనాలి. మనస్సులో చింతలు పోగొట్టుకొని చిత్తము భగవదాయత్తము జేసినపుడే దైవము ప్రత్యక్షమౌతాడు. పాపభూయిష్టమైన దుర్మదం తొలగించుకున్నప్పుడే తానుకోరిన ముక్తి వశమౌతుంది. జన్మజన్మల కర్మమాలిన్యాన్ని కడిగివేసినపుడే నిర్మల జ్ఞానం కలుగుతుంది. శ్రీహరి మరుగుజొచ్చినపుడే జన్మ ఉత్తమమౌతుంది. శాంతి నెలకొన్నప్పుడే తాను చదివిన చదువు ఫలప్రదమౌతుంది. వేంకటేశ్వరుని దాస్యం లభించినపుడే సంసారసాగరతీరం చేరి సుఖిస్తాం.

"నేనొక్కడ లేకుండితే నీకృపకు పాత్రమేది!
పూని నావల్లనే కీర్తి బొందేవునీవు" (3-48)

దేవా! నేననేవాడిని లేకపోతే నీదయ యింకెక్కడ ప్రసరిస్తుంది. నన్ను దయజూడడం ద్వారా నావల్లనే కీర్తి పొందవలసింది. తెలివి హీనులలలో నేను మొదటివాడిని. గర్వమనే పర్వతాన్ని నేను. పంచేంద్రియాలే నా సంపద. అటువంటినన్ను వదలిపెట్టడం భావ్యమా! సంసార సామ్రాజ్యాన్ని పాలించే ప్రభువును నేను. వివిధజన్మలలో అనేక యోనికూపాలలో

నేనుమునిగి తేలుతున్నాను. నావంటివానిని విడిచిపుచ్చక కాపాడినప్పుడే నీకీర్తి పెరుగుతుంది. మనికిద్దరికీ లంకె బాగా కుదిరింది. కాబట్టి నన్ను కాపాడి పుణ్యం కట్టుకో!

"ఇహమేకాని యిక పరమేకాని
బహుళమై హరి నీపై భక్తేచాలు" (2-131)

భక్తునికి ఐహిక ఆముష్మిక జీవితాల కంటె హరిభక్తి ప్రధానం. ఎక్కడ జన్మించినా హరిదాస్యము కలిగితేచాలు. ఇతరులు దూషించినా, భూషించినా హరిసేవాసక్తి మేలు. చదువుసంధ్యలు లేకపోయినా భగవంతుని పాదాలపై ధ్యాసచాలు. అతని శరణు కోరితే చాలు. ఇక్కడ దాస్యభక్తిలోని సంతృప్తిని అన్నమయ్య వ్యక్తం చేశాడు.

"అన్నియును అతనికృత్యములే
ఎన్నియైనా నవు అతడేమిసేసినను" (1-20)

భగవంతుని చేతలేఅన్నీ. ఏమి చేసినా అతడే. అణురేణువులలో పూర్ణంగా వున్న అతడు మొహం అటు తిప్పితే బ్రహ్మాండమైనా అణువవుతుంది. పన్నగశయనుని కృపవుంటే గడ్డిపరక అయినా మేరువవుతుంది. హరి భక్తిలో లోపం కలిగితే సంపదలు నశిస్తాయి. అతనిపై భక్తి స్థిరమైతే పట్టినదల్లా బంగారం. హరిసేవ వెగటుపుడితే చేసిన పుణ్యాలు పాపాలవుతాయి. వేంకటపతిపై భక్తి కలిగితే మోక్షపదవికి అర్హుడవుతాడు.

"ఎందునుబోరాదీ సంసారము
కందువ నీమాయ గడవగవశమా" ( 4-464)

నీ మాయతో నిండిన ఈ సంసారము దాటవశమా. సంపదలు చిత్త వికారాలు కలిగిస్తే లేమి దైన్యాన్ని కలిగిస్తుంది. సంసారతాపత్రయాలు బంధకారణాలు అవి కాదంటే శరీర పోషణ కుదరదు. యవ్వనము మీద వికారము, వార్ధక్యమే కష్టభరితము. ధనార్జన యాతాయాతనతో కూడినది. అదిమానితే ఆకలి అధికం. సంపాదనలు ఆర్జించినా కష్టాలలో ముంచిన అంతర్యామివైన నీకటాక్షంతో నన్నుకాపాడు.

"తెలియరాదు మాయ దేహమా మమ్ము
పలువికారాల బెట్టి పనిగొన్న దేహమా" (1-416)

ఓమాయ దేహమా! మమ్ము పలువికారాలకు గురిచేసి ఎన్నోపనులు చేయించావు రోజురోజుకూ వయసు పెరుగుతుంది. శుష్కశరీరం రోజుకో రుచికోరుతుంది. మోహపాశాలతో కట్టివేస్తుంది. జాగ్రత్ సుషుప్తులతో పంచభూతాలపొత్తునీదే. సంసారదేహం వూరట లేనిది. కారణజన్మకలిగినది ఇంతే!

"వెదకిన తెలియదు వెనకముందరలు

పదమున నిలుపవె పరమాత్మా" (3-118)

ఓపరమాత్మా! జన్మజన్మల మధ్య సంబంధము ఎంతవెదకినా తెలియదు. కోరికలు అంతము లేకుండా సాగగా జీవులు జన్మిస్తూనేవుంటే తొలిజన్మ దూరమౌతుంది. శరీరమదం మాయగా ఆవరించగా జంతు సమానులైన జీవులు ఈకూపంలోనే పడి గడచిన ఛాయలు మరచారు. నీకరుణచేత శరణాగతి పొందిన ప్రాణులకు ఇహపరములు కరతలామలకమయ్యాయి.

"సర్వసులభుడితడు సర్వేశ్వరుడు

గర్వము బాసితేను కానవచ్చు నితని" (3-152)

సర్వేశ్వరుడు సులభుడు గర్వము వీడితే అతడిని చూడవచ్చు.

"ఏడే జానలు ఈ దేహంబు ఏడానికమరి యెరుగమునేము" (3-325)

ఏడు జానల శరీరానికి ఇతరమేమీపట్టదు. సముద్రాలన్ని నిముషంలో నిండిపోతాయి కానీ మనసు నిండదు. పంటలన్నీ పండుతాయిగాని నాలోని పాపపు మనసు పండదు. పామును పట్టవచ్చుగానీ వయసుపట్టలేము. అగ్ని నీటితో చల్లారుతుందిగానీ కోపముచల్లారదు. పాతాళమైన చూడవచ్చుగాని నా చరమగడియ కానరాదు. చిన్నచిన్న మాటలతో అన్నమయ్య వేదాంతసారాన్ని రంగరించి పోశాడు.

"బోధకు లెవ్వరులేకభోగినైతిని

శ్రీధరుడే మాకు దిక్కు చింతింప నికను" (1-465)

బోధించేవారు లేక భోగినయ్యాను. మాకింక శ్రీధరుడే దిక్కు. బాల్యమున దిగంబరుడనై పాలే ఆహారంగా జీవించాను. పంచేంద్రియాల దారి విడిచాను. సన్యాసిగా పుట్టాను నడుమ సంసారినయ్యాను. అన్నిమరచి ఏకాంత సమాధిలో నిద్రాభ్యాస నిర్మల యోగినయ్యాను. మరలా మేలుకొని కర్మినయ్యాను. వేవేలకోరికలతో బ్రహ్మాండమంతా నిండి భావాన్ని వదిలి పెట్టాను. శ్రీవేంకటేశ్వరుని చేరి తన్మయుడనై జీవన్ముక్తుడనయ్యాను.

"జ్ఞానంబొకటె జగమున కధికం మరి

నానా విధములు నటనలు" (4-231)

ఆలోకంలో నానానటనల కంటె జ్ఞానమే అధికము. దానాల ఫలాలకంటె లోకంలో

వైరాగ్యం గొప్పది. వేయికర్మలకంటె హరిభక్తి అధికము. తపస్సులకంటె శాంతము ఘనము. ఆచారాలకంటె హరినామ కీర్తిన అధికము. వ్రతలన్నింటికంటె వైష్ణవమే శ్రేష్టము.

"మూడేమాటలు మూడు మూండ్ల తొమ్మిది
వేదుకొని చదువరో వేదాంత రహస్యము" (2-233)

వేదాంతంలో రహస్యాన్ని మూడుముళ్ళు తొమ్మిది అనే సంకేతంతో అన్నమయ్య అందించాడు. జిజ్ఞాసువులు దానిని తెలుసుకోవాలి. జీవుని స్వరూప మెలాంటిదో చింతించాలి. దేవుని వైభవం తెలుసుకోవాలి. తనలోని జ్ఞానాన్ని తప్పక భావించాలి. వైరాగ్యాన్ని జీవిత సారమని గ్రహించి మరవకుండాలి. ఆచార్యునిపై నమ్మకం కలిగివుండాలి. శరణాగతి ముఖ్యసాధనమని అనుష్టించాలి. ఇదే శాశ్వత బ్రహ్మానందానుభవం. జీవుడు, దేవుడు, ప్రకృతి, జ్ఞానము, భక్తి, వైరాగ్యము, ఆచార్యవిశ్వాసము, శరణాగతి, భగవద్దాస్యము ఇవి ఆ తొమ్మిది.

"వెదకిన నిదియే వేదాంతార్థము
మొదలు తుదలు హరిమూలంబు" (4-436)

ఓ జనులారా! వేదాలలో సారము యిదే! వినండి అన్ని అవయవాలలో శిరస్సు ప్రధానమైనట్లే దేవతలలో శ్రీహరియే ప్రధానము. ఇంద్రియాలు ఎన్నివున్నా మనస్సు ప్రధానం. మతాలన్నింటిలో హరిమతం మూలం. వేంకటేశ్వరుని నామమే సర్వమంత్రసారము.

" ఎంత చేసిన తనకేదితుద
చింత శ్రీహరిపై చిక్కుటేచాలు" (1-98)

ఎన్నిగొప్పపనులు చేసినా అంత్యము తెలియదు. శ్రీహరిపై మనసు వుంచితేచాలు. పుణ్యాలెన్ని చేసినా అంత్యమేకాక చివరేది? హరియే దైవమని మనసులో దిటువుగా వుంటేచాలు. తపస్సులెన్ని చేసినా వనజాక్షునిపై మనసువుంచితేచాలు. ఎన్నివాదనలుచేసినా వేంకటపతి మహిమల పొడవేచాలు.

"తప్పదుతప్పదు దైవముకృపయిది
ముప్పిరినింతా ముకుందుడే" (1-371)

కష్టకాలంలో ముకుందుడేశరణ్యము. దైవకృపతప్పదు. మనస్సులో వెలితి తీరితే ఎక్కడ చూచినా ఈశ్వరుడే. ఆశాపాశము కోసివేస్తే అడుగడునా నిధానమే. శరీర భోగాలు వదిలిపెడితే పాపాలు సుకృతాలౌతాయి. విషయ వాంఛలకు దూరమైతే యిహలోకమే పరము. వేంకటపతి సేవకలిగిన ప్రపన్నులకు ముక్తికి సందేహము లేదు.

"సకలము జదివిన శాస్త్రములెరిగిన
శుకధ్రువాదులిటు చూపినది" (3-488)

సకలశాస్త్రాలు చదివిన శుకుడు ధ్రువుడు మొదలైన వారు చూపిన త్రోవయిదే. ప్రతి పుట్టుకకు ప్రకృతి వేరే. లోకంలో నామరూపాలు వేరే. కప్పిన నీమాయ గడచిపోయినది. నీదాస్యము ఎప్పుడూ ఒక్కటే. మతాల మార్గాలు వేరే. నీశరణు మాత్రమే మోక్షాన్నిస్తుంది. జాతుల ఆచారాలు వేరయినా మోక్షము ఒకటే. లోకంలోని మతాలు ఆచారాల పేర జరుగుతున్న వాదోపవాదాలను ఎత్తిచూపుతూ అన్నమయ్య ఈ కీర్తన వ్రాశాడు.

"దొరకునా యితనికృప తుదిపదంబు
అరిది విభవము లొల్లమనినా పొదలు" (1-358)

సంపదలు వద్దనినా భగవంతుని కృపతో మోక్షము లభిస్తుందా! సంపదలన్నీ లభిస్తాయికాని స్వామి కరుణ, కృప లభించడం అరుదు. సౌఖ్యాలు, కష్టాలు తొలగించే శక్తి ఇతనిపై భక్తికే వుంది. సమస్త భోగాలు సామ్రాజ్యాలు అతని దయవెంటనే తిరుగుతాయి.

"విడువ విడువనింక విష్ణుడ నీపాదములు
కడగి సంసారవార్ధి కడుమునుంచుకొనిన" (4-206)

ఓదేవా! సంసార జలధిలో మునిగిన నేను నీపాదాలు విడువను. ఇంద్రియాలు నను చుట్టుముట్టి నందున నీయందు పరాకుగా వున్నాను. పాపాలు నలువైపులా పరుగులు తీయించగా తనువు డస్సిపోయింది. అనేకమార్లు జన్మించినా ముదిమిపై కొన్ని సంసారబంధాలు చుట్టుముట్టినా అంతరాత్మబంధం ద్వారా నీకు-నాకు పోదు. ఈదేహంలో కాని మరో దేహంలో కాని ముక్తి లభించినా నిన్నే శరణు వేడుతాను.

"విడువవో మాయా విష్ణువధీనము
ఒడలిది నీకెందు నునికేలేదు" (3-424)

ఓమాయ విష్ణుని అధీనమైన ఈశరీరంలో నీకు చోటులేదు. నన్ను విడువు. భగవత్స్మరణ చేసే నానాలుకపై ఏ పాపాలకు చోటులేదు. గోవిందుని తలచే మనసులో కోపానికి తావులేదు. హరికథ వినే చెవులకు కలిదోషాలు లేవు. అచ్యుతుని శరణుగొన్న జన్మకు దుఃఖాలులేవు. దైవాధీనమైన మనస్సుకు కర్మపు పనులేలేవు.

"మాయామోహము మానదిది
శ్రీయచ్యుత నీచిత్తమేకలది" (3-566)

ఓ అచ్యుతా! నిన్నేతలచే నాచిత్తము మాయామెహాన్ని మానడం లేదు. ఎంత వెలుగునకు అంతేచీకటి. ఎంత సంపదకు అంత ఆపద. చేసిన పనికి జీతము సరి. జన్మము మరణముతో సరి. దేహానికి ముసలితనంతోసరి. ఈవిధంగా లోకంలోని సహజ ఉదాహరణలతో అన్నమయ్య తత్వబోధచేశాడు.

"పలికేటి వేదమెప్రమాణము
తలచిన వారికి తత్వము సుండి" (4-210)

భగవంతునిపలుకే వేదప్రమాణము. అదే పరమతత్వము. బ్రహ్మాండనాయకుడైన అతనిని దేవతలు స్తుతించారు. ఆయనను కొలువని వారు రాక్షసులు. ఆయనకు దేవతలు మొక్కుతారు. శుకాదులు, మన్మధుడు, బ్రహ్మదేవుడు ఆదైవ శిఖామణిని కొలిచారు.

"ఇతరచింతలిక నేమిటికి
అతడేగతియై అరసేటివాడు" (3-22)

అన్నిటికీ గతియై భగవంతు డుండగా ఇతర చింతలతో పనియేమి? కర్మకు ధర్మానికి అతడే మర్మము. ప్రపంచమంతా భోగమయం. ఇహపరాలకు ఆయన సహజకర్త. ఆశలు దుః ఖ భాజనాలు. అన్నిటా సమభావము సుఖకరము.

"శరణంబితడే సకలము నాకును
వెరవున మనసా వెతకవోయితని" (4-403)

ఓమనసా! ఈదైవమే నాకు సమస్తము. ఇతడే శరణము. అభయమొసగిన వాడు, కరివరదుడు, ప్రభువు, శరణాగతులకు రక్షకుడు, రాక్షసాంతకుడు, నాపాలి దేవుడు అతడే.

"ఎంత గాల మొకదా యీ దేహధారణము
చింతా పరంపరల చిక్కుపడవలసె" (1-316)

'వాసాంసిజీర్ణాని యధా విహాయ' అని గీతాచార్యుడు చెప్పినట్లు జీవాత్మ శిధిలదేహాన్ని వదలి కొత్త దేహాన్ని ధరిస్తుంది. మోహం వలన గర్భనరకాన్ని ఈదవలసివస్తోంది. పాపకర్మలవలన ఆపదలతో దేహాన్ని మోయవలసి వస్తోంది. భగవంతుని కరుణారసం లభించక నలువైపులా పరుగెత్తవలసి వస్తోంది.

" సహజవైష్ణవాచార వర్తనుల
సహవాసమె మాసంధ్య" (1-10)

సంధ్యావందనం మన సంప్రదాయంలో శ్రేష్టమైనది. అయితే దానికంటె మించి వైష్ణవ సహవాసం మంచిదని అన్నమయ్య చెబుతున్నాడు. శ్రీహరి సంకీర్తనయే మా సంధ్య. రామానుజ మతము, భాగవత పద సేవనము, హరినామశ్రవణము, తిరుమంత్ర పఠనము మాకు సంధ్య. ఇందులో అనుష్ఠానముకంటె ఆచరణమే ప్రధానమని నొక్కి చెప్పబడింది.

"తనకేడ చదువులు తనకేడ శాస్త్రాలు
మనసు చంచలబుద్ధి మానీనా" (1-198)

మనోనిగ్రహం లేనివాని చదువు సంధ్యలు వ్యర్థం. జడమతి అయినవాడు ఎంత చదివినా ఆశలు తరగవు. గుడ్డి కుక్క సంతకు బోతే దుడ్డుకర్ర దెబ్బలే దొరుకుతాయి. దేవతలను దూషించే వానికి పవిత్ర బుద్ధి కలగదు.

"తలమేల కులమేల తపమే కారణము
యలమి హరిదాసులు ఏజాతియైన నేమి? (15-285)

భక్తులకు కులమతాలతో పనిలేదు. విశాలమైన రావిచెట్టు కాకి రెట్ట నుంచి రాలేదా! గుల్లలోనుంచి ఆణిముత్యాలు రాలేదా! విషలతలో నుంచే విరుగుడు పుట్టలేదా! మహానుభావుల పుట్టుకతో పనియేమి? రాళ్ళలోనుండి వజ్రాలు, ఈగలనుండి తేనె, పిల్లి శరీరం నుండి జవ్వాది లభించినట్లే పుణ్యులు ఎక్కడ జన్మిస్తే నేమి? బురదలో తామర, పురుగు నుండి పట్టు వచ్చినట్లే జ్ఞానులు ఎక్కడ జన్మిస్తే నేమి? (పెదతిరుమలాచార్యుని కీర్తన).

"వెనకేదో ముందరేదో వెట్టినేను నా
మనసు మరులుదేర మందేదొకో"! (2-16)

జీవితము బుద్బుద ప్రాయము. రాబోయే జన్మలో సంపదలు కలగాలని నోములు నోస్తున్నాను. మరుజన్మలో ఎలాపుడతానో తెలియదు. నిద్రకు శయ్యను పరచుకుంటానుగాని లేస్తానో లేదో తెలియదు. తెల్లవారితే తెలుస్తుంది గాని, కల్ల-నిజము తెలియదు. కామినుల వలపులో మేను ముదిసినది తెలియదు. పాపాలతో బ్రతుకుతున్నాను గానీ చిత్రగుప్తుడు ఏమివ్రాస్తున్నాడో తెలియదు.

"త్రికరణశుద్ధిగా చేసిన పనులకు దేవుడు మెచ్చును లోకము మెచ్చును
ఒకటి కోటి గుణితంబగు మార్గమునుండగ ప్రయాసపడనేల?" (2-236)

మనసావాచా కర్మణా శుద్ధితో చేసిన పనులకు లోకం మెచ్చుతుంది. భగవంతుడు మెచ్చుతాడు. అంతశ్శుద్ధిలేని ఆడంబరాల వల్ల ప్రయోజనము శూన్యమ. మనసే పరిపూర్ణమైన గోదావరి. తీర్థయాత్రల వలన ప్రయోజనం లేదు. హరి అనే రెండక్షరాలు చెబితే ఫలితం తపోయోగానికంటె మించి కలుగుతుంది. వేంకటపతికి మొక్కితే యాగాలూ, యజ్ఞాలు చేసిన ఫలితం లభిస్తుంది. అనవసరకాయక్లేశం తగ్గుతుంది.

"శ్రీపతి యొకడే శరణము మాకును
తేప ఇతడే మరి తెరగేది?" (3-573)

శ్రీపతియే మాకు శరణ్యము. మరివేరు దిక్కులేదు. ఆత్మలో ఆశలుండగా సుఖమెక్కడిది. చేసిన పాపము చేతులలో వుండగా మోసపోకుండుట సాధ్యమా! కోపము సమీపంలోనే వుంది. ఇక సుఖ మెక్కడిది. పంచేంద్రియాల పాలబడ్డ దేహికి నిలుకడలేదు. శ్రీవేంకటేశ్వరుడే రక్షించాలి.

"హరినెరుగని జన్మమది యేలా!ఆ
సరుస నాతడు లేని చదువేల?" (2-414)

భగవంతుని తెలుసుకోలేని జన్మము ఆతని గురించి చెప్పని చదువు వృథా! దయలేని తపము, భయములేని భక్తి, క్రియలేని సంకీర్తన, ఫలములేని పనులు, కలిమిలేని గర్వము, బలములేని పంతము కుదరని దొరతనము వృథా! ఒకసారి శరణుకోరితే చింతలన్నీ దూరమౌతాయి.

"వెలినుండిలో నుండి వెలితిగాకుండి
వెలిలోను పలుమారు వెదకవేగాలి" (5-232)

పంచభూతాలలో వాయువు ప్రధానము. అది సర్వాంతర్యామి. లోపల బయట వుండేదానిని వెదకమని ప్రభోదిస్తున్నాడు. వెన్నెలకు ప్రాణము. కొలనులలోను, మల్లెలలోను, ఎండమావులలోను కొమ్మావిచిగురులలోను తమ్మిపూల తేనెలోనూ వుండేగాలి తిరుమలపై స్థిరంగా వుంటుంది. చలువలకు నెలవైన ఆగాలి విరహులను వేధిస్తుంది.

"కడు చంచలములు కడ నధృవములు
కడునల్పములని కాదందురు" (1-152)

చంచలములు అస్థిరములు అయినవి అల్పములని వేదాంతులు కాదంటారు. కర్మదూరులైనవారు మానసిక వికారాలు, దర్మతంత్రసంధానాలు కాదంటారు. భాగవతులైనవారు, బోధలెరిగినవారు కరుణాధికులు వీటిని కాదంటారు.

"వలెనను వారిదె వైష్ణవము ఇది
వలపు తేనెవో వైష్ణవము" (1-405)

వైష్ణవము ప్రేమతో కూడిన తేనెవంటిది. కోరికలు మరిచిపోయి వైరాగ్య భావము కలిగివుండటమే వైష్ణవము. తనలో కోపాన్ని పట్టుదలను వారించడమే వైష్ణవము. దేహపు సుఖదుఃఖాలలో చొరబడనిదే వైష్ణవము. ఇంద్రియాలకు దాసుడుకాకుండటమే వైష్ణవము. అన్ని ఉపాయాలను వదిలిపెట్టడమే వైష్ణవము.

మదమత్సరము లేక మనసు పేదైపో
పదరిన యాసల వాడు లోవైష్ణవుడు" (4-455)

శ్రీహరి దాస్యము ఒకటే నిజంగా సుఖాన్నిస్తుంది. ఆసంగతి నాకు తెలిసి నేను సరిగా ప్రవర్తించలేకుండా వున్నాను. చిక్కులలోబడి సంపాదించే కంటే పేదరికమే సుఖము. కష్టాలపాలైన పగలికంటె చీకుచింతలు లేని రాత్రియే సుఖము. అన్ని విధాలా గొప్ప వాడవైన వేంకటేశా! నీకిదేశరణు!

"ఇహపరములకును యిది సుఖము
సహజావస్తే జరగేటి సుఖము" (3-545)

సహజావస్తయే యిహపరాలకంటె సుఖము. శ్రీరమణుడే చింతలు పోగొడతాడని వూరకుండుటే ఒక సుఖము. దానంతట అదే వచ్చిన సంపదను తీసుకోవడం సుఖము. తన వశము కానటువంటి పనిని తలకెత్తుకొని శ్రమపడకుండుట సుఖము. శ్రీవేంకటేశ్వరుని శరణు కోరుకొనుటే సుఖము.

"ఎన్నడొకొ సుజ్ఞానము ఈయాత్మకు
కన్ను లెదుటివి చూచి కాలము నిట్టాయెను" (4-460)

కంటికి కనిపించినవి చూచి భ్రమపడి కాలము వృధా ఆయెను. ఈఆత్మకు సుజ్ఞానము కలిగేదెన్నడో! ఈశరీరము ఉచ్చిష్టాలలోను, హేయాలలోను సుఖాన్ని నమ్మి కష్టపడింది. మాయలునమ్మి పాపములో రుచులు నిజమనుకొంది. ఈజీవితమే కల్లయని తెలియక ధనమే సుఖమని నమ్మింది. ఇంద్రియలోలత్వంతో సంసార తాపత్రయంలో పడింది. ఈదొంగజీవుడు తొట్రుపడుతూ బ్రతికాడు. శ్రీవేంకటేశ్వరుడు మన్నించగా మోక్షాన్ని పొందాడు.

"వెన్న వట్టుక నేయి వెదక నేల మరియు
నెన్ని వలసినను దమ యేలేటివి కావా" (1-202)

వెన్నపట్టుకొని నేతికోసం వెదకడం ఎందుకు? విష్ణుచింతన క్షణమాత్రమైనను కలుగవలెగాని, భోగభాగ్యాలు తమ ఎదుటికి రావా! హరినామ మంత్రపఠనము గలిగితే సంపదలకు కొదువేలేదు. తిరుమలగిరిశిఖరాలను దర్శిస్తే నిత్యానందం కళ్ళ ఎదుటే వుంటుంది.

"పరమ యోగీశ్వరుల పద్ధతి యిది
ధరణిలో వివేకులు దలపోసుకొనుట" (2-148)

యోగమార్గాన్ని అనుసరించాలనుకునేవారు మొదట ఆత్మజ్ఞానాన్ని తెలుసుకోవాలి. తానొనర్చిన సత్కర్మఫలాలను దైవ సమర్పణ చేయాలి. ధ్యానంలో ఆసక్తి కలిగి విరాగియై ఉండాలి. యోగ సాధన సమయంలో భగవంతుని కథలు వినాలి. ఆచార్య సేవతో భాగవతుల దయకు పాత్రుడై సుఖించాలి.

"జ్ఞాన యజ్ఞ మీగతి మోక్ష సాధనము
నానార్థములు నిన్నే నడపె మాగురుడు" (2-148)

జ్ఞానయజ్ఞము మోక్షానికి ఉపాయము. దీనికి సంబంధించిన పనులు మా ఆచార్యుడు నిన్ననే నిర్వహించాడు. శరీరమనే యజ్ఞశాలలో అజ్ఞానమనే పశువును బంధించి వైరాగ్యమనే కత్తులతో కోసి జ్ఞానాగ్నిలో మాగురుడు వేల్చినాడు. భాగవతుల సభకు చేర్చి మాకు శ్రీపాద

తీర్థమనే సోమపానము అందించి సంకీర్తన సామగానంతో జ్ఞానయజ్ఞం చేయించాడు. గురుప్రసాదమనే హుతశేషాన్ని యిచ్చి వేంకటేశ్వరుని ప్రత్యక్షం చేయించాడు.

"భారమైన వేపమాను పాలు బోసి పెంచినాను
తీరని చేదేగాక తియ్యనుండీనా" (1-287)

ఎంత ప్రయత్నించించినా వికారములైన శరీరము, మనస్సు మారవని అన్నమయ్య చెబుతున్నాడు. వేపమానుకు పాలుబోసి పెంచినా చేదుమానదు. కుక్కతోక వెదురుతో కట్టినా వంకరమానదు. శరీరము ఎంత చెప్పినా వికారాలు మానదు. గొడ్డలిని నాన బెట్టినా మెత్తనకాదు. పంచమహాపాతకాల బారినబడ్డ మనస్సు లొంగదు. తేలును కోకలో దాచి పెట్టినా కుట్టక మానదు. దైవకృప వుంటే బాధలకు దూరమౌతారు.

"ఆశమీద విసువౌ దాక
గాసి బరుచు తన కపటమే సుఖము" (1-212)

ఆశవున్నంత వరకు కష్టకారణమైన భ్రాంతి తొలగదు. కర్మబంధాలు తెగేంత వరకు సంసారక్లేశాలకు అలవాటుపడి ఆలంపటమే సుఖంగా కనపడుతుంది. శరీరము చాలించేతంత వరకు తనరూపే సుఖంగా కనపడుతుంది. వేంకటేశ్వరుని కనుగొనేంత వరకు ఈభ్రాంతియే సుఖంగా కనిపిస్తుంది.

"వలపులధికము సేయు వైభవములు
తలపులధికము సేయుతలపోతలు" (1-146)

కోపాన్ని పెంచే కోరికలు. తాపాన్ని పెంచే తమకాలలో, మోహాలలో ఏమి అందముంది. మచ్చికను, ఇచ్చలను, అధికం చేసే హెచ్చరికలతో ఏమి అందముంది. అందాన్ని పొందులను అధికం చేసే వేంకటేశుని కృపయే అరుదు.

"మొదలుండ కొనలకు మోచి నీళ్ళు పోయనేల
ఎదలో నీవుండగా యితరములేల?" (1-466)

చెట్టును పెంచి ఫలాన్ని అనుభవింపతలచిన వాడు దానికుదురు వుండగా కొమ్మలకు శ్రమపడి నీళ్ళు పోయడం వృధా! హృదయంలో దేవుడుండగా ఇతర ఉపాయాలతో ముక్తికై ప్రయత్నించడం నిష్ఫలం. చంచలమైన మనస్సును నిరోధించి నియమబద్ధంగా వుందామంటే ఆకోరికలు కూడా నీమాయలే. ఇంద్రియాలు నీమహిమలోనివే. అంతా నీమాయకు, మహిమకు లోబడి వుండగా అటూ యిటూ పరుగిడి వ్యర్థప్రయాస లేల? పరమ ఫలాన్ని అందించే నిన్నే శరణు జొచ్చుతున్నాను.

"ఇట్టి సంసారి కేదియు లేదాయె
తట్టు వడుటే గాని దరిచేరలేదు" (4-26)

సంసారికి ఏ సుఖమూ లేదు. సంసారసాగర తీరాన్ని చేరడానికి వీలు చిక్కక బాధపడుతూనే వున్నాడు. బరువు మోసేవాడు అక్కడక్కడా భారాన్ని దించుకుంటాడు. సంసారికి ఆ అవకాశం లేదు. వేపచేదు తాగేవాడు మధ్యలో తీపి తినవచ్చు. సంసారంలో చేదు తప్ప తీపిలేదు. మురికిని కడిగేవాడు సుగంధ ద్రవ్యాలు పూసుకుంటాడు సంసార బంధాన్ని వదిలించుకునే అవకాశమే లేదు. ప్రకృతిబద్ధుడైన జీవి సృష్టికర్తను తెలుసుకోలేకుండా వున్నాడు.

"సడిబెట్టె కటకటా సంసారము జూడ
జలధిలోపల ఈత సంసారము" (1-199)

ఈ సంసారము ఎటువంటిదో అన్నమయ్య వివరిస్తున్నాడు. సముద్రములో ఈత, యముని నోటిలో బ్రతుకు, చమురులేని దివ్వె, యుద్ధ భూమిలోని ఉనికి సందిట గట్టిన తాడు, చంద్రుని జీవితమువలె హెచ్చుతగ్గులు, చల్లదనములోని వేడి, పూత పూసిన బంగారం వంటిది ఈ సంసారం. కానీ ఇలలో వేంకటేశునిదాసులకు చలువకే చల్లదనమైనది ఈ సంసారము.

"గోనెలె కొత్తలు కోడెలెప్పటివి
నానిన లోహము నయమయ్యీనా" (4-60)

పైన కప్పిన శరీరాలే కొత్తవిగాని ఆత్మలు పాతవే. ఇనుమును ఎంతగా నానబెట్టినా దాని గట్టితనము మెత్తబడదు. అజ్ఞుడనైన నేను నిన్ననేటిలో పరమార్థాన్ని తెలుసుకోగలనా! వాసనలకు నెలవైన నా చిత్తము నన్ను వెంబడిస్తూనే వుంది. శాస్త్రము ఎంత దారి చూపినా అజ్ఞానం చేత నేను గుణవంతుణ్ణికాగలనా? అంతర్యామియైన శ్రీవేంకటేశ్వరుడు వారిని దయదలచి కాపాడునే గాని వదలిపెట్టునా? జీవాత్మ తప్పుత్రోవలు తొక్కుచున్నదని ఇందలి మర్మము.

"ఇహమును పరమును యిందేవున్నవి
వహికెక్క దెలియువారలు లేరు" (1-492)

ఇహపరాలు యిక్కడేవున్నా తెలుసుకునేవారు లేరు. రాతివంటి ఈమనస్సు ఇతరులు బోధిస్తే కరగదు. జిగురువంటి ఈజీవశరీరానికి తగుళ్ళు ఎక్కువ. లంపటమే దినదినము వృద్ధిపొందుతుంది. గనివంటి ఈసంసారంలో తృప్తిలేదు. వేంకటపతి రక్షించేవాడు దొరికాడు గాన ఆదిఅంత్యము తెలిశాయి. ఇక భయమేలేదు.

"చదివి బతుకరో సర్వజనులు మీరు
కదిసి నారాయణాష్టాక్షర మిదియే" (4-33)

అష్టాక్షరిమంత్రము సర్వ సులభము. కులమత వర్గ భేదం లేకుండా ఈమంత్రపఠనానికి అందరూ అర్హులే. శుకుడు, వేదవ్యాసుడు వైష్ణవులు చదివినదే అష్టాక్షరి. మునులు బ్రహ్మ ప్రహ్లాదుడు చదివినదే ఈమంత్రము. దేవతలు విప్రులు చదివే ఈనారాయణాష్టాక్షరి ఇప్పుడు శ్రీవేంకటపతిగా కొలువబడుతోంది.

"మఱచితి మంటే మరిలేదు
తఱితో దలచవో మనసా" (4-412)

మానవజన్మ దుర్లభం. చావుపుట్టుకలలోపడి విలువైన కాలం హరించుకుపోతోంది. మధ్యకాలాన్ని నామస్మరణలో సద్వినియోగం చేసుకోవాలి. సూర్యోదయ సూర్యాస్తమయాల మధ్యకాలమే దినము. లోపల వెలుపల వున్న అంతర్యామి శ్రీపతి సృష్టి. ఆయన మహిమలను నమ్ముతూ ఆయననే తలచితరిద్దాం.

ఎంచిసేయుపను లికలేవు
కొంచక యాతని గొలుచుటే కొలది (4-50)

చేయవలసిన సత్కర్మలు యిక లేవు. భగవంతుని కొలుచుటే యిక చేయవలసినది. కర్మఫలము అనుభవింపక తప్పదు. దానిని గూర్చిన చింతవదలి భగవంతుని తలచుటే మార్గము. ఆయుష్షుకు అన్నానికి లంకె. దానికోసం వెతలెందుకు? అంతరాత్మను నుతించడమే శరణ్యము. ఇలలో కాపాడే అతనినే శరణు కోరుదాం.

"ఎంతటి వారలు నెవ్వరును హరి
చింతించక నిశ్చింతులు గారు" (1-32)

హరినామ స్మరణ లేక ఎంతటివారైనా నిశ్చింతులుకాలేరు. జితేంద్రియులు అనశనవ్రతులు తపోధనులు, దైవస్మరణ లేకుండా పుణ్యులు కాలేరు. శాంతులు ఆధ్యాత్మిక వేత్తలు, సోమయాజులు హరిస్మరణ లేక విబుధులుకాలేరు. పాపరహితులు, నిరతానందులు తిరుమలేశుని కొలువక బ్రహ్మలు కాలేరు.

"అప్పదుండే కొండలోన ఇప్పపూల ఏరబోతే
ఇప్పపూలుకప్పలాయరా ఓ వేంకటేశ
అప్పులు గలవానివలెనే ఓవేంకటేశా" (27-18)

మర్మగర్భమైన ఈ సుదీర్ఘ కీర్తనలో వీరబ్రహ్మేంద్రస్వామి వారి తత్వాలలోవలె యిందులో గూఢమైన తత్వ బోధవుంది. మహిమాన్వితుడైన స్వామికే ఎఱుక. అకాలంనాటి కొన్ని తాంత్రిక విద్యలను యిందులో చెప్పాడు. ఇప్పపూలు కప్పలుకావడం. ఆకాశనపోయే కాకులనుజూచి త్రిమతాలు వెలవడం, అహోబలంలో వలువలు మల్లెలు గావడం, చెట్టుకు బదులు తీగపాకి

కంచిలో కాయ గాయటం, పుట్టమీద చెట్టుకు పర్వతాన పండుపండటం. కాళ్ళులేనివాడు నడవటం వంటి అద్భుతాలను ఇందులో ప్రస్తావించాడు.

"విడువము మనసా వీరిడిచేతలు
తడయక శ్రీహరి తలచవోయికను" (4-216)

ఓ మనసా! చెడుతలపులు మాని శ్రీహరిని ధ్యానించు నేను ఎనభైనాలుగు లక్షల యోనులలో జన్మించి అనుభవించిన భోగములుండగా మరిఏమి గడిస్తాము. పదునాల్గులోకాలు చూచిన నేను యింకా తిరగడమెందుకు? లోకంలో పాపపుణ్యాల ఫలాన్ని అనుభవించాను. ఆవేంకటేశ్వరుడు నన్ను రక్షించగ ధన్యుడనయ్యాను.

"శ్రీహరి సేసిన చిహ్నాలివి ఈ
మోహము విడుచుట మోక్షమిది"

సృష్టిఅంతా శ్రీహరి గురుతులే! మోహాన్ని విడిస్తే మోక్షం. మలినము శుభ్రము అనేది ఈమలిన కాయానికేది? ఈమాయల జన్మకు  కలిమిలేములు లేవు. రోజూ ఆకలి తీరని శరీరమిది. కర్మబంధానికి లోనైన శరీరమిది. కోరికలు కొండలపొడవుగా వుంటాయి స్వామిని శరణంటే ఇహపరయోగ సాధనం.

"వేదం బెవ్వని వెదకెడినీ
ఆదేవునికొనియాడుడీ" (1-5)

ఆదిదేవుడైన మహావిష్ణువును వేదాలు కీర్తిస్తున్నాయి. సకల జీవులు ముసలితనంలో కొలిచే దేవుడు ఆయనే! విశ్వమంతా ఆయన చేతిలో ఒదిగివుంది. పితృదేవతలు ఆయనను కొలుస్తారు. ముల్లోకాలలోని వారు ఆయననే తలుస్తారు. అట్టి వేంకటపతిని వెదికి సేవించండి.

"ఊరకే వెదకనేల వున్నవి చదువనేల
చేరువనె ఉన్నదిదె చెప్పరాని ఫలము" (4-196)

భగవంతుని వెదుకనవసరం లేదు. శాస్త్రాలు చదవనవసరం లేదు. చెంగటనే చెప్పరాని ఫలమున్నది. కోపము విడిచిపెడితేనే పాపం పోతుంది. లోకం కోసం పైపై స్నానాలు చేస్తే పావనుడౌతాడా? కోరికలు పోతే బంధాలు వీడుతాయి. ఆశ మానితే కైవల్యం సిద్ధిస్తుంది. చిత్తము పరాయత్తమైతే వైకుంఠము లభించదు. కాంతా సుఖాన్ని విడనాడితే దుఃఖములేదు. హరిని శరణాగతి కోరకుంటే భవసంచితములు వదిలిపెట్టాయి.

"బాపురే నీమాయ భ్రమయించి జీవులకు
దాపున నున్నదే గాని దవ్వులకు జొరదు" (4-257)

స్వామీ! నీమాయ జీవులకు దగ్గరగా వున్నదేగాని దూరము కాలేదు. మోక్షము ముందున్నా దీక్షకు పూనుకోనీదు. ఆలుబిడ్డలుండగా నీపై భక్తి కలగనీదు. నానా యోనులలో జన్మించి కర్మములు శ్రమపెట్టగా వైరాగ్యము పొందనీదు. పంచేంద్రియాలు బలిసినందున నీ తిరు మంత్రము తలచుకో నీదు. నీదాసులైతే అన్నిటా జయమే!

"ఏమని విన్నవించేను యెన్నని కాచేవు నీవు
శ్రీమాధవుడ నీకు చేతికి లోనయ్యా" (4-208)

ఓస్వామీ ఎన్నని నీకు విన్నవించేను, నీవు మాత్రం ఎన్నినికాస్తావు. అంతా నీచేతి చలువ. పుట్టడం ఒక తప్పు. సంసారిని కావడం మరోతప్పు, దొరనుకావడం మూడోతప్పు. నా తప్పులను కావవద్దు. అన్నపానాలు కోరడం, కాంతాసంగమం, బంధుజనసంబంధం అన్నీ నాకు బంధాలే. పుణ్యపాపాలు నాకు రెండు సంకెళ్ళు నా తప్పులు దండంతో తీర్చు. ఇలా అన్నమయ్య ఆధ్యాత్మభావ సంపత్తిగల కీర్తనలెన్నో ప్రవచించిన ప్రవక్త.

"ఏకులజుడేమి ఎవ్వడైన నేమి
ఆకడ నాతడే హరినెరిగినవాడు" (1-292)

అనంతకాలగమనంలో కులగోత్రాలు లేవు. ఏకులానికి చెందినా సత్యసంపన్నుడై పరనిందసేయక, భూతదయ గలిగి, నిర్మలుడై ధర్మబుద్ధిగలిగి కర్మమార్గమును విడువక హరి భక్తి గలిగి వేంకటేశుదాసుడైతే చాలు. అతడే హరినెరిగినవాడు.

"కడునడుసు చొరనేల కాళ్ళు కడుగగనేల
కడలేని జన్మసాగర మీదనేల" (1-251)

సంసార సాగరం కడలేనిది. అది అడుసుతో సమానం. బురదలో కాలు పెట్టడమెందుకు మరలా ఆ బురదను వదిలించుకోవడానికి కడుగుకోవడమెందుకు! మరల మరల మమకారము ఆశ, మోహము అనే వందలని బంధాలు దుఃఖహేతువులు. సర్వకర్త యైన వేంకటేశ్వరుని చింతించమని జ్ఞానబోధ.

"ఎంత విభవము గలిగెనంతయును నాపదని
చింతించ నదిగదా చెడని జీవనము" (1-181)

ఎంత ఐశ్వర్యము వుంటే అంత ఆపదని గ్రహించాలి. తన కోపమే శత్రువు, పరనిందేమృత్యువు. ఇంద్రియ విషయములే మెదనున్న ఉచ్చులు. ఆశయే భూతము, శ్రీవేంకటేశుడే దైవము నిరంతరము అతని సేవాభాగ్యమున వుండుటయే మంచి జీవనము.

"దిబ్బలు వెట్టుచు దేలిన దిదివో
ఉబ్బు నీటిపై నొక హంసా" (1-16)

ఇది హంసపదం, తత్వబోదార్ధకం, యోగులను పరమాహంసలంటారు. హంసకు కమలములందు విహారము (పరబ్రహ్మకు కమల - లక్ష్మితోడి విహారవు) పరమాత్మజీవుల మానస సరస్సులలో వివరించేహంస. పాలునీరు వేరుచేసే గుణం హంసకు వున్నట్టే పరమహంసలు మంచి చెడులను గుర్తిస్తారు. ఒక్కొక్కరోమకూపము నుండి వ్యక్తమగు బ్రహ్మాండములను పొదిగి సృష్టిని నడుపుతాడు పరబ్రహ్మ. అదియే వేంకటగిరి మీదనుండే హంస.

"పాపపుణ్యముల పక్వమిదెరగను
నాపాలిటిహరి నమోనమో" (4-100)

ఓ స్వామి! పాపపుణ్యముల గురించి నాకంతగా తెలియదు. అయినా నీవు నాపాలిట వుండగా వాటితో అవసరములేదు. త్రికరణములుగా త్రినంద్యలలో నేను నీకు దాసుడను. నీకుశరణాగతడను. నీవేనాకు దిక్కు

"ఎరిగే నెరగదు యేమిసేతుమతి
హరిదాస్యం బదియే సుకము" (4-455)

శ్రీహరి దాస్యము ఒకటే నిజంగా సుఖాన్నిస్తుంది. ఆ సంగతి తెలిసి నేను సరిగా ప్రవర్తించలేకుండా వున్నాను. చిక్కులలో బడి సంపాదించే కంటే పేదరికమే సుఖము. కష్టాలపాలైన పగటికంటె చీకు చింతా లేని రాత్రియే సుఖము. అలమటించి సాధించిన అమృతముకంటె కలిగిన గంజేసుఖము. అన్ని విధాల గొప్పవాడివైన వేంకటేశా! నీ శరణుపొందే నాజన్మమే సుఖము.

"ఇహపరములకును యిది సుఖము
సహజావస్థే జరిగేటి సుఖము" (3-545)

సహజావస్థయే యిహ పరాలకంటె సుఖము. శ్రీరమణుడే చింతలు పోగొడతాడని వూరకుంటే ఒక సుఖము. దానంతటఅదేవచ్చిన సంపదను తీసుకోవడం సుఖము. తన వశము కానటువంటి పనిని తలకెత్తుకొని శ్రమపడకుండుట సుఖము. శ్రీవేంకటేశ్వరుని శరణుకోరుకొనుటే సుఖము.

"కడవరాదు హరి ఘనమాయతెగి
విడువరాదు వేసరరాదు" (3-496)

హరిమాయ దాటరానిది. ఈ పాపపుణ్యముల ప్రపంచము ఎంతో ఆశ్చర్య జనకమైనది. ఈ సంసారభోగములు రోజూ కొత్తకొత్త రుచులతో తీపులు పుట్టిస్తున్నాయి. జననమరణముల ఈ శరీరమును అంటిపెట్టుకొని బంగారు కోరికలనే కర్మలు తిరుగుతున్నాయి. అయినా మన సుకృతమువలన మోక్షమునకు దగ్గరదిగా హరినామము దొరికిన నాలుకవెగటు తీరి వేంకటపతి లభించాడు.

# అలమేలుమంగ సొబగులు - శృంగారం

అన్నమయ్యకీర్తనలలో అలమేలుమంగ అంతరంగాన్ని ఆవిష్కరించిన సందర్భాలు ఎన్నో వున్నాయి. అందులో ఆమె సొబగులు, సొగసులు, సౌకుమార్యం, శృంగారాభిషేకము వర్ణించబడ్డాయి. మచ్చుకుకొన్ని (షుమారు వంద కీర్తనలు)

కలదింతె మాట కంతునియాట
తెలుసుకో నీలోనిదియె పూటపూట" (9-16)

ఈకీర్తనలో అలమేలుమంగను చరణంలోని మొదటిరెండు పంక్తులలో వివిధ విశేషణాలతో పొగడి మిగతారెండు చరణాలలో ఆమెకు సూచన లిచ్చాడు. ఓ అలమేలుమంగా! నిత్యమూ మదన కేళిలో తేలియాడటం నీవంతు. నీచెలువుడు నిన్ను చేరగానే మన్మథబాణాలు వాడిగా వేడిగా తగిలాయి. నిన్ను కలియడానికి నీపతి రాగానే చిలుకలు ముద్దుపలుకులు పలుకుతున్నాయి. శ్రీవేంకటేశ్వరుడు నిన్ను కూడగానే ఆలోచనలన్నీ ఒక చోట కూడాయి. అలమేలుమంగకు వాడిన విశేషణాలివి. హరి అంతరంగ, కలిత నాట్యరంగ, కరుణాపాంగ, అలినీల వేణి, అంబుజపాణి, జగదేకవిభునిరాణి వంటివి. ఇవి శబ్దాలంకారశోభితములు.

"కులుకక నడవరో కొమ్మలారా
జలజలరాలీని జాజులు మాయమ్మకు" (5-73)

అలమేలుమంగను పల్లకీలో మోస్తున్న ముద్దుగుమ్మలను అన్నమయ్య హెచ్చరిస్తున్నాడు. ఓకొమ్మలాల! వయ్యారంగా నడవకండి. అమ్మ విరులు జలజల రాలిపోతున్నాయి. నుదురు చమర్చి పాపటలో చల్లిన గంధవొడిజారుతున్నది. ముత్యాల కుచ్చులు అదురుతున్నాయి. అమ్మపల్లకి దిగింది. వెంటనే పాదరక్షలు అందించండి. మణుల ఆరతులు ఎత్తండి-అని చెలికత్తెలను అన్నమయ్య సేవకు పురమాయిస్తున్నాడు. ఈకీర్తనలో ఒక వర్ణ చిత్రాన్ని గీశాడు అన్నమయ్య. ఆడబోయీలు మోస్తున్న పల్లకి, వారి వయ్యారపు కదలికలు, అలమేలుమంగ సున్నిత శరీరం నొచ్చడం ఎంత అందంగా, సుందరంగా వర్ణించబడ్డాయి!

"ఏమొకో చిగురుటధరమున యెడనెడ గస్తురి నిండెను
భామిని విభునకు వ్రాసిన పత్రిక కాదుగదా" (5-82)

అలమేలుమంగాశ్రీనివాసుల రతిక్రీడలను తెలుసుకున్న చెలికత్తెలు అమ్మను ఆటపట్టిస్తున్నారు. చనవుతో చెలిని హెచ్చరిస్తున్నారు. ఏమమ్మా! నీపెదవుల నంటిన కస్తూరి ఎక్కడిది అది నీవు విభునికి వ్రాసిన పత్రిక కాదుగదా! నీకడగంటి చూపులలో ఎర్రదనం వలపుబాణాలను వెలికీ తీయగా ఏర్పడిన నెత్తురు కాదుగదా! చనుగవపైన ప్రియుడు వొత్తిన

నఖశశిరేఖల వెన్నెల కాదుగదా! చెక్కులపై శృంగారం అతివేలంగా వర్ణించబడింది. దాని ఛాయలు. యిందులో - కూడా ప్రతిబింబించాయి. నాయికానాయకుల సరసశృంగారాన్ని అతి మనోహరంగా వర్ణించడం యిందులో ప్రత్యేకత. అధరము, కనులు, చనుగవ, చెక్కులు శృంగారంలో ప్రధానం.

"అలరులుకురియగ నాడెనదే
అలకల గులుకుల నలమేల్‌మంగ" (5-24)

ఇది నాట్యానికి అనువైన కీర్తన. అమ్మవారు నాట్యం చేస్తున్నట్లుగ అన్నమయ్య ఒక వూహా చిత్రం గీశాడు. ఆమె కొప్పులోని విరులు జలజల రాలాయి. ముంగురులు అల్లలాడాయి. హరికి ఆనందాన్ని కలిగిస్తూ ఆమె నాట్యం చేసింది. కాళ్ళ అందెల మెరుగులు అందాలు చిందుతున్నాయి. ఆమె చిందునృత్యం చేసింది. వేంకటపతి మెచ్చగా అందంగా అందెలమోతలతో ఆడింది.

"మూసిన ముత్యానకేలే మొరగులు
ఆసల చిత్తానకేలే అలవోకలు" (5-125)

అమ్మ సహజ సుందర వర్ణన యిందులో ఉపమానాలతో వర్ణించబడింది. జగదేక సౌందర్య రాశియైన ఆమెకు అలంకారాలు అనవసరం. దానిని ఎత్తి చూపుతూ యిలా అంటున్నాడు అన్నమయ్య. మూసిన ముత్యానికి మొరగులేల! అందాలమోముకు కస్తూరి ఏల? కొప్పునకు చేమంతు లేల? కమ్మని నీమేనికి గంధమేల! ఘనపయోధరాలకు పయ్యదేల! మీయిద్దరికలయిక అత్యద్భుతం.

"చక్కని తల్లికి చాంగుబళా తన
చక్కెర మోవికి చాంగుబళా" (5-107)

ఇది అమ్మవారి సౌందర్యాన్ని కీర్తించే జానపద సంకీర్తన. అమ్మచూపులు, పలుకులు, అలుకలు, చక్కెర మోవి, వయ్యారపు నడక, భంగిమ పయోధరాలు అన్నీ 'భళా' అన్న రీతిలో వున్నాయి. ఆమె మురిపెపు చూపులతో, పలుకుల సొలపుల అలుకలతో, పతి పక్కన చనుమెరుగులతో నిలుచుంది. ఆమె మెడలో ముత్యాలసరులు ఆడగా తన సందిట వేంకటవిభుని పెనవేసింది. ఒక నాట్య కళాకారిణి వయ్యారంగా నడచివచ్చి తనపతిని సందిట బంధించినట్లున్న అద్భుత వర్ణచిత్రమిది.

"జయలక్ష్మి వరలక్ష్మి సంగ్రామ వీరలక్ష్మి
ప్రియురాలవై హరికి బెరసితివమ్మా" (19-520)

శ్రీలక్ష్మి అనేక పాత్రలలో హరికి యింపు గూర్చింది. జయలక్ష్మిగా వరలక్ష్మిగా, వీరలక్ష్మిగా లోకాల నేలింది. పాల సముద్రములోని తేటమీగడ, తామర పూవులలోని పరిమళము

గుబాళించగా శ్రీహరి వక్షస్థలంపై కొలువతీరింది. చందురుని తోబుట్టువు, బ్రహ్మాదులను గాచే కల్పవల్లి, గోవిందునికి తోడునీడగా వుండేయిల్లాలు మాయింటనే వుండవమ్మా! పదహారు వన్నెల బంగారు బొమ్మ, వేదమాత అయిన ఓతల్లీ! మేము నీవారము. సకల సంపత్ర్పదాయిని అయిన జయలక్ష్మిని యిందులో వివిధరకాలుగా అన్నమయ్య స్తుతించాడు.

"జవ్వాది మెత్తినది తన
జవ్వనమే జన్నె వట్టినది" (5-316)

ఓ వేంకటరాయా! ఈ ఎలజవ్వని నీకోసం జవ్వాదిపూసుకొని తన యవ్వనాన్ని నీకు మీదు గట్టింది. ముద్దు పలుకులతో చెక్కుటద్దాల కాంతి మీరగా తళుకు చూపులతో చెలియపై వొరగి నిలుచున్నది. ఈ పుత్తడి బొమ్మ తన చిత్తాన్ని నీసొమ్ముచేసింది. ఈ గుబ్బచన్నుల గుమ్మ మదనుని ధిక్కరించినది. ఈమె చిరునగవులు చిందిస్తూ నీకమ్మని కౌగిట పరవశించింది. ఇక్కడ అలమేలుమంగ అతిశయ సౌందర్యాన్ని అన్నమయ్య చిత్రీకరించాడు.

"మెఱుగ వంటిది యలమేలుమంగ
అతిమురి నవ్వీని అలమేలుమంగ" (19-355)

శ్రీవేంకటేశా! మెరుపుతీగవంటి అలమేలుమంగ చిరునవ్వులు చిందిస్తోంది. నీమీది ప్రేమతో సన్ననిస్వరంతో నీమీద పాటలు పాడుతోంది. చెలులతో నీసుద్దులే చెప్పి అలసిపోతోంది. నీరాక కోసం మేడమీద ఎదురుచూసి వాడిన మోముతో నీపై వలపుజల్లి నాట్యమాడుతోంది. ఆరితేరిన ఈమె నీప్రియాలు చెప్పిచెప్పి నేడు నిన్ను కూడినది.

"పరమాత్ముడైన హరి పట్టపురాణివి నీవు
ధరమమ్ము విచారించదగు నీకు నమ్మా" (20-36)

హరికి పట్టపురాణివి నీవు. మాక్షేమాన్ని చూచే చల్లని తల్లివి. బ్రహ్మమన్మథాది దేవతలను కన్నతల్లివి. అందువల్ల నీవు బిడ్డలగూర్చి తండ్రికి చెప్పగల దయగల దానివి. కామధేనువు కల్పవృక్షము చంద్రునితో పుట్టినదానవు. నీభర్త అనుమతితో ఆశ్రితులకు సంపదలిస్తున్నావు. దానంలో నీకు నీవేసాటి. పాలసముద్రంలో పుట్టిపద్మంలో నెలకొన్న నీవు క్షీరసాగర శయనుని దేవేరివి. ఇహపరసౌఖ్యాలు కలిగించే భక్తులపాలి భాగ్యదేవతవు.

"విరహపు రాజదె విడిదికి రాగా
సిరుల జేసె నిదె సింగారములూ" (6-71)

ఇందిరావిభుడు విరహియై తనవిడిదికి రాగా ఆమె సింగారాలుపోయింది. మదనుడు ఆమె నుదుటిపై నీలపుకురులు అనే తోరణం కట్టాడు. ఆమె శరీరంపై మొలక చెమటలనే ముత్యాలముగ్గులు తీర్చిదిద్దాడు. చింతాలతనే పందిరిగా చేశాడు. శరీర పరిమళాలు మదనుడు

సరి జోడు కట్టించాడు. వేంకటవిభునిపై ప్రేమను ఆమె బోనాలుగా పెట్టింది. తన అలుకలతో విభునికి చవి చూపినది. ఇక్కడ విరహోత్కంఠితమైన నాయిక సరిజోడు అయిన నాయకుడు వర్ణించబడ్డారు.

"పలుకుతేనెల తల్లి పవళించెను

కలికి తనముల విభుని, గలసనది గాన" (6-74)

రతిశ్రమానంతరము అలమేలుమంగ పగటిదాకా శయనించినది. తన మోముపై కురులు చెదరినవి. సఖులు శయనమందిరం చేరి ముసిముసినగవులతో గుసగుసలాడటం ఇందులో విశేషం. తల్లి తాళ్ళపాక వారి ఆడపడచు. అందుకే ఆమె కందిపోతుందేమోనని బంగారు మేడలో శయనమందిరం సృష్టించి ముత్యాల పాన్పు అమర్చాడు. ఆమె కొంగు జారింది. గుబ్బల మెరుగులు వ్యాపించాయి. అతడా అంగజగురుడు. ఇక నిద్రపోయే అవకాశమేముంది? కనుగొనలలో సిరులు తొలకాడాయి. ఆమె పారవశ్యంతో ముత్యాలపాన్పుపై పవళించింది. వేంకటేశ్వరుని బిగికౌగిట నలిగి ఆమె మేన చిరుచెమట వ్యాపించినవి. సగము విచ్చిన పూవువలె ఆమె పవ్వళించినది.

"నవరసములదీ నళినాక్షి

జవకట్టి నీకు జవిసేసీని" (7-282)

ఈకీర్తనలో అలమేలుమంగను నవరస సమ్మేళనంగా ఇందులో చిత్రించాడు. ఈనళినాక్షి నవరసములు దీపింపగా నీకోసమే జవగట్టి చవిచూపుతున్నది. ముఖమున శృంగారము, నఖముల వీరము, పెదవుల కరుణము, కుచముల అద్భుతము, సెలవులహస్యము, నడుమున భయము కన్నుల భీభత్సము బొమలలో రౌద్రము రతులలో శాంతము కూడగా నవరసములకు తోడు మోహము పదియవ రసముగాకాగా నీవామెనుకూడి సంతోషరసమును కూర్చినావు. ప్రబంధనాయికల అంగాంగ వర్ణనలకు దీటుగా ఈరచన సాగినది.

"మిక్కిలి మేలుది అలమేలు మంగ

అక్కరతో నిన్నుజూచీ నలమేలుమంగ" (19-28)

అలమేలుమంగా శ్రీనివాసుల సరససల్లాపాలను యిందులో చిత్రించాడు. ఓ వేంకటేశా! సర్వాంగ సుందరమైన అలమేలుమంగ నీవైపు క్రీగంటచూచి పాటలు పాడింది. నెచ్చెలులతో నీగుణాలే పొగిడింది. నీవు వీధివీధులా తిరుగుతున్నప్పుడు మేడలెక్కి చూచింది. నీవు కర్పూరవీడెము చేతబట్టుకొని పిలువగానే నీ నీడకు చేరినది. నీవిచ్చిన చనవును ఆసరాచేసుకొని తననేర్పులు ఆలోచనాత్మకం చేసింది. నీరతులలో మేలమాడింది.

"గంధము పూసేవేలే కమ్మని మేనయీ
గంధము నీమేనితావికంటె నెక్కుడా" (5-2)

ఓచెలీ! నీకు అలంకారాలు అక్కరలేదు. నీమేనితావికంటె గంధము ఎక్కువకాదు. అద్దమువంటి నీమోమునకు మరి అద్దమేలా? నయనకమలాలకంటె తామరలు ఘనం కాదు. బంగారపు నీమేనికాంతికి ఆభరణాలేల? నీవేలిగోళ్ళకు మణులు సరిగావు. మరి వుంగరాలేటికి? నీకొప్పునకు సవరమేజడియు. నీకెమ్మోవిరుచికి చవులు వెలవెలపోతాయి. ఉపమానాలలను ఉపమేయం కంటె తక్కువగా చెప్పి ఒక కొత్త సొగసును తెచ్చాడు అన్నమయ్య.

"విచ్చేయవమ్మా వెన్నెల బొమ్మా
మచ్చిక మరునిధాక మగువనీరాక" (6-104)

ఓ వెన్నెలబొమ్మా! నీరాక మన్మధునిధాక. ఇక విచ్చేయవమ్మా! సిగ్గుదొంతరలతో వలపుతీపులతో రావమ్మా! నీమాట కోకిల స్వరం వంటిది. నీమోవి తళుకు చెంగావి. నీకదలికలకు గుబ్బల జావ్వాది కరగి మదనుడు రొదలు చేస్తున్నాడు. నీ ముద్దుల నగవు, రతిబిగువులో మోహము, రతిసాము, అద్దపు నీమోములో కనిపిస్తున్నాయి.

"చూడరమ్మ చెలులాల సుదతి చక్కదనాలు
కూడుకొన్న పతికాంతి గురులే పోలెను" (20-197)

సముద్రరాజ తనయమైన అలమేలుమంగను సముద్రము నుండి పుట్టిన వస్తువులతో యిక్కడ పోలుస్తున్నాడు. ఓ చెలులార! ఈ సుదతి చక్కదనాలు చూడండి. ఆమె ముఖము చంద్రునివలె వున్నది. అతడు తమ్ముడే గద! ఆమెనగవు అమృతమువలె నున్నది అది పుట్టినింటి ధనమే గద! ఆమెగుణము సముద్రమువలె గంభీరంగా వుంది అతడు తండ్రిగదా! కన్నులు గండు మీనముల వలెవున్నాయి. అవి సముద్రములోనివే గద! ఆమెపాదాలు కల్పతరువు చిగురు వలె వున్నాయి. ఇంతటి పుట్టింటి సౌభాగ్యము ఆమెకు లభించి శ్రీవేంకటేశ్వరుడు ఆమెను పెండ్లాడి సరసుడైనాడు.

"ఇన్నిరాసులవునికి యింతి చెలువపురాశి
కన్నె నీరాశి కూటమి గలిగినరాశి" (5-143)

మేషాది ద్వాదశరాసులతో అలమేలుమంగ సౌందర్యాన్ని యిక్కడ వర్ణిస్తున్నాడు. ఆమె సౌందర్యరాశి. అన్ని రాసులు కలబోసినకూటమి. ఆమెకనుబొమ్మలు ధనురాశి, కనులు మీనరాశి. కుంభములు కుంభరాశి. నడుము సింహరాశి పైయదలోని మకరాంకము మకరరాశి. కన్యప్రాయము కన్యారాశి. బంగారంతో తులతూగే ఆమెవన్నె తులారాశి. వాడి గోళ్ళు వృశ్చిక రాశి. ఒరపులు వృషభరాశి, గుట్టుమాటలు కర్కాటక రాశి. చిగురుమోవి మేషరాశి. వేంకటపతితో

కలిసి వారిరువురు మిధునరాశి.

"పలుకు తేనియలను పారనియ్యవే
అలరు వాసనల నీ యధర బింబానకు" (5-221)

ఓతల్లీ! నీఅధర బింబాన వాసనలతో బాటు పలుకు తేనెలను పారనీ! ముఖ చంద్రునికి పుక్కిటి చిరునగువు చూపించు. నీచెక్కుల మెరుపులకు వాలుగన్నుల హారతి నెత్తు? నీవూర్పులకు నీమేని తావికానుకగా యిమ్ము. నీతీగమేనికి చెమటల స్నానం చేయించు నీతలపోతలతో నీహృదయేశుడైన వేంకటేశుడు పరవశుడవుతాడు. ఇందులో ఉపమానాలు శృంగారాత్మకము.

"అలమేలు మంగను నేనైతే నయితిగాక
నిలుచుండి నిన్ను జూచి నీకేల లోగను". (18-31)

సపత్నీమాత్సర్యంతో వేరొకతెను దెప్పిపొడుస్తోంది- అలమేలుమంగ. నేను అలమేలుమంగనే అయితే నన్ను చూచినీకేల బెరుకు. అతిగా ప్రేమించిన నీకు సిగ్గుపడటం దేనికి? ఎప్పటినుండో ఎదురుచూచిన నీవు నన్నుచూచి ఏల బిడియం. అతిశయించిన మోహంగల నీవు లోపలదాచుకోకుండా గట్టిగా నవ్వు. ఎంతో ఆశపడిన నీవు ఆవేంకటేశుని కౌగిలించుకొని అతని కూడియాడు.

"నెలమూడు శోభనాలు నీకునతనికి దగు
కలకాలమును నిచ్చకళ్యాణ మమ్మా" (7-280)

తిరుమలలో నిత్యకల్యాణం పచ్చతోరణం. ఆకల్యాణానికి మూలకారకుడు అన్నమయ్య ఆ ఉత్సవాన్ని ప్రవేశపెట్టింది తాళ్ళపాకవారు. అలమేలుమంగాశ్రీనివాసులకు ఈడుజోడు కుదిరిందని ఇక్కడ పోలికలు చెబుతున్నారు. అతడు రాముడు, నీవు రామవు. పేరు బలాలు సరిపోయాయి. అతడు చామనచాయ నీవు చామవు. అతడు వామనుడు నీవు వామనయనవు. అతడు హరి-నీవు హరిణేక్షణవు. అతడు కరివరదుడు-నీవు కరిగమనవు. అతడు జలధిశాయి - నీవు జలధికన్యవు. అతడు జలజనాభుడు నీవు జలజముఖివి. మీ ఇద్దరికి పేరు బలం సరిపోతుంది.

తిరో తిరో జవరాల తిత్తితిత్తియా
తరలమైన నీతారహార మదురే...(6-47)

అలమేలుమంగచేత అన్నమయ్య నాట్యం చేయిస్తున్నాడు. ఓ జవరాలా! భ్రమణాలు చేయి. నీ మెడలో హారం అదిరిపడేలా నృత్యం చెయ్యి. నాట్యంచేస్తూ పాత్రలో లీనం కావడం మరచిపోవద్దు. నీముఖశ్రీ కాంతులు గజ్జెలమోతలు అందమైన చూపులు శ్రీవేంకటపతికి తలగని ఆనందాన్నిస్తున్నాయి. నీ నాట్యంతో స్వామికి నయనమనోహరంగా కనువిందు చేయవమ్మా!

"వలపుల సొలపుల వసంతవేళయిది
సెలవి నవ్వకువే చెమరించీ మేను" (12-385)

ఓచెలీ! ఇది వలపుల వసంతవేళ. నీవు నవ్వితే నీమేను చెమరిస్తుంది. నీవు శిరసువంచి సిగ్గులుపడకు. నిన్నతడు తప్పక చూస్తాడు. విరులు దులిపి తప్పించుకోకు. అతడు నీకు సేసలు బెడతాడు. నీవు చేతులతో ఆటంకపరచవద్దు. అతడు నీచనుగవలు అంటుతాడు. నీమర్మస్థానాలు దాచుకోకు. అతడు సరసమాడే వేళ కౌగిలిస్తే పెనుగులాడకు. నీవతనిని అనుమానించకు. అతడు చనవిచ్చి మేలుకొంటాడు అంటూ చెలికత్తెరూపంలో అన్నమయ్య హితవు చెబుతున్నాడు.

"తానే యెఱుగును రమణుడు తన కెదురాడేనా
నానెనూజమటల బులకల నటనకు బనిలేదే" (17-40)

చెలికత్తెలతో అలమేలుమంగ మొరపెట్టుకొంటోంది. నే నారమణునికి ఎన్నడూ ఎదురు చెప్పలేదు. నా శరీరం చెమటలు పులకలతో నానింది. పైకి కోపం కనిపించినా మనసులో ప్రేమ వుంది. ఇంక ఆయనకు ఏమని బదులు చెప్పగలను. నే నాయన వద్దకు రాకుండుటేమేలు. మంకుపట్టుతో ఒట్లున్నాయి. ఇంకా మీరేమని సుద్దులు చెబుతారు? కాగిటిలో వలపులు, సిగ్గులు వున్నాయి. ఆయన యింకేమనగలడు నన్ను కూడి నిలువునా ముంచాడు. ఇంకమీరు నేరాలెంచవద్దు.

"ఏడవలపేడ మచ్చికేడ సుద్దులు
ఆడుకొన్న మాటలెల్లనవి నిజాలా... ( 1-220)

స్త్రీల వలపులు కల్లలని భాష్యం చెబుతున్నాడు. వలపులు సద్దులు ఆడుకున్న మాటలు నిజాలా! మెరుపులు ఆకాశంలో తళుక్కుమంటాయి. కానీ అవి నిలుస్తాయా? అలానే కన్నెవలపులు కలకాలం వుంటాయా? ఎండమావులు పారినట్లుంటాయి గాని దగ్గరకుబోతే దాహం అణుగుతుందా! స్త్రీల మనస్సులో మోహం పైకి కనిపించినట్లే లోపల వుంటుందా! కలలలో సంపదలు నిద్రలేస్తే కనిపిస్తాయా! అలివేణుల తలపులు వేంకటపతిని తగిలేనా?

"ఉదయాద్రి తెలుపాయ నుదురాజు కొలువిడె
అదనెఱిగి రాడాయె నమ్మ నా విభుడు" (6-146)

ఇందులో నాయిక విరహోత్కంఠిత. చంద్రుని కొలువుతో తూర్పుకొండ తెల్లనయింది. ఇది సంగమానికి తగిన సమయం. కాంతా! నాకిపుడు ఎదపై ముత్యాల సరులుచల్లనైనాయి. వెన్నెల వేసంగి మొగ్గ(చంద్రుడు) ఉదయించాడు. కాబట్టి కన్నె కలువలు కనుమోడ్చాయి. కొప్పులో పూలు వాసన లీనగా తుమ్మెదలు విజృంభించాయి. అయినా అతడెవతెతో వున్నాడో! పన్నీట జలకమాడి పచ్చకపురము పూసుకొని కొప్పున పూలు ధరించి ఆస్వామి నన్నుకూడి

తన్మయింపజేశాడు! ఇక్కడ నాయిక యోగత్వసిద్ధిని పొందింది.

"అడుగరే యీమాట ఆతని మీరందరును
యెడయని చోటను ఇగిరించు బ్రియము" (24-498)

వేంకటశుని దక్షిణనాయకత్వాన్ని అలమేలుమంగ యిందులో చెలులతో ప్రస్తావిస్తోంది. ఓచెలులార! మీరందరు ఈమాట అతనిని అడగండి. మనసు కలవక పోతే ప్రేమ ఎండిపోతుంది. పొరపొచ్చములున్నచోట మాటలు పొసగువు. పెనుగులాడేచోట వలపుసన్న గిల్లుతుంది. వొల్లనిచోట నగవులు పనికిరావు. బలిమిచేసే చోట పంతము పనికిరాదు. అలుకలుచూపే చోట వినయము పనికిరాదు. అనుమానమున్నచోట రతికూడదు. అయినా యింతలోనే శ్రీవేంకటేశుడు నన్నుపైకొన్నాడు.

"చెప్ప నరుదాయగదె చెలిసింగారమునేడు
వొప్పగు మరుబండార మొనగూర్చినట్లు" (18-188)

ఇక్కడ అద్భుతమైన ఆతల్లి సౌకుమార్యాన్ని, సింగారాన్ని వర్ణిస్తూ బొమ్మపెండ్లి అయినట్లు అని చమత్కరించటమే అద్భుతంగా వుంది. చెలులు ఒకరితో ఒకరు ఇలా అనుకుంటున్నారు. ఈనాడు ఈమె సింగారము మరుభాండారంలా వుంది. చేమంతులు కొప్పున తురిమితే చీకటి, వెన్నెల కలిసినట్లున్నాయి. నొసట కుంకుమతిలక మద్దితే సూర్యచంద్రులు ఏకమైనట్లు వుంది. చనులమీద నీలహారాలు తుమ్మెదలు జక్కవలు దొర్లినట్లున్నాయి. నడుముపై వడ్డాణము మెరుపు ఆకాశము నేస్తం చేసినట్లున్నాయి. చేతి చౌకట్టు తామర చిగుళ్ళవలెవున్నాయి. సమరతులలో యిద్దరికీ బొమ్మపెండ్లి అయినట్లుంది. ప్రబంధవర్ణనలను తలదన్నేలా అన్నమయ్య అలమేలుమంగను ముస్తాబు చేశాడు.

"చక్కని దానవు నీవు జవరాలవు
మక్కువ నీపై జేయక మానవచ్చునా" (18-90)

ఓచెలీ! చక్కనిదానవు, జవరాలవు అయిన నీపై నీపతి మక్కువజేయకమానునా! నీవాల్గంటి చూపు గండుతుమ్మెదల తూపు. నవ్వులుజాజిపూలు. సిగ్గువెన్నెలనిగ్గు. అట్టి నిన్ను నీ రమణుడు ప్రేమించడంలో అరుదేముంది. నీపలుకులు మరుని బాణాలు. నీ కొప్పు మేఘపుతీరు. నీ చక్కదనము నిండుజవ్వన వనం. నక్షత్రాలు వజ్రాల మిణుకులు. అట్టి నిన్ను అతడు అలరించుట అరుదేమున్నది.

"ప్రతిలేని పూజ తలపగ కోటిమణుగులై
అతివ పరవశము బ్రహ్మానందమాయ" (5-301)

అలమేలుమంగ స్వామికి షోడశోపచారపూజ సమర్పించినట్లు యిందులో వూహ.

బ్రహ్మానంద పరవశురాలై ఆమె చేసిన అతులితమైన పూజ కోటిమణుగులైంది. మనసు ఆసనంగా ఆనందబాష్పాలు అర్ఘ్యంగా, కనుదోయి దీపంగా, వాగమృతము అభిషేకముగా చిరునవ్వులు విరులుగా, మేని తావి చందనముగా, తనుకాంతి నీరాజనముగా అలుకలు ఉపచారముగా, పొందులు నైవేద్యముగా, వేడుకలు తాంబూలముగా మారి అతనికౌగిట వినయం మొక్కులైంది. ఇక్కడ భక్తుడు తన్నుతాను సమర్పించుకోవడం ప్రసక్తమైంది.

"సకలాపరాధము శమియించుకోవయ్య
అకలంకమైన నీయానతిలో దానను" (11-85)

ఈపాటలో నాయిక స్వామితో యిలా అంటున్నది. ఓస్వామీ! నా అపరాధాలు మన్నించు. నేను నీ ఆనతి దాటని దానను. నీ పాదసేవ చేద్దామంటే అన్ని సేవలు ఎరిగిన ప్రభుడవు నీవు. చేతులెత్తి మొక్కుదామంటే నీ ఆజ్ఞలేనిదే కాదు. మనసిచ్చి మాట్లాడదామంటే ముందు వెనుకలు నీకు వింతకాదు. చనవుతో సరసమాడమంటే నీకు తెలియని దేముంది. నిన్ను కౌగిలిద్దామంటే నీకు నేను ఇవ్వగలిగింది ఏముంది? ఈనాడు నన్ను కూడి చేసిన సుద్దులలో భేదములేదు. ఇందులో స్వామి విశ్వవ్యాపకత్వం అంతర్లీనంగా కనిపిస్తుంది.

"ఏలరాడమ్మ యింతిరో వా
డేలరాడమ్మ నన్నేలినవాడు" (5-235)

ఇందులో శ్రీవేంకటేశ్వరుడు సంపత్తు భోగము సామర్థ్యంగల చక్కని గృహస్తుగా కనిపిస్తాడు. భక్తునికి మధ్య సంబంధం విచిత్రం. ఒకసారి బంటుగా మరొకసారి సఖుడుగా, తల్లిగా, పత్నిగా భావించుకుంటాడు. ఇది నమ్మాళ్వారులు దర్శించిన మధురభక్తి. గోపికలురాధ అనుసరించిన పద్ధతి. అన్నమయ్య ఈమార్గాన్నే అనుసరించాడు. నాయిక విరహిణీయై విభుడు రాడేల అని చెలితో ప్రశ్నిస్తోంది. మన్మథుని తండ్రి, బంగారు పచ్చడము కట్టినవాడు, బ్రహ్మతండ్రి, శేషశయనుడు, గంగా జనకుడు, గోవర్ధనగిరిధారి అయిన కొండలరాయుడు యింకారాడేమమ్మా! ఇందులో కోనేటి తిమ్మయ్య అనడం అద్భుతంగా వుంది.

"పట్టిన పంతము బలువనవే
చుట్టపు వరుసలు చూచితిననవే" (20-195)

రతిశ్రమతో పులకించిన అలమేలుమంగ తన చెలికత్తెతో యిలా అంటున్నది. ఆయనతో పట్టిన పంతము గట్టిదే అయినా చుట్టపువరుసలు మరిచిపోలేదని చెప్పవే! రతిశ్రమలో చెమటలో తడిసిపోయాను. నవ్వులలో మునిగి తేలాను. తాను నన్నుచూచి గాఢంగామోహించాడు. తన సంభాషణతో ఆరితేరిన అతడు నామనసులో నిలిచాడు. ఆమేని పులకింతలు తమకము యింకా తీరలేదు. అతని కౌగిట చేరి నేను కరిగిపోయాను. ఇంక దాచట మెందుకు? శ్రీవేంకటపతి

రతిపారవశ్యంలో మునిగిపోయాను. శృంగారలాలిత్యం యిందులో ద్యోతకమౌతుంది.

"ఇదివో నాభాగ్యము ఏమిచెప్పేనే
ముదముతో తనకిట్టె మొక్కి తినే ననవే" (11-149)

చెలికత్తెతో తమ సరసశృంగారాన్ని అలమేలుమంగ ఏకరువు పెడుతోంది. ఓచెలీ! నాభాగ్యమేమని చెప్పేను. అతనికి నా వందనాలు తెలుపు. నాకు బంధువు, సులభుడు, అయిన అతడే సమస్తము. నాపై కరుణ జూపేది అతనే నా అంతరంగాన్ని తెలుసుకొని వంతులు లెక్కించక వచ్చినది అతడుగాక మరెవ్వరు? నాకు భర్తయైనా సాన్నిహిత్యంలో వివరించే శ్రీవేంకటవల్లభునితో తహతహ తీరగా కూడి ఆడాను. ఇందులో పరమాత్మతత్వాన్ని అన్నమయ్య వర్ణించాడు.

"వలెగా వేసాలు వద్దన్న మానడు
ఎలయింపుల మాటలనెంత సేసీనే" (11-35)

శ్రీవేంకటపతిపై మోహం తీరని నాయిక చెలితో యిలా అంటోంది. అతని నయగారపు వేసాలు వద్దంటే మానడు. చతురసంభాషణలతో అతడు ఎంతలేసి చేస్తున్నాడు. కనులతో మొక్కితే మన్మథ తాపం అతిశయించడమెందుకు? నాశరీరమంతా చేతులు మోపడమెందుకు? బయట వెన్నెలవుంటే మదనతాపం పెరగడమెందుకు? తాను నిన్న నేడు కథలునేర్చాడు! చిలుకలు పలికినా.. నేను నవ్వినా... ఆమాయగాడు చేస్తున్న చెయిదాలు, కౌగిలింతలు జాణతనాన్ని చెబుతున్నాయి!

"నాకుజెప్పరే వలపునలుపో తెలుపో
నూకిపోవగరాదు నుయ్యోకొండో" (5-193)

శైత్యోపచారాలు మదనతాపాన్ని పెంచుతున్నాయని ఆరసికునితోడి మదనసామ్రాజ్యము ఎట్టిదో చెలికి చెబుతోంది. ఆశృంగారపు ఛాయలు తెలుసుకోలేకుండా వున్నాను. ఆవలపు జాడ తెలియడంలేదు. మరుడు పులిలా, తుమ్మెద ఝంకారము ఉరుములా చందనము తేలుగా, కోయిలకూత సహింపరానిదిగా, చలిగాలి పొగగా, కన్నీరు వాగుగా, పన్నీరు ఉడుకుగా, తలవంచుకొనుట సిగ్గుగా, మదనుని గాలి పదనుగా, విరహతాప మతిశయిస్తోంది. మదనసామ్రాజ్యపు పట్టపురాణిగా తన్నుతాను భావించుకొంది.

"మనవిచెప్పితిని మరువకుమీ
కనుగొని నామాట కదువకుమీ" (11-53)

ఓస్వామీ! నీవు దక్షిణనాయకుడవు. నామనవి మరువవద్దు. నామాట జవదాటవద్దు. నాతో యిచ్చకాలాడుతూ మచ్చికతో నామేలుమరువ వద్దు. వేరొకతె నీపై వలపులు కురిపిస్తే

చెలించవద్దు. సరసాలాడుతూ చనవులిచ్చి మరిగిన నాపొందుమానవద్దు. మరొకతె నీపై మోహంతోవస్తే భ్రమపడవద్దు. ఇప్పుడు నన్ను కలిసి కౌగిలించినట్లే మరొకతె పిలిస్తే ఆమె వెంట వెళ్ళవద్దు.

"చలువలు వేండ్లు జరపగ నేటికి
నెలవగు మేలే నించగరాదా" (11-34)

చెలులు శ్రీవేంకటేశునిపై అభియోగం మోపుతున్నారు. ఓస్వామీ! నీవు మాచెలిని మదన తాపంలో ముంచడం ఏల? ఆమె సాహసి ఇకపై జరిగేది నీకే ఎరుక. ఆమె నీపై ఆశతో అలసిపోయినది. ఇకపై సుద్దులు మమ్మడగ వద్దు. ఆమె కౌగిలిలో తనివితీరా మురిసిన నీవుయింకా సిగ్గుపడనేల! అంటూ అలమేలుమంగా శ్రీవేంకటేశుల సరసశృంగారాన్ని చెలులు నెమరు వేసుకుంటున్నారు?

"కలలోనే యిరువురము నలిగివేగ
కలయనుచు తెలిసి నిను కౌగిలించితిరా" (5-21)

తనపతి స్వప్నంలోనే తనను కలిశాడు మేల్కొన్న ఆమె అతణ్ణి కౌగిలించింది. అతనితో మేల మాడుతోంది. నాపై అలుకలేల స్వామీ! నీవలిగితే పూవులే మదనబాణాలవుతాయి. చంద్రుడే సూర్యుడౌతాడు. గంధమే కస్తూరి అవుతుంది. ఓ విటవరా! నీవు నన్ను ఎడబాసితే ఈదేహాన్ని భరించలేను. నాస్వప్నం నిజమని భావిస్తున్నాను. ఇక్కడ స్వామిపై ఆమె జాగ్రత్ సుషుప్త్య వస్తలలో కూడా మమకారాన్ని పెంచకున్నదని అన్నమయ్య చెబుతున్నాడు.

"ఓయమ్మ ఇంతయేల వొద్దనరే!
నాయముగా దిందరిలో నగుబాటు తనకు ( 20-62)

జాణతనాల శ్రీవేంకటేశుడు నన్ను మరిపించాడు. ఆమైమరపులో నేను అతని చెక్కునొక్కాను. మక్కువతో మాటాడాను, ఇచ్చకాలాడాను, ముచ్చట లాడాను, మోవిరుచి చూపాను. ఇంత పచ్చిగా చేసినా అతడు పగచాటు తిన్నాడు. అయినా కౌగిలించిన అతడు ఎంతైనా రతిమానడు. అతడెంత జాణడే. వలపుతలపోతలలో స్వామినే తలపోస్తోంది అలమేలుమంగ.

"ఏమిసేయుదునమ్మ యిన్నియును నిటుగూడె
తామసపుప్రేమ వేదన బాయ నీదు"(5-113)

ఓచెలీ! అతనిపై తామసపుప్రేమ నాలో వేదన అధికమౌతోంది. ఏదైనా కోపంతో మాటాడుదామంటే తడబాటు వహిస్తోంది. అతనని తనివి తీరచూదామంటే కళ్ళనీరు అడ్డువస్తోంది. సాష్టాంగనమస్కారం చేద్దామంటే పరవశత్వం పైకొంటోంది. అతణ్ని మరవకుండా వున్నాను. అతని దొరతనము సరసత్వము నిరంతరం నన్ను మరపింపజేస్తున్నాయి. మనసావాచా

కర్మణా అతనినే వూహిస్తూ అలమేలుమంగ యిలా అంటోంది.

"తగుదువమ్మ నీవందపు మరుతండ్రికి

మొగి తగిచ్చి నమృతము మోవినుందిగాన" (20-205)

ఓచెలీ! నీశృంగారము అద్భుతము. సౌందర్యము వర్ణనాతీతము. ఏమని వర్ణింతును. నీవు ఆమదన జనకునికి సరితూగుతావు. నీమోవి అమృతమయము. నీ జవ్వనము అతిలోకము నీచూపులు సుమధురాలు. నీతురుము, నీసొబగు, నీపిరుదు ఒకటిని మించి మరొకటి భాసిస్తున్నాయి. నిన్ను వర్ణించ నలవిగాదు. చిగురుపాదములుగల నీభాగ్యము అసదృశము. ఆమెలోని సర్వాంగసుందరత్వాన్ని అన్నమయ్య చెలిచేత మనోహరంగా పలికించాడు.

"వలపారగించవమ్మా వనిత నీ

యలుక చిత్తమున కాకలి వేసినది" (5-25)

శృంగారరసభరితమైన వలపుటాకలిని వివిధరకాలుగా తీర్చుకోమని చెలులు సూచిస్తున్నారు. అడియాసతో పక్వమై అలుకల వేడిరుచులతో తమకంతో కూడిన బోనం ఆమెవడ్డించింది. మదురాధరామృతాలు, కోరికలను కుమ్మరించి ఆభామకు పూపాన్పు పళ్ళెంపెట్టాయి. కాంక్షలనే కలవళాలు తీరిపోయి నవ్వులు విరిశాయి. శ్రీవేంకటేశ్వరుడు మన్నించటంతో మైమరపు కలిగింది. ఇక్కడ ఆమె చేష్టలనే పక్వాన్నంగా అన్నమయ్య వర్ణించాడు.

"మాయింటికి రావోయీ మాధవా నీ

మాయలెల్లా గంటిమిదె మాధవా" (15-236)

ఓమాధవా! నీమాయలన్నీ మాకు తెలుసు యింక మాయింటికిరా! నాపై వలపు మచ్చుచల్లి మచ్చిక చేసుకున్నావు. నీపై మాత్సర్యం నాకు ఏమాత్రము లేదు. నాకు దక్కినా యింకా మరుగెందుకు? నన్ను మరిచిపోవద్దు. నన్ను భ్రమియింపజేసిన నీవు నాకాళ్ళ మట్టెలు యిచ్చివేయి- అని నాధునితో మొరపెట్టుకొంటోంది నాయిక.

"రచ్చలు సేయక రావయ్యా

ఇచ్చయరగనిది ఏలయ్యా" (16-388)

ఓవేంకటేశా! రచ్చలు మాని మాచెలిని ఏలుకో! ఆమెజంకెన చూపులు, సరసపు మాటలు నీపై లంకెపెట్టినది. నీవు మంకుపట్టువదిలి అలుకలుమాని రావెందుకు? నీపై బాసలు చేసి ఆశపెట్టుకున్న ఆమెపై పంతాలు వదలి ఏలుకో! ఆమె నీపై చనవు పెంచుకొని పరవశురాలౌతోంది ఆమెను ఏలుకోవయ్యా!

"తలచిన తలపులు దలకూడె
వెలుపలె లోపల వెరవిక నేలే" (9-276)

స్వాధీనపతికయైన నాయిక బిగువుచేస్తోంది. చెలికాడు వాకిట నుండగా బిగువు చూపుతోంది. పంతాలువదలి అతనిని కలవమని చెలులు సరసోక్తులాడుతున్నారు. ఓ చెలీ! నీవు యింతకాలము ఎదురు చూచిన తలపులు కూడాయి, ఇంకా నీవు వెరగుపడనేల? వలపులు అసలునుమించి వడ్డికి బారాయి. ఇవనైనా తలుపు తెరువు. పిలవకుండానే ప్రియుడు వాకిట నుంచున్నాడు. ఇంకా బిగువేల? ముసిముసినగవులతో ముసుగుతున్ననేల? కౌగిట నించిన నీవు చెమటలతో కరిగిపోతున్నావు? ఇంకా తడబాటెందుకూ అని చెలితో సరసాలాడుతున్నారు.

"చలిగాలి వేడేల చల్లినె కప్పురపు
మలయజము తానేల మండీనే (5-191)

లోకాధిపతికి లోనైన నాయిక విరహతాపంతో కాగిపోతోంది. చలిగాలులు వేడిగావున్నాయి! మలయమారుతము మండిపోతోంది. మనసు నలుగడల పరుగులు తీస్తోంది. చూపులు నలుదిక్కులా ప్రసరిస్తున్నాయి. తాపంతో శరీరం వాడిపోతోంది. మదన బాణం మనసులో దూరింది. చిలుకలు వదరుతున్నాయి. కోయిలలు గొణుగుతున్నాయి. మన్మధుడు కసురుకుంటున్నాడు. ఏకాంతంగా అతనికి ఎదురుపడగ అతడు మన్నించి పాలించాడు. ఎంతటి అదృష్టం.

"నీడలచూపులు నీకేలే యీ
వాడక వాడెడి నడ నీకేలె" (6-66)

ఓచెలీ! ఉత్తముడై వేంకటేశ్వరుడు నీకే దక్కినపుడు నీవు పలుభంగులు పోనక్కరలేదు. నీచూపులలో నీడలు నీనడకలలో అలసత, నీనటనలు, నీనడపులు, నీ నునుసిగ్గులు, చెదిరినకురులు, చెరను చాటు మాటలు నీకేల? నీనాధుడు నీవాడైనాడు!వేంకటోత్తముడు నీవాడే! అని చెలులు పరిహాసమాడుతున్నారు.

"బడలెనుపానుపు పరచరే
అడుగర్రేయిది ఏమి అని చెలులు ( 19-122)

సురతశ్రమాంతరము నాయకునికి శైత్యోపచారములు చేయుటకు సన్నద్ధముకండని చెలులకు పనులు పరమాయిస్తున్నది నాయిక. ఓచెలీ! రతిశ్రమలో బడలినాడు. పాన్పుపరచండి యిదేల అని అడగండి! శరీరంపై చెమటలు పట్టాయి. విభుడు అలసిసొలసి వచ్చినాడు కప్పురము చల్లండి, సురటితో విసరండి. రతిశ్రమకోర్చిన అతడు నిట్టూర్పులతో బుసగొడుతున్నాడు. చల్లని గంధము మెత్తి పన్నీరు చల్లండి. దప్పికతో మోవి తడుపుతున్నాడు తాంబూల మందించండి.

నన్నురతిలో ఏలిన అతనికి అన్ని సేవలూ సేయండి.

"విరహంబువేదాయ విరుల మొనవాడాయ
తరవాతి పనులకిటు తడవేలయికను" (19-367)

విరహతప్తయైన నాయికకు శైత్యోపచార ప్రక్రియ మొదలుపెట్టారు చెలులు. ఒకరితో ఒకరు యిలా పనులు పురమాయిస్తున్నారు. ఇంక ఆలస్యం చేయక నాయకుని పిలవండి. అంతదాకా చందనం అలదండి. రొదలు చేయక పనులు చేయండి. తురుము సరిచేయండి. నుదుటి కస్తూరిబొట్టు దిద్దండి. పతికి కానుకలు పంపండి. పన్నీరు చిలకండి. ఇదిగో శ్రీవేంకటేశుడు విచ్చేశాడు. సతిసొంపులు మారాయి. ఇంక బాధపడవలసిన అవసరం లేదు.

"అమ్మమ్మ యేమమ్మ అలమేల్మంగ నాంచారమ్మా
తమియింటనలరు కొమ్మా ఓయమ్మా"! (6-64)

ఓ అలమేలుమంగ! నీకోసం ఆస్వామి దశావతారాలెత్తాడు. మత్స్యకూర్మవరాహావతారాలు నీకోసమే. నృసింహావతారం ధరించాడు. ఇంక అలక చాలించు. వామనుడై నీకోసం చేయి జాచాడు. పరశురాముడైనాడు. విరహతప్తరాముడైనాడు. గోపికా హృదయచోరుడైనాడు. తాంబూలమివ్వు. నీకోసమే పొంచిన వేంకటేశుని మక్కువతో అక్కున జేర్చి అలరించవమ్మా!

"చూడరమ్మ సతులాల సోబాన పాడరమ్మ
కూడున్నది పతి సూడికుడుత నాంచారి" (26-246)

శ్రీమహాలక్ష్మి అయోనిజగా శ్రీవిలిపుత్తూరులో జన్మించింది. ఆమెయేగోదాదేవిగా పిలవబడే ఆండాళ్. ఆమె రోజుకొక పాశురంచొప్పున ధనుర్మాసంలో స్వామి (రంగనాధునికి అర్పణ చేసింది. ఆమెయే చూడికుడుతనాంచారి. (అముక్తమాల్యద). ఆమెను స్తుతిస్తూ ఈకీర్తన శోభనముగా అన్నమయ్యవ్రాశాడు. ఆమె శ్రీమహాలక్ష్మి కాన సౌందర్యానికి ఏమి అరుదు. మన్మధుని తల్లికి చక్కదనాల కేమికొరవ. చంద్రుని తోబుట్టువుకు సొంపు కళలకేమి అరుదు. సముద్రుని కూతురునకు గంభీరాలకరుదా! దేవవందిత అయిన ఆమెమహిమల కేమికొరవ! పద్మనివాసికి చల్లదన మరుదా! అమృతపు బంధువైన ఆమె ఆనందాల కేమికొరవ! తనంతానే వచ్చి వరించిన సంఘటన అత్యద్భుతం.

"ఏమని పొగడుదుమే యిక నిను
ఆమని సొబగుల అలమేల్మంగ" (18-538)

ఓ అలమేలుమంగా! నిన్ను ఏమిని పొగడగలము. వసంత ఋతువులోని అందచందాలతో జగదేక సుందరివైన నీ తెలికన్నులు వెన్నెలకురిసిస్తూ స్వామికి ఆనందం కలుగజేస్తున్నావు. మొలకలెత్తిన పులకరింతలే పూల పాన్పులు. నీ అధరామృతమే స్వామికి వియ్యపు విందులు.

మొలక నవ్వుకప్పురపుతాంబూలము. నీకౌగిలి స్వామి సిరినగరు. మీతమకములు లోకకల్యాణాలు. ఈకీర్తనలో అతిలోక సుందరియైన అలమేలుమంగను ప్రకృతి స్వరూపిణిగా అన్నమయ్య కీర్తించాడు.

"ఎటువంటి మోహముఎట్టి తమకమొకాని
తటుకునను దేహమంతయు మరచెచెలియ" (6-101)

అన్నమయ్య పరమాత్మపట్ల పరితపించే జీవనాయిక స్థితిని ఈమధుర సంకీర్తనలో వర్ణించాడు. యిక్కడ జీవనాయిక జీవాత్మకు ప్రతిరూపం. ఆమె పలువిధాలుగా పరమాత్మసంగమం(ఐక్యం) కోసం ఎదురుచూస్తుంది. మోహపారవశ్యంలో దేహాన్ని మరచిపోతుంది. అప్పుడే పరమాత్మ ప్రత్యక్షమౌతాడు. అప్పుడు నాయిక ఆనందానికి అవధులు లేవు. పరిమళపు ముఖము వికసించింది.

"వచ్చెను అలమేలు మంగ
పచ్చలకడియాల ఫణతి చలంగా" ( కీర్తన 255)

దక్షిణదేశంలో భజనసంప్రదాయ సంకీర్తన ప్రసిద్ధం. కూచిపూడివారి భామాకలాపంలో ప్రవేశదరువు ధోరణిలో ఈకీర్తన సాగింది. అలమేలుమంగ రంగస్థలంపైకి వస్తున్నట్లుగా వూహించి అన్నమయ్య అద్భుతదృశ్యాన్ని ఆవిష్కరింపజేశాడు. తరువాతి కాలంలో పారిజాతాపహరణంలో ప్రవేశదరువును సత్యభామపరంగా మాతృభూతకవి ప్రవేశపెట్టాడు. కలికి చూపుల తల్లి గంభీరంగా నటనలు చేస్తూ వచ్చింది.

"విభుని వినయములు వినవమ్మా నిను
నభయం బడిగీ నయ్యోతాను" (5-308)

ఈ కీర్తనలో స్వామి విరహతాపాన్ని చెలులు అలమేలుమంగకు చెప్పటం విశేషం. సాధారణంగా ఆమె విరహన్ని చెప్పటం జరుగుతుంది. ఇక్కడ స్వామి విరహం చెప్పబడింది. రహస్యంగా ఆయన విరహలేఖలు పంపాడు. ఆది శేషుని పాన్పు తాపాన్ని అధికంచేస్తుంది. నీదయలేక నిముషమొక యుగంగా వేదాంతరచన చేస్తున్నాడు. నీకు కింకరుడైనాడు. వేంకటపతి గతి వినమని సరసంగా చెప్పబడింది.

"హరినిన్ను పిలిచీని అదివోవమ్మా
తెరమరగిక నేల తీయవమ్మా" (26-112)

ఇందులో చెలికత్తె వేషాన్ని అన్నమయ్య ధరించాడు. చిత్తరువు ప్రతిమ వంటి ఓచెలీ! నీకూరిమిపతి మోము చూడు ఓ బంగారుబొమ్మా! మదన బాణమా! నంగతనం వదిలి నవ్వు. మీరిద్దరు మమ్మునేలండి!

"గరుడాద్రి వేదాద్రికలిమి యీపె
సిరులొసగీ చూడరో చింతామణి ఈపె" (4-522)

ఇక్కడ అహోబలనారసింహుని ప్రస్తావించాడు. నారసింహునితోబాటు భక్త చింతామణియైన నారసింహలక్ష్మి భక్తులను బ్రోచుతోంది. ఆమెను కొలిస్తే ఘనసంపదలు వశమౌతాయి.

"రమణుడు పిలిచీని రావె చెలియ నీవు
తమకమేవలెగాక తరుణులకు" (24-550)

ఈపాటలో నాయిక స్వామిపై అలిగి దూరంగా వెళ్ళింది. స్వామి రాయబారం పంపాడు (అన్నమయ్యను) ఓచెలీ! సరసురాండ్రు మంచితనంతో వుండాలి గానీ, వ్యంగ్యపుమాట లేల? వలపులు కురిపించాలగానీ, గర్వము ఏల? ఇక్కడ జీవాత్మ పరమాత్మల సంయోగం జరిగి యోగత్వం సిద్ధించడం అన్నమయ్య సూచించాడు.

"అలమేలుమంగ నీవభినవ రూపము
జలజాక్షు కన్నులకు చవులిచ్చేవమ్మా"!(5-160)

అమ్మ అనపాయిని. అతిశయ సౌందర్యరాశి. తన చల్లని వెన్నెల చూపులు స్వామిపై దిగబోసి ఆయనను రసికుణ్ణి చేసింది. పట్టపుదేవేరియై ప్రేమపల్కులతో పరవశుణ్ణి చేసింది. ఈకీర్తనలో నాయిక స్వాధీనపతిక.

"ఎంతనేరుపరి ఈలేమ
దొంతి వెట్టె సంతోషముల" (28-372)

అన్నమయ్య అనేకమంది నాయికలను (జీవాత్మలు) సృష్టించాడు ఇందులో నాయిక తెలివిమంతురాలు. చెలికత్తెలు స్వామివిశేషాలు చెబుతుంటే నవ్వులవెన్నెలలు విరబూయించింది. స్వామి ప్రియభాషణం చేయగా ఆపెదవుల వెంట తేనెల సోనలు చిందుతున్నాయి. నాయిక నేర్పరి తనాన్ని స్వామి దయాపరత్వాన్ని యిందులో అన్నమయ్యకీర్తించాడు.

"మించి దేవాంగనలిట్టె మెచ్చేరమ్మా
ఎంచ నలమేలుమంగ ఎంతదానవమ్మా" (20-124)

అలమేలుమంగ జాణతనాన్ని యిందులో రంగరించి పోశాడు అన్నమయ్య. మాటలతో వూరడించి, పాటలతో కరగించి, నటనలతో మెప్పించి వలపించి, భ్రమియించి, పతి వురమెక్కింది. ఇక్కడ ఇంచు క్రియాపదాన్ని మాటిమాటికీ వాడి చివరకు పతి ఉరమెక్కేపట్టపురాణి ఆమె అని అన్నమయ్య యిందులో సొబసుగా చెప్పాడు.

"అమరెగదె నే డన్ని సొబగులు

సమరతి చెన్నలు సతి నీమేన" (28-419)

మధురభక్తి అతిశయించిన కీర్తన యిది. చెక్కుటద్దాలపై చెమటలు మొలక నవ్వులు, రతిపారవశ్యము, తన్మయత్వము యిందులో వర్ణించబడ్డాయి. ద్విత్వళకారాంత ప్రాసతో (అంత్యానుప్రాసతో) చెక్కిళ్ళు, మొక్కిళ్ళు, వంటి అచ్చతెనుగు పదాలను సుందరంగా వాడాడు.

"చక్కని జాణ యిన్నిటా జవరాలు

చక్కెర బొమ్మవంటిది జవరాలు" (29-5)

ఇందులో చెలికత్తె అలమేలుమంగ అతిశయ ప్రేమను నాయకునకు విన్నవిస్తోంది. జాణ అయిన ఆజవరాలు ఓ చక్కెరబొమ్మ. నిన్ను కనులారా చూచి వెన్నెల నవ్వులు కురియిస్తోంది. తెరమరుగున నిలబడి తేనెలూర మాటలాడుతోంది. సరసాలు పోతోంది. రతులతో సొక్కిపోతోంది. ఇక్కడ శృంగారాత్మక భావనలను తానే చెలియై అన్నమయ్య చెబుతున్నాడు.

"ఎంత నేరుచుకొన్నది ఈచిన్నది

చెంతనుండే నిన్ను నిట్టెచేకొన్నది" (25-115)

పై కీర్తన కోవలోనే సాగిన యిందులో నేరుపరియైన నాయిక రతిలోని అలపులు చెప్పబడ్డాయి. సెలవులనయములు కౌగిట ప్రియములు, మొగమోటలు, వలపులు, బింకములు పొంకములు ఇందులో వెల్లివిరిశాయి.

"ఎంతమోహమో కాని ఇతడు నీమీదను

సంతసము బాయకిటు సరసనున్నాడు" (28-63)

అలిగిన చెలితో చెలులు సరసాలాడే సందర్భమిది. ఎదుటనున్న పతితో పలుకవమ్మా! చిరునవ్వులు చిలకవమ్మా! కూరిమి నేరుపులు విసరవమ్మా! నీతో రతి మరిగి చొక్కుచున్నాడని చెబుతున్నారు.

"ఎంతవడేయ నిదేమమ్మా!

దొంతిరతులకు నెదురుచూచీని" (28-192)

పై వరుసలోనే సాగిన యిందులో పతికలయికకు కాచుకన్న సందర్భాన్ని వివరంగా చెప్పబడింది. ఒప్పుల కుప్పా ఒయ్యారిబొమ్మా అనే జానపద సరళిలో సాగిన కీర్తన యిది.

"అన్నిటా జాణవు నీకు నమరు నీజవరాలు

కన్నుల పండుగగాను కంటిమి నేడిపుడు" (28-282)

ఇందులో ఉపమలు అత్యద్భుతాలు. మోయని మోపులు ముద్దుచన్నులు. గాదెబోసిన

మణులు కనుచూపు తేటలు. విత్తినపైరు జవ్వనము, పెట్టిబెట్టిన సొమ్ములు - పెనురతులు. ప్రబంధకవులు కూడా ఈవర్ణనలు చేయలేదు.

"మేటి నేరుపరులాల మెలుతలాల
కూటము లిద్దరికిని కూరచరెఎప్పుడు" (28-93)

విభుని చక్కదనాలు గమనించిన నాయిక చెలులతో పతిని తోడితెమ్మని ప్రార్థిస్తోంది. కోరికలు కుప్పలువడి విభునిపై వేడుక పుట్టిస్తున్నాయి. ఇంతలో తానే శ్రీవేంకటేశుడు విచ్చేసి పెండ్లాడాడు.

"చిత్తగించు మిదె చెలియ విలాసము
పొత్తులుగలిపి భోగంబులకు" (28-200)

ఈకీర్తనకూడా పై వరుసలోనే సాగింది. కన్నులమొక్కులు కానుకలొసగి, జక్కవ పిట్టల అక్కున జేర్చుకుంది. పలుకు తేనియలు అనేమాట యిందులోనూ ప్రస్తావించబడింది.

"వీణ వాయించెనే అలమేల్మంగ
వేణుగాన విలోలుడైన వేంకటేశుల యొద్ద" (27-22)

ఇందులో వీణావాదనతో పతిని మురిపించే జంత్రగాత్ర సమ్మేళనముతో ఒక సుందర దృశ్యకావ్యం ఆవిష్కరించబడింది. కురులుజారగా, సన్నజాజివిరులు రాలగా, కరకంకణములు మ్రోయగా, ఆణిముత్యాలసరులు వూయల లూగగా, పాలిండ్ల కుంకుమ గంధము చెమటచే కరిగి ఘుమఘుమలీనుతోంది.

"చేరి వచ్చెను అలమేలుమంగ
జిలుగుపయ్యెద జారగా" (27-16)

పతిని కూడివచ్చిన నిదురమబ్బుతోనున్న రతిశ్రమానంతర నాయిక యిందులో వర్ణించబడింది. పడకటింటిని తిరిగి తిరిగి చూస్తూ కప్పురతావివెదజల్లుతూ కొప్పున పూలు రాలగా ఒటికట్టు చీరతో కెమ్మోవినొక్కులతో పడతి వెలుపలికి వచ్చింది.

"చిత్తజువేడు కొనరే చెలియలాల
తత్తరించి పతి మీది తలపోతనున్నది" (7-407)

చిత్తజుడు యుద్ధంలో అనేకఅస్త్రాలను అతివపై ప్రయోగించాడు. అనలాస్త్రంతో విరహాగ్నిని, వరుణాస్త్రంతో చెమట వానలను, వాయువ్యాస్త్రంతో నిట్టూర్పులు, శైలాస్త్రంతో చనుకొండలు, సమ్మోహనాస్త్రంతో పారవశ్యము, రక్షగా నారాయణాస్త్రమువేశాడు. ఇలా మరే కవీ చెప్పలేదు.

"ఎంతజాణరో ఈకలికి
కాంతుడ నీభోగములకే తగును" (12-45)

ఇందులో వివిధకేళీవిలాసాలతో ఆకలికి తనకాంతునికి భోగము చేసినది. కౌగిట చెమటలతో జలకేళి, కుచమర్దనతో పర్వతకేళి, బాహులతలతో వనకేళి, చూపుతూపులతో పూలకేళి. అధరామృతములతో భోజనకేళి, రతులతో పరిణయకేళిచేసింది.

"పెనుపండుగలు సేసిపిలిపించె నిన్నమాపె
పెనగీ చిత్తపుచింత పెనులంపటముల" (11-184)

ఇందులో తెలుగువారి వివిధ పండుగలను నాయిక చేష్టలకు అన్వయం చేస్తున్నాడు. చెలి జాగరాలతో వేగుదాకా దీపావళి పండుగ చేసింది. తమకంతో మేడపై నిల్చొని నిముషమొక ఉగాదిపండుగ చేసింది. నిన్నకలియగానే లక్ష్మీదేవి పండుగలు చేసింది. ఇలా ప్రతికదలికను నయన పర్వంగా వర్ణించాడు అన్నమయ్య.

"పొలతికి నీతో పొందు పోకకు పుట్టెదాయె
యెలమి నీభాగ్యమికనైనా గద్దయ్యా" (23-66)

ఇందులో నాయికా నాయకుల పొందును వివిధ రకాల వర్షపు జల్లులలతో ఉపమించాడు. అన్ని వానలు రాయలసీమ కవియైన అన్నమయ్య ఎప్పుడు చూచాడో. బహుశా 15వ శతాబ్దినాటికి పుష్కలంగా వానలు కురిసేవేమో? పన్నీటివాన, మెరుగువాన, విరులవాన, ముత్యాలవాన, జడివాన, తొలకరి వాన, సోనలవాన, తతివాన.

"ఎటువంటి విలాసిని ఎంత జాణ ఈచెలువ
తటుకున నీకు దక్కె దైవార చూడవయ్యా" (23-30)

ముద్దుగారే యశోద ముంగిట ముత్యము వీడు అనే కీర్తనలోస్వామిని నవరత్నాలతో పోల్చినట్లే యిందులో అలమేలుమంగ సొగసులు నవరత్నాల ఉపమలతో పోల్చాడు. మాటలు మాణిక్యాలు, పగడాలు పెదవులు, చూపులు మంచినీలాలు, పచ్చల జవ్వనము, గోళ్ళు వైఢూర్యాలు, నవ్వులు-వజ్రాలు, ప్రియాల పుష్యరాగాలు, చెనకుల - గోమేధికాలు, చెమటల ముత్యపుసరాలు ఇలా అంగరంగ శోభను నవరత్నమయం చేశాడు.

"విన్నవించితిమి నీకు వేడుక వేళ
కన్నెను నీవు దయ గాచేటి వేళ" (21-133)

ఇందులో ఆరు బుతువులను సర్వాంగ సుందరంగా నాయికకు అన్వయం చేస్తూ చెప్పటం అసాధారణంగా వుంది. యవ్వన ప్రాదుర్భావంతో వసంతవేళ, తాపభారంతో వేసవివేళ చెమటల యేరులతో వర్షపువేళ సెలవుల వెన్నెలలతో శరద్వేళ, తత్పరపు [illegible] హేమంతవేళ, పతిని

కూడిన వేళ శిశిర వేళ ఆవిర్భవించాయి.

"అలమేలుమంగ ఈకె ఆనుకవద్దనుండది
చెలరేగి కందువలు చిత్తగంచవయ్యా..." (8-90)

అలమేలుమంగవద్ద నుండగ వేంకటేశుడు రథంపై ఎక్కి జయాన్ని సాధించాదని పలు ఉపమలతో అన్నమయ్య చెప్పాడు. ఆమె దేహమే దివ్యరథము. గరుడధ్వజము ఆమె పయ్యెద. తురగములు రతికోర్కెలు. పిరుదులు బండికండ్లు. చనులు పూలగుత్తులు. కంఠము విజయశంఖము. ఇక జయమునకు కొదవేది?

"అల్లదె జవ్వని హరియురముననదె
మెల్లన ఇటు ఉపమించరే మీరు" (19-375)

ఇక్కడ ఆమె శరీరాంగాలను రెండేసి ఉపమలతో పోలుస్తున్నాడు అన్నమయ్య. కనుగవ ముత్తెపు చిప్పలో, కలువలో, కుచములు - కుండలో, కొండో, చేతులు - తామర తూండ్లో తీగలో తురుము - నీలమణులో మేఘమూ ఆమె - మెరుగో మెలతో అని ప్రసిద్ధకవి సమయాలతో పోల్చటం అలంకారోక్తికి సహజంగా వుంది.

"రమ్మనవే చెలియా రమణుని నీడకు
ఇమ్మనవే చనువులు ఎలయింపులేటికే" (19-81)

ఎదుటనే ఉండి ఒడబాటులెందుకని నాయిక చెలులతో ప్రస్తావిస్తోంది. తమకము, కూరిమ, కోరిక పైకెగసి శుభసూచకముగా చన్నులదురుతున్నాయి నోరూరుతోంది అంటుంది.

"అలుగకువమ్మ నీవాతనితో నెన్నడును
పలువేడుకలతోనె పాయకుండరమ్మ" (9-300)

దశావతారాల స్ఫూర్తితో నాయికను అలుక మానమని చెలులు గుర్తు చేస్తున్నారు. మత్స్యకూర్మ వరాహాది అవతారాలలో ఓనెలతా! నీకోసమే అతడు ఎన్ని వెతలు పడ్డాడు. జలధిలో తపము చేశాడు. పాతాళాన్ని సాధించాడు. కొండగుహలలో వున్నాడు. బ్రహ్మచారి అయినాడు పగసాధించాడు. వ్రతము లూనాడు, ధర్మాన్ని అనుసరించాడు. ఇలా ఎన్నో అవతారాలు..

"మచ్చికతో నేలవయ్య మదన సామ్రాజ్యలక్ష్మి
పచ్చిసింగారాలచేత బండారాలు నిండెను" (19-281)

శృంగార రసాధిదేవతయైన ఆమె వలపుల పంటలు పండించింది. యవ్వనరాసులునించ మని పోదిగొనింది. మోహపుసోనలతో ముంచెత్తింది. పులకల పైరులు, కోరికల జళ్ళు, రతుల కొటార్లు వంటి పదబంధాలతో అన్నమయ్య శృంగార సామ్రాజ్యాన్ని ఆవిష్కరించాడు.

"అన్నిటానేరుపరిగా అలమేలుమంగ నీకు
చిన్న చిన్నముద్దులనే సిగ్గువిడిపించెను" (8-89)

నేర్పరియైన నాయిక పతిని వశపరచుకుంది. మనసుదీరామాటలాడింది. తలంబ్రాలు బోసింది. పానుపు దగ్గరగా చేరింది. విన్నపాలు చేసింది. ఇరువురు జతగూడారు. రతికేళిలో పాల్గొన్నారు.

"హరి యేమనెనో అలిగెనో
విరహినైనేనుండగా ఏలరాడాయ" (7-329)

ఓచెలీ! విరహిణినైన నిన్ను అలిగిన హరివచ్చి ఏల అనుగ్రహించడు. ఇందరు తరుణులు వచ్చినా అతనేమన్నాడు. వాకిటిదాకా వచ్చి తిరిగి వెళ్ళటానికి కారణమేమి. ఇంతరాత్రి అయినా రాడేమి? చివరగా ఏమన్నాడు? అని పరిపరి విధాలుగా చెలులతో తలపోసింది.

"ఎంత వేడుకో యిది నీకు
కొంత చెలియ సిగ్గున బొదలీని" (27-264)

ఓ వేంకటేశా! చెలియ నీవేడుకలకు సిగ్గుపడుతోంది. నీవు చేసిన మోవి ముచ్చట్లకు సిగ్గుతో తలవంచుకుంది. చనులపై చేసిన నక్షత్రాలకు సిగ్గుపడుతోంది. నిట్టూర్పులతో నిన్ను పొదవుకొంది. ఇది నీకు వేడుకయా!

"మిక్కిలి నేర్పరి అలమేలుమంగ
అక్కర దీరిచి పతి నలమేలుమంగ( 7-21)

సతీసతుల సరసశృంగారాన్ని యిందులో అన్నమయ్య శోభాయమానంగా వర్ణించాడు. అతనికి ఆశరేపి సరసనకూర్చుండి కప్పుర విడెమిచ్చి ఆరతులెత్తింది. ఇచ్చకాలు వేసింది. కౌగిట కూడింది. ఉరమెక్కికూర్చుంది.

"చెప్పరాదీయింతి సిరులు - దీని
ఒప్పు లిన్నియు జూడ ఒరపులో కాని" (5-259)

శృంగారలక్ష్మి అయిన అలమేలుమంగ లావణ్యాన్ని ఉపమానాలతో పోలుస్తున్నాడు. ఆమె మొలనూలి గంటల రవము మదనుని ఘంటలుగా, పయ్యదలోని కుచములు మరుధనరాసులుగా, కంఠమున నీలమణిహారాలు ప్రాణవల్లభుని కౌగిట చేర్చినట్లుగా యిందులో వర్ణించాడు.

"కొమ్మ సింగారము విని కొలది వెట్టగరావు
పమ్మిని ఈసొబగులు భావించరే చెలులు" (12-513)

ఉపమలతో ఎన్ని ఆటలాడుకున్నాడు అన్నమయ్య. తురుము అనే చీకట్లు మోము కళలు ఎండగాయగా రాత్రి పగలు వెనక ముందైనాయి. చన్నులు పొడవూ నెన్నడుము బయలై కొండలు మిన్ను కింద మీదైనాయి. వేంకటేశుని ఈమె కౌగలించగా కొమ్మలు తీగల నల్లుకున్నట్లున్నాయి. ఎంత గాఢమైన భావన.

"పొద్దిక నెన్నడు వొడచునొ పోయిన చెలి రాదాయను
నిద్దుర గంటికి దోపదు నిముషం బొకయేడు" (5-138)

చెలిద్వారా వర్తమానం రాలేదని తబ్బిబ్బౌతున్నారు. విరహతాపంతో బాధపడుతున్న నాయికను చూచి చెలికత్తెలు ఆమె మాటలు, చేతలు చూపులు, అలపులు అన్నీ చెలితాపాన్ని తెలియజేస్తున్నాయి. ఆస్వామి కరుణిస్తే తప్ప విరహతాపం తీరదు.

"నెలత సొబగులివి నీసొమ్ము
కలసి మెలసి యిటు గైకొనవయ్యా" (12-473)

ఓస్వామీ నీవు రామద్దరకువచ్చి ఆమె కానుకలందుకో వలపుల చెమటల వానలకు కుచంబుల పిందెలుకాచాయి. నీవు ఈమెనుకూడితేనే సుఖం. ఇందులో ఆమని వచ్చిందని తత్సూచకంగా కుచము పిందెలుకాచాయని వర్ణించడం అద్భుతం.

"మెరుగుజెక్కుల అలమేలుమంగా
తరితోడి రతులను దైవారవమ్మా" (20-263)

ఓచెలీ! నిన్ను ప్రేమతో అతడు గౌరవిస్తున్నాడు. నీవతనికి విందుల మోవియిచ్చి వీడియము అందిమ్ము. నీవన్నెలన్నీ చూపి ఉరము మీద స్థిరముగా కూచో.

"ఎంతమన్నించితో యీయింతి నిదె నీవు
అంతకంతకు బ్రేమ నలరీనిపుడు" (5-380)

ఓస్వామీ! నినుకూడిన రతిపారవశ్యంతో ఆమె తేలియాడుతోంది. నీతొడలపై ఆమె పవళించినప్పుడు నీవు తలదువ్వి రతికళలతో తృప్తిపరచావు నీకు ఆకు మడిచి యిచ్చినగురుతులు జ్ఞప్తిచేసుకొని యిప్పుడు తాపంతోవేగిపోతుంది. ఇటువంటి శృంగారప్రధానమైన కీర్తనలు అన్నమయ్య వివిధ సందర్భాలలో వివిధ భంగిమలలో భిన్నభిన్నంగా చెప్పటం విశేషం.

అన్నమయ్యకు జీవితపరమార్థం తిరుమల శ్రీనివాసుడు. తాను చవిచూచిన ఆ పరమార్థాన్ని ఇతరులకు కూడా రుచి చూపాలని ఆయన దృక్పథం. గత భాగాలలో అన్నమయ్య స్తుతించిన వివిధ దైవతాలను, అవతారాలను అలమేలుమంగమ గూర్చి పాటలు, ఆధ్యాత్మిక కీర్తనలను గూర్చిన వివరణ ఇవ్వబడింది. ఈ చివరి భాగంలో స్వామిని ఆయన సందర్శించిన భిన్నభంగిమలను భిన్నవూహాచిత్రాలను సంగీతసాహిత్యజానపదగేయఫణితులను దృజ్మాత్రంగా వివరించే ప్రయత్నం జరుగుతుంది. కీర్తనల మూలాన్ని సంప్రదించి అందులో ప్రధానమైన భావనను మాత్రమే మీ ముందించే ప్రయత్నమిది. సర్వపాపప్రణాశనమైన భగవన్నామసంకీర్తనమే ఆయనకు తరణోపాయము.

నా పరిశోధనా పరిధిలోని కీర్తనల నాడి కనుగొని అన్నమయ్య హృదయా విష్కరణ చేయదానికి ప్రయత్నిస్తాను. ఆపై స్వామికృప.

"శ్రీమన్నారాయణ శ్రీమన్నారాయణ
శ్రీమన్నారాయణ నీ శ్రీపాదమే శరణు" (1-155)

ఓస్వామి నీపాదమే నాకు శరణు. ఓ పరమ పురుషా! ఓ పరమాత్మా !

ఓపరాత్పరా! నీవు పరమయోగిజనులకు అదృష్టాన్ని ప్రసాదించే భాగధేయము. గరుడగమనుడవైన ఓ కమలనాభా! కమలప్రియ, కమలేక్షణ అయిన ఆమహాలక్ష్మి ముఖకమలాన్ని నీవు వికసింపజేసేవాడివి. నీ పదములే శరణము.

అట్టి అచ్యుతుడు, అసురాంతకుడు అయిన ఆ గోవిందుని కొలువమని అన్నమయ్య మనస్సును ఉద్బోధిస్తున్నాడు. అతడు సర్వాంతర్యామి

"భావములోన బాహ్యమునందును
గోవింద గోవింద యనికొలువవో మనసా" (3-561)

అంతరంగబహిరంగాలలో ఆవిష్కృతుడైన ఆవేంకటాద్రివాసుడే విష్ణువు.ఆ హరి అవతారములే సమస్త దేవతలు. బ్రహ్మాండములు ఆయన లోనివే. అతని నామములే సకల మంత్రములు. వేదములు పొగడిన ఆవిశ్వాంతరాత్ముని వెదకుట భక్తుని పని. ఆధ్యాత్మరంగంలో తుదలు వెదకిన అన్నమయ్య సామాన్య భక్తునకు విష్ణువే సమస్తమని ఈ కీర్తనలో బోధ చేస్తున్నారు.

అట్టి విశ్వవ్యాపకుడు, సృష్టికర్తయైన బ్రహ్మకే తండ్రి అయిన విష్ణువు యశోద శిశువు కావడం వింతలలో వింత.

"చేరియశోదకు శిశువితడు

ధారుణిబ్రహ్మకు తండ్రియు నితడు (3-485)

ఏమి చోద్యము! సమస్త దేవతలకు అధిదేవత, సూర్యచంద్రులకే ప్రకాశాన్ని కలిగించేవాడు. సమస్త భువనభాండాన్ని కడుపున దాచుకున్నవాడు అయిన అతడు యశోదకు శిశువైనాడు. అతని లయబద్ధమైన ఊర్పుల నుండి సమస్త వేదరాశి జన్మించింది. మోహనాకారుడైన ఆ ఘనపురుషుడు మావంటి శరణాగతులకు దిక్కు. అట్టిపరమాత్మ నందవ్రజంలో యశోదకు శిశువు కావడం ఆనందంగా చాటి చెబుతున్నాడు అన్నమయ్య.

అట్టి యోగిహృదయవాసి అయిన అమదసజనకుని ఉద్వేగభరితంగా వర్ణించడంలో పనసతొనలా మెరిసిన సంస్కృత కీర్తన ఇది.

"వందే వాసుదేవం శ్రీపతిం

బృందారకాధీశ వందిత పదాబ్జం" (1-53)

ఇది స్తోత్రప్రాయంగా వున్న సంస్కృత పదభూయిష్టమైన వర్ణన. ఇందీవరశ్యాముడు, ఇందిర కుచముల చందనముతో తన శరీరచ్ఛాయ ప్రకాశించేవాడు, మందార మాలికలతో శోభించేవాడు, వక్ష స్థలాన కౌస్తుభాన్ని ధరించిన ఆ కమలనయనుడు గరుడగమనుడు, శేష తల్పశాయి అయిన అతడు వేదవేద్యుడు. కరిరాజ వరదుడైన ఆ చక్రధారికి వందనం.

అట్టిపరతత్వాన్ని "ఏకంసత్ విప్రా బహధా వదంతి" అన్నట్లు నానామతాల వారు నానారీతుల పేర్కొంటారు. కాని అన్నిటా నిలిచిన పరతత్వ మొకటే అని -

ఎంతమాత్రమున నెవ్వరు దలచిన అంతమాత్రమే నీవు

అంతరాంతరము లెంచిచూడ పిండంతే నిప్పటియన్నట్లు" (2-393)

పరబ్రహ్మమొక్కటే! వివిధమతాల నాశ్రయించి అనేకాలయిన ఉపాసనామార్గాలలో పయనించే ఉపాసకులకు చిట్టచివరపొందదగిన పరతత్వం అదే. వైష్ణవులు విష్ణువని, వేదాంతులు పరబ్రహ్మమని, శైవులు శివుడని, కాపాలికులు భైరవుడని, శాక్తేయులు శక్తిరూపమని నానా విధాలుగా దర్శిస్తారు. అల్పబుద్ధిగలవారికి అల్పంగా, ఘనబుద్ధిగలవారికి ఘనంగా కనిపిస్తాయి. నీవలన లోపం కాదిది. గంగానది గట్టున బావులలో గంగా జలమే వూరుతుంది. భావనలో తేడా. నీటికొలది తామెరవు నీవే. మాకు శరణం.

"కొలువడీ భక్తి కొండలకోనేటి

నిలయుని శ్రీనిధి యైనవాని" (1-44)

దేవదేవుడు ఆదిదేవుడు అన్నీ అతనే అని కీర్తనలో స్తుతిస్తున్నాడు. ఆ కోనేటిరాయుని భక్తితో కొలిస్తే ముక్తినిస్తాడు. అతడు అభవుడు. వేదనాద వినోదుడు. సర్వభావతీతస్వభావుడు. అతన్ని కొలువమని మనకు హితవు చెప్తున్నాడు.

"పరమపురుష నిరుపమాన శరణు శరణు
రేయేయేయేయే ఇందిరా నిజ మందిరా" (2-367)

జానపద సరళిలో సాగిన ఈ కీర్తనలో వేంకటాధిపుని కొనియాడుతున్నాడు. అతని శరణుగోరుటయేగతి. నిరుపమానుడైన అతడు కమలనాభుడు, కమలనయనుడు, కమలచరణుడు, దేవతల నాయకుడు, వరదాయకుడు, చతురమూర్తి, శంఖచక్రధారియైన చతుర్బాహుడు.

శరణాగతులకు స్వామి పాదములే శరణ్యం. మరి ఆపాదము లెట్టివి. బ్రహ్మకడిగినవి. అహల్యాపాపముపోగొట్టినవి.కాళీయుని మదమడచినవి. చతుర్వేదసారంగా ఆ పాదాలను స్పృశించిన నాలుగు పదాలివి.

"బ్రహ్మకడిగిన పాదము
బ్రహ్మముతానె నీపాదము" - (1-191)
ఈ పాదమేగదా యిల ఎల్ల కొలచినది!
ఈపాదమేగదా ఇందిరా హస్తములకితవైనది" (1-66)

ఆ పరమాత్ముని పాదము సృష్టికర్త అయిన బ్రహ్మకడిగినది. త్రివిక్రముడైన వామనుడు కొలిచిన పాదము ఇదే. బలితలమీద, గగనముమీద నిలచినపాదమిదే! అహల్యాశాప విమోచనం చేసినపాదమిదే. కాళీయుని తలపై నిడినపాదమిదే. అట్టి తిరుమలేశా ! పరమయోగులకు పరతత్వాన్ని అందించేవి.

లోకంలోని జనులందరూ కొలచిన దీపాదమే అందరూ మ్రొక్కేది, గగనగంగ పుట్టినది. అన్నిటికంటె మిక్కుటమైనది ఈపాదమే. బ్రహ్మాండాన్ని అంటిన ఈపాదాన్ని ఇంద్రాదులు వెదికారు. గజరాజు శరణువేడాడు. నీపాద దర్శనం దుర్లభం. ఇహపరాల నొసగేది నీపాదమే గదాస్వామి.

"విష్ణుదేవుపాదములే విద్యాబుద్ధిమాకు
వైష్ణవులమైతి మింక వదలవోకర్మమా (4-149)
"నారాయణనిను నమ్మిన నాకును
మేరతో నీపాదమే గతిగల్గె" (4-402)

ఓ దేవా! నీపాదములే వైష్ణవులమైన మాకు విద్యాబుద్ధులు. ఇహపరములు, వేదశాస్త్రాల అధ్యయనం నీపాద దర్శనానికే. నీపాదములే నాకు దిక్కు దెస. అవేమాకు అన్నపాన భోగాలు, పాడిపంట, ముందు వెనుక దు:ఖాలను పొగొట్టే ఆయుష్కారులు ధనధాన్య ధర్మాలు.

నీపాదాలు నమ్మిన నాకు ఓ నారాయణా అదేగతి! చింతాసముద్రంలో కూరుకుపోయిన నాకు తెప్ప నీపాదమే. కాంతామోహంలో బంధాలను తెంచే పరశువు. పాప పంకాన్ని కడగటానికి నీపాదమే ఆకాశగంగ. కర్మతుల వేదనను చల్లార్చేవాన నీపాదమే! అజ్ఞానాంధకారాన్ని పారద్రోలే రవి నీపాదము! అట్టిపాదమే మాకు శరణ్యము.

"ఆదిపురుషా అఖిలాంతరంగా
భూదేవతారమణ భోగీంద్రశయనా" (4-37)

ధ్యానముద్రలో వున్న అన్నమయ్యకు ఆభవరోగవైద్యుడు, శేషాద్రివాసుడు, బహు విశ్వరూపుడు, భోగీంద్రశయనుడు ఆదిపురుషుడు దర్శనమిచ్చాడు. ఆవేశంతో వురకలు వేశాడు అన్నమయ్య. సంస్కృతపద జటిలమైన కీర్తన సురగంగ నుండి జాలువారింది. ఓ అఖిలాంతరంగా! నీవు భవసాగరాన్ని అంతమందించే బడబానలానివి. భవజీమూతాన్ని పారద్రోలే ప్రభంజనానివి. భవపర్వత ప్రళయాన్ని తొలగించే వాడివి. భవతిమిరాన్ని పారద్రోలే సూర్యుడవు. భవగజానికి సింహానివి. అట్టి మాధవరూపా! నమస్కారము.

"సర్వోపాయముల జగతి నాకితడే
ఉర్వీధరుడు పురుషోత్తముండితడే" (2-132)

శ్రీవేంకటేశ్వరుని శరణాగతికోరిన అన్నమయ్య వేంకటేశుని, వేంకటాచలాన్ని బహుధా ప్రస్తుతిస్తున్నాడు. స్వామిపుష్కరిణీ జలాలు సమస్తగంగాది తీర్థస్నాన ఫలాన్నిస్తాయి. వేంకటాచల విహారము సకల పుణ్యక్షేత్ర యాత్రలకు సమము. ఆ స్వామి సంకీర్తనం సమస్త వేదాధ్యయన శాస్త్రతుల్యం. ఇక్కడి కైంకర్యము సకల కర్మానుష్ఠానమునకు సమానము. ఉపవాస తపముల ఫలము ఇక్కడి ప్రసాద స్వీకరణమే స్వామిపాదశరణు వేడిగ్రోలిన పాదజలము జపతపముల ఫలము. ఇక్కడి వృక్షదర్శనము పుణ్యపురుష సందర్శనము. ఇక్కడి పక్షికిలకలము నిత్యపుణ్య కథాశ్రవణము. ఇక్కడి సహయోగము శ్రీ వైష్ణవ సాహచర్యము. ఇక్కడి తిరునాళ్ళు ఇతర మహోత్సవములతో సమానము. ఆ స్వామి శరణాగతియే నాదేవతా ప్రార్థన, నా సంపదలన్నీ అలమేలుమంగ కడగంటి చూపులు. ఈ విధంగా సమస్త పారమ్యాన్ని తిరుమలేశుని సేవగా అన్నమయ్య భావించటం ఇందులో విశేషం.

"కంటిగంటి నిలువు చక్కనిమేను దండలును
నంటు జూపులను జూచేనవ్వు మోము దేవుని" (పీఠిక 22) (అన్నమాచార్యచరిత్ర)

అన్నమయ్యకు ఆస్వామి విగ్రహాన్ని సందర్శించగానే సర్వాంగసుందరమైన ఆవిరాణ్మూర్తి గోచరించింది. ఉద్రేకభరితంగా సాగిన ఈ కీర్తనలో తిరుమలేశుడు మనకనులముందు సాక్షాత్కరిస్తాడు. భగవంతుని పాదములమొదలు శిరస్సు వరకు దర్శించడం సంప్రదాయం.

అదేపద్ధతిలో - కనకపు పాదములు, గజ్జులు, అందెలు, పీతాంబరము, కటారి, వడ్డాణము, మొలనూలు, నాభీకమలము, వరదకటి హస్తములు, శంఖచక్రహస్తాలు, కౌస్తుభహారము యెదపై శ్రీభూదేవులు, కంట సరులు, భుజ కీర్తులు, ముత్యాలనామము, కర్ణపత్రాలు శిరస్సుపై కిరీటము. ఇది ఆస్వామి చిత్రణ. వీటన్నింటినీమించి నిలువెత్తుదండలు నవ్వుమోము ఆస్వామి ప్రత్యేకత.

"అదివో అల్లదివో హరివాసము
పదివేలు శేషుల పడగలమయము" (1-23)

ఆ వేంకటనగము ఉన్నతోన్నతముగా అన్నమయ్య దర్శించాడు. ఆ హరి నివాసమైన శేషాచలాన్ని ముంగిటి మూలధనంగా భావించాడు. పదివేలశేషుల పడగలతో వేంకటాచలము మహోన్నతంగా కనిపిస్తోంది. బ్రహ్మాది దేవతలు అపురూపంగా భావించేది, అఖిలమునులు నిత్యనివాసముండేది ఆ వేంకటాచలము. దానిని సందర్శించి మొక్కి ఆనందమయ శేషాచలాన్ని భావించమని అన్నమయ్య ఉద్బోధిస్తున్నాడు. బంగారు శిఖరాలతో బ్రహ్మమయమైన ఆ వేంకటాచలము కైవల్యపదాన్నొసగిన పావనప్రదేశము. వేంకటాచలపతికి సిరినొసగినది సకల సంపద రూపము అదియే.

"కంటి నఖిలాండకర్త నధికునిగంటి
కంటి నఘములు వీడుకొంటి నిజమూర్తి గంటి" (4-58)

తిరుమలపై వివిధప్రదేశాలను అన్నమయ్య సందర్శించాడు. భావావేగం వుప్పొంగింది. ఉద్వేగభరితంగా ఆ నిజమూర్తిని సందర్శించిన పారవశ్యంలో తన పాపాలన్నీ పటాపంచలయి నాయని చెబుతున్నాడు. మణిమయమైన ఆశైలంపై అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుని వీక్షించాడు. మణిమయశైలంపై వైభవమండపాలు, నవరత్నకాంచనవేదికలు అద్భుత గోపురాలు చూసి పులకించాడు. పాపవినాశము, ఆకాశగంగాపుణ్యతీర్థాలు, పుష్కరిణి కనిపించాయి. వీటన్నిటికీ మించి పరమయోగీంద్రులకు భావగోచరమైన పాదాబ్జాలు చూచాడు. స్థిరమైన గిరిని చూపే దివ్య హస్తాన్ని కనుగొని ఆనందించాడు.

"కొండాచూతమురారో కొండొక తిరుమలకొండా
కొండనియడిగిన వరములొసగు కొండల తిమ్మయకొండా " (15-460)

తిరుమలగిరి అడిగిన వరములిచ్చే పుణ్యప్రదేశము. అక్కడి దైవము కొండల తిమ్మయ్య. బ్రహ్మదేవుడు మున్ను మేరు నగము స్తుతింపగా బ్రహ్మాండములకు ఆధారముగా కల్పతరువుగా సృష్టించిన కొండయిది. గరుడాచలమని, వేంకటశైలమని, అంజనాద్రియని, అనంతగిరియని, నాలుగు యుగాలలో వెలసినకొండయిది. పూపొదలు, తామర కొలకులు, మలయానిలము, కదళీవనములు, సంపదగాగల కొండయిది. ఇక్కడి జంతువులు మునులు -దేవతల.

జంతువుల అరుపులు వేదఘోషలు! ఇక్కడి రాళ్ళు చింతామణులు. నిరంతరము సందడిగల కొండయిది. బ్రహ్మాదులు ఇంద్రాదులు భాగవతులు సూర్యచంద్రులు, యోగీశ్వరులు తపస్సుచేయగా వారి ఆశలు తీర్చేకొండ.

ఇక్కడ శుకబ్రహ్మాదులు శుకాలతో కలిసి శ్రుతులు చదువుతారు. యోగీశ్వరులు నెమళ్ళను ఆడిస్తారు. మునులు పురాణాలు వింటారు. స్వామి పుష్కరిణి పాపవినాశము కుమారధార, పాండవసరసి, ఆకాశగంగ కోర్కెలను తీరుస్తాయి. కృత త్రేతా ద్వాపర యుగాలలో ఇదే పాలసముద్రము, ద్వారక, నందవ్రజము, అయోధ్య. ఇదే వైకుంఠము.

అట్టి కొండలలో నెలకొన్న కోనేటిరాయుడు వేంకటేశుడు. అతడు ఎందరో భక్తులకు వరము లిచ్చి కరుణతో పాలించినవాడు.

"కొండలలో నెలకొన్న కోనేటిరాయడు వాడు
కొండలంత వరములు గుప్పెడువాడు" (1-151)

భక్తవరదుడైన ఆ వేంకటేశుడు భక్తుల కోర్కెలు ఎన్నో రకాలుగా తీర్చాడు. కుమ్మరి కురువరతినంబి యిమ్మన్న వరములిచ్చాడు. నమ్మిన తొండమాన్ చక్రవర్తి రమ్మన్న చోటికి వచ్చాడు. ఆనంతాళువాన్‌కి వెట్టిచాకిరిగా మన్నుమోశాడు. తిరుమల నంబితో ఇచ్చకాలాడాడు. కంచిలో తిరుకచ్చినంబిని కరుణించి తన వద్దకు రప్పించు కున్నాడు. అట్టి కరుణాసింధువైన ఆకోనేటిరాయడు నిజంగా కొండలంత వరాలు ప్రసాదించేవాడు.

"గోవిందాశ్రిత గోకులబృందా
పావన జయజయ పరమానందా " (15-260)

భజనసంప్రదాయంలో గోవిందనామాలతో కొండ ఎక్కే పాదచారులు పరవశులై పాడుకునేందుకు అనువుగా తాళ బద్ధంగా సులభసంస్కృతంలో అనుప్రాసలతో సాగిన లలిత రాగంలోని కీర్తనయిది. ఆయన సహస్రనాముడు. జగదభిరాముడు. సుగుణధాముడు, మేఘశ్యాముడు, రఘువంశాబ్ధిచంద్రుడు, జననుతచరణుడు, దనుజహరణుడు, దినకర సన్నిభుడు, దివ్యాభరణుడు గరుడ తురంగుడు, శరధిభంగము చేసినవాడు. అట్టి వేంకటపతి స్తుతిపాత్రుడని అన్నమయ్య కొనియాడాడు.

"వినరో భాగ్యము విష్ణుకధ
వెనుబల మిదివో విష్ణుకధ" (3-355)

తత్వబోధ చేస్తున్న అన్నమయ్య విష్ణుకథలోని పారమ్యాన్ని వర్ణిస్తున్నాడు. ఆ విష్ణుకధ వినుటయే భాగ్యము. అది అత్యంతము మనకు వెన్నుదన్ను. నిత్యము మనము అనుష్ఠించే వేదము, నారదాదులతో కీర్తించబడేది. వ్యాసాదులు చెప్పిన పావనకథ, సంకీర్తనాయోగ్యము, వెదికినచోటనే కనిపించేది. గొల్ల ఇల్లాండ్రు చల్లలు చిలుకుతూ పాడుకున్నకధ ఈ విష్ణు కథ.

విష్ణుపురాణములు వేంకటేశ్వర నామము అభేదములని అన్నమయ్య భావన. దానిని గానంచేసి తరిద్దాం. అట్టి విష్ణుమూర్తి జానపదులనోటిలో విష్ణుమూరితి అయినాడు.

గ్రామ్య తెలుగు భాషలో భజన సంప్రదాయంలో ఇది పాడుకోవచ్చు.

వెట్టివలపు చల్లకు విష్ణుమూరితి నాతో
వెట్టదేర మాటాడు విష్ణుమూరితి" (15-241)

ఇదిపెద తిరుమలాచార్యుని సంకీర్తన. తండ్రిశైలిలోనే ఈయన కూడా ఎన్నో కీర్తనలు వ్రాశాడు. విష్ణుభక్తిని ప్రచారం చేయటానికి పామరులు ఆనందంగా పాడుకోవడానికి హృద్యపద్యంగా సాగిన కీర్తన ఇది. జానపదులు తనకట్టెదుట వున్న విష్ణుమూరితి తనపై వలపుచల్లి మాట బిగించాడని, నీ అవతారాలు మాకు తెలుసునని నిన్ను చూస్తే మాకు వెరపు కలుగుతోంది. నీమాయలు,. చేతలు మాకుతెలుసు. బహిరంతరాత్మకుడవైన నీవు వెల లేనివాడవు. దేశి కవితాగాన సంప్రదాయంలోని ఈ కీర్తనను మంచాళ జగన్నాధరావు స్వరపరచాడు.

అట్టి విష్ణుమూర్తి ముద్దుగారే గోపాల బాలుడై యశోదశిశువైనాడు.

"పరమపురుషుడు గోపాల బాలుడైనాడు
మురహరుడు ఎదుట ముద్దుగారే నిదివో " (12-17)

అవతారపురుషుడైన ఆ విష్ణువు గోపాలబాలుడై యశోద శిశువైనాడు. వేద పురాణాలలో వర్ణించబడే ఆదిమూలమైన ఆ పరబ్రహ్మము శ్రీదేవి పాలిటి నిధానము. తనను స్తుతించే నారదాదులకు ప్రత్యక్షమయ్యేవాడు. జీవుల్లో అంతర్యామి అయ్యేవాడు. బ్రహ్మకుతండ్రి అయినవాడు, ఇక్కడ వెన్న దొంగయై ఆటలాడుతున్నాడు. దేవతలను రక్షించే ఆ విష్ణువు ఇక్కడ గోపకాంతల కౌగిళ్ళకు కైవసమైనాడు. ద్వాపరయుగంలోని ఆ గోపాలకృష్ణుడు నేటి కలియుగ వేంకటాద్రి వరదుడు. ఆ వేంకటేశుని మంత్రము అన్ని మంత్రములకు సారము.

"అన్నిమంత్రములు నిందే ఆవహించెను
వెన్నతో నాకు గలిగే వేంకటేశు మంత్రము" (4-438)

ఈ వేంకటేశ్వర మంత్రములో సమస్త మంత్రాలు ఆవహించాయి. అదినాకు వెన్నతో బెట్టిన విద్యగా లభించింది. పూర్వకాలంలో నారదుడు జపించిన నారాయణ మంత్రము, ప్రహ్లాదుని నారసింహ మంత్రము, విభీషణుని రామమంత్రము నాకు అదృష్టవశాత్తు ఇందులోనే లభించింది. ధ్రువుని వాసుదేవ మంత్రము, అర్జునుని కృష్ణమంత్రము, శుకుని విష్ణు మంత్రములకు మూలమైన పరబ్రహ్మ తత్వమే ఈ మంత్రము; నాకీ మంత్రోపదేశమును గురుడు వెన్నెలవలె ప్రసాదించాడు.

ఇహపరములకు కలిమియైనది ఈ మంత్రము

కలదుతిరుమంత్రము కలదిహము పరము

కలిమి గలుగు మాకు కడమేలేదు" (3-531)

ఓకమలాక్షా! నీవు మా అందనుండగా మాకీ భూమిపై దొరకని సుఖము లేదు. నాలుకపై నీ నామము నర్తించగా ఇతరులను యాచింపనవసరములేదు. చక్రాంకితుడనైన నాకెదురేలేదు. నిన్ను సేవించే నాకు తీరని కర్మలేదు. అచ్యుతా! నీపై భక్తి ఆత్మలో నుండగా నే నే అపరాధము చేయను. నీ శరణాగతుడనైన నాకు ఎట్టి విచారములేదు "అనన్యాశ్చింత యంతోమా యేజనా:పర్యుపాసతే" అన్న గీతావాక్యానికి ఇది వ్యాఖ్యానప్రాయము

ఈఘన మంత్రాన్ని ధ్యానిస్తే ఏ విచారము లేదు.

"ఉన్నమంత్రా లిందు సరా వొగి విచారించుకొంటే

విన్న కన్నవారికెల్ల విష్ణునామ మంత్రము" (2-153)

వేదసారమైన ఈ వేంకటేశు మంత్రమునకు ఇతర మంత్రములు సరిరావు. రామానుజులు బోధించిన సకలవర్గాలవారు ఉచ్చరించ తగినదీమంత్రము. తాత్విక దృష్టితో చూస్తే దీనికి సాటి అయిన మంత్రం మరొకటి లేదు. దీనికి ఎట్టి శారీరక దోషములు అంటవు. ఏ జాతివారైన పఠించవచ్చు, ఇతరులకు బోధించవచ్చు. ఇహపరాల నొసగే ఈ మంత్రాన్ని నారదాదులు గానం చేశారు.

ఆకోనేటిరాయని సిద్ధమంత్రము రోగాలను పారద్రోలే దివ్యౌషధము. ఆ పురుషోత్తముడు అన్నమయ్యకు ప్రత్యక్షమైనాడు. అతడు పరవశించి గానం చేశాడు. ఓకులదైవమా! మాకు నీవు పెద్దలిచ్చిన నిధానానివి. మా ఆశాతృష్ణను తీర్చే కాలమేఘానివి. నిత్యము మామనస్సులో వుండే పారిజాతానివి, చింతామణివి, కామధేనువవు.

"పొడగంటిమయ్యా మిమ్ముపురుషోత్తమా మమ్ము

నెడయకవయ్యా కోనేటిరాయడా" (పీఠిక - 22)

వీధుల వీధులనేగే విట్టలేశా వట్టి

వేదలెల్లాబాసె నిక విట్టలేశా" (20-449)

అల్లరిగా వీధులలో తిరిగే విఠలునితో ఒక యువతి ఇలా సరసమాడుతోంది. వేడుకకాడవైన విఠలా వీడెమందుకోవయా ! చిరునగవులతో మావలపులను రెచ్చకొడుతున్నావు. వెలలేని మహిమలు గల విఠ్ఠలా బయలు లోపలి అంత నీవేనయ్య. మన్మధుని తండ్రివైన నీవు తేనెమాటలతో నా విన్నపమాలకించి నన్నుకూడితి విఠలా ! వేయి నామముల వెన్నుడా నీవే శ్రీ వేంకటాద్రివిఠలుడవు.

"నందనందన వేణునాద వినోద ము
కుంద కుంద దంత హాసగోవర్ధన ధర" (1-312)

ఈ సంస్కృత కీర్తనలో గోవర్ధన ధరుడు. నందనందనుడు, వేణునాద వినోదుడు ఐన స్వామి విభవాన్ని వర్ణించాడు. దనుజులను సంహరించినవాడు, తమోగుణ దూరుడు, కమలారమణుడు దేవోత్తముడు అయిన వాసుదేవుడే పన్నగశయనుడుని నరహరి నామధారియని కీర్తించాడు.

మా ప్రాణబంధువువై తిరిగే ఓస్వామీ మాకుమోక్షప్రదాతవూనీవే!

ఆ వేంకటపతియే రంగనాథుడు అతని శృంగారాలను ఓవనిత ఏకరువుపెడుతోంది

"రంగరంగరంగపతిరంగనాథ నీ
సింగారాలే తరచాయె శ్రీరంగనాథ " (17-101)

ఓస్వామి నీశృంగార చేష్టలకు మితిలేదు. పట్టపగలే నన్నుచూచి నవ్వుతున్నావు. నీ మాటలు ఎండిన వృక్షాలను సైతం చిగిరింపజేస్తాయి. నీవురట్టుచేయొద్దు. నాచనులపై చేయివేయవద్దు. రాత్రి నన్ను అభిసరించు. నీ నవ్వులకే నేను కరగిపోతున్నాను. నీవు కావేరీ నదీతీరంలో కాంతతో కూడి మరెక్కడికీ వెళ్ళడంలేదు. ఎక్కడ చూచినా నీవేకనిపిస్తు న్నావు. ఇది ఒక గోపిక అభినయంగా భావించవచ్చు.

అదే విధంగా ఆమె పాండురంగ విఠలుని కూడా భావిస్తోంది.

"రచ్చకెక్కితివి పండరంగవిఠలా
పచ్చిదేరేవింతలోనే పండరంగి విఠలా". (10-2-27)

"ఓ స్వామి ! నీపై కొసరి చూచినంత మాత్రాననే రట్టు చేసి నవ్వుతున్నావు. మురిపెపు మాటలతోనే నీవలపు బహిర్గతం చేస్తున్నావు. సైగ చేసి నంతనే ఆమెను రాగ జలధిలో ముంచుతున్నావు. నీ చేష్టలతో నీ మోహమంతా వెల్లడి చేస్తున్నావు". అని కోవెలకుంట్ల పాండురంగవిఠలునిపై కీర్తనను సంభావించాడు అన్నమయ్య.

వేంకటేశ్వరుని లీలామహత్యాలను తెలియజేసే ఈకీర్తనలో కోరినవరాలిచ్చే వరదునిగా స్తుతించాడు.

"వేదుకొందామా వేంకటగిరి వేంకటేశ్వరుని" (పీఠిక పుట 6)

శ్రీ వేంకటేశ్వరుడు ఆపద మొక్కులవాడు. అక్కడ నైవేద్యాలు రోజూకొత్తకుండలో పెడతారు. అతడు వడ్డికాసులవాడు. గొడ్డాండ్రకు బిడ్డలనిచ్చేవాడు. ఆ వేంకటగిరినాధుని వేదుకుందాం.

"వందేహం జగ( వ్వల్లభం దుర్లభం
మందరధరం గురుంమాధవం భూధవం" (15-235)

ఈసంస్కృతకీర్తనలో జగద్విభుడైన ఆ భూమాధవుని వివిధ రకాలుగా స్తుతించాడు. అతడు నరహరి, మురహరి, నారాయణుడు, అచ్యుతుడు, పురుషోత్తముడు, పుండరీకాక్షుడు, కరుణా భరణుడు, నంద తనయుడు, ఇందిరానాధుడు, యదుకుల గోవిందుడు, వామనుడు వాసుదేవుడు, శ్యామలకోమలశాంతమూర్తి.

అట్టి విష్ణుని మరొక దీర్ఘసమాసకీర్తనలో ఇలా స్తుతించాడు.

"కోరుదు నామది ననిశము గుణాధరు నిర్గుణకృష్ణుని
నారాయణు విశ్వంభరు నవనీతహారు" (1-141)

ప్రధానంగా విష్ణుని గుణగణాలను ఇందులో వర్ణించాడు. గరుడవాహనుడు, భవహరుడు, పన్నగశయనుడు, గానవిలోలుడు గోపాంగనామానసచోరుడు చక్రాయుధధారి, అట్టి నిర్గుణుని నామదిలో ధ్యానిస్తాను.

"మర్దమర్దమమ బంధాని
దుర్దాంతమహాదురితాని" (2-81)

ఈ కీర్తనలో భవబంధవిమోచకుడైన వేంకటేశ్వరుడు దురితాపహారియని స్తుతిస్తున్నాడు. అతడు శతకోటి రవిప్రభాసుడు. ఆతని క్రోధము చక్రాయుధముతో విక్రమమును ప్రకటించగల విస్ఫులింగకణము.

సుదర్శన చక్రాయుధముచే కోటికోటి భవ సంచితములను పొగొట్టగలవాడు, దైత్య సంహారము చేసి పరాక్రమోపేతుడైన అతడే మాకు ఇహలోకమున శరణు, రక్ష.

"వాడే వేంకటేశుడనే వాడెవీడు
వాడి చుట్టుకైదువ వలచేతివాడు" (1-121)

చక్రధారియైన ఆ వేంకటేశ్వరుడు నమ్మాళ్వారు మాటలకు చొక్కివేదరహస్యాలను తెలిపాడు. తిరుమంగై ఆళ్వారు దొంగిలించి తెచ్చిన వస్తువులతో చేసిన తదీయరాధనకు ఇష్టపడేవాడు. గోదాదేవి తాను ధరించి సమర్పించిన మాలను ప్రీతిగా అలంకరించుకున్న వాడు. గోపికలను పరవశింపజేసిన వాడు, మామ కూతురైన అలమేలుమంగతో వేంకటగిరిపై కొలువుతీరాడు. ఇక్కడ నలుగురు ఆళ్వారుల ప్రసక్తి తెచ్చాడు. నమ్మాళ్వార్, తిరుమంగై, పెరియాళ్వార్, గోదాదేవి. ఆయన చేతిలో కైదువ అనే ఆయుధం ధరించివున్నాడు.

"తరుణి నీ అలుక కెంతటి దింతినీ వేళ
కరుణించగదర వేంకటశైలనాథ!" (5-70)

ఓస్వామి ఈ యింతిపై నీవు అలుక వహించడం భావ్యమా! కరుణించవయ్యా! విరహాతురయైన ఈమె ఒక్కొక్కసారి సంసారంపై విరక్తి చూపుతుంది. ఒకమారు విధి చేష్టలను పొగడుతుంది. ఒకసారి తలవూచి ఆనందంతో మైమరుస్తుంది. పరవశించినవేళ నిన్ను తలపోసి నవ్వుతుంది. సిగ్గుపడుతుంది. మరుక్షణంలో అంతామరచిపోతుంది. ఒకసారి వదలిన మొలనూలు ముడివేస్తుంది. కురులను సవరించుకొంటుంది. చతురుడవైన నిన్ను వదలలేక విరహార్త అవుతుంది.

"ఇతడొకడే సర్వేశ్వరుడు

సితకమలాక్షుడు శ్రీ వెంకటేశుడు" (4-298)

ఇతడొక్కడే సమస్త దేవతా అధినాధుడు. పరమయోగీంద్రులకు నిధి. ఇంద్రాదులకు ఐశ్వర్యదాత. గొల్లెతల పాలిటిసిరి. యశోద కన్న బిడ్డడు, గజవరదుడు, ద్రౌపదీమాన సంరక్షకుడు, మునులతప: ఫలము. త్రిమూర్తులకు మూలమైనవాడు. అట్టివేంకటేశుడు అలమేలుమంగాపతి.

"ఇతరులకు నిను నెరుగదరమా

సతత సత్యవ్రతులు సంపూర్ణమోహవిర

హితు లెరుగుదురు నిను నిందిరారమణా"! (1-252)

ఓస్వామి! నీమహిమలు తెలుసుకొనుట నాతరమా! యోగులు, మాయా విమోహితులు మాత్రమే నిను నెరుగ గలరు. కాంతావ్యామోహదూరులైనవారికి మాత్రమే నీపై దృష్టి తగులుకుంటుంది. సంసారలంపటాలకు దూరులైనవారు మాత్రమే నీదివ్యవిగ్రహాన్ని చూడగలరు. అరిషడ్వార్గాలను జయించినవారు మాత్రమే నిన్ను కీర్తించే విధానాన్ని తెలుసుకోగలరు. స్థితప్రజ్ఞులు మాత్రమే నిను కీర్తించగలరు. పరోక్షపద్ధతిలో భగవద్దర్శనాన్ని చెప్పడం జరిగింది.

"నీకథామృతము నిరతసేవననాకు

చేకొనుట సకల సేవనంబటుగాన" (1-4-48)

నవవిధభక్తులలో భాగవతకథాశ్రవణము ప్రధమము. నీకథామృతసేవ నాకు సకల సుఖదాయకము. నీకథామృతసేవే నాకు మంత్రరాజము. వేదసంహితపాఠము, సంధ్య, బ్రహ్మవిద్యోపదేశము, దు:ఖవిరహిత మార్గము, సకలలోకాలలో అది మేలు చేకూర్చేమందు. ఉపనిషద్వాక్యమై దానఫలమై అదియే సమస్తము. ఆసుఖాలను అనుభవిద్దాం.

శరణు శరణు సురేంద్ర సన్నుత

శరణు శ్రీసతివల్లభా

శరణు రాక్షసగర్వసంహార

శరణు వేంకటనాయకా" (పీఠిక 67)

ఇది భజన సంప్రదాయ పద్ధతిలో ప్రచారంలో వున్న కీర్తన ఓ వేంకటనాయకా! నీకు శరణు శరణు కమలధరుడు, కమలమిత్రుడు (సూర్యుడు) కమల శత్రుడు (చంద్రుడు) కమలపుత్రుడు (బ్రహ్మ) నిను కొలవడానికి నిరీక్షిస్తున్నారు. దేవతలు, మునులు, దిక్పాలురు, కిన్నరులు, సిద్ధులు, రంభాద్యప్సరసలు, నీకోసం వేచి వున్నారు. ప్రహ్లాదాది భక్తులు నిన్ను సేవించటానికి వచ్చారు. వారి విన్నపాలు వినవయ్యా.

"అన్నివిభవముల అతడితడు

కన్నులు వేవేలుగల ఘనుడితడు" (4-23)

శ్రీవేంకటేశ్వరుడే సమస్తము, సహస్రాక్షుడైనవైభవోపేతుడతడు. వేదాంతకోటికి అధినాయకుడు. నాదబ్రహ్మమయుడు ఆద్యంతములు లేనివాడు, భవాలను పోగొట్టే భువన రక్షకుడు. ఆంజనేయునికి ప్రభువు. గరుడవాహనుడు. పరమ పదాన్ని ప్రసాదించే దేవుడు.

"ఇందిరారమణు దెచ్చి యియ్యరో మాకిటువలె

పొంది ఈతని పూజించపొద్దాయ నిపుడు" (4-430)

పూజకు వేళయినది పూజావిగ్రహం కనిపించలేదు. మాస్వామిని మాకు తెచ్చి యివ్వమని అన్నమయ్య పరిపరి విధములపెక్కురను అర్థిస్తున్నాడు. మైరావణుని దండించి రాముని తెచ్చిన ఓ ఆంజనేయా! నాగపాశబంధముల నుండి విడిపించిన ఖగరాజా! స్తంభములో నారసింహుని జాడ దెలిపిన ఓ ప్రహ్లాదా! శ్రీకృష్ణుని సారథిగా నిలుపుకున్న ఓ అర్జునా! ఓకార్తవీర్యార్జునా, ఓఆదిశేషా! మాదేవుని వెదికి తెచ్చిపెట్టండి.

"చూడజూడ మాణిక్యాలు చుక్కలవలె నున్నవి

ఈడులేని కన్నులవె ఇనచంద్రులు" (1-133)

శ్రీ వేంకటేశ్వరుని శిఖనఖ పర్యంతం ఈ కీర్తనలో వర్ణించాడు. సూర్యచంద్రులు కన్నులుగా, మాణిక్యాలు చుక్కలుగా భాసించాయి. ముత్యాల కంఠమాలలు మెడలో వ్రేలాడుతున్నాయి. కిరీటమునకు ఇరువైపులా శంఖచక్రాలు ప్రకాసిస్తున్నాయి. మోముపై జిగినగవు అందంగా మెరుస్తోంది. భుజకీర్తులు, యెదపై అలమేలుమంగ, మొలకతారి, పట్టు పీతాంబరమును ధరించిన ఆస్వామి ముంగిటి నిధానంగా కనిపిస్తున్నాడు.

"అంగనకు నీవె అఖిలసామ్రాజ్యము

శృంగారరాయడ నీకు శ్రీసతి నిధానము" (9-299)

ఓ శృంగారరాయా! శ్రీసతికి నీవే సకల సామ్రాజ్యము. నీకు ఆమెయే నిధానము. నీ ఉరము ఆమెకుపానుపు. నీమనసు పాలజలధి, నీభుజలతలు పొదరిల్లు. నీమెడ రతి సామునకు స్తంభము. నీకౌస్తుభమణి నిలువుటద్దము. శ్రీవత్సము రాజముద్ర అలమేలుమంగ పెండ్లి పీట నీకౌగిలి. చందన చర్చే తలబ్రాలు. ఈ విధంగా ఆమెకు సకలము నీవే.

"త్వమేవ శరణం త్వమేవశరణం
కమలోదర శ్రీజగన్నాథ" (1-323)

భజనసంప్రదాయంలోని సంస్కృత కీర్తన ఇది. స్వామినామాలు బహువిధాలుగా పేర్కొనబడ్డాయి. కమలోదర, జగన్నాథ, వాసుదేవ, కృష్ణ,వామన, నరసింహ, పురుషోత్తమ, బలభద్రానుజ,కుంజర వరద, సురేశ్వర, సుభద్రానుజ, వటపత్రశయన, శృంగారాధిప, వేంకటగిరి నిలయా, నిత్య వైభవరాయా! నీవేశరణం.

"చేరికొల్వరో యాతడు శ్రీదేవుడు
ఈరీతి శ్రీ వేంకటాద్రి నిరవైన దేవుడు" (4-297)

వేంకటాద్రిపై నెలకొన్న శ్రీ మహావిష్ణువు అతడే. అలమేలుమంగను ఎదపై నిలిపినవాడు, శంఖచక్రధరుడు, కటివరదహస్తుడు, శ్రీవత్సాంకితుడు, మకరకుండలధారి కనక పీతాంబర వసనుడు, పాదములయందు గంగకు నెలవైనవాడు, కోటి మన్మథాకారుడు అతడే వేంకటాద్రి నిలయుడు. అతనిని చేరికొలవండి.

ఆరగింపవో మాయప్పయివే
పేరిన నేతులు పెరుగులును (6-4)

ఈ కీర్తనలో ఆంధ్రుల భోజనసౌభాగ్యాన్ని, రాయలసీమలోని నైవేద్య పాత్రమైన వివిధ భక్ష్యాలను అన్నమయ్య వర్ణించాడు. కనకపు పళ్ళెరాలలో రాజాన్నాన్ని సమర్పించి, వివిధ ఫలాలు భక్ష్యాలు వడ్డించాడు. నోరూరించే ఆ రుచులు ఆస్వాదిద్దాం. తేనెలు, జున్నులు, టెంకాయపాలు, వెన్నఅట్లు, బూరెలు, వడలు, పానకములు, పరమాన్నములు, పంచాదారలు, అరిశలు, గారెలు, కజ్జికాయలు , వివిధ భక్ష్యాలు, పూర్ణకుడుములు, ఇడ్డినకుడుములు, అప్పాలు, పొడి బెల్లము, మిరియాలు, యాలకలు, దధ్యన్నము, కూరలు పప్పులు ఇలా ఒకటేమిటి అన్నీ ఆ స్వామిని ఆరగించమని పేరిన నేయి ,పెరుగులతో వడ్డిస్తున్నాడు అన్నమయ్య.

"ఆరగించె నమ్మనేడు శ్రీవేంకటేశుడు" (27-21)

ఇందులో స్వామి ఆరగింపునకు విందు భోజనం ఏర్పాటు చేశాడు అన్నమయ్య. సతులందరు సరస సల్లాపాలతో ఎంగిలి చవిచూచి వడ్డించగా స్వామి ఆరగించాడు. గొల్ల యిల్లాండ్రు అందించిన పాలు, పండ్లు, బువ్వము ఉల్లాసంగా ఆరగించాడు. అలివేణులందరూ

కొత్తకొత్త భక్ష్య భోజ్యాలు వేడుకతో అంత:పురంలో విందుగా ఏర్పాటు చేశారు అలమేలుమంగ వేంకటేశునకు మోవితేనియల తీయని విందు యిచ్చింది.

"ఇందిర వడ్డించ నింపుగను
చిందక భుజించవో స్వామి " (1-22)

ఓస్వామి! ప్రీతితో ఇందిరాసతి వడ్డించిన భోజనాన్ని యింపుగా ఆరగించు. ఈ కీర్తనలో ఆనాటి ఆహార పదార్థాలను భక్ష్యభోజ్యాలను అన్నమయ్య విస్తరించాడు. అక్కాళపాశాలు, అప్పాలు, వడలు, పేణులు, మధుర పదార్థాలు, నేయి, మిరియంపు తాళింపు కూరలు, పచ్చళ్ళు పిండివంటలు, పాలు, పెరుగు, పాయసాలతో కూడిన దివ్యాన్నపురాసులు వడ్డించారు. నీవు మెచ్చిభుజించు.

"పంకజాక్షులు సొలసి పలికి నగగా
నింకా నారగించు మిట్లనే అయ్యా (1-138)

ఈ కీర్తనలో కూడా సరసులైన వనితలు నవ్వుతూ వడ్డిస్తున్న పదార్థాలను భుజించమంటున్నాడు. రకరకాల వంటకాలు - పులగములు, పెరుగన్నము, అప్పాలు, నేతులు, మధుర పదార్థాలు, పలురకాల పిండివంటలు, పొడిబెల్లము కలుపుకొని పప్పులతో ఆరగించవయ్యా! మీగడపెరుగులు ఊరగాయల రుచులతో పళ్ళెరంలో నవకాయ పిండివంటలు ఆరగించవయ్యా!

"హరి నీవే సర్వాత్మకుడవు
ఇరవగు భావన ఈయగదే ! (4-441)

ఓహరీ! నీవే సర్వాత్మకుడవనే భావన నాలో కలిగించు. ఈ దేహం పూర్వజన్మల పాపకర్మలతో అరిషడ్వర్గాలతో పుట్టినది. అందుకే ఇంద్రియాలు చాంచల్యానికి లోనై విషయాసక్తిని కలిగి వుంటాయి. సమస్తాన్ని నీకర్పించే ఇహలోక జ్ఞానాన్ని నాకు ప్రసాదించు, ఇందులో సాధకుని చిత్తవృత్తి వర్ణించబడింది. అట్టి సాధకునకు అంతా విష్ణుమయం.

"ఎదుట నెవ్వరులేరు ఇంతా విష్ణుమయమే
వదలక హరిదాస వర్గ మైన వారికి" (1-502)

హరిదాసులకు జగత్తు అంతా విష్ణుమయమే. ఎదుట ఎవరూ లేరని భావిస్తారు. కనిపించే అక్షరాలన్నీ నారాయణనామాలు. భూమిపై ప్రవహించే నదులన్నీ స్వామి పాదతీర్థమే. మనము నివసించే భూమి అతని పాదరేణువే. తాము చేసే ప్రతిపనీ కేశవార్పణమైన కైంకర్యమే. చిత్తములో నెలకొన్నది వేంకటేశ్వరుడు. సమస్తప్రకృతి అతనిమాయ. అతనికంటె మత్తిలజేసే భావము మరొకటి లేదు. ఈ దేహము బుద్బుదప్రాయమని తెలిసినవారికి ఈ మాయ తెలుస్తుంది.

"చాలదాబ్రహ్మమిది సంకర్తనం నీకు
జాలెల్ల నడగించు సంకీర్తనం". (1-343)

సంకీర్తనము పరబ్రహ్మ స్వరూపము. జీవుల బాధలను తొలగించే దివ్యేషధము, సంతోషకరమైనదీ, తాపాన్ని అణచేదీ, జీవులను రక్షించేది ఈసంకీర్తనమే ! గజేంద్రుని రక్షించినదీ, సామవేదాన్ని మించినదీ, సులభసాధ్యమైనదీ ఈ విష్ణు సంకీర్తనము యముని బారినుండి రక్షించేది, ద్వంద్వాతీత స్థితిని కలిగించేది, అనితరసౌఖ్యాల నందించేది, శమదమాదులచే కీర్తించేది, బ్రహ్మపలికే వేదము, పార్వతి చేసే సంకీర్తనము ఇదే దానిని మీరు పట్టుదలతో చేయండి ఆ వేంకటపతి సమస్త సంపదలు ఇస్తాడు.

"అదెచూడరే మోహన రూపం
పదికోట్లుగల భావజరూపం" (24-208)

అన్నమయ్యకు స్వామి ప్రత్యక్షమయ్యాడు నవకోటి మన్మధాకారుడైన ఆ స్వామిని మనల్ని చూడమంటున్నాడు. పదారువేల మగువలను మురిపించిన రూపమూ, నందవ్రజ గోపకాంతల చిలిపి చూపులకు గురియైన రూపముఅదే. వక్షస్థలమున ఇందిరను, కౌగిట భూదేవిని నిలిపిన వేడుక రూపమిదే ! త్రిపుర సతులను రమించిన మోహనరూపమిదే ! అట్టి ఉన్నతరూపముగల వేంకటపతిని ఉపమించలేము.

"వాడె వేంకటాద్రిమీద వరదైవము
పోడిమితో పొడచూపె పొడవైన దైవము" (1-422)

అదిగో! మహోన్నతాకారంలో వేంకటాద్రిమీది పరమదైవము అతని ఒక్కొక్క రోమకూపాన బ్రహ్మండకోట్లు పిక్కటిల్లాయి. తనలోని చతుర్దశభువనాలను కొలిచిన పాదము గల దొడ్డదైవము. వేదశాస్త్రాలు కనుగొనలేని గుణగణాలుగల మూల దైవము. సృష్టికర్త యైన బ్రహ్మనుకన్న దైవము. శంఖచక్రాలతో రాక్షసులను సంహరించిన దైవము. అట్టి వేంకటేశ్వరుడు శరణాగతులను కాచే దైవము.

"కరుణానిధిం గదాధరం
శరణాగతవత్సలంభజే" (1-342)

ఈ సంస్కృతకీర్తనలో వేదనిలయుడైన ఆ వేంకటేశుని స్తుతి ఇమిడివుంది శరణాగతవత్సలుడు కరుణానిధి అయిన అతనిని భజిస్తాను. గదాధరుడు కౌస్తుభా భరణభూషితుడు, వరదుడు, సకలరక్షకుడు, సేవక పాలకుడు, ఉరగశయనుడు, గరుదారూఢుడు, దనుజభయంకరుడు, లంకాహరణుడు, లక్ష్మీరమణుడు అయిన ఆస్వామికి నమస్కారము.

"ఇంతకంటె ఘనమికలేదు

సంతతసౌఖ్యము జనార్ధనుడే" (3-259)

వేంకటేశ్వరుని బాగుగా సేవించుట ఎరిగిన ప్రపన్నులకు ఇంతకంటె మరొకటి గొప్పకాదు. అతనిని స్తుతించుట భయనివారణము, జయ కారణము, అతని సేవఅంచిత పుణ్యఫలదాయి. నిజమెరిగిన వారికి ఆ శ్రీకాంతుని దర్శనము కర్మహరము. అతని తోడి సఖ్యము అనంతసంపద లందించును. దానికి నిర్మలదాసబుద్ధికావాలి. ఆగమోక్తంగా విష్ణుని కైంకర్యము జరిపితే అదే భోగము.

"ఈతడఖిలంబునకు నీశ్వరుడై సకల

భూతములలోన తా బొదలువాడు" (1-170)

'ఎవ్వని చేజనించి జగము ఎవ్వనిలోపలనుండు లీనమై' అన్నభాగవత సూక్తినిధికి తార్కాణంగా ఈకీర్తన చెప్పవచ్చు సకలభూతాలలో నివసించేది అతడే గోపాంగనల చనుదోయిపై చందన చర్చ యితడే. తాపసోత్తముల మానససౌధాలలో జ్ఞాన దీప మితడే ఇందిర కడగంటి చూపులలో వెలిగే కాటుక ఇతడే. బ్రహ్మనోటినుండి వెలువడిన వేదామృత మితడే వధువులను సురతసంపదలతో పరవసింపజేసినది ఇతడే. వేంకటాద్రిపై నిలిచి సమస్తపరిపాలనాభారాన్ని వహించిందితడే.

"అరుదరుదు నీమాయ హరిహరీ

అరసి తెలియరాదు హరిహరీ" (1-480)

తత్వగీత ధోరణిలో సాగిన ఈకీర్తనలో శ్రీహరిమాయలు తెలియరానివంటున్నాడు. రోమకూపాలలో అనంతబ్రహ్మాండాలు వున్నాయి. క్రుంగినభూమిని ఎత్తిన నీ అవతారాన్ని ఏమని పొగడేది. బ్రహ్మాదులు నీ బొడ్డునుండి పుడుతున్నారు. అట్టినీవు జీవులను పుట్టించే సామర్ధ్యం గలవాడువని చెప్పవలెనా? భక్తియుతుడైన వాడికి నీ పాదమూలము నందే వైకుంఠమున్నది తిరుమలపై నీవుండగా ఇతర చోట్ల వెదక నేల?

అంతయనీవే హరిపుంరీకాక్ష

చెంత నాకు నీవే శ్రీ రఘురామా" (1-385)

ఆ శ్రీహరియే తనకు సమస్తము. కులము, కలిమి, తలపు, నెలవు ఆగోవిందుడే. తనువు, మనకి, వినికి, వెనక ముందరలు ఆ మధుసూదనుడే ఆద్యంతాలు ఆనారాయణుడే. అట్టివేంకటేశ్వరుడే తనకు గతి.

"హరి రసమ విహారి సతు

సరసోయం మమ శ్రమ సంహారి" (6-45)

ఆ పరమాత్మ నాకు శ్రమ సంహారి. దయానివృతమైన తనువును ధరించినవాడు. క్రియా విముఖులైన వారి పట్ల కృపాణమును ధరించినవాడు. ఆశ్రితులకు సదా రక్షకుడు. సుస్థిరమైన ఆనందాన్ని ప్రసాదించిన ఆ తిరుమల నాయకుడు దివ్య వినోది.

"తిరుమలగిరిరాయ దేవరాహుత్తరాయ
సురత విన్నాణరాయ సుగుణ కోనేటిరాయ" (2-459)

ఆ వేంకటరాయడు నన్ను కరుణించి నందున నేను శ్రీమంతుడను అతడు సుగుణాలవాల కోనేటిరాయడు. సకలవినోదరాయడు వనితలపావి విటరాయడు కొండలకోనేటి రాయడు గొల్లెతలపాలి ఉద్దండరాయడు. అతడే వలరాయడు సర్వమోహనరాయడు సామసంగీత రాయడు అతనిని కామించి కోరితే నన్ను కరుణించాడు. అట్టి వేంకటరాయనికి జయము జయము.

## గోవిందరాజస్వామి

అన్నమయ్య దిగువ తిరుపతిలో వెలసిన గోవిందరాజుని వైభవాన్ని కొన్ని కీర్తనలలో ప్రస్తుతించాడు. ఆయన శయనరూపంలో మనకు దర్శనము యిస్తాడు

"అలవటపత్రశాయివైన రూపమిట్టిదని
కొలువై పొడచూపేవా గోవిందరాజా! (1-478)

పరుండియుండే గోవిందరాజస్వామిని చూడగానే అన్నమయ్యకు వటపత్రశాయి గుర్తుకు వచ్చాడు. తిరుపతి క్షేత్రంలో గోవిందరాజస్వామి పాదాలవద్ద శ్రీ భూదేవులిద్దరూ ఉన్నారు. నాభికమలం వద్దకొడుకు బ్రహ్మదేవుడున్నాడు. ఆదిశేషునిపై పవళించి దాసులను కృప జూస్తున్నాడు పామువిషములే రాక్షసులపై కురియించాడు. చేతుల్లో శంఖుచక్రాలు శిరసుకింది హస్తంతో గోవిందరాజ వరదుడైనాడు.

ఇంచుమించు అదే భావంతో కీర్తించిన మరో కీర్తన.

"కొమ్మలాల ఎంతవాడె గోవిందరాజు
కుమ్మరించీ రాజసమే గోవిందరాజు (7-470)

ఇందులో అధికంగా తన వద్ద సేవ సేసే సతులకు వలపులుకురిపించి రాజసాన్ని ప్రకటించే స్వామిని కనులెదుట ప్రత్యక్షం చేసినాడు. పడుకున్న ఆస్వామి వామకరంచాచి కుడిచేత కొప్పు ఎత్తినాడు. కుప్పెకటారము ధరించినాడు ఇలాంటిదే మరో కీర్తన.

"కొలువైవున్నాడు వీడె గోవిందరాజు
కొలకొల నేగి వచ్చేగోవిందరాజు" (13-168)

వైభవోపేతుడైన గోవిందరాజస్వామి ఇరువైపుల దేవేరులతో గొడుగుల నీడన కొలువైవున్నాడు. ఉత్సవమూర్తి యై పౌజులతో ముందుకు సాగే ఆస్వామి పెద్దపూదండలతోను, వింజామరతోను కొప్పుపై చుంగులతోను కుప్పికటారముతోను సింగరాలు ఒలకబోస్తున్నాడు. కురులుసరిదిద్దుకున్న ఆ రాజసమూర్తి వరాలు కురిపిస్తున్నాడు.

"కోరికలు కొనసాగే గోవిందరాజ
మేరమీర ఇట్లానే మెరసితివా" (25-285)

గోవిందరాజా! నీప్రభాకాంతులు ఇలా మెరుస్తుండగా నా కోరికలు కొనసాగుతున్నాయి. ఆనాడు రేపల్లెలో బాలుడవై యిలానే పవళించి పాలుతాగావా? గొల్లెతలు ఊయలలో వుంచి జోలలుపాడగా ఆలకించావా! మధురలో కుబ్జయింట పవళించటం మరిగావా! ద్వారకలో సత్యభామతో ముచ్చటలాడావా! పదారువేలకాంతల పాలిండ్లే తలగడలుగా భోగించిన నీవు యిక్కడ తిరుపతిలో శ్రీ భూనీళలను కూడిఆడుతున్నావా !

"కొమ్మలు పాదాలొత్తగ గోవిందుడు
యెమ్మెలకే పవళించె నిదివో గోవిందుడు" (27-379)

గోవిందరాజస్వామి పవళించియున్న సందర్భాన్ని అన్నమయ్య ప్రస్తుతిస్తున్నాడు. శ్రమానంతరం పవళించినట్లుగా భావించడం ఇందులో విశేషం. గొల్లెతలతో సరసాలాడి అలసిపోయాడో ! బృందావనాన ఆవులను కాచి వచ్చి అలసి పోయాడో గోప బాలురతో గచ్చకాయలాడి పవళించాడో! గోవర్ధనధారణ భారంచే అలసిపోయాడో! తెలియడంలేదు. అక్కడ తిరుమలలో నిలుచున్న శ్రీవేంకటేశ్వరుడు ఇక్కడ తిరుపతిలో పదారువేళ భామలను వావివరుస లెంచుకుంటూ పవళించాడని చమత్కరించాడు.

## పూజలు

"నిత్యపూజలివిగో నెంచిన నో హెూ
ప్రత్యక్షమైనట్టి పరమాత్మునికి" (2-82)

దేహమే దేవాలయం. అందులో దేవుడుజీవుడు. ఈ పవిత్రభావంతో సార్థకజీవితాన్ని మానవుడు గడపాలి. స్వామియే తన సర్వస్వమని భావించిన అన్నమయ్య స్వామిని ఆవాహన చేసుకొన్న రీతిలో సాగింది ఈ కీర్తన. తనువును గుడిగా, శిరమును, శిఖరముగా, హృదయాన్ని హరిపీఠంగా, కనుచూపులు దీపాలుగా పలుకులు మంత్రాలుగా నాలుక నైవేద్యపుగంటగా తాను భూజించేదే నైవేద్యంగా తనలోని అంతర్యామికి సమర్పించుకుంటున్నాడు.

"షోడశకళానిధికి షోడశోపచారములు
జాడతోడ నిచ్చలును సమర్పయామి" (2-134)

భగవంతునికిషోడశోపచారాలు చేస్తాము. ఇక్కడ ఆషోడశకళానిదికి దాస్యభావంతో అర్పిస్తున్న ఉపచారాలను పేర్కొంటున్నాడు. ఆ వాహనము, ఆసనము, అర్ఘ్య పాద్య ఆచమనాలు, ఆ విశ్వాత్మకునకు, గంగాజనకునకు సమర్పిస్తున్నాడు. జలదిశాయికి మజ్జనమేమి? పీతాంబరునకు వస్త్రాలంకారము, శ్రీమంతునకు భూషణములు, ధరణీధరునకు గంధపుష్ప ధూపములు అందిస్తున్నాడు కోటి సూర్యతేజమునకు దీపం. అమృతమధనునకు నైవేద్యం, అలానే కపురపువిడెము ఆదేవదేవునకు ఇవే ప్రదక్షిణాలు దండములు. ఈ పాటలో అన్ని ఉపచారాలు కైంకర్య భావంతో అందిస్తున్నాడు. అంతగొప్ప స్వామికి ఇంత చిన్న సేవలు.

"నిండుమనసే నీపూజ
అండగోరకుండు టదియు నీపూజా" (3-320)

'ఇందుగలడందు లేదని సందేహము వలదు' అన్న సూక్తికి నిదర్శనంగా ఈకీర్తన భాష్యం చెప్పింది. నిండు మనసే ఆస్వామి పూజ, ఇందు గలడందు లేదనుటకు దూరమగుటయే ఆయన పూజ. కొందరు మిత్రులు, కొందరు శత్రువులు అనే ద్వైదీభావానికి దూరం కావటమే ఆస్వామిపూజ. దూషణభూషణలు సమానంగా భావించడమే నీపూజ. ఇనుము బంగారు ఒకటిగా భావించడమే నీ పూజ. సమస్తము నీవేనని భావించడమే నీపూజా. నీ దాసుల సేవే ముందటిదని తలచే బుద్ధి నీపూజ.

"ఇంతకంటె నేమిసేసే మిదే మా మానసపూస
సంతతము నీవు తొల్లే సర్వసంపన్నుడవు" (2-272)

షోడశోపచార సంపన్నుడైన ఆస్వామికి మానసపూజ అర్పించి అన్నమయ్య ధన్యుడైనాడు. అంతర్యామియైన అతనికి ఆవాహనము, ఆవిష్ణునకు ఆసనము, కోనేటి జలము అర్ఘ్యము, గంగాజలము పాద్యము, జలధులు ఆచమనము, వరుణజలముస్నానము మహిమలు వస్త్రాభరణములు, వేదములు యజ్ఞోపవీతములుగ భావించాడు. పైపెచ్చు కుబ్జ యిచ్చిన గంధము, మాలకారుని పూలమాలలు మౌనుల హోమధూపము, రవితేజదీపము, అమృతములే నైవేద్య తాంబూలాలు, జవముల నుతులు అలవేలుమంగావతి షోడశోపచారములు అందుకొంటున్నాడు.

"దొరకెగా పూజ కందునపూజ నీ
విరహపు తను తావి విరవాదిపూజ" (5-95)

అలమేలుమంగ స్వామికి పూజోపచారాలను సమర్పిస్తున్నది. విరహపు తను తావితో విరవాదిపూజ, కనుచూపులతో కలువరేకులపూజ, నగవుతో మొల్లల పూజ, తలపోతలతో కమలపు పూజ, వేడి నిట్టూర్పులతో సంపంగి పూజ, చెక్కున చేయి జేర్చి కర పల్లవపూజ, తనుపులకరింతలతో జాజి మొగ్గలపూజ వళులే దొంతరపూలపూజ, చమట మల్లెమొగ్గలపూజ,

గోళ్ళతో గేదంగిపూలపూజ చనుగుబ్బల పూవు గుత్తులపూజ మోవి మంకెనపూవు పూజ యిలా సమస్త పూజలు అమ్మ సమర్పించింది.

వివిధనామాలతో సంస్తుతించే ఈ కీర్తనలో భగవన్నామాలు కనిపిస్తాయి.

"మాధవా కేశవా మధుసూదనా విష్ణు
శ్రీధరా పదనఖాంచింతయామి యూయం" (4-330)

ఓస్వామి! నీపాద నఖలపైనే నిరంతరం దాస్య బుద్ధితో నిన్ను భజిస్తాను అని చెప్తూ వివిధ నామాలను ఉటంకించాడు. మధవా, కేశవా, మధుసూదనా, విష్ణు, శ్రీధరా, వామనా, గోవింద, వాసుదేవ, ప్రద్యుమ్న రామ, రామకృష్ణ నారాయణ, అచ్యుత. దామోదరా, అనిరుద్ధ, పుండరీకాక్ష, పురుషోత్తమా, హిరి, సంకర్షణ, అధోక్షజా, నారసింహ, హృషీకేశ, నగధర, త్రివిక్రమ జనార్ధన అని నామాలు సంకల్పించి ఆపైన మత్స్యకూర్మాది దశావతారాలను స్తుతించాడు.

ఇదే రీతిలో మరో కీర్తనలో మరికొన్ని నామాలు స్తుతించబడ్డాయి.

"అపరాధిని నేనైనాను
కృపగలవారికి కపటము లేదు" (2-326)

ఈ కీర్తనలో అపరాధభావంతో స్వామిని అర్చిస్తూ ఈదాసునికి బుద్ధి చెప్పవలెనని వేడుకుంటున్నాడు. ఓ సనాతనా! అచ్యుతా, సర్వేశ్వరా, అనాదికారణా, అనంతా, అచలా జనార్ధనా, సకలలోకేశ్వరా! నేను నిన్ను మరచాను. పురాణపురుషా, పురుషోత్తమా! జగదీశా! పరాత్పరా, హరి బ్రహ్మాండనాయకా, దేవోత్తమా, పావన చరితా, జీవాంతరంగా, శ్రీ వెంకటేశా! నీవే నాకు ఇరవు.

"కంటిమినేడిదె గరుడాచలపతి
ఇంటివేలుపగు ఈశ్వరుడితడు" (4-504)

కులదైవమగు ఆవేంకటపతిని ఈరోజు చూడగలిగాను. అతడు శ్రీనరసింహుడు, చిన్మయకాంతుడు, దానవాంతకుడు దయానిధి. అతడే నమ్మిని వారిని పోషించే దేవదేవుడు జీవాంతరంగుడైన ఆదైవశిఖామణి తలచిన వారిని కాపాడే శ్రీవిభుడు. ప్రహ్లాదవరదుడైన అతడు బుధులకు కల్పవృక్షము దాసులను గాచే అనంతుడు.

"తేశరణమహం తేశరణమహం
శైశవకృష్ణ తేశరణం గతోస్మి" (2-401)

ఈ సంస్కృతకీర్తనలో ఆ వేంకటాద్రినివాసుని శరణు కోరుతున్నాడు అతడు శైశవ కృష్ణుడు.దశావతారాలు దాల్చిన ధర్మ రక్షక మూర్తి. దశకంఠుని దునిమినవాడు. దశదిశలు

నిండిన మూర్తి. దశవరణ లోకతత్వానికి అతీతుడు సహస్రాలోచనుడు, సహస్రఫణశేష శయనుడు సహస్రకోటి సంపూర్ణ తేజుడు, సహస్రర దివ్య చక్రాయుధుడు, అనంత చరణుడు అట్టిస్వామిని శరణువేడుతున్నాను.

"సదానందము సర్వేశ్వరా నీ
పదారవిందముపై భక్తి" (2-369)

ఓస్వామి ! నీపాదారవిందములపై భక్తి సదా ఆనందం కలిగిస్తుంది. నీసాకారము నయనానందకరము. నీకీర్తన శ్రవణానందదాయకము. నీ ప్రసాదము జిహ్వానందదాయి. నీపాద ప్రణామాలు దేహానందసంధాయకాలు నీ దాస్యము పరమానందము నీ సమారాధనము నిత్యానందము. ఈ విధంగా సదానంత సంధాయియైన హరి పద భక్తి ముఖ్యము

కింకిరిష్యామి కింకరోమి బహుళ
శంకాసమాధాన జాడ్యం వహామి" (1-265)

ఓస్వామి! ఈకింకరునికి నిత్యశంకాసమాధాన జాడ్యం వుంది. నీవు జగన్నాధుడవు త్రిలోకైక పారాయణుడవు నాకు ఈ సంసారసాగరదు:ఖాన్ని తొలగించగల స్వామివివే కరిరాజ వరదుడవు, శరణాగత వత్సలుడవు అయిన నీవు చావుపుట్టుకలు గల ఈదేహంపై అభిమానం కలిగిన నన్ను కృపతో దయచూడు.

"ఇందిరానామ మిందరికి
కుందనపుముద్దవో గోవింద" (1-8)

ఓ గోవిందా! ఆ తల్లి ఇందిర నామము సమస్త జనులకు కుందనపు ముద్దవంటింది. సంపదలిచ్చే అచ్యుత నామము అనంతము. ఆనామస్మరణము నాలుకపై వుంటే సిరులభిస్తాయి. ఆ వైకుంఠనామము అన్ని లోకాలకు వరదనామము. పందరి నాధుని నామస్మరణము అందరికి చల్లదనాన్నొసగే పరంధామం. కొండలకోనేటి రాయునినామము నిండు నిధానము.

"ఇతర మెరుగ గతి యిదియే శరణ్యము
సతతపూర్ణునికి శరణ్యము" (4-376)

ఓ వేంకటనాధా! సతత పూర్ణుడవైన నీవే నాకుశరణు. ఇతరము లేవియు నాకు తెలియవు. అట్టి సగుణమూర్తివైన నీకు శరణం. సర్వలోక సాక్షివై కాపాడే నీకు శరణము. త్రివిక్రమావతారుడవైన ఓసార్వభౌమా నీకు శరణము, శ్రీకాంతను ఎదపై నిలిపిన నీకు శరణము. పరంజ్యోతివై వెలుగు ఓ సుకుమారా నీకు శరణు. దాసులకు ఇహపర సాదకుడ వైన ఓ జగదీశ్వరా! శరణు శరణు.

"కలిగె మాకిదె కైవల్యసారము
ఫలించెనాదెదబాదెద నేను" (4-419)

ఓ స్వామి! మాకు కైవల్యసారం లభించింది. బ్రహ్మ శివుడు గౌరి వాణి -నీ నామస్మరణతో దీపిస్తున్నారు నీపాద తీర్థమే బ్రహ్మ కమండలజలము, శంభుని తలపై గంగగా భాసిస్తున్నాయి. నీమంత్రపాఠము గౌరీదేవి నాలుకపై నర్తిస్తోంది. అదే చదువుల తల్లికి బీజాక్షరం. నీదాసులసేవించే జీవనమే నాకు దోషాలను హరించే దారి తెన్ను. నీదాసుల సేవయే. నీ సేవ అని పరమార్థము.

"అదివో చూడరో అందరు మొక్కరో
గుదిగొనెబ్రహ్మము కోనేటి దరిని" (2-498)

పుష్కరిణి సమీపంలో ఆపరబ్రహ్మము అదుగో! వానికి మ్రొక్కండి. ఆ తేజస్సు రవి మండల ప్రకాశము చంద్రునికాంతి. విశ్వతేజము అనలసదృశము పాలజలధిలో నీసాకారము వైకుంఠ సాకారము. యోగీంద్రుల మనస్సులోని ఆకారమే లోకముల సాకారము. యాగఫలము, తప:ఫలము, దానఫలము సమస్తము ఆ వేంకటపతియే.

"పాడేము నేము పరమాత్మ నిన్నును
వేడుక ముప్పది రెండువేళల రాగాలను" (3-467)

శరీరాన్ని తంబురాతో పోలుస్తున్నాడు. ఓ స్వామీ! నిన్ను 32 వేళలో స్తుతిస్తాను ఈ శరీరమే ఒళవు. తలదాని దండెకాయ. ఉచ్ఛ్వాసనిశ్వాసాలు దానికి కట్టిన రెండు తాళ్ళు. మనస్సు బద్దెతాడు. జీవాలు గుణాలు. పుట్టువు కరడి. పాపపుణ్యాలు రెండువైపులా వుండే అనుసులు. సంసారమే సూత్రము. మానోటిమాటలే వన్నెపదాలు. ఇలా నీవు జీవునికి దండె చేసినావు.

"ఈ రూపమై వున్నాడు యీతడే పరబ్రహ్మము
శ్రీ రమాదేవితోడ శ్రీ వేంకటేశుడు" (2 -244)

ఆ వేంకటాద్రివాసుడు వరములిచ్చే చింతామణి. అతడే మోక్షతత్వరహస్యము. రమాదేవితో కూడిన ఆస్వామి ఈ రూపంలో కనిపించే పరబ్రహ్మము. ఈ రూపమే మాయాదేవి పట్టిన సముద్రము. పంచభూతాత్మకమైన అశ్వర్థవృక్షము. బ్రహ్మాండాలను గుడ్లుగా పెట్టే హంసరాజము. బ్రహ్మలు ఉదయించే నాభీకమల మూలకందము. వేదాలు నివసించే అక్షయ వటపత్రము. దేవతలకు శుభప్రదమైన యజ్ఞము. రాక్షసుల పాలిటి నరసింహము. సంసార భారాన్ని వహించే వృషభరాజము. జీవులకు చైతన్య సూత్రము. భక్తులకు జ్ఞానామృతము. అట్టి కామధేనువు, కల్పవృక్షము యిదే అంటున్నాడు అన్నమయ్య.

"కామధేనువిదే కల్పవృక్ష మిదే
ప్రామాణ్యముగల ప్రపన్నులకు" (2-488)

ప్రపన్నభక్తి - భక్తి సంప్రదాయంలో ముఖ్యము అట్టి ప్రపన్నులకు హరినామ జపమే ఆభరణము. పరమాత్ముని స్తుతి సుగంధపరిమళము. అతని పాదసేవయేభోగము. అతని ధ్యానము దివ్యాన్నము. ఆయనపై భక్తి జీవనము. అతని కైంకర్యమే సంసారము. అతడే సర్వస్వము. శరణాగతులే చుట్టాలు. ఈ ప్రసన్నభక్తి యోగసిద్ధ గలవారికి మాత్రమే సాధ్యం.

"ఆదిపురుషా అఖిలాంతరంగా
భూదేవతారమణ భోగీంద్రశయనా" (4-37)

ఓ వేంకటనాథా ! నీవు ఆదిపురుషుడవు. సర్వాత్మకుడవు. భూదేవీరమణుడవు. పన్నగశయనుడవు. మా భవజలధిని దహించే బడబానలానివి. భవరోగాలను పారద్రోలే ప్రభంజనానివి. భవపర్వత ప్రళయకాల కాలకూటానివి. భవాంధకారాన్ని పారద్రోలే మార్తాండుడవు. ఇంత ఎందుకు? నీవుభవరోగ వైద్యుడవు. పంచభూతాత్మకమైన స్వరూపాన్ని స్మరించాడు.

అట్టి పరతత్వాన్ని ఇహపర సుఖదాయకమని స్తుతిస్తున్నాడు.

"చేకొంటి నిహమే చేరిన పరమని
కైకొని నీవిందు కలవేకాన" (2-517)

ఓ స్వామి! నీవు ఇక్కడ వున్నావుగాన ఇదే పరంధామమని ఇహాన్ని చేకొన్నాను. ఈ లోకంలోని సమస్త భోగాలు నీ ప్రసాదాలే వర్ణమాలలోని యాభై అక్షరాలు నిగమగోచరమైన నీ మంత్రాలే. ఈ సంసారంలోని దారాపుత్రాదులు నీ దాసవర్గమే. నేను ముప్పొద్దులా చేసే పనులు నీఆజ్ఞాకైంకర్యాలే. నా జన్మాదులు నీపనుపులు. ఇట్టినాకు అవసరమొచ్చినపుడు వరాలివ్వు. అట్లు నిన్ను సేవించే నాకు ఇతరులకెవ్వరికి లభ్యముకాని కైవల్యం సిద్ధించింది.

"కలిగె నదిదెనాకు కైవల్యము
తొలుత నెవ్వరికి దొరకనిది" (2-466)

నీ దివ్యకీర్తనమే ఓపురుషోత్తమా! నా పని. ఇతర ధర్మములు నేనెరుగను. నీవా కరుణాజలధివి. నీవేశరణము. పరముగాని, భక్తికాని నే నెరుగను, నీదాస్యమే నాగతి. నేజేసే పనులన్నీ నీకైంకర్యమే. అట్టిస్వామి హస్తము ప్రస్తుతిపాత్రము.

"శ్రీ వేంకటేశ్వరుని సింగారము వర్ణించితే
ఏ విధాన తలచినా ఇన్నిటికి తగును" (2-221).

ఆస్వామి! అద్భుతరూపాన్ని ఏమని వర్ణించను. చక్రముతో కరిరాజు బ్రోచిన హస్తము ఏనుగు తొండము వలె నున్నది. వరదహస్తము తరుశాఖవలె వున్నది. పాంచజన్యహస్తము సముద్రపు తరగవలెనున్నది. కాళీయుని తోక పట్టిన హస్తము ఫణీంద్రునివలెనున్నది. నీరెండు హస్తముల మధ్య నున్న నీయెద అలమేలుమంగకు ఇరవైన ప్రదేశము.

"ఆడుతాపాడుతా నీతోడ నట్టే ముద్దు గునుసుతా
ఓడక నీదండజేరి వున్నారమయ్యా" (3-390)

నీ అండదండలుండగా మేము నిర్భయులమై ఆటపాటలతో గడపవచ్చు. చిన్న శిశువులు సుఖదు:ఖాలు తెలియని వారై తల్లిదండ్రుల ముఖాలను అలానే చూస్తూ వుండిపోతారు. నీపైధ్యానంతో పుణ్యపాపాల ఎరుక మాకుండదు. రాజుగారి వాల్లభ్యానికి గురియైన బంటులు ఇతరులను యాచించరుగదా ! శ్రీపతివైన నీవు మమ్ము రక్షింపగా ఇతరుల నేమి అడుగను? చేత జిక్కిన నిదానమైన నీవు మాయింట నుండగా మాకు కలిమి లేములతో పని యేమి ఆత్మలో నీవుండగా మాకిక వెలితి ఏమి? మాకు ఓ స్వామి యిదే సమస్త బలసంపద.

"సకల బలంబులు నీవే సర్వేశ్వరా నాకు
అకలంకంబగు సుఖమే అన్నిటనిదే నాకు" (2-109)

ఆ వేంకటపతితోడున్నాడనే బలం నాకు కలిగింది. అదే నాకు అకలంకమైన సుఖము. చక్రాంకితుడనైన నాకు అదే భుజబలము. హరిచింతయే ఆత్మబలము. కేశవనామమే పేరుబలము. నాకిక భవ భయములేదు. తిరుమణులే పంచాంగబలము. నీపాటే స్వరబలం. నీగుణరాసులే రాశి బలం. అట్టి నాకు ఇహపరములలో ఎదురేలేదు. నీ విగ్రహమే నా గ్రహబలము. నీ దాసుల సేవయే నాకున్నబలము. సర్వము అర్పణ చేసిన భావమిది.

పుట్టుభోగులము నేముభువి హరిదాసులము
నట్టనడిమిదొరలు నాకియ్యవలెనా" (4-94)

హరిదాసులమైన మేము పుట్టుభోగులుము. నడమంత్రపు సిరిగల రాజులు మాకివ్వనవసరం లేదు. మహాలక్ష్మి విలాసాలతో వెల్లివిరిసే సమస్తభోగాలు మాకు లభిస్తాయి. అమె మాతల్లి. ఆమె మగనినే మేము కొలుస్తున్నాము. ఇతరులు సిరులు ఇవ్వవలెనా? భూకాంతకు గ్రామాలు రత్నాలు ఇతరసంపదలు అంగభేదాలు ఆమె భర్త సేవకులమైన మాకు ఆతడే యిస్తాడు. ఇతరులివ్వవలెనా? పదవులన్నీ బ్రహ్మనిర్మితాలు. ఆ బ్రహ్మకు తండ్రి మా వేంకటేశుడు. ఇతరులు సొమ్ములీయవలెనా! ఆయనే మమ్ము ఏలుకుంటాడు

"ఆశాబద్ధుడనై యలసి నిన్నుకడు
గాసి బెట్టినవాడగాను" (1-175)

ఓ వేంకటేశ! ఆశాపాశబద్ధుడనైన నేను నిన్నేమి కోరిశ్రమ పెట్టలేదుగదా! కర్మ పరతంత్రుడనై నిన్ను దూషించి నీపై భారాన్ని మోపలేదు గదా! దు:ఖమగ్నుడనై దానిని తొలగించమని నిన్ను వేడలేదుగదా! నాకు కావ సినవి లభిస్తే వాటిని నావి కావనేవాడిని కాదు. నాకిదికావలనని కోరేవాడినికాదు. నిర్లి భావాన్ని కల్గిన భక్తుడనని భావన.

"దాచుకో నీపాదాలకు తగనేజేసిన పూజలివి
పూచి నీకీరితి రూప పుష్పములివి యయ్యా" (2-338)

భక్తిపారవశ్యంతో వేలాదికీర్తనలు రచించిన అన్నమయ్య తనకీర్తనలను పాదపూజ చేసిన పుష్పాలుగా సమర్పించుకున్నాడు వాటిని భద్రంగా దాచుకోమని అభ్యర్థిస్తున్నాడు. అన్నవేలకీర్తనలలో ఒక్క కీర్తనే తమను రక్షించగలదని మిగిలినవి భండారంలో దాచివుండనిమ్మని మొరలిడుతున్నాడు నీ నామము వెల సులభము, ఫలమధికము. నీవే నాదిక్కైయేలినావు. అదేనా తీరని ధనము నీవేనా నాలికపై వుండి నిన్ను పొగడించి వేల సంకీర్తనలు పాడించావు. నీ నామస్మరణ చేయటానికి నేనెంతవాడను. పోనీలే అని నాకీ పుణ్యాన్ని అంటగట్టావు. ఇది నీమహిమను కొనియాడుటేగాని నాగర్వము కాదు. నేను స్వతంత్రుడను కాను. నీదాసుడను. నా మానానికి నేను పాడుకుంటున్నాను. నేరములెంచవద్దు. అట్టి నీవు సర్వాంతర్యామివి.వేరొక చోట వెదకనవసరంలేదు.

"వేరొకచోట లేదు వీడివోహరి
వీరిడియై చేరువనే వీడివోహరి" (3-57)

ఆ హరి ఇందుగలడందులేదని సందేహము వలదు. అతడెక్కడో వున్నాదని వెదకనవసరములేదు. చేరువనే వున్నాడు. వెదకిచూస్తే ఉచ్ఛ్వాస నిశ్వాసరూపంలో ముక్కుకొననే వున్నాడు. వినిపించే మాటలలో చెవుల మధ్య మంత్రమై వున్నాడు. శోధించి వెదికితే చూపులకొనలనే వున్నాడు. వీధుల వెంబడి వెదకనవసరం లేదు. వెదకి చూస్తే నాలిక కొనపైవేదమై నిలిచాడు. వేదరహస్యం తెలుసుకుంటే అంతరాత్మయే వెలుపల లోపల అతడే. అతడు మమ్ము రక్షించడానికి యిక్కడ వున్నాడు.

"ఎటువంటి భోగి వీడెటువంటి జాణ
వటపత్రముననున్నవాడా వీడు" (5-177)

ఇతడు వైకుంఠపతి. వాడేవీడు జాణయైన ఈభోగి వటపత్రశాయి అంటే ఆశ్చర్యం వేస్తుంది. పున్నాగతరుల పుప్పొళ్ళపై పూదేనె సోనలు వానకాలపు నదులై పారగా వాటి మధ్యలో కల్పవృక్షచ్ఛాయ బంగారు వేదికపై జలధికన్యను కౌగిట చేర్చినవాడు వీడు. వాసంతికలలో కెందామరల ధూళితో చల్లగాలి వీచగా కోనేటి పన్నీటి జలాలలో వనితలతో జలకాలాడే వాడేవీడు. తన వాలుచూపులచే చిక్కిన వారిని తన సరసవచనాలతో కరిగించి యేకాంత సౌఖ్యాన్ని చేకొన్నవాడేవీడు. ఇతడు జాణ. అట్టి స్వామి శృంగారము విస్తృతముగా వర్ణింపబడినది.

"చెలులెల్లా చూచి సంతోషించి మెచ్చిపొగడేరు
కలిగెమీకు మేలము కలకాలము" (7-370)

ఓస్వామి ! రతి సుఖాలలో నీవీమెను ఏలుకున్నావు ఓ చెలియా అది చూచిన నీ చెలులందరు నిన్ను చూసి సంతోషించి మెచ్చిపొగడుతున్నారు. మంచికాలము వచ్చినదని సంబరపడ్డారు. ఓ చెలీ! నీవద్దనవ్విన చిరునవ్వులు వలపు వెన్నెలల పువ్వులు నీపై చూసిన చూపు యవ్వనమదంతో వికసించిన చూపు. నీతో పలికిన పలుకు మన్మధుని ములుకు. నీ యెదుట అతడు చూపిన శృంగారం పదారువన్నె బంగారము. నీతో పెనగిన ముత్యాలసేస. నీవు చన విచ్చావు. ఓస్వామి రతిపారవశ్యంలో మునిగితేలావు.

"తలగరో లోకులు తడవకురో మమ్ము
కలిగినదిది మా కాపురము" (2-14)

లోకులను తమ సంగతిని పట్టించుకోవద్దని అంటున్నాడు. నరహరిని నుతించిన నాలుకతో వేరొకరిని పొగడలేనని, మురహరుని పాదముల మొక్కిన శిరస్సుతో మరొకరి నమస్కరించలేనని, లక్ష్మీపతిని సేవించిన చేతులతో పరులను యాచింపలేననీ, హరిని చేరుకున్న పాదములతో ఇతరుల యిండ్లకు వెళ్ళలేనని, శ్రీపతిని చింతించిన మనసుతో దేన్ని తలచలేనని, ఈ తనువే శ్రీ వేంకటపతి ఆధీనమని మొరపెట్టుకుంటాడు. రాజులు, అధికారులు తమను స్తుతించమని బలవంత పెట్టి నపుడు ఇలా వాపోయి వుంటాడు అన్నమయ్య.

"వెన్న చేత బట్టి నేయి వెదకనేలా
యిన్నిటా నెంచి చూచితేనిదియే వివేకము" (3-180)

కొందరు అజ్ఞానంచేత పరమాత్మను గుర్తించలేక వెతుకుతుంటారు. అది వెన్నను చేతులో పట్టుకొని నేయి వెదికినట్లు. నీ దాసులున్నచోటే వైకుంఠమని తెలియక వేరొక చోట వెదక నేల? నీభక్తుల రూపాలే నీ రూపాలని గ్రహించలేక నిన్ను తలపోయనేల? నీ భక్తులతో సంభాషణలు వేదాంత పఠనములని తెలియక వృధా చదువులేల? వారిదయ నీ మన్ననకు పాత్రము. అంతకు మించి నిన్ను కొసరనేల? నారద శుకాదులవలె నాదీ అదే విన్నపము. నీవు చేపట్టిన దాసులకు ఈ బుద్ధి కైవసమౌతుంది. మిగతావృధా!

"సకల సందేహమై జరుగు చున్నది యొకటి
ప్రకటింప జీవమో బ్రహ్మమోకాని" (1-332)

జీవమో బ్రహ్మమో తెలియని గొప్ప సందేహము కలుగుతున్నది. వసుదేవుని జఠరమనే వననిధికి చంద్రుడై స్వామి పొడచూపాడు. ఇలలో చంద్రుడు నీలవర్ణమున ఎందుకైనాడు? కసరెత్తి నునుకందు కలిసి యుండవచ్చు. ఇతడు రవి వంశమున లోకమునకు మేలు చేయుటకై కల్పవృక్షమువలె పాపరహితుడై జన్మించాడు. సురతరువు నల్లగా ఎందుకయిందబ్బా! బాగా

చేవ కలిగినందువల్లకాబోలు ! తిరువేంకటాద్రిపై చింతామణివలె కన్పించాడు. మరి నలుపు వర్ణము ఏలా? హరి నీలమణులతో కలిసి వున్న ప్రభావము కావచ్చు.

"అన్ని చోట్లు బరమాత్మ నీవు
యిన్ని రూపుల భ్రమయింతువుగా" (1-278)

ఓ పరమాత్మా ! అన్నిచోట్ల నీవు యిన్నిరూపాలుతో భ్రమింపజేస్తున్నావు గదా! పాలజలనిధిలో, బదరీవనంలో, గయలో, ప్రయాగలో, భూలోకనిధివై, పురుషోత్తముడవై వేవేలరూపాలలో వెలసితివిగద! ఉత్తరమున మధురలో, అయోధ్యలో, నందవ్రజంలో పంచవటిలో, సింహాద్రిలోన నుండి లోకాలను పావనము చేయుచున్నావు గద ! కైవల్యన బ్రహ్మ లోకమున శ్రీరంగమున యిక్కడ శ్రీ వెంకటాద్రి మీదను నీవేవచ్చి నెలకొంటివి గదయ్యా!

"వాడివో కంటిరటరే వన్నెలవాడు
పైడి మోలము కటారు పరుజుల వాడు" (7-116)

ఈ కీర్తనలో అన్నమయ్య శ్రీ వేంకటేశునిరూపం కన్నులకు కట్టినట్లు వర్ణించాడు. పెద్ద కిరీటమును, పీతాంబరమును, ఉరమున కౌస్తుభమణినీ, శంఖచక్రాలను హస్తములందు ధరించి వున్నాడు. ముద్దుల మోము ముత్యాలనామముతో ప్రకాశిస్తున్నది. కటి హస్తము, అభయ హస్తములతో పాదాలకు గజ్జెలందెలతోనున్నాడు. కర్ణములకు బంగారు మకర కుండలములు, బాహువులకు కడియాలు, మొలన మొలనుళ్ళు నాభియందుకమలము, మంగ ఆయన మెడలో తాళి, చిగురు మోమితో నగవు చూపులతో వున్న స్వామిని చూచారు గదా అని సఖులతో చెప్తున్నట్లున్నది.

"తగునయ్య హరి నీకు దానము దెచ్చుకొనిన
జగములో భూకాంత సౌభాగ్యలక్ష్మి" (20 - 303)

ఓ హరీ ! శిశుపాలుని గెలిచి రుక్మిణిని జయలక్ష్మిగా, శరముతో జలధినణచి లంకను సాధించి మరల సీతను ఘనవీర లక్ష్మిగా, నరకాసురునణచే సమయంలో సత్యభామయే సంగ్రామలక్ష్మిగా, హిరణ్యకశిపుని సంహరించి ఇంద్రాదులకు నీచే వరమిప్పించిన ఆమే వరలక్ష్మి. నీ ఉరమున అఖిలసంపదలతో వున్న ఆమె ఆదిలక్ష్మిగావుండి శ్రీ వేంకటాద్రి మీద నీ సరసన మించిన కళలతో కల్యాణలక్ష్మి జగములో భూకాంతయే సౌభాగ్యలక్ష్మి.

"ఆనతియ్యగదవే అందుకే కాచుకున్నాడను
పూనుక నీవెంత నేర్పరివైనా భువి మనసుపేదను నేను" (2-301)

నీవెంతో నేర్పరివి. నేనెంతో అల్పుడను. మనసు పేదను. నీ సేవకొరకే కాచుకొని వున్నాను. ఆన తీయవయ్యా! నీకు బంట్లు కోటానుకోట్లు వున్నారు. నిన్ను తెలియగల జ్ఞానులకు

అంతేలేదు. వరముకోరేవారు తల వెంట్రుకలంత మంది గలరు. ఈ సందడిలో నాసేవ ఎంత? బ్రహ్మాదిదేవతలు నీ పనులు చేసేవారు. వేదరాసులు నిన్ను నుతించేను. నినుధ్యానించే మునులెందరో గలరు. నా మనవులకు సమయము ఎప్పుడు దొరుకుతుందో! నిన్ను మోయడానికి వాహనముగా గరుడుడు, ఆదిశేషుడు వున్నారు. అన్నిటికీ నీకౌగిలిలో అలమేలుమంగమ్మ వున్నది. నన్ను ఏలిన శ్రీవేంకటేశా! నామొక్కులు నీకు ఎలా జేరేనో !

"ఇదే నీకన్నుల యెదిటికి వచ్చితి
కదియుచు నెట్టయిన గావకపోదు" (3-182)

నీకన్నుల ఎదుటికి వచ్చాను గనుక నీవేతప్పక రక్షిస్తావనే నమ్మకాన్ని వెలిబుచ్చుతున్నాడు అన్నమయ్య. పరమ పురుష! నీ భక్తి దొరకకే ఇన్ని జన్మలు ఎత్తాను. హరి నీకరుణకు అర్హతలేక ఇన్ని దురితములు పొందాను. జగదీశ్వర! నీ శరణము లేక ఈసంసారపు ఉరిలో ఇరుక్కున్నాను. నీ పాద దర్శనం లేక పాపాత్ముడనైనాను. గోవిందా! నిను సేవించనందువలననే ఆశలలో చిక్కుకున్నాను. శ్రీ వేంకటేశా! నాదైవమైన నిన్ను చేరి ధన్యుడనయ్యాను.

"శ్రీ శోయం సుస్థిరోయం
కౌశికమఖ రక్షకోయం" (1-264)

ఓ స్వామి! నీవే శ్రీశుడవు. సుస్థిరుడవు, కౌశికమఖ రక్షకుడవు, వేదనిధివి జగన్మోహనసతికి పతివి, విజయ సఖుడవు, భృగుముని సంహితుడవు, శాశ్వతుడవు, మునిజనసులభుడవు. రుక్మిణీ ప్రియుడవు శరణాగతవత్సలుడవయిన శ్రీ వేంకటపతీ నీవు సరసుడవు.

"మామనునేతు మాగత వానసి
కాముక విద్యా కలచలరే" (5-252)

కాముకవిద్యాకళలయందు ప్రవీణుడవైన ఓస్వామీ! నీవు భిల్లవధూజనుల కుచపీడన పరాయణుడవు. గోప గోపాంగనా పరివృతరతిపరవశుడవు. గోపీజన కుచకుంకుమపంకము నీ లలితదేహమునుకు తాపశమనముకాగా బహువిధరూపములతో సంచరిస్తావు. పరవనితల యెడ పరతంత్రుడవై నఖాంకితపతివై, రసికుడవై, తరునికుంజ గృహాలలో సంచరించే తిరుమలేశా! నమోస్తు.

"కరేణకిం మాంగృహీతుంతే
హరే ఫణిశయ్యా సంభోగ" (6-171)

లీలావినోదివైన నీవు శేషశయనుడవై మాకు కరావలంబనమిమ్ము. జలములలో సంచరించి, స్థలభవనములందు విహరించి, బహురూపములను ప్రకటించి

భువనప్రమాణమును పదములతో కొలిచి, కాళిందీహ్రదమున విహరించి, మునిజన మోహనుడవై, విజయుని బాసటవై, తురగవాహనుడవై ఈనాడు వేంకటగిరిపై వెలసినావు.

"యోగిభోగినటనం కురుఉల్లాసాననమోహన
సాగరోద్భవ కన్యకాపతి సారస శ్రీవేంకటగిరి యోగి" (11-588)

యోగుల హృదయాలలో మోహనాకృతివై సముద్రకన్యకు సరసుడవై, ఫాలనేత్రునిచే వంద్యుడవై, కాళీయునిచే నుతింపబడినవాడవు, గరుడగమనుడవు, శేషశయనుడవు, మురళీనాద మోహనుడవు, కరుణానిధివి గోపికానాధుడవు అయిన నీవు నేడు వేంకటపతివై అవతరించావు.

"జానామ్యహంతే సరసలీలాం
నానావిధ కపటనాటక సఖత్వం " (5-135)

కపటనాటక సూత్రధారివైన నీసరస లీలలు నాకు తెలుసు. పరకాంతా నఖాంకురములు నీశరీరంపై ఎందుకున్నాయి? శంకను వదలి నీవు ఏల ఆకర్షించుచున్నావు? కృతకమానసముతో, డాంభికముతో, విటులను తరిమి, గాంభీర్యాన్ని ఆవహించి, సంభోగ చాతుర్యాన్ని ప్రకటిస్తున్నావు. ఓసఖా! వేంకటశైలరమణుడవై నీకిష్టమైన సురతభోగాలను అనుభవిస్తూ మదన నిర్మాతవై మా మానాలను హరిస్తున్నావు.

"కిన్నజానే అహం కేశవాత్పరమహో
సన్నుతాకార మమాచరణాయ తస్మై " (2-83)

ఓ సన్నుతాకారా! నేను నిన్ను ఎందుకు ఎఱుగను. వేదాంతవేద్యుడవు విశ్వరూపుడవు, ఆదిమధ్యాంతరహితుడవు, నాదప్రియుడవు, పరమపురుషుడవు, భవబంధహరణుడవు. నిత్యుడవు, నిరుపమానందదాయకుడవు, దురితదూరుడవు, కలిదోషవినాశకుడవు. కాలాత్మకుడవు, శ్రీసతి ప్రియుడవు అయిన నీవు నన్ను పాలించుము.

"బ్రువంతి బౌద్ధా బుద్ధయితి
స్తువంతి భక్తా సులభయితి " (1-164)

వివిధమతాలవారు భగవంతుని ఏవిధంగా భావిస్తారో ఈకీర్తనలో వివరించబడింది. బౌద్ధులు బుద్ధుడని, భక్తసులభుడని ప్రశంసిస్తారు. సాంఖ్యాయనులు పదవాక్యజుడవని చెబుతారు. వేదాంతులు బ్రహ్మపదమని కొలుస్తారు. మీమాంసకులు వివిధ కర్మవైభవాలలో నీ వైభవాన్ని దర్శిస్తారు. అయితే నీ కృపాళుత్వము అన్నిటా కనిపిస్తుంది. మునులు అణిమాది ప్రధములందు నీవున్నావని నీవు నిర్గుణుడవని ధ్యానిస్తారు. ఈ సంస్కృత కీర్తనలను సుప్రసిద్ధ హిందూస్థానీ సంగీత విద్వాంసురాలు పద్మశ్రీ సుమిత్రా గుహ శ్రీవేంకటేశ్వర దృశ్యశ్రవణ ప్రాజెక్టువారికి రికార్డుచేశారు.

"ఘనుడవు నీమహిమ గన్నవారెవ్వరు
మినుకుల కొంతకొంత మెచ్చుటింతే కాని" (7-310)

అన్నమయ్య ఈ కీర్తనలో దశావతారములను వర్ణించకే వర్ణించాడు. స్వామి గొప్పతనాన్ని కీర్తించాడు. జలధినీదవచ్చు. నీటిలో మునిగి కొండనైనమోయవచ్చు, భూమిని ఎత్తిపట్టవచ్చు, ఏ రూపాన్నైనా ధరించవచ్చు గానీ, నీ చిత్తమును పట్టలేము. ఆకాశమునంటి కొలవవచ్చు, ఘోరమైన తపస్సునైనా చేయవచ్చు. రాక్షసులను చంపవచ్చు. భామలను పొందవచ్చు. కానీ నీగుట్టును తెలుసుకొనలేము. వ్రతములుచేయవచ్చు. రాయినికొరకవచ్చు. కానీ అనుగ్రహంతో నన్ను కూడిన ఓ వేంకటేశా, నీ మధ్య నామధ్య భేదము తెలియరాదు.

"అనరాదు వినరాదు ఆతని మాయలు -నేడు
దినదిన కొత్తలాయ ద్రిష్టమిదేమాకు" (2-167)

అతనిమాయలు దినదినము కొత్తలై దృష్టాంతాలై అనలేని వినలేని విధంగా వున్నాయి. తోడి బాలురతో ఆడతూ అంగిలి చూపించమని వెంటనే వారి నోటిలో దుమ్ము చల్లాడట. మేము వెళ్ళి చూడగా నోటిలో పంచదారై ఆశ్చర్యం కలిగించింది. దురద పెట్టేతీగలు దేహమంతా చుట్టగా బాలురు వాపోయారు. ఇది విని మేము వెళ్ళి చూడగా కొత్తగా కోటి కోటి సొమ్ములు ఐనాయి. కాకి జున్నును పిల్లల చేత తినిపించి ఏడిపించాడు. అప్పుడు ఈ వేంకటేశుడు మేము చూస్తుండగానే కళ్ళనీళ్ళు తుడవగా అవి ముత్యాలు అయ్యాయి. ఏమిచోద్యము!

"ఇప్పుడిటు కలగంటి నెల్లలోకములకు
నప్పడగు తిరువేంకటాద్రీశు గంటి" (1-38)

అన్నమయ్య కలలో తాను దర్శించిన స్వామి వైభవాన్ని తెలుపుతున్నాడు. ఎల్లలోకములకు తండ్రియైన శ్రీ వేంకటాద్రీశుని కలలో చూచాను. ఉన్నతమైన శేషాద్రిశిఖరమును , గోపురప్రభలను, శతకోటి సూర్యప్రభలను, చూచి వేంటనే మేల్కొన్నాను. బ్రహ్మను రత్నాలు పొదిగిన బంగారు కవాట కాంతులను, ఘనమైన దీపపుగుత్తులను సాటిలేని మరోమయ కిరీటమును, పీతాంబరమును చూచాను. ఇరువైపుల శంఖ చక్రములను, సరిలేని అభయహస్తమును చూచాను. గురువుదైవము అయిన తిరువేంకటాచలపతిని చూచి మేల్కొన్నాను. మేలును పొందాను అంటాడు అన్నమయ్య.

"కలడా యింతటిదాత కమలనాభుడే కాక
కలడన్న వారిపాల గలిగిన దైవము " (4-255)

కలడన్నవారికి కలిగినదైవము అయిన కమలనాభుడుగాక ఇంత దాతమరొకరు లేరు. ఇంద్రాదులకు సంపదలు, శుకాదులకు ఇహపరములు, ఆంజనేయునికి బ్రహ్మపట్టము,

ఘంటా కర్ణునకు కుబేరత్వము ఇచ్చాడు. ధృవునకు బ్రహ్మకంటె ఉన్నత పదవినీ, విభీషణునకు లంకారాజ్యమును, బ్రహ్మకు పోయిన వేదాలను తెచ్చియిచ్చాడు. శ్రీసతిని పెండ్లాడాడు. దేవతాలకు అమృతము పంచాడు. భక్త వత్సలుడను బిరుదు పొందిన శ్రీ వేంకటేశుడు పృధివిపై జీవులందరికీ ప్రసాదము పంచిపెట్టారు.

"హరియే యెరుగును అందరిబ్రతుకులు
యిరవై యీతని యెరుగుటే మేలు" (3-255)

హరిని తెలుసుకొనుటేమేలు. అందరిబ్రతుకులు ఆతనికే తెలుసుగనుక ఈ బ్రహ్మాండము పూర్వమునుండి ఎందరో బ్రహ్మలు ఏలారు. వారిపేర్లే మరచిపోగా అల్పులైన మనుజుల సంగతేమిటి? కోటానుకోట్లమునులు ఎందరో తపములు చేశారు. ఏ ఫలితాలను పొందారో ఎవరికెరుక? ఇక నరులగతేమిటి? అనేక కర్మమార్గములు ఎందరో దేవతలు అనుసరించారు. చివరకు శ్రీ వేంటపతికి మొరలిడినారు ఇదే మంచిమార్గమని.

"నిత్యానందధరణీధర ధరారమణ
కాత్యాయనీ స్తోత్రకామ కమలాక్ష" (1-25)

కమలాక్ష ! నిత్యానందుడవు, భూమిని మోసినవాడవు, భూదేవి భర్తవు అయిననిన్ను కాత్యాయినీదేవి స్తుతిస్తున్నది. పద్మనాభుడవు, జగత్తుకు ఆధారభూతడవు, భవనాశకుడవు పురుషోత్తముడవైన భువనేశా! నీకు నమస్కారములు కరుణాసమగ్ర, రాక్షససంహార, కమలాధీశ, కరిరాజవరద, భోగీంద్ర శయన, పరిపూర్ణనంద, జలధివాసా,గరుడగమన, నానావర్ణనిజదేహ, గంగాజనక, పరమాత్మ, పావన, పరాత్పర, శుభప్రద, పరాతీత, కైవల్యకాంత, శృంగార రమణ, దేవతారాధ్య, సుస్థిరకృపాభరణ, దాక్షిణ్య గుణనిధివైన శ్రీ వేంకటేశా! అని అన్నమయ్య వివిధ విశేషణాలతో స్వామికి నమస్కరిస్తున్నాడు.

"అలుకలుచెల్లవు హరి పురుషోత్తమ
నలినిందర నీతో నవ్వినది " (20-6)

అన్నమయ్య ఒక చెలికత్తెయై అమ్మ ఇందిరను గూర్చి నివేదిస్తున్నాడు. పురుషోత్తముడవైన హరీ! ఇందిర నిన్ను చూచి నవ్వినది, ఇక నీ అలుకలు చెల్లవు. ఆదిలక్ష్మి మోహన కమలముతో నిన్ను తాకినది. తన అభయ హస్తమును సాదరముగ నీవైపు చాచినది. శ్రీదేవి తన కన్నుల చింతామణులను నీపై కుమ్మరించినది. వరదహస్తముతో నీవలపలి చేయి అందుకుని నిను మాట్లాడించినది. జలధికన్య తన సర్వాంగములతో నిన్ను పెనవేసినది. శ్రీ వేంకటేశ్వరా! రతిని నిన్ను అలముకొని నీవురమునెక్కినది. స్వామి! ఇంక నీ అలుకలు కుదరవు.

"శరణు శరణు నీకు సర్వేశ్వరా నీ
శరణాగతే దిక్కు సామజవరదా" (15-219)

గజేంద్రుని రక్షించిన సర్వేశ్వరా నీకుశరణు! వేయి శిరసులగల విశ్వరూపమా, పరంజ్యోతి పరబ్రహ్మమా, వేద నాదస్వరూపా, అనంత శ్రీమూర్తీ!శరణుశరణు. బ్రహ్మవిష్ణు మహేశులకు మూలకందమైనవాడ! మునులు ఋషులు ధ్యానించే ఓంకారమా! దేవతలకు ప్రాణబంధూ! జగమెల్లకన్నులైన సాకారమా (సహస్రాక్షుడా) సచ్చిదానంద వినోదివైన పంచవింశతి ఆత్మ తత్వమా! కరుణానిధివై దాసులకు వరములిచ్చే వేంకటనాథా! శరణు శరణు!

"ధ్రువవరదా సంస్తుత వరదా
నవమైన యార్తుని నన్నుగావవే" (2-73)

ధ్రువునిరక్షించినవాడా! ఆర్తితో స్తుతిచేస్తున్ననన్ను రక్షించరాదా! కరిరాజును, కాకాసురుని, శరణన్న విభీషణుని కాచిన వాడవు. వేదాలు నిన్ను గూర్చి చెప్పగా విని నీ అండచేరిన మమ్ము గావరాదా! అక్రూరుని, అంబరీషుని, ఇంద్రాది దేవతలనురక్షించిన ఓ చక్రధరా! నీవే ఘనుడవని శరణన్న నన్నుబ్రోవవే! ద్రౌపదిని, అర్జునుని, ప్రహ్లాదుని కాచిన శ్రీపతీ! నాగురువు నిన్ను ఈ వేంకటాద్రిమీద చూపగా గొలిచే నన్ను కావవయ్యా! అని వేడుకుంటున్నాడు అన్నమయ్య.

"గోవిందాదినామోచ్చారణ కొల్లలు దొరికెను మనకిపుడు
ఆవలనీవల నోరగుమ్మలుగ నాడుద మీతని బాడుదము" (3-332)

గోవిందాది. ఎన్నోనామములు మనకు కో కొల్లలుగా దొరికాయి. మనందరము ఇతనిని ఆడుతూ పాడుతూ కీర్తిద్దాము. దేవతలందరిలో శ్రీహరియే నిత్యుడు. నిర్మలుడు. ఇదిసత్యము. ప్రాణులిన్నింటిలో అంతర్యామిగా వున్న ఈ సాక్షీభూతుని శరణనండి. హరియే పరబ్రహ్మమని వేదాలు చాటుతున్నాయి. ఓ జనులారా ! కూటస్థుడు, గోపవధూపతి అయిన ఇతనినే సేవించండి. శ్రీ వేంకట విభుడు ఎదుటనే నిలుచుండి వరదుడైవున్న అతనిని చూచి బ్రతకండి.

"ఏమి చిత్రం బేమి మహిమలు యేమి నీమాయా వినోదము
వామనాచ్యుత నిన్ను దెలియగ వసుధలో మాతరములా " (15-216)

వామానా! అచ్యుతా! నీ చిత్ర విచిత్ర మహిమలు, మాయావినోదములు, నిన్ను తెలుసుకొనగలడడం ఇలలో మాతరమా! సకలలోకనిలయా! శౌరి, మురహర, నరహరీ నీవుపాలదొంగవన్న నీగుణము తేటతెల్లమైంది. నినుగన్నతల్లి అదలింపుకే తెరచిన నీనోట

లోకములుండెను. శ్రీపతీ! దైత్యులను, దానవులను శిక్షించి అమరులను రక్షించే నీ చేతలు శకటాసురసంహారంతో బయటపడ్డాయి. వాసవార్చితా! అర్జునుడు తెలియక మాట్లాడితే నీ విశ్వరూపమును చూపితివిగదా! శ్రీవేంకటేశ్వర, నారదప్రియ, భక్తవత్సల ! నీదాసులు నీవిద్యలెల్లాచూచారు. ఏనుగు, శబరి, బలి, శుకుడు, ధ్రువుడు మొదలగువారు నిన్ను కొలిచి ఉన్నతపదవులను పొందిన వివరములు మాకు తెలుసు.

"మాయదారిచేతలింకా మానవయ్యా
ఆయముమోచినది ఆనతియ్యవయ్యా" (16-369)

ఇంక నీమాయదారి చేతలు మాని ఆనతీయవయ్యా. నీమీద సిగ్గులతో చెలి చింతలో బొరలినది. యెగ్గు తీరే మందు, నీవిరహముతో వున్న యింతిని గావగమార్గం చూపవయ్యా! ప్రాయమును నీ కప్పగించి పవ్వళించిన చెలిని మేలుకొలుపరాదా! నీకొరకు ఎన్నో నిందలు మోచిన యింతి మీద కరుణ చూపవయ్యా. నిన్ను జుచి కౌగిలించిన చెలికి ఇంక మీద మాటేదీ. ఇంతినిగూడినవేంకటేశా! మీ మద్దుముచ్చటలేవయ్యా.

"సతతంశ్రీశం
హితం పరాత్పరమీడే " (1-165)

గదాధరుడు, మేఘగంభీర నినదుడు, పరమోన్నత, శుభములకూర్చువాడు, మందగమనుడు, భూధరుడు అయినస్వామి నాహృదయమునందు నిలుచుగాక. నందకధరుడు, జనార్దనుడు, గోవిందుడు, ముకుందుడు నందగోపనందనుడు, రవిచంద్రనయనుడు, గరుడ గమనుడు, శేషశయనుడు అయిన ఆ తిరుమలేశుడు నిరంతరము నాకు హితమును చేకూర్చుగాక.

"నేరుతువయ్యా నేరుపులు
పోరచిపొందులె భోగములు " (18-573)

నీవుసకలకళాప్రవీణుడవు. భోగాలు పొందడంలో నేర్పరివి. చిరునవ్వులు చిందిస్తూ వలచిన సతులతో భోగిస్తావు. నీకు కోరిక కలిగినప్పుడే సున్నితమనస్కుడవైన నీతో క్రీడించాలి. నిన్ను మరిగినవారికి నీసరససంభాషణలలోని మర్మాలు తెలుస్తాయి. నీ కప్పురవుమోవి విందులు నిన్ను కూడిన మాకు రతి వేళలలో వేడుకగా వెల్లివిరిశాయి.

"ఇతరదేవతల కిదిగలదా
ప్రతివేరీ నీప్రభావమునకు " (3-44)

నీప్రభావము ఇతర దేవతల కెవరికీ లేదు. మదనజనకా, రవి చంద్రనయన, శ్రీవత్సాంక, గరుడగమన, పద్మావతీపతీ! నిన్ను తలచుటే మనోహరము. ఘనకిరీటమును, పీతాంబరమును ధరించి పాలసుద్రమున వుండి భూదేవిభర్తవై పద్మమును చక్రమును ధరించిన

నిన్నుస్మరించుటే నిర్మలత్వము. దేవతలకు పితామహుడవు త్రివిక్రముడవు, హరివి. నీవారము అనుకొనుటయే నిజమైన సుఖము.

"దురితదేహులే తొల్లియునుశ్రీ
హరి భజించి నిత్యాధికులైరి " (1-21)

పూర్వము దురితదేహులైన వారెందరో శ్రీహరిని భజించి నిత్యాధికులైరి. కోటానుకోట్లమునులు నిశ్చలయశులైన సనత్కుమార, సనకసనందనులు మున్నగువారు రవిశశినయనుని కీర్తించి నిర్మలులైరి. అతిశయమతులు, మహామహులు, భోగములకు విముఖులైనవారు, చిరంతనులు హితమునే కూర్చువారు ఎందరో ఇతనిని భజించారు. అధిదేవతలు దివ్యులు,పావనులు, ఇతరుల మంచిని కోరువారు శ్రీవేంకటపతిని సేవించి సుఖాంచితమతులయ్యారు.

"ఏమని విన్నవింతు నిదివో నాభాగ్యము
కామించి మీశరణంటి గమలారమణా " (2-224)

ఓ కమలారమణా ! కోరినిన్నేశరణుపొందిన నాభాగ్యమేమని విన్నవింతును. కర్మఫలము అందరికైతే వున్నది, మరినాకైతే నీకృపాఫలము. దేవతలకు అమృతము, నాకు నీ నామామృతము దొరికింది. సకల జీవులకు సంసారమే మూలముకానీ నాకు నీపాదమూలము. లోకులు వీధులవీధులు తిరిగితే నేను నీభావవీధిలో త్రికరణరతి సల్పుతాను. అందరకు బంధువులతో బంధము. కానీ నాకు భక్తజనులతో బంధుత్వము. నన్నేలే శ్రీవేంకటేశా! నాధ్యానము నీ శ్రీమూర్తి యందే.

మొక్కేటిగోపాంగనల మోహనాకారము
చక్కని నవ్వులు నవ్వీ శ్రీవేంకటేశ్వరుడు " (15-221)

అన్నమయ్య ఈకీర్తనలో శ్రీ వేంకటేశ్వరుడు ఎవరెవరిని ఏయేరూపాలలో అలరించాడో వివరించాడు. చక్కనినవ్వులు చిందించే వేంకటేశ్వరుడు మొక్కేటి గోపాంగనలకు మోహనాకారుడు. సత్యభామ స్తనములపై అలదిన చల్లని కస్తూరిపూత తత్తరపడేరుక్మిణి చేతిలోని తామరపువ్వు కౌగిలించిన భూకాంతకు పయ్యదకొంగు పదారువేలమగువల బంగారు వుంగరము, కుబ్జకు బంగారు తాళి. రాధాదేవి వేసిన కలువపూదండ. తులసీదేవి అరచేతి అద్దము. ఇళాదేవికి పట్టు గొమ్మ, శ్రీసతి యెక్కిన సింహాసనపు గద్దెగావుండి సేస వెట్టించుకున్నాడు శ్రీవేంకటేశ్వరుడు.

"సకలలోకనాథుడు జనార్దనుడితడు
శుక యోగి వంద్యుని సుజ్ఞానమెంత " (2-279)

స్వామి యొక్క చెప్పరాని గొప్పతనాలను తెలిపాడు అన్నమయ్య. ఈ కీర్తనలో. సుజ్ఞానమును, మదనజనకుని చక్కదనమును, లక్ష్మీపతి భాగ్యమును, పురుషోత్తముని ఘనతను, జలధిశాయి గంభీరమును, సహస్రముఖాలు గల ఆ విగ్రహమును, భూదేవిభర్తకు గల ఓర్పును, బ్రహ్మతండ్రి యొక్క రాజసమును చక్రాయుధుని శక్తి, వరదుని ఉదారత, అసురవైరి పరాక్రమమును, అలమేలుమంగపతి అయిన శ్రీవేంకటేశ్వరుని సొగసును, ఆధిక్యతను ఎంతని వర్ణించగలము?

"వేవేల చందాలవాడు విఠలేశుడు
భావించనలవిగాని పరమాత్ముడితడు" (4-468)

వివిధరూపుల భావించినలవిగాని పరమాత్ముడే విఠలుడు. రుక్మిణీ సత్యభామలనడుమ వుండే శృంగార పురుషుడు, సనకాదుల మదిలో నిండిన పరమానందము, దేవతలకు దిక్కుదెస ఆధారము, గొల్లెతల తపమునకు కైవసమైన భాగ్యము, యశోదానందులు, దేవకీవసుదేవులు వరముతో పొందిన కన్నుల పండువు అయిన ఆతడే శ్రీవేంటాద్రిమీద దాసులపాలిటి నిధానమై వున్నాడు.

"ఇతరులనడుగము యితడే మా దాత"
యితని యీవి వొరులియ్యగగలరా" (3-526)

హరిదేవాదిదేవుడు, ఆదిపురుషుడు, శ్రీవతత్సాంకుడు చిన్మయుడు, ఇలవేల్పు భావజగురుడు, జగద్గురుడు, శాశ్వతుడు, అచ్యుతుడు, వరదుడు, అనంతుడు, యేలిక, నిగమమూర్తి, బంధువు, కలిదోషహరుడు, కైవల్యదాత, చెలిమి బలిమి, తల్లితండ్రి, అంతర్యామి అయిన శ్రీవేంకటాధీశుడే మాదాత అయినపుడు ఒరులకు అడగపనిలేదు అని అన్నమయ్య స్వామి ఈవిని తెలియపరచాడు.

"జలజనాభ హరి జయజయ
యిల మానేరము లెంచకు వయ్యా " (2-396)

ఓహరీ ! పద్మనాభ నీకు జయము జయము. ఈ లోకములో మానేరములను లెక్కించకుము అనేక ముఖాలుగల ఈ ప్రపంచము సహజముగా చంచలము. నీవే దానిని విడిచిపెట్టలేనపుడు అందులోనే విహరించే జీవులు దానిని విడిచి పెట్టగలరా ! ఇంద్రియవశమైన ఈ ప్రకృతి పలువిధములైన నటనలకు లోనైనది. నీవాప్రకృతి యందేకాపురముంటావు. మరి మలినజీవులు దానిని మానగలరా ! నీమాయను మరల్చుడానికి నీవే సమర్ధదవు, శరణుకోరటానికి మాత్రమే నేను శక్తుడను. ఇతరులెవ్వరూ నన్ను రక్షించలేరు.

"చాలుచాలును భోగసమయమున మైమఱపు
పొలుపడునట యేటిబ్రతుకురావోరి" (5-45)

ఓకోనేటితిమ్మా ! నీతో భోగించేసమయంలో మైమరపు కలిగితే మరి ఆ బ్రతుకెందుకు? నిన్ను కౌగిలించినచో నీలోపలిజగములుకందునని బిగికౌగిలిని సడలించింది. కోరినవానిని బిగికౌగిట బిగించలేని పొందుఎందుకు? నీకనుదోయిని చేతులతో మూసిలోకమంతా చిమ్మ చీకట్లు కమ్మగా వెంటనే వదలింది. వలచివలపించుకున్నవారితో విలాసములు చూపలేని ఆ వలపెందుకు? నీవక్షస్థలంపై గోటిముద్రలువేస్తే అవి ఆత్మలోవున్న నన్నుదాకినవి. అలానీపై ప్రియాన్ని కుమ్మరించలేని బ్రతుకెందుకు?

"కాదనకునామాట కడపరాయ-నీకు
గాదెబోసేవలపులు కడపరాయ" (1-458)

కడపరాయా! నీపైవలపులు గుమ్మరిస్తున్నాను. నామాటకాదనకు నాపయ్యద నీకు కప్పినాను. నాకు కప్పుర మియ్యవయ్యా ! నల్లనిమేఘము మేనిరంగులవాడా నన్ను గాఢంగా కౌగిలించు. చందన చర్చలు చేసిననీవు నాతో క్రీడించటానికి రారాదా? మదనజనకుడవైన నీకు మొక్కుతున్నాను. నీసరససంభాషణలిక పై చూద్దాం! ఈనాడు నీవు నన్ను కలిశావు. నాకలనేడు నిజమైంది. నేను నీసొత్తుగదా! ఓ కడపరాయా! నన్ను నీవు ఏలుకో !

"మేడలెక్కినిన్నుజూచి కూడేననే ఆశతోడ
వాడు దేరిఉస్సురందురా వేంకటేశ !
యాడవుంటి లిందాకనురా " (7-223)

ఈ సుదీర్ఘ కీర్తన సరస సంభాషణలశైలి కొనసాగింది. ఓ వేంకటేశా ! నీవింతదనుక ఎక్కడున్నావు? నీతో క్రీడిలచాలనే ఆశతో నీరాకకోసం మేడ లెక్కి చూచి విరహతాపంతో ఉస్సురన్నాను. నీరాజముద్రికను పిక్కటిల్లే నాచనులపై అద్దుకొనగాలక్కవలె ముద్రలంటుకొని విరహతాపం కలిగింది. నీవు దప్పిగొన్నావని సుగంధజలాలందించి నీవిరహాగ్నిని నిప్పని భ్రమించాను. ఎలమావిపై గండుకోయిల కూయగా నీకంఠస్వరమని భ్రమించి నాఅండకు రమ్మని పిలిచాను. ఉదయచంద్రుని చూచి నీముఖచంద్రబింబమని ఎదురు వచ్చి బెదరి మారుమోమయ్యాను. రతిక్రీడలో తమ్మిపూలు నీకనులకు తగిలించగా అవి మదన బాణాలయినాయి. నీశరీరచ్ఛాయను పోలిన తుమ్మెదలను పట్టబోగా అవి మదనాస్త్రాలయినాయి. శరీరతాపాన్ని పోగొట్టుకోవటానికి గంధవళి చల్లుకొని నీపొందుకోరితే అది వశీకరణ మందు అయినది. మల్లెపూలపానుపుపై నీపై పాటలుపాడి జాగరములున్న రాత్రులు వెన్నెలలు ఎండలైనాయి. నిద్రించగా నీవునాపక్కలోనున్నట్లు కలగని పురాస్మృతులు గుర్తుకు వచ్చిన సుద్దులు ఏమని చెప్పుదును. సున్నితమైన మల్లెపూవుకొనను దాకి ఒళ్ళు ఝల్లనగా నామేను నీకర్పించాననడం కల్లగాదు. నీవూనేను జోడుగట్టి మాట్లాడుకున్న సరసాలన్నీ గోడలేని చిత్తరువులై నామతిని పోగొట్టాయి. అద్దంలో నానీడను చూచి మోవిపై గంటుచూసి

శరీరతాపంతో పొద్దుపోక తమకించాను. పావురానికి ప్రేమలేఖనుగట్టి పంపి నీవు రావలెనని ఆదేవునికి మొక్కుకున్నాను. నీ సింహాసనంనుండి దిగి నాముంగిటికి రాగా నేను తొంగిచూచినిలువగా ఎంగిలిమోవి ఎందుకడుగుతావు! దంతపు మంచముపై పంతముతో నేనురాగా నన్ను బలిమితో కౌగిలించావు. నేను నీకంతప్రియమయ్యానా ! నాపట్టు చీరకొంగుజారి నేనుసిగ్గులుపోతుంటే నీవేలనవ్వుతావు. నాకొప్పుబట్టి క్రీడించి నేను చూచానని నీవుచమరించావు. నేను బొమ్మలపై తమ్మిపూవులు విసిరితే నీవు అనరాని తిట్లు తిట్టావు. రతిపారవశ్యంతో పందాలు కాచి నీవు ఓడినట్లు నటించే జాణవు. నీవు నన్నుమన్నించి కూడిన సురత సౌభాగ్యాన్ని మెచ్చిన ఆసన్నివేశం కన్నులపండువైంది. మన పడకటింట్లో చిలుకలు మన రతిరహస్యాలు పలుకగా నేను తలవూపుతాను. నీపైవలపు నేను నోటితో చెప్పలేను అదిలోకమంతా ఎరిగినదే ! నాప్రాయమంతా నీకోసం మీదు కట్టాను మాయిల్లువదలవద్దు. ముమ్మాటికీ నేను నీవు సేసిన బాసలే నమ్మివున్నాను. నావిరహపు చిమ్మచీకట్లను పారద్రోలి నాపై నీకరుణను కుమ్మరించవయ్యా !

"ఏమినెఱుగనునేను ఇకనీచిత్తమురా
దోమటి వయసు నాపై దోసినట్టితోయరా" (19-405)

నేను ఏమియు యెరుగను. యవ్వనముతో నీచిత్తము వచ్చినట్లు నన్నేలరా !నీతలపులతో తమకించాను ఎలా ఏలుకుంటావో ! నీతో తప్పనేనెవరితోమాటాడను. పంతమునాలోనే ! చలి వలపులను నాపై చల్లరాదా! వాలుచూపుల నీపై బడి చెమరించాను. నాచనుదోయిని మర్దించు. నా అలకలన్నీ నీకోసమే ! నీవు నాతో నవ్వినట్లు నవ్వు. కౌగిలినీకుకళలదేలేదినేను. నీఅధరామృతాన్నియిచ్చినంతయివ్వు ! ఇద్దరి మనస్సులు ఒకదానికొకటి పెనగొన్నాయి.

"మనసు తనపాలిటిమమకారభూతమై
అనయంబు నిన్నిటికి నాధారమాయ " (6-155)

మనసు తనపాలి మమకారభూతమై అన్నిటికీ ఆధారమైంది. చూపులు ఆశలవలలలో చిక్కుకొని సుఖాన్ని అందుకోబోతే మనసులో పరితాపం కలిగింది. తాపము, పరవశము,శరీరశ్రమ, ఆపదలకన్నింటికీ మూలమైనాయి. మనస్సులోని, రతికోర్కెలను తమకించబోగా వలపులకు తగులాటమాయెను. వలపులనే మహావైభవంలో అలపులు, సొలపులు దీర్ఘమైనాయి. శేషాద్రి పతిని దూషించిన కారణంతో అతనికి కోపం అధికమైంది. ఆకోపము కరుణారసముతో తడిసి నీసంయోగానికి త్వరపెట్టింది.

"మోహము సేయించుకొనిమురిసేవునీ
సాహసములెదురాచదురాలికిపుడు " (5-71)

ఈ శృంగారకీర్తనలో అమ్మస్వామికి ఎందులోనూ తక్కువగాదు అన్ని అన్నమయ్య నిర్ధారిస్తున్నాడు. అమ్మ మోహముతో మురిసిపోతున్నావు. స్వామి నీ వద్ద సుదర్శనచక్రము ఒకటివున్నది. అమ్మవద్దచనుగుబ్బల చక్రవాకాలు రెండువున్నాయి. చక్కదనములోనూ అమ్మ నీకు తీసిపోదు. నీమేను చాయ నీలిమేఘమువంటిదైతే నీలిమేఘమే అమ్మ కొప్పు. నీజాలి అమ్మ ఓర్పు ముందు సాటిరాదు. మన్మధునికి ప్రతినిధి నీమహిమ అయితే మరుని సంపదే యీమగువ. తిరుమలేశ! నీసరసమునకు అమ్మ తీసిపోదు.

"అణురేణు పరిపూర్ణమైనరూపము
అణిమాదిసిరిఅంజనాద్రిమీదిరూపము" (2-432)

అణువు మొదలు బ్రహ్మాండములన్నీ ఆపరమాత్ముని స్వరూపమే. అణిమ, మహిమ, గరిమ, లఘిమ, ప్రాప్తి, ప్రాకామ్యము, ఈశత్వము, వశిత్వము అను అష్టసిద్ధులు ఆయన అధీనమే. వేదాంతవేత్తలు వెదికే రూపము, ఆద్యంతములులేని రూపం, యోగీంద్రులు భావించేరూపం ఇక్కడే కోనేటి దరినేవుంది. పాలసముద్రమున పవళించేరూపం. కాలపు సూర్యచంద్రాగ్నులు తానే అయినరూపం వైకుంఠమునప్రకాశించేరూపమే శేషగిరి మీదనున్న ఈరూపము. బ్రహ్మాదులకు ఆదిమూలమైన రూపము ప్రళయకాలమున మఱ్ఱాకుమీది రూపము, పరబ్రహ్మమైన శ్రీవేంకటాద్రిమీద వుండి మమ్మునేలిన వేంకటేశుడు.

"ఊరులేని పొలిమేర పేరు పెంపులేని బ్రతుకు
గారంబులేని ప్రియము కదియనేటికి" (5-55)

ఊరులేని పొలిమేర (సరిహద్దు). పేరు ప్రతిష్టలేని బ్రతుకు గారవంబు లేని ప్రియము ఉండీ వ్యర్థమే. విరహ వేదనలేని సురతసుఖము, ఎండలేనపుడు నీడకు విలువ, తమకమేలేనపుడు ఓర్పుకు విలువ, ఇద్దరు ఒకటవని ప్రియములు వ్యర్థములు. మెప్పులేనిచోట మంచితనము, చనవులేనిచోట మంచిమాటలు, ఇష్టములేనిచోట సొగసులు ఉన్నతిలేని చోట ప్రియములు, సత్యమైనస్నేహములేని పొందులు సంకోచములేక పొందని చనవులు వ్యర్థములైనట్లే వేంకటాద్రి విభుడులేని వేడుకలు నిష్ప్రయోజనములు.

"నే నవగుణినైన నీకు బోదు భువి
లోన భక్తవత్సలుడవటుగాన" (4-367)

నీవు భక్తవత్సలుడవుగావున నేనెంత గుణహీనుడనైనను నీకు నన్ను రక్షించక తప్పదు. ఓ పరమపురుషా, భవరోగవైద్య, ధరణీధరా, మాధవా, కేశవా! ఈసంసారములో బాగా అలసిపోయాను. ఇప్పుడు నిన్నుగాంచే దారి తెన్ను తెలుసుకొనలేకున్నాను. భువనాతీతా, పుండరీకాక్షా, నవనీతప్రియ, నారసింహా, నేనెంత అపరాధినైనా నన్నుకాపాడవయ్యా! నిర్గుణుడు,

సగుణుడు, ఆద్యంతరహితుడు, నిగమగోచరుడవైన అగణిత శ్రీవేంకటాద్రినాథ! నేను నీ ఆధీనుడను. నగుబాటు కాకుండ నన్నుగావవయ్యా !

"కొమ్మకడకు విచ్చేసి కోరినవరమీరాదా !
యెమ్మెల మానసతపమీకె చేసీని" (7-380)

ఈ విధముగ ఈమె మానసతపముచేయుచున్నది గద! మగువ దరికివచ్చి కోరిన వరము ఈయగరాదా! ప్రియుడు సరసనలేనపుడు విరహములో మంచివన్నీ కూడా విపరీతంగా తోస్తాయి. అలాగే ఈమెకు కూడా జరిగింది. వెన్నెలలనే ఎండలలో విరహతాపంతో చెలితపముచేసింది. చెమటలో తలమునకలైన నీటిలో నీకోసంతపము చేసింది, నిట్టూర్పుల సుడిగాలితో చలించక ఘోరతపస్సుచేసింది. యవ్వనపువనములో నీరతికొరకు తపస్సు చేసింది! నీయింట నిన్ను కూడిన అలమేలుమంగ ఇప్పుడు మోహన తపము చేసినది.

"ఇతరమేదియులేదు యెఱుగ మింతే కాని
రతికెక్కె పనులెల్లా రామచంద్రుడే వో" (4-11)

మనసులో తలచే ఆమాధవుడే దైవమై రక్షించి, ధనమైచేరి నాలుకచివర గోవిందనామమై నిలుస్తాడు. తల్లిగాపెంచి తండ్రిగా పుట్టించేది, మనం కొలిచే విష్ణువే. ఇల్లాలై, పుత్రులై సుఖమిచ్చేది శ్రీహరియే. ఈదేహమైనవాడు, భోగించేవాడు శ్రీవేంకటేశుడే. మోహాచారమైన వాడు, మోక్షమైనిలిచేవాడు నమ్మగలిగినవాడు అనర్వేశ్వరుడే. తెలుసుకొనలేకున్నాము కానీ రతికెక్కెపనులన్నీ చేసేవాడు ఆరామచంద్రుడే. అన్ని రూపాలలో అన్నీచేసేవాడు ఆపరమాత్మడే అని తెలుసుకొనలేకున్నాము అంతే!

"ఇదిగాక సౌభాగ్య మిదిగాక తపముమరి
ఇదిగాక వైభవం బికనొకటి కలదా" (5-17)

శృంగారకీర్తనలా కనిపించే అధ్యాత్మకీర్తన. పరమాత్ముడొక్కడేపురుషుడు. జీవులన్నీ నాయికలు, కోరికలన్నీ విడచి పరమ యోగివలె జన్మను సఫలము చేసుకున్నది. శాంతమైన ఆసతికోరికలు విజ్ఞానవాసనలు విరజిమ్ముతున్నాయి. ఆమోహ్రాదయము కృతార్థతబొంది పరవశించింది. నిశ్చలభావములతో మనసును జయించినది. శ్రీ వేంకటేశ్వరుని చింతించి పరతత్వమును పొంది దేవదేవోత్తముని కృపకు పాత్రమైన ఆమె మనస్సు స్థిరమైనది. ఇంతకంటె సౌభాగ్యము, తపము, వైభవము మరియొకటి లేదు.

"చూచి మోహించకుందురా సురలైన నరులైన
తాచి, నీవు ముందర ప్రత్యక్షమైనను " (2-403)

గంగపుట్టిన నీపాదములు, మన్మథుని జన్మస్థానమైన నీతొడలు, నవబ్రహ్మలున్న నీనాభి,

లక్ష్మికి నెలవైన నీఉరము, అందరిని రక్షించే అభయహస్తము, అసురులనడచే నీగదాహస్తము, లోకములనాజ్ఞాపించే చక్ర హస్తము, నీశంఖహస్తము,ధ్రువుని స్తుతించునట్లు అనుగ్రహించింది. సకల వేదములుగల నీముఖము, తులసిని ధరించిన నీ శిరసు, మహిమలు గల నీరూపమును చూచిన సురలైన నరులైన మోహించకుందురా వేంకటాధీశా!

"ఏరీతి నెవ్వరు నిన్నునెట్టు భావించినాను
వారివారి పాలికి వరదుడవౌదువు" (2-173)

నిన్నేవిధముగ భావిస్తే వారి పాలిటికి వరదుడు వేతావు. కొలిచేవారికి చేతిలోని కుంచమవు. కీర్తించిన వారికి కొంగుబంగారురమవు. తలచినవారి నిధానమవు. వివేకులకు సచ్చిదానంద స్వరూపుడవు. కోరినవారికి కామధేనువవు. సేవించుకొనేవారికి చింతామణివి. నీవే గతియన్న వారికి రక్షకుడవు, శరణువేడిన వారి భాగ్యరాశివి. నిన్ను పూచించినవారి పరతత్త్వమవు. ఓవేంకటేశా ! నీదాసులకు ఇహముపరము నిచ్చే ఫలదాయకుడవునీవే!

"దిమ్మరి గాకేలమాను ధీరుడైన కోనేటి
తిమ్మడు దాలోకమెల్ల దిరుగాడువాడు" (6-172)

ఈకీర్తనలో అన్నమయ్య స్వామి అవతారములను స్పృశించాడు. ముత్యాల తులసిమాలలను ఉరమున ధరించినవాడు, పీతాంబరము గట్టినవాడు, గొల్లెతలతో కూడి ఆడినవాడు, అందమైన తలకట్టు, పెద్దపెద్ద కన్నుగలిగి వాలుచూపుల సిరినివలచినవాడు, లోకములో జగజెట్టిఅయినవాడు, తాను నేలమీదనిలిచి మింటికి కాలు చాచినవాడు, మంధరగిరి మోచినవాడు గోవర్ధనము నెత్తినవాడు, కొండంత రాకాసుల చంపినవాడు, కొండవలె అండనుండి కొండల కోనేటి దిగ్గజములను అధీన మందుంచుకొన్నాడు. లోకాలన్నీతిరిగే ధీరుడైన కోనేటి తిమ్మడు దిమ్మరే గద!

"ఆలించుపాలించు ఆదిమ పురుషక్షమ
జాలి దీర నీకే శరణు చొచ్చితిని" (4-338)

ఓ ఆదిపురుషా ! నీశరణంటిమి. మాజాలి తీర్చి ఆలించిపాలింపుము. గతి, మతి, కర్త, భర్త, పతి అన్నీనీవే. నీకుసాటి మరొకరులేరు. చతురుడవైన నిన్నే శరణుపొందాము. తల్లి, తండ్రి శరణము. ఉనికి మనికి, ఉపమచనవి, మనవి అన్నీ నీవే అయిమన్నించు! శరణుజొచ్చాము లోకసాక్షివి, లోకబంధుడవు నీవే! సాకారరూపుడవైన ఓ వేంకటేశా! నిన్నే శరణుజొచ్చితిమి. రక్షించు!

"మచ్చకూర్మ వరాహ మనుష్యసింహ వామనా
యిచ్చ రామరామ రామహిత బుద్ధి కలికీ " (15-168)

ఈ కీర్తనలో అన్నమయ్య పల్లవిలోనే దశావతారములను, చరణములలో సంకల్పములో చెప్పుకొనే కేశవాదినామములను ఇరువది నాల్గింటిని పేర్కొన్నాడు. మత్స్య, కూర్మవరాహ, నారసింహ, వామన, పరశురామ, బలరామ, రామ, బుద్ధ, కల్కి దశావతారములను, కేశవ, నారాయణ, మాధవ, గోవింద, విష్ణు, మధుసూదన, త్రివిక్రమ, వామనా, శ్రీధరా, హృషీకేశ, పద్మనాభ, దామోదర, సంకర్షణ, వాసుదేవ, ప్రద్యుమ్న, అనిరుద్ధ, పురుషోత్తమ అధోక్షజ, నారసింహ, అచ్యుత, జనార్ధన, ఉపేంద్ర, హరి, శ్రీకృష్ణ రాయడవైన ఓ వేంకటపతి ఇందిరానాథా, సర్వేశా, అనంతా నీ దాసులమైన మేము ఈ నీ నామములనే జపించుచున్నాము. నీకు మ్రొక్కేమమ్ము ఎడబాయక, మన్నించి రక్షించుము.

"తగుమునులు ఋషులు తపములు సేయగ
గగనము మోచియు గర్మము దెగదా" (3-315)

భూదేవిని ఉద్ధరించి, మంధర పర్వతమును మోచి, గోవర్ధనము నెత్తి, కౌస్తుభమణిని, శ్రీదేవిని ఉరమున ధరించిన నీవు కరుణించినది కరిని, కాకిని. భవహరుడవు, మురహరుడవు, భక్తులపాపములహరించేవాడవు, భూభారమును హరించేవాడవు, పురహరుడవైననీవు దయచూపినదిఉడుతపై, గద్దపై, శేషగరుడపతివి, ధరణీపతివి భూతపతివి అయిన శ్రీవేంకటాధిపతి! గోవులను, కోతులను నీకృపకు పాత్రముచేశావా ! మునులు, ఋషులు ఎన్నోకష్టములకోర్చి తపస్సులు చేసినా కర్మము తెగదా! ఈకీర్తనలో అన్నమయ్య అల్పజీవులను కూడా కాచిన స్వామి కారుణ్యమును వ్యంగంగా తెలియజేశాడు.

"కట్టెదుర వైకుంఠము కాణాచయినకొండ
తెట్టెలాయ మహిమలే తిరుమలకొండ" (3-471)

ఎన్నోమహిమలకు నెలవు, కన్నుల ఎదుటివైకుంఠము యీతిరుమలకొండ. వేదములే శిలలుగా నిండినది. పుణ్యరాసులే ఏరులుగా ప్రవహించేది, బ్రహ్మాది లోకములపైన వుండేదీ శ్రీపతివుండే ఈశేషాచలం. దేవతలు మృగజాతులై చరించేది, సముద్రములే నీటి మడుగులైనది, తాపసులే వృక్షములుగా నిండినదైన యీపొదవాటి కొండయే పూర్వము అంజనాద్రి. వరములే కుప్పలుగా, గుహలనిండ సంపదలతో నిండిన లక్ష్మీకాంతుని శోభనపుకొండయే శ్రీవేంకటగిరి.

"కానరు నాలుగు కరముల వానిని
శ్రీనాధుండని చేరగ వలదా " (3-319)

నాలుగుచేతులుగల ఈతనిని శ్రీనాధుడనిదరిచేరవలెనుగదా! చక్రముతో గరుడుని ఎక్కిన కృష్ణుడే ఆనాటి విష్ణువని ఈ మనుజులు మొక్కువలెను గదా! దేవతలభయము మాన్పి

విశ్వరూపం చూపగా ఆకౌరవులు పట్టుదలమాని దేవుడని సేవించవలెగదా! ఇప్పుడు ఈ వేంకటమున నున్న ఇతడే వరములు ఈయగా దాసులవలె ఎరుగవలెనుగదా?

"విచ్చేయవయ్యా వెంకటా చలము పొంత
కచ్చుగా నేమున్న చోటికచ్చుత నారాయణా" (3-433)

ఓ అచ్యుతా! నారాయణా! వెంకటాచలము చెంతకు మేమున్న చోటికి రావయ్యా! అలనాడు లంకను సాధించి అందరుపొగడతుండగా అయోధ్యకు మరలినట్లు, కైలాసయాత్రకు వెళ్ళిమరలి ద్వారకు వచ్చినట్లు, గోమంతమెక్కి విజయము సాధించి మధురకు మరలినట్లు, ఎన్నోచోట్ల అల్లిరములారగించి వేడకతో వచ్చినట్లు, త్రిపురవనితలకు బోధించి మరల ఇందిరవద్దకు విచ్చేసినట్లు గరుడ వాహనుడవై మమ్ముగావగా విచ్చేసినయట్లు శ్రీవేంకటేశా! వేంకటాద్రి చెంతకు విచ్చేయవయ్యా !

"వరుసతో సాసముఖా వసంతపూర్ణిమనేడు
సిరులఈవిభవాలు సేవించరో" (7-445)

స్వామి! వసంత పూర్ణిమనేడు ఈసిరుల వైభవములను స్వీకరించవయ్యా! గోవిందుడు లక్ష్మిమండపమున నుండగా, మన్మధుడు సేవించరాగా చంద్రుడు గొడుగుపట్టగా, పవనుడు వీవన వీచాడు. వసంతుడు పూవులతో పూజించగా తుమ్మెదలు గానముసేయగ, చిలుకలు పద్యాలు చదవగా, కోయిలలు వందిమాగధులై పొగిడాయి. రతీదేవి రమణులతో నాట్యమడగా, మేఘములు వసంతమాడగా వేంకటగిరి వెల్లివిరియగా దేవతలు వేంకటపతికి మ్రొక్కారు.

"విజయపుటమ్మువేసె వేంకటేశుడు
విజయుని సఖుడు యీ వేదమూరితి" (3-472)

విజయునిసఖుడు, వేదమూర్తి అయిన వేంకటేశుడు విజయబాణంవేశాడు. దశకంఠుని పదితలలమీద ఆదిదేవుడై బాణమువేశాడు. ఆ విష్ణుదేవుడే సేనలతో సముద్రముదాటే సమయమున వేరొక బాణమువేశాడు. ఏడుసాలవృక్షములను ఒక బాణంతో కొట్టాడు. ఈ సందర్భములు రామావతారములోజరిగినవి. రుక్మిణిని పెండ్లాడు సమయమున శత్రువులపై జాలియమ్ముపేశాడు విజయ కృష్ణుడు. శ్రీవేంకటేశుడు విజయదశమినాడు ఇందిరతో గూడి పంతమున అమ్మువేశాడు. ఆవిష్ణుదేవుడే సుజనులను దేవతలను అందరినిగాచి విజయమును చేకొన్నాడు.

"ఇలువేల్పితడే ఇందరికిని మరి
పలువేల్పులతో పనియికనేలా " (4-133)

అందరికి ఇతడే యిలవేల్పు అయినప్పుడు పలువురుదేవతలతో అవసరమేముంది ! అమరులు తాగే అమృతము లక్ష్మీరమణుని కరుణే గదా! ఈప్రాణులందరు నిలిచిన భూమికి ఆధారము శ్రీహరేకదా! ఈసృష్టికంతకు మూలము పద్మనాభుని బొడ్డుతామరేగదా! భువిపైనిండిన సిరులంతా హరిసతి మహిమలే కాదా ! ఇతని కుమారుడైన బ్రహ్మరచన వలననేకదా సతీపతుల సంసారమంతా. శ్రీవేంకటేశునిలోకమే ఉన్నతమైన వైకుంఠనగరపు ముక్తికి మార్గం.

"భావించువారలపాలి భాగ్య మిత

డావల నీవల అంతర్యామి " (4-19)

అంతర్యామియై భావించువారలపాలిటిభాగ్యమే ఇతడు. దేవతలకుఈశ్వరుడు. జగములకు శాశ్వతమూర్తి, వివిధజీవులకు విశ్వాత్మకుడై మా అంతర్యామి అయినాడు.కాలాతీతుడైన నిత్యుడు, చదువులకు సత్యుడు, భక్తకోటికి ప్రత్యక్షసాక్షి. మునిజనాలకు గుణి, నిర్గుణి ఇతడే. వేదాంత వాక్యాలకు ఓంకారస్వరూపుడు లోకుల కితడు అణువులోదాగిన అంతర్యామి.

"భారకుడతడే బంధువుడతడే

చేరితిమతనినే చెంచలమేలా" (4-354)

చేత ఆయుధము వుంటేనే నిర్భయుడైతే అనంతాయుధుడైనస్వామి ఆత్మలో వుండగా భయమెందుకు? ఇలలో ఒకరాజుని సేవించితే నేకొఅతలేదట మరి ఆభువనరక్షకుడే మనలను ఏలగా మరొకరిని అడిగేఅవసరమేముంది? దారిలో నిధిదొరికితేనే ఏమి లెక్కచేయడు మరి ఆశ్రీపతికావగా ఇతర ఉపాయములతో పని ఏముంది? భారకుడు, బంధువయిన వేంకటపతి దరిచేరిన తర్వాత చంచలత్వమెందుకు!

"త్రిజగములనెరుగు దేవదేవుడు

అజుని జనకుడైన ఆదినారాయణుడు" (3-523)

ముజ్జగములనెరిగిన దేవదేవుడే బ్రహ్మతండ్రియైన ఆదినారాయణుడు గరుడునిమీద నెక్కి చక్రముచేతబట్టి పరమపదమునుండి వచ్చి కరిని రక్షించి మొసలిని త్రుంచినవాడే ప్రతాపముగల ఈఆదినారాయణుడు. పీతాంబరము ధరించి మెడలో కౌస్తుభమణితో శ్రీసతిసేవించగా పాంచజన్యము పట్టి కరుణచూపేవాడే ఈ ఆదినారాయణుడు. త్రిదశులు నుతియించగా ముదముతో దాసులు మొక్కులిడుచుండగా అందరికీ వరములిచ్చే వేంకటపతే ఆదినారాయణుడు.

"కనుగొనవయ్యాకలికిని

కొలువున జిలుకలకొలికిని " (18-308)

చిలుకలకొలికి అయిన ఆ అలమేల్మంగాను చూడవయ్యా ! వదన కమలమును కొద్దిగావంచి క్రీగంటి చూపులలో మెదలేటికళలతో నీపై ఆశలతోవున్న చెలినిచూడవయ్యా. తమకముతో కూడి నీకు మొక్కుతున్నది. తనియని మాటలతో నీపాదము తొక్కుతున్నది. పలురాగముల నినుపాడి వలవంతల వసివాడిన అలమేల్మంగను కనుగొనవయ్యా.

"కోవిలపలుకదు కొమ్మావిలతల
దైవికమిదివో తలకిందాయె" (5-44)

విరహ వేదనతో సొమ్మసిల్లుతున్న సఖిస్వామితో ఇలా అంటున్నది. ఓస్వామి! నేడు దైవవిధి తలక్రిందైనది. కొమ్మావి పై కూర్చున్నకోయిల కూయడంలేదు. సూర్యప్రతాపం అధికమైంది. అంధకారం గిరులపై, నలుగడలకప్పింది. అలుకలు నిజమైనాయి. తోటలలో వెన్నెలకాసి కలువ సరస్సులు పొంగాయి. ఆ రీతిగానైనా చెలి నీకు కనిపించి నీముఖంపై చిరుకోపం ముచ్చటగా కనిపిస్తోంది. నలువైపుల నక్షత్రకాంతితో నేనిట్లయినాను. నీకౌగిటిలో కరుణవలన మన్మథగ్రహణమైనట్లయినది.

"ఒరపో మెఱుపో వయ్యారమో నీకు
వెరతుమయ్య గోవిందుడ" (5-129)

ఓ గోవింద! నీ శృంగార లీలా విలాసాలకు మేము భయపడతాము. కపటమో, నిజమో, కరుణమో, కోపమో, ఉపచారమో, తాపమో తెలియనట్లు నీవువిపరీతంగా స్నేహం చేస్తావు. నగవు, నయము, ప్రియము, చనవు, చలము, సరసము, కూరిమి, గయ్యాళితనము కలబోసి మావెంబడి పడతావు. మరులో, మదమో, ముదమో, జంకో, జగడమో, తెలియనట్లు శంక లేకుండా నాతో క్రీడిస్తావు. శబ్దానుప్రాసతో అలంకారశోభితమైన కీర్తన యిది.

"ఇందునే తుదిపదమెక్కి రిందరును
మందరధర నీ మహిమిదివో" (3-548)

నీచింతనతోనే సమస్తజనులు కైవల్యాన్ని పొందారు. అది నీమహిమ నిన్ను నమ్మినవారి మదిలో నీపాదములే పరమగతి. అదే గోపికలు నీతో కోరిన సంభోగసుఖము. వేదాలన్నీ పొగిడేది నీగుణగానమే. యజ్ఞాలఫలాలన్నీ నీ నిజపూజలే. నీశరణాగతియే కైవల్యమునకు దారి. మాగురుడు చెప్పినది, మావద్ద వున్నది నీమంత్రమే.

"చలువకు వేడికి సరికిసరి
కలదిక హరినీకరుణేమాకు" (4-213)

సుఖదు:ఖాలు ఒకదానితో ఒకటి పోటీ పడుతున్నాయి. నీకరుణయే మాకుదిక్కు. జన్మఎత్తిన వెంటనే మదమాత్సర్యాలు పైకొంటున్నాయి. శరీరం రుచులే వెదుకుతోంది.

నిన్ను తెలుసుకొనేదెపుడో! కడుపునిండితే పంచేంద్రియాలు నిండుగా పైకొంటాయి. ఆశలు బంధాలు విడువవు. మోక్షమెపుడో ! వేదశాస్త్రాలు చదివితే సందేహాలు అధికమౌతున్నాయి. వీటన్నిటికి నీవే దిక్కు

"సకలముచదివినశాస్త్రములెరిగిన
శుకధ్రువాదులిటుచూపినది" (3-488)

ఓస్వామి ! శుకుడు, ధ్రువుడు మొదలైనవారు చెప్పినదే సకల శాస్త్రములసారము. జన్మజన్మకులకు ప్రకృతులు వేరై నామరూపాలు వేరేకానీ ఎప్పుడు నీదాస్యమొకటే. నీమాయ తెలుసుకోవడమే తరువాయి-మతాల మార్గాలు వేరు. సంశయాలు వేరు. . నిన్నుశరణుగోరుటయే మోక్షప్రదము. జాతులాచారాలువేరు తుదకుమోక్ష మొక్కటే. మాగురుడు చెప్పినదీ అదే !

"తప్పులెంచకిక దరి చేర్చవయ్యా
చెప్పనేల నీచిత్తమయ్యా" (3-435)

శ్రీసతీప్రియా ! మాతప్పులెంచక మమ్ము దరిజేర్చు. నీవు కలిదోషములను తొలగించ గలవాడవు. కర్మములను పోగొట్టగలవాడవు. నీదాసులమైన మేము నీశరణాగత వజ్ర పంజరము మరగుననున్నాము. దురితాలను పోగొట్టి దు:ఖాలను పారద్రోలే నీ అండగల భక్తులముమేము. కరిరాజవరదుడవైన నిన్ను నమ్మిన జంతువులము. నీకింకరులమైన మాకు ఇతర మతముల జోలి ఏల ? నీవే మమ్ము పాలించాలి. ఇకపై నీచిత్తము.

"వింటిమి నీకతలు కంటిమినీ మాయలు
బంటుల మచ్యుత నీపాలివారమయ్యా" (3-546)

ఓ వేంకటేశా! నీకథలు, నీమాయలు, విన్నాము కన్నాము. అచ్యుతా నీబంటులము. నీవలననే బ్రహ్మాదులు, దేవతలునిలిచారు. నీవే దైవమవని మునులుతెలుసుకున్నారు. నీకుశరణము. నీమహిమను వేదాలు నుతించాయి. వైకుంఠమే అందరికీ గతి. యోగీంద్రులు నీరూపాన్నే భావించారు. మేము నీకే దాసులము. నీచక్రధారలకు అసురులు అణగిపోయారు. నీపాదసేవతో నీకరుణతో విప్రులుబ్రతికారు. ఎల్లవేళల మేము నీకే మ్రొక్కుతాము.

"కంటిరావింటిరా కమలనాభుని శక్తి
ఒంటి నితని శరణ మొకటే ఉపాయము" (2-470)

భక్తులారా! ఆపద్మనాభుని శక్తి తెలుసుకున్నారా! అతనిశరణు గోరుట ఒక్కటే ఉపాయము అతని నాభియందు బ్రహ్మజన్మించాడు. ఇతడే ఇంద్రాదులను రక్షించాడు. ప్రళయకాలమున ఆకుపైతేలాడు. ఇతడే మనదైవము. మూడడుగులుగా మూడులోకాలను చేసుకొని రాక్షసబాధను తొలగించిన దితడే. నీవే తప్ప 'ఇత:పరంబెరుగ' అన్న కరిరాజును

బ్రోచినవాడితడే. ఇతనికంటె ఇతరదైవములెవరున్నారు? ఇతడే వైకుంఠపతి, రమాపతి, అంతర్యామి, ఇహపరధనము, వేదోక్తదైవము.

"వేదముదీర్చదు వేరేశాస్త్రములు
ఏదియుదీర్చదు ఇదినీమాయ" (3-565)

వేదములు, శాస్త్రములు గూడ నీమాయను తుంచలేవు. దేవతలు నీవల్లబ్రతికారు, అసురులు నాశనమయ్యారు నీవల్లనే. ఇందరిలో ఆత్మవునీవే ! భువిలో అదేపెద్ద చిక్కు సమస్య. పాండవులను ఆదరించావు. కౌరవులను విడిచావు. కానీ వారిరువురి వావివరుస ఒకటే. ఇదేతీరని చిక్కు. జగత్తులో నీవే స్వతంత్రుడవు. నీవారు ధన్యులు. శ్రీవేంకటేశ ! నీదాసులు తెలిసిన చిక్కు.

"ఆదిమూలమే మాకు నంగరక్ష
శ్రీదేవుడే మాకు జీవరక్ష" (4-49)

ఆదిమూలమైన శ్రీదేవుడే మాకు అంగరక్ష, జీవరక్ష, భూదేవి పతియైన పురుషోత్తముడేమాకు భూమిపై రక్ష. జలధిశాయి అయిన స్వామియేజలరక్ష. అగ్నిలో యజ్ఞమూర్తి అయిన దేవుడే మాకు అగ్నిరక్ష. వాయుసుతుని ఏలిన వనజనాభుడే మాకు వాయురక్ష. పాదముతో ఆకాశమును ఆక్రమించిన ఆవిష్ణువేమాకు ఆకాశరక్ష. సర్వేశ్వరుడైన శ్రీ వేంకటేశుడే మాకు సర్వరక్ష.

"ఏమిసేయుదు నింతయునీమాయ
సామజవరద నాచందమిది" (4-348)

సామజవరద ! నాతీరుయిది. అంతానీమాయ. జలములోపలిచంద్రుని నీడవలె నామనసు చలిస్తున్నది. మేఘములు గప్పిన సూర్యునివలె నాలోని విజ్ఞానము వెలుగదు. ఆకాశమున గాలి అణిగియున్నట్లు నావైరాగ్యము కనపడదు. ముత్యపుచిప్పలోని ముత్యమువలె నాలోని సాత్వికత దాగుంది. శ్రీవేంకటేశ ! నీకృపవలె నిజభక్తి ఉబికింది. నిధానమువలె బ్రహ్మానందము ఆవరించింది.

"తమ్ములాల అన్నలాల తల్లులాల నే
నెమ్మనపు హరిబాసి నిలువనే నికను" (5-99)

"తమ్ములాల! అన్నలాల! తల్లులాల! మంచి మనసుగల హరిని విడచి నే నిలువలేను కొమ్మలాల! మరునికోటకొమ్ములాల! ఓఅమ్మలాల! నాఅక్కలాల పుండరీకాక్షుని ఎడబాసి నేవుండలేను. చెలులాల! వనితలాల! యవ్వనముచే మోహింపజేసే జవ్వనులాల! హరిని తలపోయగావచ్చే కన్నీరిక ఆపలేను. పూవుబోణులాల జవ్వనపు కొమ్మలాల! చీకటిలాంటి

పెద్దకొప్పులున్న వనితలాల శ్రీవేంకటేశ్వరుని బాసి ఇకనే బ్రతుకలేను.

"ఉప్పవడముగాకున్నారిందరు
యెప్పుడురేయి నీకెప్పుడు పగలు" (1-148)

నీకు ఎప్పుడురాత్రియో పగలో తెలుసుకోలేకున్నాము. సూర్యచంద్రులు నీకన్నులు. వెన్నెల ఎండలు కలిసి వుండగా మెలకువఎన్నడు నిదురెన్నడో తెలియరాదు. శ్రీసతిముఖారవిందము, కలువకన్నులు వికసింపగా నిద్రెలావస్తుందయ్యా! విందగు నీతెలివికి అంతమేది? సాత్విక, రాజసికతమో గుణములు నీమాయారతులు. కమలాధిప! వేంకటగిరీశ! ప్రమోదము, మఱపు నిన్ను ఎలా ఆవహిస్తాయి.

"పరిపూర్ణుడవు నీకు బరాకున్నదానిన్ను
మరిగివుండనిదే మావల్ల దప్పుగాకా" (15-279)

పరిపూర్ణుడవైన నీకు పరాకెక్కడిది? నిన్నుసేవించని మాదే తప్పు. విశ్వమంతా వ్యాపించిన నీవు అన్నింటిని వినగలవు. నీకు విన్నవించు కొననిమాదేలోపము. సహస్రాక్షుడవైన నీవు చూడలేనిది ఏముంది. నాభావమును వ్యక్తపరచిని మాదే నేరము. శబ్దమయుడవైన నీవు పలుకగలవు. నిన్ను పిలువలేని అవివేకమునాది. విశ్వరూపుడవై నాముందు నిలిచినా సందేహముచే చూడలేకపోతున్నాను. నిన్ను శరణంటే మన్నిస్తావు! కానీ మత్తుడనైన నాకర్మము యిది. ఇన్నాళ్ళు నిన్ను ఎరుగలేని అభాగ్యుడునయినా నీవునన్ను అనుగ్రహించావుతండ్రి!

"ఆనందనిలయ!ప్రహ్లాదవరదా!
భానుశశినేత్ర జయ ప్రహ్లాదవదా" (3-502)

ఈకీర్తనలో ప్రహ్లాదవరదా! అనే సంబోధన ప్రతిపాదము చివరమకుటమైంది. ఎన్నోవిశేషణాలమాలను ప్రహ్లాదవరదునికి అలంకరించాడు అన్నమయ్య. ఆనందనిలయ, భానుశశినేత్ర, పరమపురుష, నిత్య, హరి, అచ్యుత, ఆనంత, పరిపూర్ణ, గోవింద, కల్యాణగుణ, భవరోగసంహరణ, అవిరళకేశవ, పవమాననుతకీర్తి, పితామహవంద్య, బలయుక్త నరసింహ, శ్రీవేంకటాద్రినిలయ ప్రహ్లాదవరద అని స్తుతించాడు.

"నీవేమి సేతువయ్య నీవుదయానిధి వందువు
భావించలేనివారిపాప మింతేకాని" (1-487)

నీవు దయానిధివి. నీవు ఏమిచేయగలవు! నిను తలచనివారి దోషమేయిది. పాపము పోగొట్టి పరమపదమును ఇస్తానని చాటిన నీవల్ల దోషములేదు. నిన్ను నమ్మనివారిపాపమింతే! ఎన్నోపురాణములలో భక్తసులభుడవని విన్నాము. కాని ఏమిలాభము పంతమున నిన్ను నమ్మినవారి పాపమింతేగదా !

"అందరి బ్రతుకులు ఆతనివే
కందువెల్ల శ్రీకాంతునిదే" (1-335)

అందరి బ్రతుకులు అతనిఅధీనములే! వేదములలో చెప్పినదంతా శ్రీవేంకటేశుని యశోవిభవము, అమరులపై ఆయన కరుణ, హిరణ్యకశిపుని అణచి ప్రహ్లాదుని తల్లి, దండ్రి తానైరక్షించుట, ఇంద్రాదులబ్రతుకులు, బలిపై కృపజూపుట, మునులను రక్షించుట, రామావతారమున అనాధులను ఆదుకొనుట, భూభారమణచుటకు నంద నందనుడు చేసిన కృత్యములు, ధర్మమును నిలబెట్టుట అనే క్రియలన్నీ కలియుగమున వెలసిన వేంకటపతిఘనకార్యములే.

"అతడే పరబ్రహ్మఅతడేలోకనాయకు
డతనికంటే మరి యధికులు వేరయ్యా" (3-470)

అతడే పరబ్రహ్మము, అతడేలోకనాయకుడు. అతనికంటెఅధికులు ఎవరయ్యా! లక్ష్మీదేవి భార్య. బ్రహ్మకుమారుడు. అందరునివసించే భూదేవి ఇతరులకులభ్యమా? ఆలమందలను మేపినగోవిందుడు, మందరధరుడు, మాధవుడు, పాదాలవద్ద భాగీరథి, అభయమిచ్చే నేర్పరితనము, శరణాగతరక్షణ, నారాయణుడైన వేంకటాద్రి దైవానికి గాక మరెవరికి గలవు.

"సేవింతురాయితనిజెలగిపరులిట్లనే
కావించె మమ్ము నెక్కడిదైవమితడు" (1-293)

ఈ కీర్తనలో వ్యాజస్తుతి వుంది. ఇలాంటి పనులు చేస్తుంటే ఎలాగయ్యా ఇతనిని సేవించేది? పాలసముద్రమున పవళించువాడు, గోకులంలో పాలుదొంగలించిన గోపబాలుడు, పాలివ్వడానికి వచ్చిన పూతనను పాలతో సహా ఆయువు పీల్చివేసినవాడు ఎలాటి దైవము? అందరికీ జన్మనిచ్చే పురుషోత్తముడని, మంచి జన్మనిస్తాడని పూజించితే జన్మలతో బంధించాడు. ఇతడు ఎలాటి దైవము? కర్మలకు కర్త అతడేనని పుణ్యకర్మఫలములతో కొలువగా ఈవేంకటపతి ఉభయకర్మలను తొలగించాడు. ఇదెక్కడిదైవము! పుణ్యము, పాపము రెండు అనుభవించవలసిందే. న్మలెత్తవలసిందే! వానిని తొలగించి స్వామి అనుగ్రహించాడు అంటున్నాడు అన్నమయ్య.

"మందరధర మధుసూదన
నందగోపనందనా" (1-267)

ఈ కీర్తనంతా నామసంకీర్తనమే. మంధరధర, మధుసూదన, నందగోపనందనా, నరసింహా, గోవింద, నవనీతానంద, హరి, ముకుంద, నయనారవింద, కరివరద, గరుడగమన, గురుచాపా, యదుకులదీపా, భవదూర, భయహర, పరిపూర్ణ, అమృతా, భువనపాలన, సురపాలన, భువన భూషణ, పరమపురుష, పురాతన, నవభోగా, కరుణాయోగా,

పంకజాసననుత, భవ్యనిర్మల పాదపంకజ, పరమపరాత్పర, శుభంకరా, క్షేమంకర! వేంకటనిలయా అని కీర్తించాడు అన్నమయ్య.

"విశ్వప్రకాశునకు వెలియేదలోనేద
శాశ్వతున కూహింప జన్మమిక నేద" (1-355)

విశ్వమంతాప్రకాశించేవానికి లోపల వెలపల అని ఏముంది? శాశ్వతుడైన వానికి జన్మము ఏముంది? పరిపూర్ణుడైనిండిన అతనికీ సంచారమమేముంది. భూమిని మోచిన అతని కాలుపెట్టచోటేమిటి? ఎన్నో ప్రభావముగల అతనికి నదుమ, మొదలు, తుద ఏముంది? సహస్రముఖములు గల అతనికి అవతల ఇవతల ఏముంది? మునిహృదయమున నుండే అతనికి మాట పలుకు ఏమిటి? జ్ఞాన స్వరూపుడైన అతనికి వినేదేముంటుంది? పరమ యోగీంద్రునికి స్వపరబేధమేముంది? దురితదూరునకు స్తుతిలేదు నిందాలేదు. హరి నారాయణుడుతానే అయిన వేంకటేశునికి దివ్య విగ్రహమెందుకు? అతనికి అవునుకాదు అనే ద్వంద్వములుండవు.

"ఎండగాని నీడగాని యేమైనగాని
కొండలరాయదే మా కులదైవము" (1-214)

ఇది ఒక జానపద కీర్తన. ఎండగాని నీడగాని కొండలరాయడే కులదైవము. తేలుగాని, పాముగాని, గాలిగాని ధూళిగాని కష్టనష్టమువచ్చినా కాలకూట విషముమ్రింగిన నీలవర్ణుడే నిజదైవమని, చీమదోమ గాముగాని నాముగాని గుర్రముపై ఎక్కివచ్చిన కల్కిఅవతారమే దొరదైవమని పిల్లి, నల్లి, ఎలుక, కల్ల, పొల్లు ఏమైనాగాని మమ్ముకాపాడే వేంకటాధీశుడే మాయింటిదైవము అని జానపదుల ధోరణిలో అన్నమయ్య స్వామిని కీర్తించాడు.

"రామరామ రామకృష్ణ రాజీవలోచన నీకు
దీమువంటి బంటననే తేజమే నాది" (15-26)

వారిధి దాటి మెప్పించినహనుమనుగాను, రుచిగల పండ్లతో మెప్పించిన శబరినిగాను. సీతనిచ్చిమెప్పించిన జనకుడగాను. వాహనమైమోచి మెప్పించే గరుడుడనుగాను. కామసుఖమిచ్చు గోపికనుగాను. వేయినోళ్ళతో పొగడి మెప్పించే ఆదిశేషుడగాను. కీర్తించి మెప్పించే నారదుడగాను, ప్రాణమిచ్చిన జటాయువునుగాను, రాజీవలోచన! నీబంటుననే అర్హత తప్ప మరేదీ లేదు. ఓ వేంకటేశా నిన్నే శరణన్నాను. నన్ను ఎలా రక్షిస్తావో నీదేభారం.

"ఎదుటనున్నాడు వీడె యీబాలుడు
మది దెలియమమ్మ యే మరులోకాని" (11-425)

ఎదుటనున్న ఈబాలుని ఎవరిని నిర్ణయించ లేకున్నాము. పరమపురుషుడట -

పసులగాచెనట. వినదగినట్లులేదు. హరియేతానట. అందరిని ముద్దులతో మురిపించెనట నమ్మనగినదా! బ్రహ్మకు తండ్రియట. యశోదకు బిడ్డడట ఈవిషయం ఎవరికైనా చెప్పదగినట్లుందా! కరుణామయుడై శ్రీవేంకటాద్రి దేవుడై నిలిచి వున్నాడట.

"సకలశాంతికరము సర్వేశ నీపై భక్తి
ప్రకటమై మాకు నబ్బె బదికించునిదియె" (3-377)

ఓ సర్వేశ్వరా! సకలశాంతికరమైన నీపై భక్తి మాకు కలిగింది. అదియే మమ్ము బ్రతికిస్తుంది. మనలోని పాప బుద్ధిఅంతా నిన్ను తలచగానే నశించిపోతుంది. అంతుతెలియని పాపములైనా నీదర్శనముతో తొలగిపోతాయి ఈచేతులతో చేసిన పాతకములన్నీ నీకు మ్రొక్కగానే వదిలిపోతాయి. చెవులతో వినిన ఘాతుకములన్నీ నీకథవింటే చాలు విడిచిపోతాయి. దేహముతో చేసే కర్మపుపాపములన్నీ నీచక్రాంకితముద్రలతో వీడిపోతాయి. శ్రీవేంకటేశా! ఇంత ఎందుకు ఎంతటి పాతకములైనా నీశరణాగతిచే అణిగిపోతాయి.

"అభయదాయకుడ వదెనీవేగతి
యిభరక్షక ననునిపుడు గావవే" (3-420)

గజేంద్రుని రక్షించిన అభయదాయకా ! నన్నిపుడు రక్షించరాదా! భయహర, దైత్యభంజన, సర్వేశ్వరా, నీపాదాలే మాకుగతి కాపాడుమయ్య! బంధవిమోచన, పావవినాశన, సింధుర వరద, ఆశ్రిత రక్షక గతీనీనామమే అజ్ఞానాంధకారమును తొలగించు. దైవశిఖామణి, చక్రాయుధశ్రీరమణా నావిన్నపములివియే. నీకేశరణు.

"తానేతానే యిందరిగురుడు
సానబెట్టినభోగి జ్ఞానయోగి" (4-355)

వేంకటరాయడే భోగి, జ్ఞానయోగి అందరికి గురువు. అపరిమితముగా యజ్ఞములు చేసిన ప్రపన్నులకు తపముగా యజ్ఞఫల పరిత్యాగమును చేసేమంచి బుద్ధి ప్రసాదించే కర్మయోగి ఇతడు. చేతలన్నియు బ్రహ్మార్పణ విధిగా చేయగా మన్ననతో ఉన్నతమైన మోక్షపదవిని అనుగ్రహించే పన్నగశయనుడే బ్రహ్మయోగి. కపిలుడుగా, దత్తాత్రేయుడుగా గొప్పమహిమలతో సంసారయోగమును ప్రసాదించే అభ్యాసయోగి ఈ వేంకటపతి. జ్ఞానయోగి, కర్మయోగి, బ్రహ్మయోగి, అభ్యాసయోగి అంటూ గీతలో భగవానుడు బోధించిన గీతారహస్యాలను వివరించాడు అన్నమయ్య.

"ఈతడే హరుడు యీతడే యజుడు.
ఈతనికి నీచేతలెంత ఘనమిటుగాన" (4-47)

లయింపజేసేహరుడు సృష్టికర్త బ్రహ్మయు వేంకటేశుడే. బ్రహ్మాండ భాండములను

కడుపులోదాచుకున్న ఈఘనునికి పూతన చన్నులవిషము ఒక లెక్కయా ! ప్రళయకాలమున జలరాసులన్ని ఏకమైన సమయమున వటపత్రశాయియై ప్రకాశించే యితనికి బాలకృష్ణుడైరెండు మద్దులను పడగొట్టడం వలన గొప్ప బలవంతునిగా పరిగణించారు. దేవదేవోత్తముడు, పరిపూర్ణుడు అచ్యుతుడు,అభవుడు, శరణాగతరక్షకుడుగా తలపోసి కొనియాడవలసి వచ్చినది.

"అరసినన్నుగాచి నతనికి శరణు
పరమునిహమునేలే పతికిని శరణు" (3-374)

ఇహాపరములను పాలిస్తూ నన్ను కాపాడుతున్న ఆవేంకటపతికిశరణు వేదోద్ధారుడు, ఆదిమూలము, విశ్వమంతా వ్యాపించిన విష్ణువు, శ్రీదేవి భర్తయైనవానికి దేవదేవునికి భూమ్యాకాశములనేకం చేసిన వానికిశరణు. చైతన్యస్వరూపుడై, బ్రహ్మాండనాయకుడై వేంకటాద్రి నుండి దీనులందరికి వరము లిచ్చే దేవునికి శరణు.

"తత్తాతిగుడి దింధితక దిందిం
తిత్తితిత్తితి తితి తితి తితి" (6-46)

దానవుల రుధిరాలను ఆస్వాదించినవాడా ! దీనజనులు, నానా భూతగణాలచే నీ గుణగానం చేయబడేవాడా! దనుజుల పరాభవంతో శౌర్యాన్ని ప్రకటించినవాడా ! తిరుమలపై వెలసిన దేవాధిదేవా! కరుణాభరణా! కమలాధరా! నీకు ప్రణతి.

"వలపులు వలపులు వయ్యాళి
చలమరి మరుడును సమేళి" (7-292)

అమ్మవారిపై అయ్యవారి వలపులు. సౌందర్యరాశియైన అమ్మవారిముఖానికి స్వామి చూపులు ముత్యాలనివాళి. అమ్మవారి కుచద్వయానికిస్వామిమనసే దువాళి. ఆ వనిత నిండు జవ్వనానికి స్వామి రతియేక రాళి. ఆమె వెనుక ముందు సౌందర్యమును కోరి పెనగేపిసాళి. అమ్మకోరికల భావమునకు స్వామివారి మోహమే గయ్యాళి. నిత్యానపాయిని అయిన ఆమెకు స్వామికూటమి విరాళి.

"కలిగెమాకు నిదికైవల్యం
కలకాలము హరికథా శ్రవణం" (2-464)

నిరంతర హరికథాశ్రవణ మనేకైవల్యము లభించింది అంటున్నాడు అన్నమయ్య. అచింత్యం, అద్భుతం, ఆనందదాయకం, ఎంతో ప్రచారంలో వున్న దివ్యము పావనమైనది సంకీర్తనం. సుచరితమై శ్రుతిశోభితమై దోషభవహరదాయకమై పరమ మంగళకరమై, భావాతీత మైనదే గజరాజ రక్షకుని కైంకర్యము. ఎంతో సౌలభ్యముకలిగి సుకరమై శోకవినాశకారియై లలితమై ఫలప్రదమైన భయాన్ని తొలగించేది పద్మనాభుని నిత్య స్తోత్రముశ్రీవేకంటపతి శరణం.

"చిరంతనుడు శ్రీవరుడు
పరమభవ్యం పావనం" (1-333)

పరమమై భవ్యమైపావనమైన చిరంతనుడే శ్రీవరుడు. వేదమయుడు, కోవిదుడు అమలుడు పరాత్పరుడు, ఆదిపురుషుడు, మహామహుడు, ఎక్కడ ఏమితలచినా భేదము, వాదము లేనివాడు ఎంతో సమ్మతమైనవాడు. నిఖిలమునకు నిలయుడు, మునివరదుడు అధికుడు. శుకుని ముఖమున వేదవిదుడు అగ్రేసరుడై మంగళప్రదుడై అతిశయమైన సౌశీల్యంతో ప్రముఖమైన మూలకందమితడే అనేకప్రదుడు, అనాది నిధనుడు ఘనుడైన, తిరువేంకటవిభుడు కోటి సూర్యప్రకాశకుడైన సిద్ధాంజనము ధనము నితడే.

"అతిసులభం బిదె శ్రీపతిశరణము అందుకు నారదాదులు సాక్షి
ప్రతిలేని దిదియే నిత్యానందము బహువేదంబులె యివే సాక్షి" (2-41)

అన్నిటికన్నా సులభమైనది శ్రీపతిని శరణుపొందడంఅనుటకు సాక్షి నారదాదులే. ఎదురులేని నిత్యానందము అనుటకు వేదములేసాక్షి. ఓ జీవుడా! వెదకి వెదకి వేసారకు! అందుబాటులో హరివున్నాడటకు ప్రహ్లాదుడేసాక్షి. అనుమానములతో మోసపోవద్దు. చేసిన భక్తికి చేటులేదనుటకు ధ్రువుడేసాక్షి. సుఖదు:ఖాలతో నలసి కించపడవద్దు. నరహరికరుణనునమ్మిన అర్జునుడే ఇందుకుసాక్షి. ఓ వివేకమా! భ్రమించవద్దు! స్వామిదాస్యమే రక్షించుననుటకు బలియేసాక్షి. శ్రీవేంకటపతిని నుతించిన ఈడేరించుననుటకు వ్యాసాదులేసాక్షి. ఓ విజ్ఞానమా! కనపడే మాయలకు లొంగి తిరగవద్దు. ఇతని పాదసేవకు ఏదీ సరిలేదనుటకు సనకాదులే సాక్షి !

"నీవేకా నింకనే నన్యమెరగయే
త్రోవ చూపినాకు తోడయ్యెదవయ్య" (1-17)

నా ఓదయామయా! అన్యథాశరణంనాస్తి ! నీవే నాకు దారి చూపి తోడునీడగా నిలవాలి. నేను చేసిన అపరాధాలు శతాధిక కోట్లు. నాపాపాలు అపరిమితాలు. నన్ను ఏవిధంగా ఉద్ధరిస్తావో? కాపాడతావో! కర్మ బంధాలకు తగులుకున్న నన్ను నీ మతాన్ని మరిగేలా చెయ్యి. ఇతర కర్మలు ఆరంభించడంలో తగులుకున్న నాకు మోక్షాన్ని కల్పించు. శరణాగతులను నీవు బ్రోవలేవా? మమ్ములను ఈ భవపంకిలంలో ఎందుకు త్రోసి వేస్తావు అని అంటూ చంచలమైన మనస్సును భాగవతులు భక్తితత్వంతో భగవంతునిపై నిలుపుతారంటున్నాడు.

"కడు చంచలములు కడు నధ్రువములు
కడు నల్పములని కాదందురు" (1-152)

చంచలములు, అస్థిరములు అయిన సంసారసుఖాలు అల్పములని జ్ఞానులు వాటిని త్రోసిపుచ్చుతారు. కర్మదూరులైన వారు ఆవికారాలను ధర్మసంధానాలను దుర్మదములని దూరంగావుంచుతారు. భాగవతోత్తములు, పరమజ్ఞానులు, నీ సేవకులు వాటిని కాదంటారు.

"చాలదామాజన్మము నీ
పాలింటి వారమై బ్రతుకగలిగె" (1-110)

ఓ వేంకటాచలాధిపా! మాజన్మధన్యము. నీ తోటివారమై బ్రతుక గల్గిన జన్మమాది. బ్రహ్మాదులు కానలేని నిన్ను మమకారముతో చూడగల్గినాము. ఇంద్రాదులు స్తుతించలేని నీనామాన్ని కొనయాడ గలిగాము. సనకాదిమునులు చూడలేని నిన్ను మా మనస్సులలో తృప్తిగా భావించగలిగాము మునులకు అగమ్యగోచరుడవైన నిన్ను నిరంతరము వర్ణింపగలిగాము. భవ్యమైన నీ ఉనికిని తెలుసుకున్నాము. ఈ కొండపై నిన్ను అనేక మార్లు దర్శింపగలిగాము. అంతకంటె భాగ్యమమున్నది,?

"రమణుడా ఇంతరారాదా
సమరతి దేలీ జగములికను" (20-266)

ఓ వేంకటరమణా ! విరహవేదనతో సతి అలసిపోయింది. జగడాలు మాని రతిపారవశ్యంలో తేల్చు దూషణలతో ధైర్యము సతికి నశించింది. చిలుకల వ్యంగ్యప్రసంగాలతో ఆమె మరింత కృశించింది. మలయానిలముచే ఆమె మనసు చంచలమైనది. తుమ్మెదల ఝుంకారముతో పట్టుదల ఎక్కువైంది. మదనబాణములు మరులు గొలుపగా చివరకు సరసపుమాటలతో నీవామెను కూడితివి.

"చాలుచాలు నీహరియే మాకును సకలక్రియలకు నాయకుడు
నాలుకతుదనే ఈతడుండగా నలుగడ నెవ్వరి వేదకేము" (3-371)

ఆస్వామి మాఅండనుండగా మాకిక కావలసినదయేమి? మానాలుకపై అతని నామ ముండగా నలువైపులా ఇతరులను వెదకవలసిన అవసరము లేదు. లక్ష్మీపతి మాయేలిక. సంపదలకేమి కొరత? నాలోనిని అంతర్యామి బ్రహ్మ తండ్రి. ఆయుస్సునకేమి కొరత. పాలసముద్రముపై దేవుడు మావాడైనపుడు పాడికేమి కొరత? ఇంతటి వారమైన మేము ఇతరుల వద్ద చేయి చాచవలసిన అవసరము లేదు. భూదేవీపతి సేవకులమైన మాకు ఈ భూములన్నీ సొంతమే చక్రాయుధుడు మాచెంగటనండగా భయమేలేదు. అచ్యుతుని శరణు జొచ్చిన మాకు నాశనమే లేదు. అట్టిమాకు ఇతరుల నర్థింప బనిలేదు. వైకుంఠుని దాసులమైన మాకు మోక్షము అరచేతిలోనది. గంగాజనకుని సేవకులమైన మాపాపములన్నీ పటాపంచలవుతాయి. ఆతడు వరము విన్వగా మాకిక వెలితి యేమి? ఇన్ని వైభవములు

గలిగిన మాకు ఇతరుల యాచింప బనిలేదు ఆ శ్రీహరియే సమస్తము!

"నీ వెటు దలచిన నిఖలమునట్టే
ఏవల స్వతంత్ర మంతానీది" (3-575)

వేంకటరమణా! ఈప్రపంచంలోని భావనలన్నీ నీవే. మేము అస్వతంత్రులము. నీదయగలిగితే పురాకృతకర్మలు దాటగలము. ఇవి అన్నీ నీకల్పితములే అయినప్పుడు వాటిని వదిలించలేవా? నీవు వద్దంటే జననమరణాలు యింకెక్కడివి? అందరినీ రక్షించే నిను గొలచిన మాకు ఇతరములతో పనియేమి? నీవే మమ్ములను దూరముగా పొమ్మంటే యిక పాపపుణ్యములేవి? అందుకే నిన్ను శరణుగోరాము.

"మరుని నగరిదండ మాయిల్లెరుగవా
విరులతావులు వెల్లవిరిసేటిచోటున్" (5-262)

ఓస్వామి! మాయిల్లు నీకు తెలియదా అని ఒక ప్రియురాలు స్వామిని ఆటపట్టిస్తోంది. ఓస్వామి! పూలనెత్తావులు వెల్లివిరిసే మన్మధుని నగరి పక్కన మాయిల్లు తెలియదా! బంగారుకొండల సందులో నున్న మాయిల్లెరుగవా? మదనుడు వేటాడే చోటైన మాయిల్లె రుగవా? మదనుని సంతయైన మాయిల్లెరుగవా? మనసులో నీవుండే మాయిల్లెరుగవా? మమతలు కొలువుండే ఆచోటు తెలియదా? సిరులు చిందే ఆ ప్రదేశము నీకు తెలియదా?

"ముసిముసి నవ్వులతో ముసుగులువెట్టుకొని
పసలుగ మేలుకొని పవళించి వున్నారు" (14-55)

శ్రీ వేంకటేశుడు అలమేలుమంగతో పవళించివుండటాన్ని చూసిన ఇతర చెలులు అలకలుపోయినట్లుగా కీర్తనలో వర్ణించబడ్డది. సతీపతులిద్దరు ముసిముసినవ్వులతో ముసుగుపెట్టుకొని మేలుకొనే పవళించివున్నారు. అంతేకాదు సిగ్గు విడిచి వలపులు పచరించేవారికి తప్పులున్నవని ఎవరన్నారు. ఇతర చెలులు కొలువగా వారిద్దరు పవళించారు. భయముభక్తీ లేని ప్రియులకు పగలు రాత్రి మరగు మొరుగులేదుకదా! ఇతరులు శృంగార పదాల పాడగా వారిద్దరు పరుపుపై పవళించి యున్నారు. మనలను బంటుల తొత్తులను జేసి వారేమో పవళించియున్నారు. ఎంతటి చోద్యము.

అందరి కాధారమైన ఆదిపురుషుడీతడు
విందైమున్నారగించె విదురునికడ నీతడు" (1-351)

సమస్తజగత్తుకు ఆధారభూతుడైన ఆదిపురుషుడు ఈ వేంకటగిరిమీద వెలసినాడు. ఇతడే మున్ను ద్వాపరమున విదురునింట విందులు గుడిచాడు. సనకాదులు బ్రహ్మాదులు కొలిచే దైవ మీతడే. ఇనమండలంలో చెలగేటి హితవైభవుడితడు. దేవతలకు మూలభూతము

యశోదయింటి శిశువు ఇతడే ఆలమందలలో తిరిగి గొల్లెతలతో సరసాలాడినదిడితడే. కుచేలుని చేతి అటుకులు ఆరగించింది యితడే. బ్రహ్మకు బ్రహ్మపదము నిచ్చిందితడే. ఇతడు అన్ని కాలాలలోను పరదైవం. ఇతడే లోకాలకు శరణ్యము.

"సర్వేశ్వరుడే శరణ్యము
నిర్వాహకు డిన్నిటగాన" (4-333)

అన్నింటియందును నిర్వాహకుడైన ఈ సర్వేశ్వరుడే మనకు శరణ్యము. ప్రళయకాలము నందు బ్రహ్మాండము విలయమైనపుడు అన్నింటిని నిలిపినదితడే. దేవతలకు బ్రహ్మాదులకు ఇతడే శరణ్యము. అన్ని జీవులకు ఈ జనార్ధనుడే శరణ్యము. అనాధిపతి అనాధనాధుడు, అంతరాత్మకుడు ఇతడే. నిశ్చలధ్యానయోగులైన దాసులకు ఈ జగదేకపతి శరణ్యము. వరదుడైన యితడు నిత్యశరణ్యుడు.

"నారాయణుని శ్రీనామ మిది
కోరినవిచ్చి గోవో మనసా" (4-73)

నారాయణనామము సకల శుభప్రదమని చెబుతూ కోరిన కోరికలిచ్చి కాపాడుమని వేడుకుంటున్నాడు. ఆ స్వామిని తలచుటే సకల భవాలను గెలవడం, భయాల నన్నింటిని పోగొట్టేది అదే. ఓమనసా! గరుడగమనుని తలపోయుటయే అభయ ప్రదాయకము.వక్షస్థల లక్ష్మి అధికపంసదల నొసగుతుంది. అంకెలతో పనియేముంది. నీ తలంపులన్నీ స్వామిని సేవించడానికే వినియోగించుఅని ప్రభోదిస్తున్నాడు. ఆస్వామిని మరిన్ని విధాలుగా స్తుతిస్తున్నాడు.

"పాలజలనిధిలో పాయని
నీలవర్ణుడ వట నీవా యిపుడు" (4-34)

ఓస్వామి! నీవు ఒక్కొక్కమారు ఒక్కొక్క రూపంలో కనిపించావు. పాలసముద్రంలో శయనించే మేఘశ్యాముడవు. ఆది శేషుని వేయిపడగలనే మృదువైన పరుపుగా చేసుకొని నిద్రపోతావట మునీంద్రులు బ్రహ్మాదులు నీకు అటూ ఇటూ చేరి స్తుతిస్తుంటే అల్లన నవ్వుతూ వుంటావట. అటు శ్రీదేవి యిటు భూదేవి నీపాదాలు పిసుకగా వేంకటగిరిపై వెలసిన నిగమమూర్తివి నీ వెపుడు.

"నల్లని మేని నగవుచూపులవాడు
తెల్లనికన్నుల దేవుడు" (5-244)

ఆస్వామి నీలమేఘశ్యాముడై తన తెల్లనికన్నులతో చిరునగవులు చిందిస్తున్నాడు. తన చక్రాయుధంతో రాక్షసుల పీచమణచాడు. లోకంలో ధర్మసంస్థాపన చేసినవాడు, వేదాలను పరిరక్షించినవాడు, లోకుల పాపాలను పొగొట్టినవాడు, ధ్రువునకు దివ్యపదం ఇచ్చినవాడు,

సుగుణాభిరాముడై వేంకటాద్రిపై నెలకొన్నాడు. అట్టిస్వామిని ఏమని పొగడుదును అంటున్నాడు.

"ఏమని పొడగుదు నిట్టి నీగుణము
ఈమహిమకు ప్రతిఇతరులు గలరా" (4-17)

నీ మహిమలను ఎన్ని అని పొగడుదును బాణాసురుని సంహరించినవాడవు పదితలలరావణుని కూల్చినవాడవు, సముద్రుని వారించిన వాడవు, బలిచక్రవర్తిని పాతాళమున కణచినవాడవు. కౌరవకుల నాశము చేసినవాడవు, పదునాలుగు భువనములను రక్షించినవాడవయిన నీవు.

నీ నిజదాసులకు నిత్యము కృపజూపి అభయమిచ్చావు.

"ఇద్దరితమకము నిటువలెనే
పొద్దునేమని బొంకుదమయ్యా" (13-33)

ఓ స్వామి! నీ సతీపతుల ప్రేమను ఇంతపొద్దుననే ఏమని బొంకేము? నీ అధరాన్ని నాకు లంచమీయగా అది సరసమునకు దారి తీసినది. నిన్ను నేను పిలువరాగా నాపై నింద పడినది. ఇంక ఎలాబొంకేది? నీ కౌగిటిలో నఖక్షతములయినాయి. నిన్ను వెంటబెట్టుకొనిరాగా నిందలు పడవలసి వచ్చింది చెవిలో ప్రియములు చెప్పి నందుకు ముక్కున జవ్వాది అంటుకుంది. ఇంక ఎన్ని రకాలుగా బొంకి ప్రయోజనమేమి?

"సకలం హే సఖి జానామితత్
ప్రకటవిలాసం పరమం దధసే" (5-22)

ఓ సఖీ! నీ హేలావిలాసాలన్నీ మాకు తెలుసు. కస్తూరి అంటిన నీ ముంగురులు ప్రకాశిస్తున్నాయి. నీ మనస్సులో మేఘశ్యాముడు పల్లవించాడు. నీ చెక్కిలిపై చేయి జేర్చి దీర్ఘంగా ఆలోచిస్తున్నావు. పన్నగశయనుడైన ఆస్వామిని నీ మనస్సులో తలపోస్తున్నావు. నీకుచాగ్రములపై నఖక్షతములు చంద్రరేఖను తలపిస్తున్నాయి. వేంకటపతి ఉరముపై నీవు సకలభోగాలను అనుభవిస్తున్నావు.

"ఎవ్వడెరుగును మీ యేతులు
మువ్వంక మెరసె మీమురిపెమయ్యా" (13-9)

మీ సరససల్లాపములు మురిపెములు నలుదిక్కులా మెరుస్తున్నాయి. సొగసుగ నిన్నామెచూస్తోంది. అటునిటు చూస్తూ నీవేల నవ్వుతావు. మీ చోద్యములు మాకు తెలియవు. మీబ్రతుకు మీది. ఆమెనీపై పూలజడ విసిరితేనీవు కనుసైగలతో బెదిరిస్తున్నావు. మీ తీరుదనాలు మాకు తెలియవు. కౌగిట నిలిచిన ఆమె నిన్ను ఆహ్వానిస్తోంది. నన్ను ఏలిన ఓస్వామి! మీరిరువురు ఇలానే కలిసిమెలసి వుండండి.

"నాలంవాతవ నయవచనం

చేలం త్యజ తే చేటీభవామి" (6-157)

నీ నయవచనాలు యిక చాలు చేటిచేలాన్ని యిక వదిలిపెట్టు. నీ సంయోగంతో ఆమె హృదయాన్ని బాధిస్తున్నావు. ఒడలంతా పులకించిన ఆ శరీరం వేదనతో మలినమయింది. నీప్రియభామలందరు నిరంతరము నీ సుఖభోగాలందుతున్నారు. రతిభోగాలతో నీకు విజయాభవ! నీ అనునయవాక్యాలు యిక చాలు. ప్రియకాంతపై ప్రేమతో నీవు శోభిల్లు.

"హరినీ ప్రతాపమునకడ్డమేదిలోకమున

సరివేరీ నీకు మరి సర్వేశ్వరా" (2-156)

ఇది దశవతార వర్ణన. ఓ సర్వేశ్వరా! నీ శౌర్యప్రతాపాలకు ఎవరూ సరిరారు వేదాలను పరిరక్షించీ, కూర్మమై దేవతలను బ్రోచి, వరాహమై భూమిని నిలిపి, నృసింహుడవై అసురుని దునిమి వామనుడవై, క్షత్రియులనణచడానికి పరశురాముడవై అహల్యశ్యాప విమోచనానికి రాముడవై, గోవర్ధన గిరిధారివై, త్రిపురములను గూల్చి బుద్ధుడవై, ఈయుగమున వేంకటేశు డవై మమ్మురక్షిస్తున్నావు.

"హరిగొలిచియు మరి నపరములా

తిరముగ నతనినే తెలియుట గాక" (1-290)

హరిని గొలిచి అతని దాసులమైన తరువాత ఇతర లౌకికవిషయాలపై మనసు నిలుపుట ఏల? శ్రీహరి పాదములను తలచినపుడు మరి ఇతరములతో పనియేమి? అతనిదాసులను కొలుచుట యుక్తము. అతనినీ, అతనిబంట్ల సేవించిన వారికి ఇతరములపై కోరిక లేల? కోరికలన్నీ ఆస్వామిపైనే నిలుపుకోవాలి. అతని నామామృతాన్ని రుచి చూసిన మనస్సునకు ఇతర రుచులేల? తేనెలు స్రవించే అతని నామరుచులు బహువిధాలు.

"ఆదిమపూరుషు డచ్యుతు డచలు డనంతుం డమలుడు

ఆదిదేవుడీతడేపో హరివేంకటవిభుడు" (1-80)

అచ్యుతుడు, అనంతుడు అయిన ఆదేవదేవుడే ఈవేంకటనాధుడు. ప్రళయకాలమున వటపత్రశాయియై శిశువుగా తేలియాడిన శ్రీకాంతుడితడే. బలిమదమణచుటకై ఆకాశాన్ని అంటి ఒక చరణమున భూమిని, బొటన వేలితో బ్రహ్మాండమును తాకిన పరమాత్ముడితడే. ఆదిశేషుడు పాన్పుగా శ్రీభూదేవులు పాదము లొత్తగా బ్రహ్మాదులుసేవించే నారాయణుడితడే.

"తలచిచూడ పరతత్వంబితడు

వలసిన వారికి వరదుడితడు" (15-234)

పరతత్వమైన ఈ మూర్తిని తలచి తరచిచూస్తే వరదుడుగా గోచరిస్తాడు. ఇది

పెదతిరుమలయయ్యపాట. ఆస్వామి ఎవరెవరితో బంధుత్వాలు నెరపాడో ఈ కీర్తనలో సొగసుగా చెప్పాడు. లక్ష్మీదేవికి భర్త, సముద్రునకు అల్లుడు, పార్వతికి సోదరుడు, బ్రహ్మకు కన్నతండ్రి, శివునకు బావ, దేవేంద్రుని సోదరుడు, చంద్రునికి మరది ఇతడు. అదితికి కొడుకు, దేవతలకు తాత, వాణికిమామ, సాక్షాన్మన్మథుడు అయిన ఇతడు ప్రాణబంధువు. అతని కుటుంబమెంత పెద్దదో ఇందులో వర్ణించబడింది.

"తెలిసినవారికి దేవుడితడే
వలవనిదుష్టులవాదము లేలా" (3-480)

భగవత్స్వరూపాన్ని జ్ఞానులే తెలుసుకోగలరు. జ్ఞానహీనులు ఏదో వాదిస్తారు వారితో వాదాలేల? ఇతడు పురుషులలో పురుషోత్తముడు, నరులలో నారాయణుడు, పరదైవాలకు పరమేశ్వరుడు. మూఢులు అది తెలియజాలరు. పరబ్రహ్మము, పరమాత్ముడు, మహేశ్వరుడు, అయినా ఆయనను మూర్ఖులు అది తెలియజాలరు. వేదాంతవేద్యుడు ఆదిమూలము అయిన ఇతడు నిరాసక్తులను స్వీకరించడు.

"అతనిబాడెదను అదివ్రతము
చతురుని శేషాచలనివాసుని (15-404)

ఆ వేంకటరమణుని కీర్తించుటయే నానిత్యవ్రతము. సనకాదులు, శుకుడు, ధ్రువుడు, నారదుడు ఏ సర్వేశ్వరుని పొగిడారో? విభీషణుడు, భీష్ముడు, ప్రహ్లాదుడు, వశిష్ఠుడు ఏమూర్తిని తెలుసు కున్నారో! అర్జునునికి దిక్కెవ్వరో! వ్యాసుడెవ్వరిని స్తుతించెనో ఆపరమాత్మయే అలమేలుమంగాపతి.

"అంతరంగమెల్లశ్రీహరికొప్పించకుండితే
వింతవింత విధముల వీడునా బంధములు" (1-437)

శ్రీహరిపై మనసు నిలుపనినాడు భవ బంధములు తెగవు. మనుజుడై పుట్టినందుకు జ్ఞాని కానిచో ఫలమేమి! దయగలుగని తనువేల? ధర్మము సేయని ధనమేల? ముసలితనము రాగానే భవబంధాలు పోతాయా! శాంతములేని చదువేల? ప్రియంగా మాట్లాడని పలుకులేల? మాధవుని తలచని మనసేలా? పరమును ఏలని రాజ్యమేల? భక్తి లేని పావనత్వమేల? చింతదీరని జీవనమేల? శ్రీ వేంకటేశ్వరుని దర్శించునంత వరకు ఆదేవుడు ప్రత్యక్షముకాడు.

"యజ్ఞమూర్తి యజ్ఞకర్త యజ్ఞభోక్త విన్నిటాను
యజ్ఞాదిఫలరూప మిటు నీవైవుండవే" (4-45)

స్వామి విశ్వవ్యాపకత్వాన్ని ఈ కీర్తనలో అన్నమయ్య బహుధాస్తుతించాడు. మానవుని అల్పత్వంకూడా ప్రసక్తానుప్రసక్తంగా చెప్పబడింది. ఆయన యజ్ఞరూపుడు, యజ్ఞనిర్వాహకుడు,

యజ్ఞఫలాన్ని స్వీకరించేవాడు. యజ్ఞఫలమూ అతడే! సర్వజీవులకు ప్రాణాధారమతడే. ఆయన విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ చేయాలని అనుకోవడం మాభ్రమ. మా పూజలందుకోవటానికి ఈమూర్తులలో ఆవహించు. ఈ సమస్తజగత్తుకు నీపాదజలమే ఆధారము. మరి నీకు సంప్రోక్షణ ఏల? అయినా నన్ను నేడు పావనం చేయటానికి ఈ అభిషేకాన్ని స్వీకరించు. నీ దాసులమైన మమ్ముకాపాడటానికి వేదమూర్తివై ఇక్కడకు విచ్చేసి ఇక్కడేవుండు. వేదాలు తెచ్చిన నీకు వేదమంత్రాలతో పూజావిధిమేము చేయగలమా?

"నారాయణాచ్యుతానంతగోవిందహరి
సారముగ నీకు నేశరణంటినే" (2-423)

ఓ గోవిందా! సారభూతమైన నీకు శరణు. ద్వంద్వమయమైన ఈ సంసారంలో నలిగిన నన్ను బహువిధాలుగా నీవే పాలించాలి. శీతోష్ణాలు, సుఖదు:ఖాలు, పాపపుణ్యాలు, పులుపుతీపులతో కూడిన దీసంసారం. పగలు రాత్రివలె జీవన్మరణాలు. ఈ శరీరము పుట్టి గిడుతుంది. ఒకసారి ఆనందము, మరొకసారి దు:ఖం ఇహపరాలవలె ఎదుట నుండేది కల్లనిజము ఈభ్రాంతితో మేము విహరిస్తున్నాము.

"ఇతనికంటె ఘనులికలేరు
ఇతరదేవతల యిందరిలోన" (3-28)

సమస్తదేవతలలోనూ ఈస్వామిని మించిన ఘనులు లేరు. భూపతి, శ్రీపతి, వేంకటపతి, మరుగురుడు, పరమాత్ముడు, కరివరదుడుఇతడే. తల్లీ తండ్రి ఒకడే అయిన ఇతనిని శరణుకోరి విడువకుడు. అట్టి స్వామి దేవుడు; నేను జీవుడను అని అన్నమయ్య చెప్పి చరితార్థుడయ్యాడు.

"నీవుదేవుడవు నేనొకజీవుడ
ఈవిధి నిద్దరికెంతంతరువు" (3-116)

ఓ వేంకటాధిశా! నీవు దేవుడవు. నేను జీవుడను ఈవిధివిధానంలో మన యిద్దరికి మధ్య ఎంత అంతరమున్నది నీరోమకూపాలలో సమస్త జగాలు ఉద్భవించాయి. అట్టి నీరూపాన్ని ఏమని పొగడెదను. నీవాడనే అని చెప్పడం తప్ప. సృష్టికర్తలైన బ్రహ్మలు నీ నాభికమలంలో జన్మించినపుడు నిన్ను ఎరుగనేనెంత వాడను. శరణనుటే తప్ప. సహజానందమున సంసారానందాన్ని నాకు లభింపజేశావు. నీకృపవలన ఇహ పరములుగానిచ్చావు.

"మునుల తపమునదెమూలభూతి అదె
వనజాక్షుడేగతి వలసినను" (3-477)

ఏవిధంగా ఆలోచించినా మునుల తపస్సులకు మూలవిభూతి అవనజాక్షుడే. హరి

సంకీర్తనము నాలుకపై వుండగా ఇతరులను పరము కోరుట ఎందుకు? ఒక్కసారి నామోచ్చారణ చేసిన చిరపుణ్యము నిచ్చు జీవరక్ష అదే. మనస్సులోనే మాధవుడుండగా మరియొక చోట వెదకనేల?అంత్యకాలమున కోరేది అదే అయినపుడు ఆయనేమనలను రక్షిస్తాడు. అతడు మన చేరువ నుండగా భ్రవబంధాలలో భ్రమయనవసరం లేదు. దారి తెన్నూఅయిన అతడు మనలను కాపాడక పోడు.

"కోరినకోరికెలెల్లా కొమ్మాయందే కలిగీని
చేరికామయజ్ఞమిట్టే సేయవయ్యా నీవు" (29-216)

ఇది శృంగారకీర్తన. కోమలితోనే కోరికలన్ని తీర్చుకునే కామయజ్ఞం చేయవయ్యా. ఆమె అధరామృతమే సోమపానము. తాంబూలమే పురోడాశము. సరసపుమాటలే వేదమంత్రాలు. అదేనీవు చేసే కామయజ్ఞ్న. కలికిపయ్యద నీకు కృష్ణాజినము. స్తనములే బంగారు పాత్రలు. సరసాలే కర్మతంత్ర విభవాలు. ఆమె కౌగిలే ఘనమైన యజ్ఞశాల. చెమటే అవభృథము, అలాగే నన్ను నేలి కామయజ్ఞము సేయవయ్యా ఓ వేంకటేశా!

"మాధవ భూధవ మదనజనక
సాధురక్షణచతుర శరణు శరణు" (4-321)

ఎన్నోనామాలతో స్వామినిశరణుకోరుతున్నాడు అన్నమయ్య. శ్రీదేవీభూదేవులకు పతివైన మదనజనకా! శిష్టరక్షకుడవైన నీకు శరణు. నారాయణా, అచ్యుత, అనంతా, గోవిందా, శ్రీ నరసింహా, కృష్ణ, నాగశయన, వరాహమూర్తి, వామన, వాసుదేవా మురారి, శౌరి శరణు శరణు పుండరీకేక్షణ, భువనపూర్ణగుణ, గరుడవాహన, నిత్యుడ, హరి, ముకుంద, పందరిరమణ, రామ, బలరామ, పరమపురుష, భార్గవరామ, దేవదేవోత్తమ దివ్యావతారుడవు, భావనాతీతుడవైన పద్మనాభాది నామములు శ్రీ వేంకటాచలపతికి సారూప్యము అట్టి శృంగారమూర్తీ!.. శరణు శరణు.

"అన్నిటా భాగ్యవంతుడ వవుదువయ్యా
పన్నినందుకల్లా వచ్చు భామనీకిపుడు" (7-168)

ఈకీర్తనలో అన్నమయ్య అలమేల్మంగను పరోక్షంగాను, స్వామిని ప్రత్యక్షంగాను వర్ణించాడు. అలమేల్మంగజీవాత్మకు ప్రతీక. వేంకటేశ! ఆభామ నీభార్య అవడంతో అన్నివిధాలా నీవు భాగ్యవంతుడవైనావు. ఆమెకు నీపైగల మోహరసమే పన్నీటి మజ్జనము. ఆమె సిగ్గులేకప్పురపుకావు. ఆమె చూపులే తట్టుపునుగు. అంటే ఆమెచూపులతో సిగ్గులతో అనురాగంతో స్వామికి అభిషేకం చేయించింది. అమ్మకెమ్మోవికాంతులే తెల్లని చంద్రకావి అభిషేక వస్త్రముగా, మోముకళలే ఆభరణాలుగా, మాటల విందులే ధూపదీపనైవేద్యాలుగా

సమర్పించింది. అలమేలమంగమ్మ తన నవ్వులే పూలమాలలుగా, తానే స్వామి మెడలో తాళిగా నిలిచి స్వామికి సకలసంపదలు తానే సమకూర్చింది.

"నీవు నాసొమ్మువు నేను నీసొమ్ము
యీవలనీవెపుడు మాయింట నుండదగవా" (4-429)

నీవు నా సొమ్ము నేను నీసొమ్ము. ఎప్పుడూ మాయింటనే వుండరాదా అని ప్రాధేయ పడుతున్నాడు అన్నమయ్య. ఓహరీ! నీరూపాన్ని గురువునాకు అనుగ్రహించాడు. నిన్ను తెలియలేని నన్ను విడిచిపోవద్దు. నీ దేవి నా తల్లి. నీవు తండ్రివి. నీవే ఆత్మబంధుడవు. నేనెంత అపరాధినైనా నీవు నన్ను విడువతగునా! నీవు భక్తవతులుడవని వేదాలు భువిలో ఘోషిస్తున్నాయి శ్రీవేంకటేశా! నీవు తప్పక విచ్చేయవలెను.

"ఆరూపమునకే హరి నేను మొక్కెదను
చేరి విభీషణుని శరణాగతుడని చేకొని సరిగాచితివి" (4-457)

హరీ! శరణన్న విభీషణుని గాచిన ఆరూపమునకే మొక్కెదను. శివుడు, బ్రహ్మ, ఇంద్రుడు, అగ్ని, సూర్యచంద్రులును నీలోనే వున్న, మూల మూర్తివని కిరీటి తెలుసుకున్నాడు. అనంతమైన శిరసులు, పాదములు, నయనములు, చేతులు కలిగిన నీ అనంతమూర్తిని కనుగొన్నాడు కిరీటి. అగణిత మహిముడవైన శ్రీవేంకటేశా! సకల జగత్తూ సకలమునిగణము నిన్నుపొగడిన కిరీటి గాంచిన రూపానికేనేను మొక్కెదనంటున్నాడు అన్నమయ్య.

"ఏమని పొగడవచ్చు నీతని ప్రభావము
వేమరు నోపుణ్యులాల వినరో యీకతలు" (4-482)

ఓ పుణ్యులారా! వినండి. ఇతని ప్రభావము ఎంతని పొగడగలము? అనంత సూర్యతేజుని కాంతిని ఎంతని చెప్పగలము. రాక్షసాంతకుని ప్రతాపమెంతని మన్మథగురుని చక్కదనం ఎంతని, బ్రహ్మతండ్రిఘనతఎంతని, గంగాజనకుని పుణ్యము ఎంతని? భూదేవి భర్తఅయిన అతని సింగారము, లక్ష్మీదేవిభర్త రాజసము, సర్వేశ్వరుడైన ఇతనిసంపదను వర్ణించగలమా! మాయనాధుని మహిమను, విష్ణుని వ్యాపకత్వాన్ని వేయిరూపాల వాడైన శ్రీ వేంకటాద్రిపతిని ఏమని పొగడగలము?

"హీనాధికము లింక నేడనున్నవోకాని
ఆనిన దాస్యము పొత్తు అందరికీ నొకటి (4-43)

శ్రీ వేంకటేశుని దాస్యమునకు హీనాధికములు లేవు. ఏవర్ణము వారైనా నరహరిని తలచే నామమంత్ర జపమొకటే. అతనికొలిచిన ఏజాతివారికైనా లభించ మోక్షమొకటే. విష్ణుకింకరుల భక్తి ఒకటే . అంతర్యామి అయిన ఆదేవుని వైష్ణవకులమంతా ఒకటే. ఆది

అంత్యాలుగాని, భేదాలు కాని లేని శ్రీవేంకటేశ్వరుని పొందు శరణాగతి ఒకటే.

"సంకె లేక తలచిన జాణలకు
సంకీర్తనమెపో సర్వశాంతి" (10-1-20)

విశ్వాసముతో చేసిన సంకీర్తనమే సర్వశాంతికరము. భవహరమగు శ్రీపతి నామస్మరణమే జన్మకు శాంతికరము. హరిపూజ చేయుటే గృహశాంతి ధ్రువుడు చేసిన "ఓంనమోభగవతే వాసుదేవాయ" జపమే సర్వగ్రహశాంతి. రవిచంద్రనయనుని తెలుసుకొనుటయే నక్షత్రశాంతి. అనంతుని స్మరించుటే కాలశాంతి. శ్రీవేంకటనాధుని జేరుటే దేవమానవులందరికీ దేహశాంతి.

"ఆచారవిచారా లవియు నేనెరగ
వాచామగోచరపు వరదుడవునీవు" (4-395)

ఓస్వామీ ! ఆచార విచారములు నాకు తెలియవు. నీవు వాక్కులకందవు. నిన్ను శరణనుటయే నాతపము నిన్ను ఉన్నతుడవని నుతించుటయే నాజపము. నీకైంకర్యసేవయే నాకర్మము. నీదాసానుదాస్యమే నాధర్మము. నిన్ను తలచుటే నామర్మము. నీపై భక్తియే నాబలము. నీవున్నానవనే ధైర్యమే నాసంపద. శ్రీవేంకటేశ నీవుతప్ప అంతకుమించి నాకు వేరువిచారములు తెలియవు.

"అడియ నడియనయ్య యఖిలలోకైకనాథ
తడతాకుల తాపత్రయము మానుపుటకు" (4-416)

అఖిలలోకైకనాథ! తాపత్రయములను పొగొట్టగల నీకుదాసోహం. మరణభయము పోగొట్టు కొరకు నీకే శరణం. నాదురితములను తొలగింపుమని నీకే మొరలిడుతున్నాను. దైవశిఖామణీ! నామనస్సుకు పరిపక్వత కలిగించుటకు నమస్కారములు. నేను నీదాసాను దాసుణ్ణి. నాపై కరుణించు. ఉభయకర్మములు (పాపపుణ్యములు) తుడిచివేయుటకు అభయమివ్వు. శ్రీ ఆదినారాయణుడవైన ఓ వేంకటేశా! మాకు శుభములన్నీ కలిగించమని ఇదేనా విన్నపము!

"అందరివశమా హరినెరుగ
కందువగ నొకడుగాని యెరగడు" (4-3) అనుబంధము

పదికోట్లలో ఒకడు శ్రీహరిని చూచి బ్రతికేవాడుంటే, పుణ్యులకోట్లలో ఒకడు తెలుసుకొనగలుగుతాడు. శ్రుతులు-చదివిన భూసురకోట్లలో గతిహరియే అనుకునేవాడు ఒక్కడే. అట్టిమహాత్ములకోట్లలో హరిని తలచేవాడు ఒక్కడే. నిత్యులకోట్లలో హరితలపున నిలుపుకునేవాడు ఒకడే. హరిభక్తులకోట్లలో శ్రీ వేంకటపతిని వెదకేవాడు ఏ ఒకడో!

"కలియుగ మెటులైనా గలదుగా నీకరుణ
జలజాక్ష హరిహరి సర్వేశ్వరా" (2-430)

జలజాక్ష! హరిహరి! ఓసర్వేశ్వరా! నీకరుణ వుంది గనుక కలియుగమైన భయపడను. పాపాలను తొలగించేందుకు నావద్ద నీ నామమున్నది. నాచిత్తములో నీవున్నావు గనుక నాకోపాన్ని పోగొట్టి శాంతినిస్తావు. ఇంద్రియాలు నన్నుఎంత లోబరచుకోవాలనుకున్నా నీ శరణాగతి నన్ను రక్షిస్తుంది. నీ భక్తితో కర్మబంధాలు గట్టినతాళ్ళు సడలిపోతాయి. ఇహపరాలు ఇవ్వడానికి నీ సంకీర్తనవుంది. శ్రీవేంకటేశా! నాతపము ఫలింపజేయుటకు ఆతల్లి లక్ష్మీదేవి నీవద్దనే వుందిగదా!

"చండప్రచండాది జయ విజయులన్
అండపూజించి హరికటుగదాపూజ" (4-9 అనుబంధం)

స్వామి అనే లక్ష్యాన్ని చేరుకొనేందుకు కొన్నిటిని దాటుకొనవలసి వుంటుంది. స్వామిని దర్శించి సేవించుకొనుటకు ముందుగా కొందరిని సేవించుకొనుట ధర్మం. ద్వారపాలకులైన జయవిజయులను, కూర్మము భూమి మొదలగువానిని ప్రతిష్ఠించి ధర్మాదులననుసరించి చామరగ్రహిణుల పూజించాలి. స్వామి సేవకులైన గరుడుని, ఆదిశేషుని పాదసేవచేయువారిని, శంఖ చక్ర, గద, అసిశార్ఙ్గములను పూజించాలి. తర్వాతనే స్వామిసేవపూజ. కిరీటము, కౌస్తుభము కుండలములు, హారము పీతాంబరము మొదలైనవానిని పూజించిన తర్వాత స్వామి పూజనివేదనలు.

"ఏమని చెప్పెద నిటమీద హరీ
శ్రీమంతుడ నిను జేరితి మిదివో " (4-394)

ఈ సంసారంలో పాట్లు వింటున్నాము. కంటున్నాము. రోజురోజుకు తెలిసీతెలియని భావనలతో మనసులో భయం ఇంచుక కూడాలేదు. చావు పుట్టుకలను గూర్చి ఆలోచించము. ఆశలు వదలవు. విరక్తి కలుగదు. ఎన్నోశాస్త్రాలు చదివాము. మదిలోనున్న నిన్ను మరచాము కానీ ఎదుటనే నిన్ను చూచాము కనుక ఇక ఎందుకు వృథా కార్యములు? శ్రీమంతుడవైన నిన్ను చేరినమాకు ఇకపైగల భాగ్యము ఏమని చెప్పుదును?

"కప్పురమునకు గప్పురమై
చిప్పిలుదావి మించె నితడు" (4-7 అనుబంధము)

కర్పూరమునకే కర్పూరమై సువాసనలు వెదజల్లుతున్నాడు స్వామి. బంగారమునకు బంగార మైనటువంటి స్వామికి శృంగారం కలిగింది. పీతాంబరము కొంగు బంగారమై తట్టు పునుగునకు తట్టుపునుగై, కస్తూరిబొట్టు చెమటబొట్టువలె వుంది. పన్నీట పాదాన

పన్నీరే తానై జలధిమధ్యమున కన్నియకౌగిట నున్నది ఆ శ్రీ వేంకటేశుడే.

"హరిహరినీమాయామహిమ
సరవి దెలియ నను కరుణించగదే" (4-293)

ఓహరీ ! నీ కరుణలేక నీమాయామహిమ తెలియజాలనయ్యా! నాపాలిటి తల్లిదండ్రి దైవము నీవే అనితలుస్తాను. అంతలోనే మరవుకలుగుతుంది. కలవలె తోచి అంతుచిక్కడంలేదు. నీవే ఆదిమూలమని, నాఏలికెవని మొక్కుకుంటాను. అంతలోనే గర్వంతో వూగుతాను. నీవెంతో సులభుడువుగా ఒకమారు కనపడతావు. మరొకమారు జగములకే వింతగా వుంటావు. నన్నేలిన వేంకటేశా! ఉత్సుకత కలిగింది కానీ కడ కానరావడంలేదు.

"ఇంతకంటెఘన మికలేదు
సంతత సౌఖ్యము జనార్దనుడే" (3-259)

జనార్దనుడే శాశ్వతానందం. అంతకంటె ఘనమైనది మరొకటిలేదు. పరమాత్ముని నుతి భయాన్ని తొలగిస్తుంది. ఆయన చింతయే జయకారణము. అచ్యుతునిసేవ అధిక పుణ్యప్రదము అన్నీ ఉపాయం సత్యాన్ని ఎరిగిన వారికి తెలుస్తుంది. శ్రీకాంతుని దర్శనము కర్మను తొలగిస్తుంది. లక్ష్మీపతిశరణే ధర్మరాశి, అనంతునితో అనుబంధమే అతని దాసులకు సంపద. శ్రీ హరికైంకర్యమే భోగము. శ్రీవేంకటేశుని కొలువు తెలిసిన ప్రపన్నులకు విష్ణుపూజే యోగము.

"చెప్పరాని మహిమల శ్రీధరా నీవు
చెప్పినట్టు చేసేము శ్రీధరా" (15-245)

ఇది ఒక శృంగారకీర్తన, శ్రీ వేంకటాద్రి శ్రీధరుని పొందుకోరుతున్న సతులనివేదన, ఆవేదన. గొప్పమహిమలుగల శ్రీధరా! నీవు చెప్పినట్లు చేస్తాము. నీసరసన నాకన్నులతో నిన్నుగాంచి ఎంతో సంతసించాను. నీ చిల్లరసతులు చెప్పిన ఆసుద్దులు విని నాచెవులు చిల్లులు బడ్డాయి. మమ్ముచేవ దేరగూడితివి నీకు సేవలు చేసేము. మావద్దకు రావోయి.

"నాపాలి ఘననిధానమవు నీవే నన్ను
నీపాల నిడుకొంటి నీవే నీవే" (1-108)

నీదరికి చేర్చుకొన్న ఘననిధానమవునీవే, నన్నేలేదేవుడవు. నిజబంధుడవు, సంపదవు. ఆప్తుడవు నీవే. ఈదేహము, బుద్ధి వెదీకంగా అన్నీ నీవే, బ్రహ్మ, శివుడు ఇంద్రుడు నీవే. అడ్డుతొలగించే తిరువేంకటనాథుడవు నీవేనీవే.

"ఏ పాటివారికి నాపాటివాడవు
చేపట్టిన వారిని చేకొని రక్షింతువు " (15-357)

ఎంతమాత్రమున ఎవ్వరు దలచిన అంతమాత్రమే నీవూ! అన్నట్లు చేపట్టిన వారిని అందుకొని రక్షిస్తావు. విన్నపములుగాచి సన్నుతులు చేయువారిని, కన్నుల అండనుండి, కోరికలు తీరుస్తావు. శరణుజొచ్చినవారిని కాపాడి, చనువునిస్తావు. అలమేలుమంగవి నేలిన స్వామి నీవు. అడుగని వారిని పట్టించుకోవు.

"విదురుని విందా విజయీభవ
హృదయేశ్వర విజయీభవ" (15-159)

ఈ కీర్తనలో అన్నమయ్య స్వామికి విజయీభవ విజయీభవ అని స్వామి గొప్పతనాన్ని కీర్తిస్తున్నాడు, పాండవుల రాయబారిగా వెళ్ళిన శ్రీకృష్ణుడు విదురునింట విందారగించాడు. ఆహృదయేశ్వరునకు విజయీభవ! దైవశిఖామణి, దానవమర్దనా విజయీభవ!, లక్ష్మీవల్లభుడు జగదేకపతి శతమఖవందితుడు అనేక విజయాలను సాధించినవాడు, వేదములచే పొగడబడిన నారాయణుడు. జలధిమధన సర్వజంతువిహారకుడు, కామితవరదుడు శ్రీ వేంకటపతి అయిన స్వామికి విజయీభవ.

"దైవము నెరగము తత్వము దలచము
చేవై హరి రక్షించీ నిదివో" (4-294)

దైవాన్ని తత్వాన్నికూడా తెలియని మమ్ము ఆహరే రక్షిస్తున్నాడు. పాపపుణ్యాలు, కోపముశాంతము ఓర్పు,లేక దుడుకుదనము గల ఈ దేహంతో మిడిసిపడుతున్నాము. లోనికి పీల్చేగాలి, వదిలేగాలి (ప్రాణము) చలువ-వేడి, తెలివికి-నిదురకు తెప్పగావున్న ఈదేహాన్ని పట్టుకుని వున్నాము. ఇహము-పరమును బట్టిన/జీవులపై శ్రీవేంకటపతి శరణుపొంది హాయిని పొందాము.

"సురలకు నరులకు శుభమాయె
హరి నీ చేతలు ఆనందమాయె" (1-218)

ఓహరి ! నీ చేతలు సురలకు నరులకు కూడా శుభాన్ని ఆనందాన్ని కలిగించాయి. రావణాసురుని సంహరించడం బాణుని గెలవడం, హిరణ్యకశిపుని చంపడం వంటి చర్యలు వేదములయ్యాయి. కంసుని, బలిని, శిశుపాలుని జయించడం లాంటి కథలు భారతమైంది. ఓ వేంకటేశా! అసురులను గెలవడంలాంటి మహిమలు పురాణము లయ్యాయి.

"తక్కిన దెల్లా దహతహాలే
నిక్కపు శ్రీహరి నిజమగు తెలివీ" (15-77)

శ్రీహరిని తెలుసుకొనుటే నిజమైన తెలివి. అదేఎరుక. మిగిలినదంతా తహతహాలే. జగత్తంతాదైవాధీనము. అన్నీ వాటంతట అవే జరుగుతాయి. శ్రీహరి కరుణను ఆనందించడమే

నిక్కమైన తెలివి. కావలసిన కార్యములన్నీ కర్మాధీనంలో వుంటాయి. వాటిని మనము దాటలేము. తప్పులు చేయకుండా సంతోషంగా వుండటమే తెలివి. పుట్టిన తనువులు భోగాధీనములు. ఇది - ఇదీ అని ఇదమిద్ధంగా తెలుసుకొలేము. శ్రీ వేంకటేపతిసేవనే నిజమని నమ్మటే అసలైన తెలివి.

"సేవేభావే శ్రీబృందం
శ్రీవల్లభచింతానందం" (15-175)

ఇందులో వివిధమతాలఖండన కనిపిస్తున్నది. శ్రీవల్లభుని చింతనయే ఆనంద దాయకము. అదికుతర్కములనే పర్వతాన్ని బేధించేది, కుటిలపాపాలను ఛేదించేది, కల్పవృక్షసదృశము అయిన రామనుజశాంతిభిక్షవ్యర్ధ మతాలను ఖండించేది, బౌద్ధ అంధకారంలో ప్రకాశించేది. సిద్ధాంతపరంగా చిన్మయత్వాన్ని కలిగించేది చార్వాక మతంపట్ల కుఠారంవంటిది. అపశాస్త్రాలకు వజ్రాయుధం వంటిది. నిర్వికారగుణభరితమైన వేంకటపతి సంయోగము.

"వెదకెద నిను నే వేదము చెప్పగ
హృదయములోననే యిరవు నీకటా" (15-343)

వేదము చెప్పిందని వెదకుతున్నాను కానీ నీవుహృదయంలోనేవుంటావట. అంతటావుంటావట శ్రీనాథ! అనిపిలిచితే పలుకరాదా! చెవులతో అన్నీ వింటావట మరినామాట వినరాదా! మదనజనకుడవట కనిపించరాదా! బ్రహ్మపూజించిన నీపాదాన్ని చాచరాదా? మ్రొక్కుతాను గోవిందా నీగుర్తు తెలపరాదా! వేవేలమహిమలవిభుడా నలమేల్మంగకుకైవసమైన శ్రీవేంకటేశా మమ్ము గావుమయ్యా!

"నన్ను నిన్ను నెంచుకోవో నారాయణా
అన్నియు నీ చేతినే అదివో నారాయణా (15-224)

నన్నునీవు ఎన్నుకోరాదా? అంతానీ చేతిలోనేవుంది. నామనసు నీకే తెలుసువయసా చెల్లిపోయింది. నామమాత్రపు మొక్కులు మొక్కుతున్నాను. అట్టి నాకు నీ ప్రియాలు ఎలా లభిస్తాయి. నవ్వటాలకు నేనంటానుగాని నన్ను నవ్వులపాలుచేయకు. వెంకటాద్రివాసుడవైన నిన్ను గుర్తించగలిగాను. నా అనుమానాలు తొలగిపోయాయి.

"పరమవైష్ణవుల భాగ్యం బిదివో
నిరతివారలకె నే మొక్కెదను" (4-86)

విష్ణుసేవాపరులైన ఆవైష్ణవుల భాగ్యమే భాగ్యము. వారు లౌకికభోగాలను ఇతర దేవతలను తలచరు. హరిదాసులసేవను, మోక్షాన్ని తలుస్తారు. బ్రహోదిపదవులను

మేరువుకొనసుఖమును కోరరు. నీమీది భక్తినేకోరుతారు. కర్మమును, పుణ్యమును, అహంకారమును వదిలి మనస్సులో శ్రీవేంకటేశుని శరణని తుది పదమును చేరుకున్నారు. అలాంటివైష్ణవులకే ఎల్లప్పుడు నేను మ్రొక్కుతాను అంటున్నాడు అన్నమయ్య.

"కైకొనవయ్యా కరివరదా
నీకేశరణము నిలింపవరదా" (15-178)

ఓ కరివరదా! నిన్నేశరణన్నాను నన్ను చేకొనవయ్యా. బ్రహ్మన్ను ధ్రువుని, పాండవులను, ద్రౌపదిని, బలిని, అంబరీషుని, అక్రూరుని, ప్రహ్లాదుని, కుచేలుని బ్రోచినవాడా! శుకనారద విభీషణ వరదా! శ్రీవేంటపతి నిన్నునేను నుతిస్తున్నాను.

"వేదము దీర్చదు వేరే శాస్త్రములు
యేదియు దీర్చదు యిది నీమాయ" (3-565)

వేదములవల్ల, శాస్త్రాలవల్ల నీమాయను తెలియలేరు. దేవతలను రక్షించావనీ అసురులు చెడిపోయారని అంటారు. మరి అందరి అంతరాత్మ నీవే! పాండవులను కాచావు. కౌరవులను విడిచావు. కానీ ఇద్దరితో నీబంధుత్వ మొక్కటే. నీవు సర్వస్వతంత్రుడవు. జీవులంతా నీవారే. ఇవన్నీ తెలియని చిక్కులు! కానీ నీదాసులకు నీవే తెలిసిన చిక్కు ఓవేంకటేశా!

"అనంత మద్భుత మాశ్చర్యం బిది
సనాతనుడ నను సరవిగావవే" (15-308)

అనంతమద్భుకరం! ఆశ్చర్యం సనాతనా! నన్నుబ్రోవయ్యా? అసురులకు భయంకరుడవు. అమరులకు ఆనందదాయకుడవు! ఋషులకు తప:ఫలానివి నీమహిమలుచెప్పగలమా! వేదములకు ఆధారభూతుడవు జీవులప్రాణాధారము, పరమయోగులకు పరబ్రహ్మవు అయిన నీమూర్తి తెలియగతరమా! జగద్బంధువు. శ్రీనివాసుడవు శ్రీవైష్ణవులకు శ్రీవేంకటపతివి అయిన నీ కథలు తలచగవశమా!

"మానుపవశమా మాయ లివిన్నియు
శ్రీనాధుడా మును చేసినవే" (3-360)

శ్రీనాథుడా! నీమాయలు తొలగించలేము? రాత్రి చీకటి -పగలు వెలుగు, జ్ఞానులకు అజ్ఞానులకు అసురులకు -సురలకు వైష్ణవులకు -ప్రాకృతులకు, ఇహము - పరములకు సహజవైరము కాని శ్రీవేంకటేశుమతము నిశ్చలమే!

"మఱియు మఱియు నీకేశరణు
అఱి ముఱి సకలాంతర్యామీశరణు" (15-354)

సకలాంతర్యామీ! నీకేశరణు శరణు. స్థూల సూక్ష్మ కారణ శరీరాలకు మూర్తిత్రయ

శరీరానికి పంచభూతాలకు చతుర్దశభువనాలకు మూలకారణమా! శరణు! చెప్పరాని పరబ్రహ్మమా, కాలాత్మకా, విశ్వరూపమా బ్రహ్మాండజనకుడా! శరణు. కోటి సూర్యభాసమానా, సనకాదులు సన్నుతించేవాడా, అలమేలుమంగపతీ, ననుగాచే వేంకటాధిపా! శరణు! శరణు!

"చవి నోరికేడ దెత్తు సంపదేడ దెత్తు వీని
సవరించుటే నాసంపదిది గాదా" (4-326)

నోటికి రుచులకొఱకు సంపదలకొరకు తాపత్రయపడేకంటె సరిదిద్దుకుంటే అదేసంపద అవుతుంది. సొమ్ములు, వస్త్రములు, ఇళ్లు, తేవడము కష్టముకాని, ఈపచ్చడము దేహము నంటి వచ్చినది తనను వద్దనవచ్చా? పెద్దపదవులు సిరిసంపదల కొరకు ఎవరినీ వేధించక స్వామి చెంత చేరడమే దొరతనము. తోడబుట్టినవారు చుట్టాలు, సుతులపొందుకంటె శ్రీవేంకటేశుని తలచుకొంటే వేడుకైనపొందు సరిలేని బంధుకోటి ఇతడే.

"రూకలైమాడలై రువ్వలై తిరిగీని
దాచుకొనివున్నచోట దానుండదదివో" (1-458)

లక్ష్మీదేవి రూపురేఖలు వింతమాయలు వివరిస్తున్నాడు అన్నమయ్య ఈకీర్తనలో రూపాయలు అణాలుపైసలు అన్నట్లు రూకలు, మాడలు, రువ్వలై తిరుగుతూ దాచినచోట వుండదు. ఆమె ఒకరిని రాజును చేసి, మరొకరిని బంటుగ మార్చి ఒకరికన్నకలను మరొకరికి నిజం చేస్తూ ఇక్కడధాన్యము అక్కడికి చేరుస్తూ 'ధనమూల మిదం జగత్' అన్నట్లు బంగారమువలె భ్రమింపజేస్తుంది. కొందరి గాదెలు నింపుతూ, మరికొందరికి సొమ్ములై, కొందరిపుణ్యాలుగా మరికొందరిని పాపులుగా జేస్తూ, కొట్లాటలు, విభేదాలు కలిగిస్తూ అటుఇటు మారుతూ తిరుగుతుందీ సంపదలక్ష్మి. తెగని మాయయై దిక్కుదెసతానేయై నవ్వుతూ మనపాల నటించే ఆబంగారు తల్లి నిగనిగమనే నిక్షేపమై శ్రీవేంకటేశుని వక్షస్థలమున యిల్లాలై వున్నది.

"హరినీనామమెఅంతాను
అరసి నీకు శరణనియెద నేను" (4-418)

సర్వమయుడవైన హరీ! నీకుశరణు. వేదములు నిన్ను సకలశబ్దాఖ్యుడవని పొగిడాయి గాన ఎవ్వరేమి మాటాడినా అన్నీనీనామాంకితమే. శ్రుతులు నిన్ను విశ్వరూపుడవన్నాయి. అందువల్ల అన్నిరూపాలు నీవే. వేదశాస్త్రాలు నిన్ను సర్వాంతర్యామి వన్నాయి. భావనంతా బ్రహ్మాత్మకమే శ్రీవేంకటేశ! నాచింతననీవే.

"భక్తసులభుడును పరతంత్రుడుహరి
యుక్తి సాధ్యమిదె యొకరికీ గాదు" (3-10)

భగవంతుడు ఏ ఒక్కరిసొత్తుకాదు. హరి భక్తసులభుడు, పరతంత్రుడు, లోకములంతా

నిండిన ఆవిష్ణువు మనిషినైన నాలో వున్నాడు. వేదమంత్రాల్లో వున్నవాడు నాలిక చివర కుదురైవున్నాడు. దేవతలను గాచిన దేవదేవుడు అన్నిటా అధముడనైన నన్ను నేలాడు. లక్ష్మీపతియగు శ్రీహరి యిక్కడ మాయింటనిలిచాడు గొప్పలకు గొప్పవాడైన పురుషోత్తముడు బుడిబుడి మాచేతి పూజలు స్వీకరించాడు.వడిబాయక శ్రీవేంకటేశుడు మాచెంత నిలిచాడు.

"అయమేవ అయమేవ ఆదిపురుష
జయకరం తమహం శరణం భజామి" (4-313)

ఓ ఆదిపురుషా! నీవే నాకు శరణు వటపత్రశాయివి నీవే. దశావతార రూపుడవునీవే! శ్రియ:పతివి నీవే. దుష్టదైత్యులను సంహరించినది నీవే. సకల భూతాంతర్యామివి నీవే. వేదవేందాంత వేద్యుడవు నీవే వైకుంఠాధిపతివి నీవే. వేంకటాద్రిపై వెలసినది నీవే.

"ఓహెూ! నిలిచిన దొకటిదియే
శ్రీహరిసాకారచింతనము" (3-564)

శ్రీహరి సాకారచింతన ఒకటే శాశ్వత సత్యము. పద్మాక్షుని నామమే పరమౌషధము. పీతాంబరుని శరణాగతియే అజ్ఞానము తొలగించేదీపము. విష్ణుని కీర్తనమే విందుభోజనము. అచ్యుతుని పూజలే పైకి ఎక్కగలిగే నిచ్చెనలు. పాపవిమోచనము చేయగలముదుపు ఘనమైన కృష్ణభక్తి. పట్టిన వారికి బలమైన కొమ్మ శ్రీవేంకటేశ్వరుని కృపమాత్రమే.

"ఇదియె నాకుమత మిది వ్రతము
వుదుట్ల కర్మము వొల్లానికను" (15 -166)

విశిష్టాద్వైతంలో శరణాగతికి ప్రాముఖ్యం. "అన్యధాశరణంనాస్తి త్వమేవశరణంమమ." హరీ! తపములు, జపములు, ధర్మములు అన్నీ నిను శరణనుటే. ఇహపరాలు భాగ్యము అన్నీ నీదాసుడనుటయే. నీనామజపమే సారపుచదువులుశాస్త్రాలు. నీమాయబడిచేయు సుకృతములు, పుణ్యములు కూడావద్దు. పుణ్యము బంగారు సంకెలవంటిది. అదియైన అనుభవించాలి. నీ శరణాగతి నామకీర్తనమే నాకు వ్రతము. శ్రీ వేంకటేశవేరేమివద్దు.

"ఏవం శ్రుతిమత మిదమేత
ద్భావయితు మత: పరంనాస్తి" (1-4)

శ్రుతులుకూడా నిన్నే భావిస్తాయి. అంతకుమించినదిలేదు. అనేకజన్మల భోగాలు, వైభవాలు నీవలన ఇక్కడే లభిస్తాయి. శ్రీహరి సంకీర్తనతప్పఇతర సుఖాలు చెప్పగలగినవి లేవు. అనేక జన్మల పరిభవచిత్తముగల మాకు ఇహపరసాధనము నీవే. పన్నగశయనుడవైన నిన్ను కీర్తించుట తప్ప మాకితర గతిలేదు. సంసారదురితాలలో బద్ధులమైన మాకు నీవే శరణము. కంసాంతకుడవైన నీవు వేంకటగిరిపై నిలిచి ప్రశంసలందు కుంటున్నావు. ఇంతకు మించిన చింతన లేదు.

"నీవంటి దైవాలు వేరీ నిఖిలలోకములందు
యీవల నావల నెందు నెంచి చూడ మాకును" (4-240)

అన్నిలోకాలలో నీవంటిదైవము ఎవరున్నారయ్యా మాకు! మన్మధునికన్నతండ్రివి గదా నీ మోము చక్కదనానికి ఎవరు సాటి నీవు కల్యాణగుణధాముడవని శ్రుతులు పొగిడాయి. బ్రహ్మకులమే నీయందు పుట్టినది. సర్వరక్షకత్వమునదే శరణాగతవత్సలుడవని నీ బిరుదు. శ్రీవేంకటేశా! నీ మహిమలు చూచి నిన్నే సేవించి బ్రదికామయ్యా!

"దైవంబవు కర్తవు నీవేహరి
యీవలనావల నెవ్వడనయ్యా" (3-439)

దైవానివి, కర్తవునీవే, నడుమ నాదేముంది. తలచిన తలపులు దైవ యోగములు. కలిగిన చేతులు కర్మములు. ఈదేహం విషయాల అధీనం ఇక అవును కాదనుటకు నేనెవ్వడను. ఇంద్రియములు చిత్తము యొక్కఅధీనములు. మాయకు అనుగుణంగా జగతి, ప్రాణములు, సంసారబంధము చక్క బెట్టుటకు నేనెవరిని! శ్రీదేవితో కూడిన వేంకటపతీ! ఈ ఆత్మ నీ అధీనము. నీయిచ్చవచ్చినట్లు అనుగ్రహించవయ్యా అని తన బాధ్యత నంతా స్వామికే అప్పగించాడు అన్నమయ్య.

"అతడే రక్షకు డందరి కతడే
పతియుండగ భయపడజోటేది" (4-380)

అందరికీ రక్షకుడుగా ఆపతివుంటే భయపడాల్సిన పనిఏముంది? అనంతుడు అనంతకరములతో అనంతఆయుధములను ధరించియుండగా శరణాగతులమైన మనకు భయమేల? ఇల అభయహస్తంతో హరి రక్షకుడైవుంటే నరహరి కరుణను నమ్మినవారికి భయమేల? వేంకటగిరిపై జీవులకాపాడుతూ నిలిచిన దైవశిఖామణికి దగ్గరున్నమాకు భయపడేచోటేది?

"ఏమని వర్ణించునొకొ ఇక బురాణములెల్ల
వేమారు గొత్తలాయ విశ్వలోకపతికి" (20-110)

ఈ విశ్వలోకపతిని పురాణములు ఏమని వర్ణించగలవు. వేమారు గొత్తలాయె. పాలసముద్రములో పలుమార్లు తేలినందువలన నీలవర్ణము బోయి తెలుపైనాడట. కర్పూరము వొంటినిండా నించగా పురుషోత్తముడు వేరుగా వున్నాడట. కాళిందిలో పలుమారు ఱీదినందువల్ల అక్కడే మళ్ళీ నలు పయ్యాడట. వెంటనే తట్టుపునుగు వొంటి నిండా అద్దగా ఆనర్వేశ్వరుని రూపు వేరుగావుందట. అలమేలుమంగ వక్షస్థలమున నిలువగా బంగారువర్ణంలో కనిపించాడట. దీనికి తోడు ఎన్నో సొమ్ములతో అలంకరించగా నానావర్ణములు కలిగాయట ఆవేంకటేశ్వరునికి.

"ఇతనిప్రసాదమే యిన్నియును

గతి యితనిదే కన కాదనరాదు" (2-504)

అన్నియుస్వామి ప్రసాదమే గనుక మనము కాదన రాదు. యవ్వనమునందు దేహంలో ఒక ఘనసంసారము ప్రబలుతుంది. అయినా స్వామి మనలను అంటిపెట్టుకొనివున్నాడు. కలలోని సంసారమున మనసు వెంటనే వుంటాడు. నారాయణుడై తుది మొదలు తానే అయినాడు. కోర్కెలసంసారములో ఎన్నెన్నో ఆశలు తగులు కుంటాయి. శ్రీ వేంకటేశుడే దీనిని కల్పించి ధృవమూ తానే అయినాడు.

"ఏదాయనేమి హరియిచ్చిన జన్మమే చాలు

ఆదినారాయణుడే అఖిలరక్షకుడు" (4-264)

అఖిలరక్షకుడు ఆదినారాయణుడే అయినప్పుడు హరియిచ్చిన ఏజన్మమైతే నేమి? శు నకమునకు దాని బ్రతుకు సుఖముగానే కన్పిస్తుంది కాని హీనమనుకోదు. ఏతనువులోనైన అంతరాత్మగా దైవము వున్నప్పుడు మనసు సమాధానపడితే అన్నీమంచిగానే వుంటాయి. మురికిగుంటలో నుండేపురుగుకు ఆచోటే భువనేశ్వరముగా అనిపిస్తుంది. లోకములన్నీ విష్ణుమయమైనపుడు ఎక్కువేముంది తక్కువేముంది? జ్ఞానికి అంతావైకంఠమే. తనతిమ్మటే జీవన్ముక్తి. ఏలికైన శ్రీవేంకటపతికి దాసుడైతే హెచ్చుతగ్గులు లేవు.

"విడువరా దెంతైనా వెఱ్ఱివాడనైన నీకు

కడవారు నవ్వకుండా గాచుకోనన్ను" (2-2)

నేనెంత వెఱ్ఱివాడనైనా నీవు నన్ను విడువరాదు. ఇతరులు నవ్వకుండా నన్ను కాచుకో ! కరుణానిధి, శరణాగతవత్సలుడు అనే బిరుదులు నీకున్నాయి. అందువల్ల నన్ను నీవు విడువలేవు. విషయములను మరిగి జ్ఞానమును అజ్ఞానమును తెలియను. నీ నామస్మరణతో నీదాసుడననుకొందును, దిదుకోనన్ను. ఈ సంసారమునబడి అకర్మము, సుకర్మము తెలియను, నీముద్రధారి (చక్రాంకితుడ) నైతినిగాన ప్రేమతో నన్నూ నేలుకో! వెనుక ముందు ఆలోచించను శ్రీ వేంకటేశా! నీ ఎదుటికి వచ్చానుగదా విడువక కరుణించు!

"దేవశిఖామణివి దిష్టదైవమవు నీవు

యీవల నీబంట నాకు నెదురింక నేది" (3-418)

ప్రత్యక్షదైవమవైన ఓ దేవశిఖామణీ! నేను నీబంటును. కనుక నాకు ఎదురేలేదు. ఇవన్నీకామధేనువు తీర్చగల కోరికలు. నీవేమో ఎన్నోకామధేనువులను గాచే కృష్ణుడవు ఓ ఇందిరా రమణా! నీబంటునైన నాకు కొరతేది? కల్పవృక్షము నీడనున్న నీవు ఆకల్పవృక్ష సిరుల నివ్వగలవు. ఆత్మలో నిన్ను నమ్మిన నీబంటును వంచించలేవుగదా! ఒక్క చింతామణి

తలచినవి ఇవ్వగలదు. మరికౌస్తుభమణి మించిన కృష్ణుడవు. జగదేకపతీ! నీ భక్తుడనైన నాకు కొరతేది? అన్నమయ్య అనన్యభక్తుడు. తను స్వామిబంటు అయినందువల్ల ఏకొరతా లేదు అంటున్నాడు.

"శ్రీవేంకటేశుడు శ్రీపతియును నితడే
పావనపు వైకుంఠపతియు నితడే" (1-425)

వేంకటేశుడు, లక్ష్మీపతి, వైకుంఠపతి అన్నీ ఇతడే, భాగవతంలో చెప్పబడిన బలరాముని తీర్ధయాత్రలోని దైవము, బ్రహ్మాండ, వామనపురాణాలలో చెప్పబడినదైవము ఇతడే. సప్తఋషులు ప్రదక్షిణము చేసినవాడు, కుమారస్వామి తపముచేసి కోనేటిదరిని దర్శించన దేవుడు, బ్రహ్మాదులు, ఇంద్రాదులు కొలిచిన తత్వము నారదాదులు కీర్తించినిదైవము అతడే.

"లావణ్యశృంగారరాయ లక్ష్మీనాథ
యేవేళ నీవినోదానకేదాయ నేమి" (2-149)

లావణ్యశృంగారరాయ లక్ష్మీనాధ నీ వినోదానికి లోటురానీయను. నామనసే పాలజలధి వంటింది. తొల్లి నీవు సముద్రశాయివి కద, పూర్వంనీవు భూసతికి మగడవట నిక్కపుభూమివంటిదే నామనసు స్థిరమైన భక్తి నిండుకొండ వంటింది. దృఢమైనది. అట్టి నీవు కొండలరాయడవుగద నీవినోదానికి లోటు లేదుగద!

"రతిరాజజనక వో రామామానోహర
తతితోడ బురుషోత్తముడవు నీవే" (12-101)

ఇది శృంగార కీర్తన. మదనజనకుడవు రామామనోహరుడవు. పురుషోత్తముడవు, నీవే. చతురుడవు జాణవు. నీవు సతుల మనసెరిగి సరసములాడి మోవినందించాలి. భావించి చూచేవారిని లాలించి వలపులు గైకొనాలి కోవిదుడవైన నీవే నవ్వులతో వారి సిగ్గుపోగొట్టాలి. వారికి రతులనేర్పి కృపతో లాలించాలి. ఇట్టి గుణాల శ్రీవేంకటేశా! అలమేలుమంగను నన్నుకూడితివి.

"హరిహరి నిను సకలాంతర్యామివి ఆత్మదలచుటే యోగంబు
శరణాగత రక్షామణి నిన్నే శరణని యెడిదే తుదిపదము" (4-450)

ఓహరీ! సకలాంతర్యామివైన నిన్ను ఆత్మలోతలచుటే యోగము. శరణాగతరక్షామణివైన నిన్ను శరణుపొందుటే మోక్షము. నీయందే ఈచరాచరము వుందని, చరాచరమునందు నిత్యము నీవుందువని తలచుటే పరమార్ధసారము. ఈ దేహము, జీవుడు నీ అధీనము ప్రకృతి పురుషులుగా మమ్ము మాయల ముంతువు. ఈమాయకు లోబడకుండుటే సుజ్ఞానము. తనలో పరతత్వాన్ని, పరతత్వములో తనను దలచుటే వేదాంతసారము. సన్మార్గము

ఘనమునకు మరిఘనమై, కదుసూక్ష్మములకు కదుసూక్ష్మముంబై పూసలలో దారమవని యెన్నుటే పరమ రహస్యము. ఆత్మలోపల వైకుంఠమును, ఆత్మను వైకుంఠములోపల సరిగా తెలియుటయే బ్రహ్మానందము శ్రీపతివైన నిన్నే సేవించి భజించెదను. దాతవు, దైవము నీవే అయిననన్ను రక్షించు, ఇదియే తత్వము.

"పట్టినవారల భాగ్యమిదే
గుట్టుతెలిసితే గురుతులివీ" (15-126)

నిన్నుపట్టుకున్న వారి భాగ్యమునకు కొన్ని గురుతులున్నాయి. దామోదర! నీదర్శనము కామధేనువు, కల్పవృక్షమును చూచినట్లు గజవరద! నీ శరణమంటే రాజపదవి, ఇంద్రపదవి వంటిది. నిను సేవంచిన అనుభవము, పరుసవేది పరమైశ్వర్యమువంటిది. కొండలరాయ ! నీగుణకథా శ్రవణమే నిందు భోగములు నిత్యశుభంకరము. శ్రీ వేంకటాధిపా! నీకరుణతో సర్వము లభిస్తాయి.

"వామన నృసింహ వాసుదేవహరి
నీమహిమ గదా నిర్మలు లైరి" (1- 368)

వామన నృసింహ వాసుదేవహరీ ! సనకస నందనులు సనత్కుమారులు సనత్సుజాతాది సంయములు వినయముతో ధ్రువుడు. విభీషణుడు నిను సేవించి నిర్మలు లైరి. నారదుడు శుకుడు, శౌనకుడు, హనుమంతుడు, పారాశర్యులు, రుక్మాంగద, ప్రహ్లాదులు నీ వలననే నిర్మలులైరి కరిపుండరీకుడు, భీష్ముడు, వశిష్టుడు. అంబరీషుడు, అర్జునుడు శ్రీవేంకటేశా! నీపాద భక్తివలననేకదా నిర్మలులైరి.

"సచరాచర మిదె సర్వేశ్వరుడే
పచరించి యితని భావింపు మనసా" (4-116)

చరాచరమంతా సర్వేశ్వరునితో నిండివుందిది ఓమనసా! అంతటా నిండివున్న అతనినే భావించుము. కదిలెదంతయు కమలారమణుని చైతన్యమే. నిశ్చేష్టజగమున కూడా అతడే నిండి వున్నాడు. కలిగి వున్నదంతయు పరిపూర్ణమైన సగుణరూపము. లేనట్లున్నదికూడ అతని మహిమతో నిలకడగలిగిన నిర్గుణమే. జీవరాసులసృష్టి యంతయు శ్రీ వేంకటపతి సంకల్పమే. భావించిన పరమవిదులకు ఇహము పరము కైవల్యమే.

"కోనేటిదరుల గనుగోనరో మూడుతేరులు
నానాదేవతలార నరులార మీరు" (3-517)

కోనేటివద్ద మూడు తేరులను చూడండి. ముందరి తేరుమీద శ్రీకృష్ణుడు, వేరొక తేరుమీద వేంకటేశుడు; శ్రీసతి, భూసతి; మూడవ తేరుమీద ఎక్కారు. ఆతేరులు వీధులలో

తిరుగుతుంటే కొండలా అన్నట్లున్నవి. శ్రీకృష్ణునిది వానరధ్వజము, వేంకటపతిది గరుడధ్వజము శ్రీదేవి భూదేవులది కరిలాంఛనధ్వజము.అవి చూచుటకు బ్రహ్మాండములవలె వున్నాయి. శ్రీకృష్ణుడు చెరకు విల్లు, వేంకటేశుడు చక్రము, అలమేలుమంగా భూదేవి పద్మములను పట్టుకున్నారు. బంగారు మేడలను తలపిస్తున్నాయి. తిరుమలలో మూడురథాలపై ఊరేగింపు జరగడం చూచి తరించాలి.

"జగన్మోహనాకార చతురుడవు పురుషోత్తముడవు
వెగటు నాసోదంబు ఇదినీ వెలితో నావెలితో" (2-375)

ఓ జగన్మోహనాకారా! నీవు చతురుడవు. పురుషోత్తముడవు. ఎన్నిమారులు సేవించినా కన్నులుతృప్తి చెందవు నీకథామృతమెంత విన్నా వీనులు తృప్తి చెందవు. మిమ్ము ఎంత నుతించిన నా జిహ్వాకు తృప్తి కలగడం లేదు. ఇది నావెలితో నీవెలితో . నీ ప్రసాదముతిన్న శరీరమునకు ప్రదక్షిణలు చేసిన పాదములకు సాష్టాంగము చేసిన నుదురు తృప్తి పొందడంలేదు. నిన్ను పూజించిన చేతులు, నీ చెలువమును సింగారములుతలచిన చిత్తమూ తనియదు ఇది ఏమి మాయో! శ్రీ వేంకటేశా! నను మోహింపజేశావు అంటాడు. అన్నమయ్య జగన్మోహనా కారుడైన స్వామి సౌందర్యము అంతటిది.

"కేవలకృష్ణావతారకేశవా
దేవదేవ లోకనాథ దివ్యదేహ కేశవా" (4-391)

కృష్ణావతారకేశవా! దివ్యదేహకేశవా! రవికోటితేజకేశవా హరి లక్ష్మీనాయక! ఆదికేశవా! పార్వతీదేవిచేత నుతింపబడిన కేశవా! జలధిశాయి కేశవా! నీకు జయము జయము. శిఖిపించమును ధరించిన కేశవా! శ్రీకరగుణాభిరామ చెన్నకేశవా! కుమారస్వామిని అనుగ్రహించిన కేశవా పాకశాసన వంద్య కేశవా! బ్రహ్మాది గుణములచే సేవింపబడే కేశవా! కుంకుమతో రాజిల్లు వక్షము గల కేశవా సర్వదోషహరణ జగదేక కేశవ నీకు నమస్కారము.

"అదుగో కొలువైయున్నాడు. అలమేలుమంగపతి
పదివేలవిధముల పారుపత్తెము జేయుచు" (27-పీఠిక 24)

అనేకవిధములుగ ఆధిపత్యము చేయుచు అలమేలుమంగపతి కొలువై వున్నాడు రంగమండపములో అంగనామణులతో రత్న సింహాసనముపై సురలు సేవచేయగ వేంచేసి వున్నాడు స్వామి. వెండిబంగారు గుదియలు పట్టుకొని వేత్రహస్తులు పొగడ, నిండు వెన్నెలట్టు పూలదండల మీరగా హుండీలోని కానుకల లెక్కలు అధికారులు చూస్తుండగ దేవరాయడు కొలువైవున్నాడు. శృంగారమూర్తి శ్రీవేంకట విభుడు అంగనలు సేవించుచుండగా అంగరంగవైభవముగ మంగళహారతులను స్వీకరిస్తున్నాడు.

"అన్నిటా జాణడు అలమేలుమంగపతి
పన్ని నీకు మేలువాడై పరగివున్నాడు" (27-562)

అన్నిటా జాణడైన అలమేలుమంగపతి నీకు మేలు చేయుచున్నాడు. పతితోడ అంత పంతమేల? ఒప్పుకోరాదా! నిన్ను అంటిపెట్టుకున్న అతనిమీద మనస్సు కరగదా! పిలిస్తే పలుకక సాధింపు ఎందుకు? కౌగలించుకుంటే పంతమేల రతినికూడరాదా! శ్రీ వేంకటేశ్వరుడు నిన్నేలె మెచ్చరాదా? పెండ్లాడి అండనేవున్నవానితో కలిసివుండరాదా! ఓ సఖిలాగా అన్నమయ్యా చెప్తున్నాడు.

"దృష్టిదాకు మాయయ్యకు తెరవేయరే "పల్లవి"
దృష్టించెద రెవరైన దరిజేర నియ్యకురే॥ అనుపల్లవి" (27 పీఠిక పుట 28)

అన్నమయ్య కీర్తనలలో అనుపల్లవి చాలా అరుదు. స్వామికి దృష్టి తాకుతుందనీ ఎవరినీ దరిచేరనీ యొద్దని ఓ చెలికత్తెలాగా అన్నమయ్య కీర్తన ఆలపిస్తున్నాడు. స్వామి మజ్జనమాడుచున్నారు. చప్పుడు చేయవద్దు. కప్పురపు వీవనల సేవిస్తున్నారని, సతులతో ఆరగించినాడని, దంతపు జవికెలో ఏకాంతమున నున్నారని, దొంతిపూలతోట్లలో సరససల్లాపాలతో వున్నాడని, పట్టపురాణి, తాను పవళించి యున్నారని అల్లరి చేసేవారిని రానీయవద్దని, శ్రీ వేంకటేశుడు లోకకర్తగాన సేవించి పొమ్మనరే అంటాడు అన్నమయ్య.

"వీడే నెలకొన్నాడు శ్రీ వేంకటగిరి మీద
వీడే కౌరవుల పాలిటికి విశ్వరూపుడితడు" (సం 27-పీఠిక 23)

ఆ కౌరవులపాలిటి విశ్వరూపుడే శ్రీవేంకటగిరిపై నున్నాడు. త్రిపురములపై వాలిన నారాయణాస్త్రమితడే. బాణుని ఛేదించిన చక్రధరుడు, కంబమున వెలసిన వీరసింహము, భస్మాసురుని పాలిటి కాలదండము, బలినణచినవాడు. పరశురాముని గర్వము నణచినవాడు, నరకాసురుని పాలిటి ఉరమని పిడుగు, దనుజకోటులకు ధూమకేతువు ఇతడే బ్రహ్మరుద్రులకు ఆదిమూలము. ఆశ్రితపారిజాతము, బ్రహ్మాండాలకు కన్నతండ్రి; భక్తులను వెదకి వెదకి వరము లొసగెడి వెంకపతియు నితడే.

"అవధరించగదయ్య అన్ని రసములు నీవు
తివురుచునబ్బెనిదె తేనెమోవిరసము " (7-423)

"నవరసములదీ నళినాక్షి జవకట్టినీకు జవిసేసేని" అని అన్నమయ్య అమ్మ సుందరరూపాన్ని సాక్షాత్కరింపజేశాడు అలాగే నవరసములతో నిండిన స్వామిని వర్ణిస్తున్నాడు.

చెలియ చక్కదనములో శృంగారరసము, కనుబొమలలో వీరరసము, రతికాంక్షలలో కరుణరసము, మేనిపులకల్లో అద్భుతరసము, తరుణితో సరసములలో హాస్యరసము,

విరహములో భయరసము, నిబ్బరమున బీభత్సరసము, మరుయుద్ధాన ఘనరౌద్రరసము వనిత ఆనందమున శాంతరసము, మంతనములలో నవరసములు ఉన్నాయి. దీనికి తోడు స్వామివద్ద తేనెమోవిరసము వుందట, ప్రతిదినము వినోదాలతో శ్రీవేంకటేశునితో కూడి అన్ని రసాలు స్థిరమయ్యాయి.

"విన్నవించితిమి నీకు వేడుకవేళ
కన్నెను నీవు దయగాచేటి వేళ" (21-133)

ఈ కీర్తనలో అన్నమయ్య ఆరు ఋతువులను వర్ణించాడు. వేడుకగా కన్నెను దయ గాచుమని విన్నవిస్తున్నాడు. వసంతవేళ కన్నెకు జవ్వనము వచ్చి మనసు జయపెడుతున్నది. నిన్ను బాసివున్నందువల్ల తాపసూర్యుడు ఎండకాయగా వేసంగివేళ అయింది. సిగ్గులు మొలవగా చెమట లేరులతో వాన కాలాన్ని మించిందట. చిరునగవుల వెన్నెలలతో శరత్కాలమైంది.

తత్తరపు చలి పొంచివుండి తలపోతలమంచు హెచ్చై అలమేల్మంగకు హేమంత వేళ అయింది. శ్రీవేంకటేశా! చిత్తజుకాకలు దేరె శిశిరవేళ పైకొని కూడితివి.

"కేశవ నారాయణ కృష్ణ గోవింద ముకుంద
మూసిన ముత్యము వలె మొక్కేము నీకు" (2-365)

ఓ కేశవ నారాయణ కృష్ణ గోవింద ముకుంద మామొక్కులునీకే! నీవు చక్రాయుధుడవు మాకు భయములేదు. లక్ష్మీపతివి. నీవు మా ఏలికవు మాకు సంపదలకు కొరత లేదు. పుట్టించినవాడవు భూధవుడవు, అయిన నీ పాదాలు పట్టిన వాడను. కరిరాజవరదుడవు. నాకోరికలు ఫలించాయి. నీవు గొల్లలకు గోవిందరాజవు గాన మాకు పాడినిండుగ వుంది. నీవు చిరంతన దేవుడవుగాన శ్రీ వేంకటేశ్వర మాకు పరము నిహముగలిగె.

"పసిడిచీర వాడవు పాలుదచ్చితివిగాన
పసిడి బోలినది చేపట్టెను నీకరము" (22-64)

పీతాంబరధారివి నీవుపాలసముద్రము మథించితివిగాన బంగారుతల్లి లక్ష్మి నీ చేయందుకుంది. చందురునితోడ బుట్టినదిగాన చంద్రునిపోలికైనది. చింతామణికి చెల్లెలుగాన మాణిక్యపు దంతములపోలినది (కలిగినది) ఐరావతముతో సైదోదుగాన కరిగమనము గలది, పారిజాతపు భావపుసోదరి కనుక చిగురువంటి పాదాలు గలది. తామర తొట్టెలో తానుండగాన తామెరకన్నులు కలది. ఇన్ని లక్షణములు గల ఆమె వేంకటేశ నీమేన అమరినది.

"నారాయణుడీతడు నరులాల
మీరు శరణనరో మిమ్ముగాచీని" (3-144)

నరులాల! ఇతడు శరణన్న గాచే నారాయణుడు తలచినచోటనే తానుండి తనను

కోరుకున్న వారి అధీనంలో వుంటాడు. మూడు అడుగుల్లో జగమంతకొలిచినవాడు. తన్ను కొలిచిన వారిని ఆదుకుంటాడు. పిలిచిన చోటనే పలికే వాడతాడు.రాక్షసుల చంపి జగాలను రక్షించేవాడు. నమ్మినవారి నేలుతాడు. చూచిన చోటెల్లా సాకారుదుగా వుండి పొగడిన నోటిలోనే వుంటాడు. మనసేవలు గొనే శ్రీవేంకటేశుడే యితడు.

"ఆతడే బ్రహ్మణ్యదైవ మాదిమూలమైనవాడు
ఆతని మానుట లెల్లా నవిధిపూర్వకము" (3-358)

అతడే పరబ్రహ్మం, ఆదిమూలమైన వాడు. అతనిని మరచుట అవిధేయత. పుట్టిన జీవులన్నీ పరమాత్మసంతతే. మాస నక్షత్రనామములన్నీ అతనికి చెందినవే కేశవా నారాయణా మాధవా అనే నామాలతోనే ఆచమనాలు చేస్తారు. చచ్చేటి వారికి సన్యాసులకు నారాయణ నామమేగతి పితృదేవతలకు తర్పణము వదిలినా, సంకల్పము చెప్పినా అతనినామములే. నారదుడు తలచేనామము, గౌరి నుతించేనామము, బ్రహ్మరుద్రులకు తారకమైనదీ బ్రహ్మణ్యదైవము. అతడే వేంకటాద్రిమీద వరములిచ్చే వేంకటేశుడు.

"నిత్యాత్ముడై యుండి నిత్యుడై వెలుగొందు
సత్యాత్ముడైయుండి సత్యమై తానుండు
ప్రత్యక్షమై యుండి బ్రహ్మమై యుండు సం
స్తుత్యుడీ తిరువేంకటాద్రి విభుడు" (1-75)

నిత్యాత్ముడై నిత్యుడై వెలిగేటి వాడు, సత్యాత్ముడై సత్యమై వుండేవాడు, ప్రత్యక్షమైన బ్రహ్మమై శ్రీవేంకటేశుడే స్తుతింపదగినవాడు. అన్నిలోకముల నేలే ప్రభువు, బ్రహ్మాదులచేవేదుక బడేవాడు, మోక్ష మీయగలవాడు సర్వలోకహితుడు. త్రిమూర్తులకు మూలమైన నిజమూర్తి. అతడే వేంకటేశుడు. "ఎవ్వని చేజనించు జగమెవ్వని లోపలనుండు లీనమై ఎవ్వనియందు డిందు" అని పోతన చెప్పినట్లుగా అన్నమయ్యకుడా ఆ భావం వ్యక్తచేశాడు. ఏదేవు దేహమునుండి అన్నియును జనియించి, అందే నణగివుండి సకలంతానేయై సూర్యచంద్రులు నేత్రముగా గలిగి జీవులన్నిటిలో నుండి చైతన్యాధారమై అవ్యక్తుడు, ద్వంద్వాతీతుడైన వాడే శ్రీవేంకటపతి పాదయుగంతో భూమ్యాకాశములను ఆక్రమించి, అనంతుడైన అతని నిశ్వాసమే - మహామారుతము. పుణ్యులంతా ఆయనదాసులే. సర్వేశ్వరుడు, పరమేశుడు, లోకహితుడు అతిసూక్ష్మము, అతిఘనమైన ఆ వేలుపే తిరువేంకటాద్రివిభుడు.

"హరి నీయనుమతో అదినాకర్మమో
పరమే యిహమై భ్రమయించీనీ" (1-433)

ఓహరీ ! నీ అనుమతో లేక నాకర్మమోగాని పరమే యిహమై భ్రమగలుగుతున్నది.

ఎంత చదివినా బుద్ధికి శాంతి కలుగలేదు. ఎన్ని సంపదులున్నా చిత్తంనీపై నిలువదు. ఉపవాసములున్నా వైరాగ్యము కలుగదు. జగమంతా తిరిగిన ముక్తికి ఆనవాలు కనబడదు. వివేకముతో స్వతంత్రత కలిగినా జన్మ విడువదు. శ్రీ వేంకటేశ్వరా ! వదలక నన్నురక్షిస్తున్నావు గనుక బ్రతికిపోయాను.

"నీకే నేశరణు నీవు నన్ను గరుణించు
యీకడ నాకడ దిక్కు యెవరున్నారికను" (4-194)

నీవుతప్ప నాకు దిక్కు ఎవరున్నారు శరణన్న నన్ను కరుణించు. సూర్యచంద్రులే నీ నేత్రములు. శ్రీభూదేవులకు భర్తవు, బ్రహ్మకుతండ్రివి. ఆదివేల్పువు అయిన నీకంటె ఘనులు ఎవరున్నారు. నీ దేహంలోనే దేవతలందరు ఉన్నారు. పాదంతో లోకాలనణచావు, నీకంటె అధికులెవరున్నారు. జీవులకంతా అంతరాత్మవై, పురుషోత్తముడవై, భువనరక్షకుడవై సిరులను వరములను యిచ్చే శ్రీవేంకటేశ! నీవుగాక దిక్కెవరున్నారయ్యా!

"పరమపాతకుడ భవబంధుడ శ్రీ
హరి నినుదలచ నేనరుహుడనా" (1-33)

ఓహరీ! భవబంధాలలో చిక్కుకున్న పరమపాతకుడను నిను తలచను నే నర్హుడనా! అపవిత్రుడను అమంగళుడను, పాపిని, అలసుడను, కపటకలుషిత హృదయముగలవాడను నీ వాడనుటకు అర్హుడనా ! అతిదుష్టుడను దూషితుడను, అవివేకిని, దయలేనివాడను ఓ రమాపతీ! నినుదలచ అర్హుడనా ! అనేక విషయాలలో బంధితుడను, అనంతమైన భయము మోహములో ఆర్తితో వుండేనేను నిన్ను నుతించుటకు అర్హుడనా! వేంకటేశా దీనిని నైచ్యానుసంధానము అంటారు. అన్నమయ్య త్యాగయ్యలాంటి భక్తులు ఎలాంటి దోషాలు లేకపోయినా మనందరి దోషాలను ఆపాదించుకొని స్వామిని వేడుకుంటుంటారు.

"గోవిందగోవింద యని కొలువరె
గోవిందాయని కొలవరె" (10-1- కీ 2)

ఇది చినతిరుమలాచార్యుని సంకీర్తన. వేంకటేశుని నామాలలో గోవింద నామం విలువైనది, ఆనందం కలిగించేది. గోవిందనామం అంటే స్వామికి భక్తులకుకూడా పరవశం కలిగిస్తుంది. అతిసామాన్యులైన గోకులంలో గోపాలురు పిలిచే నామం. ఓ జనులారా ! గోవిందుని కొలవండని హరీ, అచ్యుతా అని ఆడమని పురుషోత్తముని పొగడమనీ, పరమపురుషుని స్మరించమని సిరివరాయని వూరేగండి. పాండవవరదాయని పాడండి. గరుడవాహనుని కొనియాడండి, మాధవునే తలుస్తూ మనంకోరదగిన వాడు కొండలరాయడే ! ఇతడు శ్రీదేవికి భర్తయని తెలుసుకోండి. అనంతుని అందాలు చూడండి.

శ్రీవేంకటనాధుని చేరి పావనులై బ్రతకండని ప్రభోధిస్తున్నాడు.

"నీ దాసులభంగములు నీవు జూతురా
యేదనిచూచేవు నీకు నెచ్చరించవలెనా" (3-266)

సాళ్వనరసింగభూపాలుడు అన్నమయ్యను తనమీదకూడా శృంగారకీర్తన చెప్పమన్నపుడు నిరాకరించాడు అన్నమయ్య. అందుకు కోపించి కఠినశిక్ష విధించాడు రాజు. ఆ ఆవేదనలో పాడినపాట యిది.

నీ దాసుల అవమానములను చూస్తూవూరుకుంటావా? నేను నీకు గుర్తు చేయాలా! పాలసముద్రములో పవళించిన నీకు దేవతలు మొరపెట్టినట్లు నామనవి విన్నవించాను. రక్షించకుండా ఎలానిద్రిస్తున్నావయ్యా! ద్వారకలో నీవు కబుర్లాడే సమయమున ద్రౌపదిమొరపెట్టినట్లు, నేను రాజసభలో అవమానమును పొంది విన్నవించుకున్నాను. పరాకులేక రక్షించవయ్యా! వైకుంఠంలో ఇందిరతో కూడివున్నప్పుడు గజేంద్రుడు మొరపెట్టినట్లు చనవుతో విన్నవించుకున్నాను విని శ్రీవేంకటేశా వేగముగా రక్షించరావయ్యా!

"తొల్లి యేరుపరచిరి దొడ్డవాడు హరియని
యెల్లసందేహాలు బాసె నికనేలచింత " (4-239)

పూర్వమే హరిగొప్పవాడని నిర్ణయించారు గదా! సందేహాలు తొలగిపోయాయి. ఇక చింతంచనవసరము లేదు. నారదుడు శోధించి నారాయణుని తెలుసుకొన్నాడు. శివుడు రాముని తెలుసుకొని చాటాడు. పార్వతి శ్రీరామచంద్రుని శోధించి తెలుసుకున్నది. ఇంక మనం శోధించేది ఏముంది? వేదవ్యాసులు తెలిసే వెదకి విష్ణువని చెప్పాడు. సనకాదులు, శుకుడు తెలిపారు.ఎంతోకాలం వేదాలను తెలుసుకొని పెద్దలైన ఋషులు శ్రీవేంకటేశుని ధనముగా జూపిరి, అతనిచూచి దైవముగా కొలిచాము.

"ఏనోరు వెట్టుక నిన్ను నేమని కావుమందును
నే నిన్నుదలచినది నిముషమూ లేదు" (3 - 60)

నిన్ను ఒక్క నిముషమూ తలచక ఏనోరుపెట్టుకుని రక్షించమని అడిగేది? వయసంతా సంసారంలోనేబడి చేయార నీ సేవచేయ లేదు. కాయమెల్ల కాంతలకు అప్పగించాను కానీ నీకు ఉపయోగపడలేదు. మనసులో ఎన్నోకోరికలతో బతికాను గాని చిత్తశుద్ధిగా నిన్ను ధ్యానించలేదు. నాలుకకు రుచులు తెలిపానుగాని నీకీర్తనను నేర్పలేదు. జన్మమంతా అజ్ఞానముతోనే వున్నాను. నీ గురించి తెలుసుకోలేక పోయాను. అందుకే నిన్ను అడగటానికి భయం కానీ ఓ వేంకటేశా ! ఎట్లామన్నించావయ్యా నన్ను.

"ఏ తపములునేల యేదానములు నేల
శ్రీతరుణీపతి నిత్యసేవే జన్మఫలము" (4-68)

తపములు, దానములు అవసరము లేదు. శ్రీపతినిత్యసేవే జన్మకు సఫలత. దేహములోని ఇంద్రియాలను లోననే అణచిదేహముతోనే తాను దేవుడౌతాడు. బయటకు చూచే చూపులను లోపలకు మళ్ళించి దేవతలను తనలోనేగాంచాలి. శ్వాసను బంధించి తపోధనమును కూడబెట్టి తలపులను తనలోనే లయము చేసి పాపబంధములను లయము చేయాలి సంసారమునందు విషయవిముక్తుడైతే జీవన్ముక్తుడౌతాడు. శ్రీ వేంకటేశుపదములు శరణంటే తాను అనువైన దివ్యపదమును పొందుతాడు.

## II. ఇతరములు

## అన్నమాచార్యునిపై స్తుతి కీర్తనలు

పెదతిరుమలాచార్యులు, చినతిరుమలాచార్యులు అన్నమయ్యమీద రచించిన కొన్ని కీర్తనలున్నాయి. అన్నమయ్య అంతరంగాన్ని ఆవిష్కరించారు వారివంశీకులు

"అన్నామయానీకు సాష్టాంగవందన
మన్నామయా ఓ అన్నమయ్యా"

ఓ అన్నమయ్యా ! నీకు సాష్టాంగవందనములు. నీ వివిధ సంకీర్తనలెన్నోవిని నిన్ను పద కవితా పితామహుడన్నామయ్యా ! నీ మహిమలెన్నోచూచాము. నీ బోధలన్నీ తెలుసుకున్నాము. మురళీరవరూపా ! నీకు సాటిలేరన్నాము. పున్నామయాతనలు పోగొట్టేవరము ఇవ్వమంటున్నాము.

"అప్పనివరప్రసాది అన్నమయ్యా
అప్పసము మాకె కలడన్నమయ్యా" (10-1-23)

స్వామివర ప్రసాదంగా జన్మించిన అన్నమయ్య మాసొంతము. సర్వలోకపాలకుడైన ఆది నారాయణుని తన అంతరంగములో నిలపి సంతసానచెలుపొందే సనకసనందనాదు లంతటివాడు తాళ్ళపాక అన్నమయ్య. కేతనములుగా హరిమీద ఎన్నో సంకీర్తనలములు విన్నపించి వేదార్ధములను తెలిపినాడు, అన్నమయ్య. రామానుజాచార్య మతమును స్వీకరించి, విందు భోజనమువలె శ్రీవేంకటనాధుని మనందరకు ప్రసాదించాడు.

"శరణంటిమాతని సమ్మంధమునజేసి
మరగించి మమునేలి మన్నించవే" (2-24)

సకలవేదములను సంకీర్తనలుజేసి పాడిన పావనుదు, అకలంకుడైన అన్నమాచార్యుని

యేలిన శ్రీవేంకటనిలయా మమ్ముమన్నించు, నారదాదులు, సనకసనందనులవలె అన్నమయ్య స్వామిని కీర్తించాడు శ్రీవేంకటనిలయా! సామవేద సామగాన సప్తస్వరములతో నిన్ను నీసతిని పాడిన అన్నమయ్యను ఎంతో మెచ్చుకున్నావుగద. ఆ సంబంధముతోనే మమ్ముకుదామన్నించవయ్యా !

"హరి యువతారమె ఆతడితడు
పరమ సంకీర్తనఫలములో నిలిపె" (4-192)

అన్నమయ్యను హరి అవతారంగా భావిస్తున్నారు. అన్నమయ్య సంకీర్తనఫలములో పరమును నిలిపాడట. ఉన్నతమహిమలుగల అన్నమయ్య వైకుంఠమున ఆచార్యుని వద్దవున్నాడట. ఆళ్వారుల, తేజముతో నారద సనకాదులతో స్వామిని కీర్తిస్తూ గరుడుని అనంతుని వంటిఘనుల సాహచర్యంలో వున్నాడు అన్నమయ్య. శ్రీవేంకటాద్రిమీద శ్రీపతికొలువులో దేవతలు మునులు జయజయధ్వానాలు చేయుచుండగా కోనేటిదరిని ఆవహించి తిరుగుతున్నాడు అన్నమయ్య.

"ఈతడే ముక్తిదోవ యీతడే మాయాచార్యు
డీతడు గలుగబట్టి ఇందరు బదికిరి" (3-183)

తాళ్ళపాక అన్నమాచార్యులు లోకములో వేదములను చక్కని కీర్తనలుగా మలచి వేంకటేశునెదుట గానముచేసి పావనముచేశాడు. శ్రీ వేంకటనిధియేతానై గొప్ప పురాణముల నన్నిటిని కలిదోషములను పోగొట్టే, పాటలుగాపాడి హరినికీర్తించాడు. శ్రీవేంకటరమణునీ, అలమేల్మంగను కీర్తించిన అన్నమయ్య ముక్తి దోవచూపే ఆచార్యుడై అందరినీ రక్షించాడు.

"హరియవతార మీతడు అన్నమయ్య
అరయ మాగురు డీతడన్నమయ్య" (2-100)

మాగురుడైన అన్నమయ్య హరియవతారమే ! ఊర్ధ్వలోకమున విష్ణుపాదమునందు నిత్యుడైవుండి వైకుంఠనాధునివద్దపాటలు పాడుతున్నాడు. క్షీరాబ్ధిశాయిని సేవిస్తూ సూర్యమండలమున ధీరుడైవున్నాడు. భావించగా శ్రీవేంకటేశుని పాదములందే ఉన్నాడు. అన్నమయ్య.

"దినముద్వాదశి నేడుతీర్థదివసమునీకు
జనకుండ అన్నమాచార్యుడ విచ్చేయవే" (2-151)

బహుళద్వాదశి అన్నమాచార్యుల తీర్థదివసము. ఓతండ్రీ రమ్మని ఆహ్వానిస్తున్నాడు. సూరిజనులైన అనంతుడు, గరుడులతో, నారదాది భాగవతులతో దనుజమర్దనుడైన దైవశిఖామణితో కలిసి, రమ్మని, వైకుంఠమున నుండి ఆళ్వారులతో, నిత్యముక్తులతో, శ్రీకాంతతోకూడిన వేంకటేశుని వెంటబెట్టుకునిరమ్మని, సనకాదులతో కూడి స్వామినికీర్తిస్తూ వేంకటాద్రినుండి శ్రీ వేంకటగిరిలక్ష్మీవిభునితో కలిసి మాయింటికి విందులారగించ రమ్మని

అన్నమయ్యను ఆహ్వానిస్తున్నాడు - అతని కుమారుడు.

సప్తస్వరనిధులలా, సప్తగిరిప్రతినిధులుగా సప్తసాగరగంభీరంగా, సప్తర్షుల ఆశీ:పురస్సరంగా ఏడుకొండలవాని భక్తులైన అన్నమయ్యవంశీకులు భక్తితాత్పర్యంతో ఈ కీర్తనలు రచించి అన్నమయ్యజీవనసరళిని ప్రస్ఫుటంజేశారు.

## గురువు

"గతులన్ని ఖిలమైన కలియుగమందును
గతియితడే చూపెఘన గురుదైవము" (2-372)

కలియుగంలో గతులన్ని నశించినపుడు ఇతడే గతి. ఇతని దయవలన వైష్ణవులమై తిరుమణి ధరించాము. ఇతడే రామానుజులై అష్టాక్షరీ మంత్రదేశమిచ్చారు. వేదరహస్యాలను చూపించి త్రోప ముద్రాధారణాన్ని నిలిపిన మాట్లాడే దైవమే రామానుజులు. వైష్ణవనియమాలు ప్రపన్నుకు ఏర్పాటు చేసిదయ చూపినది ఇతడే అట్టిస్వామీ తల్లి తండ్రి దైవము నీవై మమ్ము దయచూడు.

"ఉన్నతోన్నతుడు ఉడయవరు
ఎన్ననంతుడే ఈ ఉడయవరు" (15-220)

ఈ పాటలో పెదతిరుమలాచార్యులు రామానుజులవారి విశేషగుణాలను కీర్తిస్తున్నారు. గురువుదేవునితో సమానము అంటారు. ఉదయం ఉడయవరు ఇహపరాలకు అధిపతి ఉన్నతోన్నతుడు అనంతుడు అయిన ఉడయవరు సర్వలోక శాస్త్ర రహస్యములను పూర్వపు వేదాంత శాస్త్రములను వెలికి తెచ్చారు. విష్ణుభక్తియే ఎదుట రూపమైనవాడు. సుజ్ఞానమునకు నిలయమయినవాడు మోక్షమే సాకారముగా ఎదుట నిలిచిన ఉడయవరు శ్రీవేంకటేశునికి సాటిగా వున్నాడు.

"చూదుడిందరికి సులభుడు
తోడు నీడగుదొరముని యితడు" (1-117)

అన్నమయ్య గురువు శఠగోపముని. ఈ కీర్తనలో గురుస్తుతి చేయుచున్నాడు. కైవల్యమునకు బంగారు మెట్ల దారివలె, లోకములను కాపాడే జ్ఞాన దీపమై, జగతికి తేజమై, పాపములను తొలగించుటకు భవసాగరములకు నావతానేయైయున్నాడు. కరుణానిధియైన శ్రీరంగనాధునికి, కంచి వరదరాజస్వామికి, అహోబిలనృసింహునకు తత్పరుడైయున్నవాడు ఇతడేశఠగోపమునీంద్రులు.

# మేలుకొలుపులు

తిరుమలలో సుప్రభాతవేళలో స్వామిని మేల్కొల్పుట అనూచానంగా వస్తున్న సంప్రదాయం. బంగారువాకిలితాళపుచెవి (కుంచెకోల)తో సన్నిధిగొల్ల సమాయత్తమైవుండగా, అర్చకస్వాములు 'కౌసల్యా సుప్రజారామా' అని మణవాళ మహాముని రచించిన సుప్రభాతాన్ని గానంచేస్తుండగా, స్వామి దర్శనంకోసం భక్తులు వేచివుండటం ఇప్పటికీ సుందరదృశ్యం. అన్నమయ్యకాలంలో మేలుకొలుపులు ఇలానే సహజంగా సాగివుంటాయి. మేలుకొలుపు పాటలు స్త్రీలుగానంచేయటం మనం చూస్తూవుంటాము. ఆసరళిలో వచ్చిన పదికీర్తనలు పరిశీలిస్తున్నాము.

"మేలుకో శృంగారరాయ మేటి మదన గోపాలా
మేలుకోవే నాపాల మించిన నిధానమా" (15-215)

నాపాలిటి నిధానమా ! శృంగారరాయా ! మదనగోపాలా మేలుకొనవయ్యా ! నీవుగోపికల జవ్వన వనములో తిరిగే మదగజమవు. చంద్రముఖి సత్యభామ హృదయపద్మములోని సుగంధము నాస్వాదించే గండుతుమ్మెదవు. రుక్మిణీదేవి కౌగిలి అనే పంజరంలోని మురిపపు రాచిలుకవు. పదహారువేలమంది మగువల జంట కన్ను కలువలకు హితముగూర్చే చంద్రబింబమవు. కొలనులోని వారి చన్ను కొండలపై వాలిన నీలమేఘమవు. శ్రీసతి నురము నందుంచుకొని వేంకటాద్రి మీదనుండి వరములిచ్చే కల్పవృక్షమవు నీవేస్వామి !

"విన్నపాలు వినవలె వింత వింతలు
పన్నగపు దోమతెర పైకెత్తవేలయ్యా" (6-25)

పలువిధముల విన్నపములను వినేందుకు పన్నగపుదోమతెర తొలగించవయ్యా ! తెల్లవారురుఝుమైంది. దేవతలుమునులు అల్లనల్లన అక్కడాఇక్కడ వచ్చివున్నారు. తామర రేకులవంటి సుకుమారమైన కన్నులను మెల్లమెల్లగా విచ్చిమేలుకొనవయ్యా ! గరుడ, కిన్నెర యక్షకామినులు గుంపులుగుంపులుగా వింత వింత తాళములతో విరహపు గీతములతో అనేక విధములుగా నిన్నూ కీర్తిస్తున్నారు చిత్తగించవయ్యా ! శేషుడు, తుంబుర నారదాదులు,, బ్రహ్మమొదలైనవారు నీపాదములవద్దకు చేరి సమీపముననున్నారు. ఓ వేంకటేశ్వరా ! రెప్పలువిచ్చి అలమేలుమంగనుచూచి యికలేవవయ్యా! అని స్వామిని మేల్కొలుపుతున్నాడు అన్నమయ్య.

"మిన్నక వేసాలుమాని మేలుకోవయ్యా
సన్నల నీయోగనిద్రచాలు మేలుకోవయ్యా" (1-374)

స్వామి ! ఇక నీవేషాలు చాలించి యోగనిద్రనుండి మేలుకొనవయ్యా !పెయ్యదూడలు

ఆవులకోసం అరుస్తున్నాయి. వీటిని వదలి పాలు పితకాలి. ఆవలఈవల పడుచులాటలుమరిగి వచ్చి నీదారికాచుకొని వున్నారు. ఓ గోవిందుడా మేలుకొనవయ్యా ! వాడలలోని గోపకాంతలు నిన్ను ముద్దాడవలెనని గుమికూడివున్నారు. యశోదమ్మ పెరుగువంటకము తెచ్చి పెట్టింది. మేలుకొనవయ్యా ! నందగోపుడు పిలుస్తున్నాడు. శ్రీవేంకటాద్రి మీది బాలకృష్ణ! ఇలమామాటలు విన్నావులే ! ఇకమేలుకొనవయ్యా !

"మేదిని జీవుల గావ మేలుకోవయ్యా
నీదయే మాకెల్ల రక్ష నిద్రమేలుకోవయ్యా" (1-377)

నీదయేమాకురక్ష. భూమి మీది ప్రాణులను కాపాడనుమేలుకోవయ్యా! గోపికల తామరకన్నులువిప్పారాయి. సూర్యనేత్రుడమేలుకో ! రాక్షసులనే చీకటిని పోగొట్టుటకు పరంజ్యోతి మేలుకో ! దురితములనే నల్లకలువలు వికసించాయి. శశివర్ధుడ మేలుకో వేదాలనేపక్షులు పలుకుతున్నాయి. ఆశ్రితపారిజాతమామేలుకో ! వరలక్ష్మి స్తనచక్రవాకము లొండింటి ఒరపిడితో మెరిసే ఓదేవా ! మేలుకో !

"వారిధిశయన వో వటపత్ర పరియంక
గారవాన మేలుకొని కన్నులుతెరవవే" (4-465)

జలధిశయన ! వటపత్రపర్యంక ! ప్రియముగా మేల్కొని కన్నులు తెరవరాదా! యోగులహృదయ కమలములు వికసించిజ్ఞాన సూర్యుడుదయించాడు. జీవాత్మ, పరమాత్మ అనే జక్కవలు కూశాయి. వనజాక్షమేలుకో ! కలుషములనే చీకట్లు తొలగి వేదకీరనాదము నలువంకల వెల్లివిరిసింది. ఇతర ధర్మములనెడి, చుక్కలు మరుగయ్యాయి జలజాక్ష అమ్మ ముఖముచూచిమేల్కొనవయ్యా తండ్రీ !కపట రాక్షసులనెడి కల్హారములు ముడుచుకున్నాయి. సుకర్మములనే ఎండలుకాశాయి. శ్రీవేంకటాద్రీశ ! ఇందిరతో కూడి మమ్ముగావు.

"భోగిశయనమును బుసకొట్టెడిని
యోగనిద్ర పాయును మేల్కొనవే" (1-139)

ఆదిశేషుడు బుసకొడుతున్నాడు. యోగనిద్ర విడిచిమేలుకో ! నీకన్నులు సూర్యచంద్రులు. వెలుగు వెన్నెలలు లేవు. అరుణోదయమిదే మేలుకో. నీ తెలికన్నులు తెరవనందుచే జలజములు విప్పారలేదు. దొంగనిదుర చాలించిమేలుకో. నీవుకన్నులు తెరవకపోతే చీకటితొలగదు. అన్నీ నీవెరుగుదువు గాన మెరుగులు చల్లుతూ మేలుకోవయ్యా !

"పొలయలుక నిద్దురలు భోగించ దొరకొంటి
అలర వడిమేల్కొనవె అఖిలేశ్వర" (6-175)

ఓ అఖిలేశ్వర చిరుఅలకతో నిద్దురకు ఉపక్రమించావా త్వరగా మేలుకో !

పరితాపసూర్యుడు పొడిచేపట్పుటికి చెలికన్నుకలువలు మూసుకున్నాయి. మన్మధబాణాలు అనేతామరలు వికసించాయి. కరుణతో మేల్కొను .కాంతనిట్టూర్పులలో వాయువు, అగ్ని; చెమటల వానలో వరుణుడు కలిసి వింతగా నిన్ను సేవించడానికి వున్నారు. పరమేశ్వరమేలుకో ! మెలత కొప్పుఅనే మేఘమండలములో పూలమాలలు కదలి పూలవానకురిసేటట్లుంది. సర్వేశ్వర! చలము చేయకమేలుకో ! మన్మధుడనే మానసబ్రహ్మశరీరంపై పులకలు సృష్టించగా ఆమెకోపమనే హరుడు సిద్ధంగావున్నాడు. ఓ జలధిశయనా! మేలుకో ! చెవిలో ఉదయరాగం పుట్టగానే కోయల గానాలు మొదలైనాయి. రతిపారవశ్యంలో నీవు ఆమెతో క్రీడించావు. ఇకనైనమేలుకో!

"ఎందాక నిద్ర నీకిదె తెల్ల వారె గదె
ఇందిరారమణ నీవిటు మేలుకొనవే" (2-436)

ఓ ఇందిరారమణా! యింకా ఎంతసేపు నిద్ర. తెల్లవారింది మేలుకో ! గంగాది నదులన్నీ నీస్నానానికి సిద్ధంగా మారాయి. కనకాద్రి తానే సింహాసనమై విచ్చేసింది. నీవాకిట పంచాంగం వినిపించటానికి బ్రహ్మతయారయ్యాడు. అవసరమైనపుడు నిన్ను కొలవడానికి దేవతలు వచ్చి సందడి చేస్తున్నారు. కామధేనువు వచ్చి నిలిచింది. అన్నీనిన్నుకామించి వచ్చాయి. నీ మహిమ ఏమని చెప్పేది !

"మేలుకొనవే నీలమేఘవర్ణుడా
వేళదప్పకుండాను శ్రీవేంకటేశుడా" (15-200)

సూర్యోదయ వేళదాటి పోకుండా ఓమేఘశ్యామామేలుకో! నిద్రతేరటానికి మంచంపై మల్లెలు విసిరారు. కొప్పున చుట్టటానికి మొల్లలు విసిరారు. కంచంలో భోంచేయటానికి కలువలు విసిరారు. శిఖపించము చిక్కు విడివడటానికి సంపెంగలువేశారు. శరీరతాపం తీరటానికి గన్నేరులు, వలపులురేగటానికి విరజాజులు, చలువదనంకోసం జాజులు ఒళ్ళు పులకించటానికి గురువింద పూవులువేశారు. కామోద్దీపనకై గోపికలు తామరలు విసిరారు. చెమటలు ఆరటానికి తులసిని, పన్నీట ముంచిన చేమంతులను వేశారు. వివిధపుష్పాలతో స్వామిని నిదుర లేపటానికి చెలులు చేసిన ప్రయత్నమిది.

"గోవిందా మేల్కొనవయ్యా
కావించిభోగముకదమానీకు" (10-1-57)

ఓ గోవిందా ! నీకు భోగమునకు కొదవా ! మేలుకో! కమలాకాంతబిగికౌగిటిలో సమరతి చల్లదనంతో ఆమెను వదలలేకున్నావు. బ్రహ్మాదులు వాకిటనుంచొని నుతిస్తూవుంటే పడక దిగ లేదు. భూకాంతతో పొందులు మరిగి శ్రమ తెలియకున్నావు, వాసవాదులు

నీవాకిట నిలిచియుండగా ఆమెను వదలేక నీవు అలానే పవళించివున్నావు. నీళాసతితో మన్మధ లీలలలో తేలియాడి వేళ తెలియకున్నావు. దాసులను బ్రతికించేవేళయినది. ఇంకమేలుకో ఇక్కడ శ్రీ భూ, నీళలను ప్రస్తావించడంవిశేషం.

## అభిషేకకీర్తనలు

మేలుకొలుపులు కాగానే స్వామి వారిని మొదటగా సన్నిధిగొల్ల దర్శించుకునే భాగ్యాన్ని స్వామి కల్పించాడు. ఆపైన లఘునివేదనలు, పూజలునిర్వహిస్తారు. ప్రస్తుతం శుక్రవారం మూలవిరాట్టుకు అభిషేకకార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించబడుతోంది. ఆ అభిషేక సమయంలో స్వామివారి సౌందర్యాన్ని అన్నమయ్య (మన పరిశోధనా పరిధిలో) 15 కీర్తనలలో సొబగుగా వర్ణించాడు.

"ఒకపరికొకపరి బయ్యారమై
మొకమునకళవెల్ల మొలచినట్లుండె" (17-485)

స్వామి ముఖవర్చస్సుపై వివిధ కళలు మొలచినట్లు కనిపిస్తున్నాయి. ఆయన శరీరంపై చల్లిన కర్పూరధూళి శరీరమంతా వ్యాపించి శ్రీదేవి వక్షస్థలంపై వుండటం వల్ల ఆకాంతి వెన్నెల దిగబోసినట్లుగా కనిపిస్తోంది. చెక్కులకు పూసిన తట్టుపునుగు రెండువైపులా ప్రవహించింది. కరిగమన విభుడుకావున మోహమదముతొణికిసలాడినట్లుగ కనిపించింది. శరీరంపై ఆభరణాలు అలమేలుమంగతోకూడి మెరుపు, మేఘము కలిసినట్లనిపించింది. ఇది పెదతిరుమలయ్య కీర్తన.

"కంటిశుక్రవారము గడియలేడింట
అంటిఅలమేల్మంగ అండనుండేస్వామిని" (పీఠిక - 31)

అన్నమయ్యనాటికికూడ శుక్రవారపు ఉదయముననే ఏడుగడియల సమయమున స్వామికి అభిషేకం జరిగేది అనడానికి ఈకీర్తన నిదర్శనం. ఆ అభిషేకసంప్రదాయం శు క్రవారంఇప్పటికీ నడుస్తోంది.

శుక్రవారము ఉదయము 7గడియల సమయంలో అలమేలుమంగను ఉరముపై ధరించినస్వామివైభవాన్ని చూశాను. ఆభరణాలన్నీ సడలింపుచేసి మొలకుకొద్దిపాటి వస్త్రమును (గోణము) కట్టి పన్నీట తడిసిన వేస్టువలు తలమొలచుట్టిన ఆనీలమేఘశ్యాముడు కనిపించాడు. పచ్చ కర్పూరాన్ని నూరి బంగారు గిన్నెలలో నింపి శిరసుమొదలు ఒంటి నిండా అద్దినపుడు స్వామి అందరికళ్ళకు నిత్యమల్లెపూవువలెనీటుగా కనపడుతున్నాడు. తట్టుపునుగును వేడిచేసి వెండిపళ్ళాలలో నింపి ఒంటినిండా అద్దిన ఆస్వామి వేడుకతో మురిపాలు పోతున్నాడు.

"సేవింపరోజనులాల చేరిమొక్కరో
భావింప నున్నాడిందరి భాగ్యమువలెను" (20-406)

ఓ జనులార! మన పురాకృతపుణ్యవిశేషమువలన ఆస్వామి అభిషేకవేళ దర్శన మిస్తున్నాడు. చేరిమొక్కండి. జలకమాడిన స్వామి నల్లకలువవలె నిగ్గుదేలివున్నాడు. కప్పురమలదిన స్వామి శరీరము పెద్దవెండికొండవలెవుంది. తట్టుపునుగు అలదినస్వామి ఇంద్రనీలాల గనివలెవున్నాడు. సొమ్ముల నించుకున్నస్వామి, సంపదలకు పుట్టినిల్లువలెవున్నాడు. అలమేలుమంగను మెడగట్టుకున్నస్వామి బంగారు తామరపూవువలెకొలువుతీరివున్నాడు ఆయన దాసులపాలి నిధానము.

"వనితకుపతి కిదెవసంతము
దినదినము నమరెతిరుమలమీద" (20-49)

తిరుమలమీద నిత్యమూ వసంతోత్సవమే. స్వామికి పుప్పొడివసంతము కాంతకు కర్పూరవసంతము. కోనేటివద్ద కుంకుమ పన్నీరుతో నింపిన గంగాళాలలలోని పన్నీరుపైపైన చల్లుకుంటున్నారు. బండ్లపై రాసులుగా పోసిన జవ్వాదిని చతురుడు తీసుకోగా, పొలతిపూలనుతీసుకొని ఒకరిపై ఒకరు నవ్వుతూ విసురుకుంటున్నారు. సమరతులలో తేలియాడేవారిరువురిలో వేంకటపతి గంధము, అలమేలుమంగ కస్తూరి అందుకుని తట్టుపునుగును చిమ్ముతూ ఆడుకుంటున్నారు.

"చూడజూడ నింతలోనే సుక్కరారమునాడు
ఆడనీడవిభవాలే అమరేదేవునికి" (17-526)

శుక్రవారమునాడు ఆదేవునికి అంతటా విభవాలే. కర్పూరముమైనలదిన ఆస్వామిమేను పాలసముద్రపు మీగడలంటడంలవల్లనో, దొంగిలి వెన్నలంటడంవల్లనో ఆకాశగంగ నురుగు అంటడంవల్లనో తెల్లగావుందనిపిస్తోంది. మేనిపై పునుగుపూత నల్లగావుంది. అదిఎలావుందంటే అర్ధరాత్రి వసుదేవుడు చిన్నికృష్ణుని నందవ్రజానికి చేర్చినప్పుడు అంటిన చీకటివలె వుంది. కరిరాజును కాపాడిన సమయంలో ఆమదమంటినట్లుంది. నీలాకాశరంగు అంటినట్లున్నది. సొమ్ములెల్లా ధరించినట్లు స్వామి మేనిపై అలమేలుమంగా తేజప్రభలు వెలుగుతున్నాయి.

"ముగురు వేలుపులకు మూలమీతడు
జిగిమీరినెదుటను సేవించరే" (1-4)

త్రిమూర్తులకు మూల భూతమైన ఈతడు ప్రకాశిస్తున్నాడు. సేవించండి. పన్నీటిబిందెలు అందుకొని స్వామిపై పోయగా, సముద్రముమీద వానకురిసినట్లు ఆయన ఉప్పొంగుతున్నాడు. పచ్చకర్పూరము మేనిపై మెత్తగా పున్నమి చంద్రునివలెవున్నాడు. తట్టుపునుగు పూయగా

కల్పతరువు నీడవలె వున్నాడు. సొములన్నీధరించి పంచవన్నెల సంపదవలె వున్నాడు. ఇన్నిరకాలసొబగులతో అతడుపుణ్యాలకు గురియైనాడు.

"దేవదుందుభులతోడ తేటతెల్లమైనాడు
సేవించరో యిదే వీడే సింగార దేవుడు" (3-125)

దేవదుందుభులమ్రోతతో తేటతెల్లమైన సింగారదేవుని సేవించండి. బంగారుమేడలలో పన్నీటిస్నానమాడి తడితుడుచుకున్నదేవుడు పులుగడిగిన ముత్యమువలె రాజసముతో వున్నాడుకొండవంటి దేవుడు. కాంతివంతమైన మాణిక్యపు తోరణములక్రింద కప్పురము అలదుకున్న సంపదల సరిలేని ఆదేవుడు అమృతము పోగైనట్లున్నాడు. తట్టుపునుగు పూసుకొని సొమ్ములన్నీధరించి అలమేలుమంగపతియైన శ్రీవేంకటాద్రిదేవుడు నమ్మినవారికి నిధానమైవున్నాడు.

"నానారూపధరుడు నారాయణుడు వీడె
పూనిన ఉపమలెల్లా బొసగె నితనికి" (17-503)

వానాకాలమున ఏరులన్నీ సముద్రమును కలిసినట్లు, పురుషసూక్తముతో విప్రులు చేసే మజ్జనము పన్నీరై శ్రీహరికి అమరింది. తెల్లమబ్బులు ఆకాశమున నిండినట్లు శరీరమున కప్పురపుకాపు నిండినది. తన విష్ణుమాయ బంటిపై వాలినట్లు తట్టుపునుగు దేవదేవునికి అమరింది. నిలువున సంపదలన్నీరూపు దాల్చినట్లు, సొమ్ములపెట్టెతెరిచినట్లు అలమేలుమంగ శృంగారాలతో శ్రీవేంకటేశుని ఉరమున నెలకొన్నది. నానారూపములను ధరించిన నారాయణునికి ఉపమలన్నీ అతనికేసరి.

"భావించి చూడరే పడతులాల
అచేవదేరి మహిమలు చెలగినట్లుండెను" (23-154)

భావించి చూడగా మహిమలన్నీ చెలరేగినట్లున్నాయి. పరమపురుషుని పచ్చకర్పురపు కాపు తిరుమేన తెల్లనికాంతి వెదజల్లుతున్నది. పాలజలధి మథించునపుడు తుంపరలు ముంచినట్లున్నది. ఈదేవుని తట్టుపునుగుకాపు శరీరంపై నల్లనికాంతిగా మెరసింది. గోవర్ధనమెత్తినపుడు నిండినమేఘకాంతులు తొణికినట్లున్నాయి. శ్రీవేంకటేశునిసింగారించిన సొమ్ములు మేనిపై బంగారుకాంతి గలిగి భావించగా అలమేలుమంగస్వామి ఉరమున వున్నందున సంపదలెల్లా వెల్లివిరిసినట్లున్నది.

"కోటిమన్మథకార గోవిందకృష్ణ
పాటించిన నీ మహిమలే పరబ్రహ్మము" (2-280)

ఓ నవకోటిమన్మథాకారా ! నీమహిమలే ఆపరబ్రహ్మము. ఆకాశమువంటిమేను నీదిగాన

నీకు ఆకాశజలాలతో అభిషేకం చేస్తున్నాను. నీవునీలమేఘశ్యాముడవు. కాబట్టిమేఘపుష్పాలే పన్నీరుజల్లాలు. నీమనసులో చంద్రుడు జన్మించాడు కనుక వెన్నెలలు కప్పురపు కాపు అయినాయి. ఇంద్రనీలపు కనులు కలవాడవుగాన ఆమె చూపులు తట్టుపునుగు అయింది. నీవులక్ష్మీపతివిగాన నీ ఉరస్థలిపై అలమేలుమంగ తాళిఅయింది. నీవు చుక్కల పొడవుగాగ నక్షత్రాలే హారాలయినాయి.

"చూడరమ్మ ఇదె నేడు సుక్కురారము
వేడుక చక్కదనాల వేవేలయినాడు" (17-498)

శుక్రవారమునాడు స్వామి వేవేలచక్కదనాలతో వేడుకగా వున్నాడు. చూడరండి. ఆదినారాయణుని వలె పన్నీటిమజ్జనము చేసి ఆపైన పులుగడిగిన ముత్యమువలె కర్పూరము అలదుకున్నాడు. కాలమేఘమువలె తట్టుపునుగు అద్దుకున్నాడు. పదారువన్నెల బంగారంతో సమానంగా వంటినిండా ఆభరణాలు ధరించాడు. సంపదలకు యిల్లువలె ఉరముపై అలమేలుమంగను ధరించినాడు. దొంతరకొండవలె వేంకటాద్రిపైనిలిచాడు.

"బంగారు మేడలోన పరమాత్ముడువాడే
సింగారాలు మీద మీద సేయరే చెలులు" (23-330)

ఓ చెలులారా ! బంగారుమేడలోని పరమాత్మునికి సింగారములు చేయండి. కస్తూరితో కలిపినతట్టుపుణుగుల నూనెబంటినిండా రాచుకొని పన్నీట మజ్జనమాడిన స్వామికి వెట్టతీరేటట్టుగా చెలులారా విసరండి. కర్పూరము గందవొడి వంటినిండా మెత్తుకొని కొప్పు దువ్వి ముడిచి సొమ్ములెల్లా ధరించిన స్వామికి దప్పికతీర తాంబూలమివ్వండి. అలమేలుమంగను నురమందుంచుకొని తులసిమాలలు ధరించి ఆరగించి కొలువుదీరిన శ్రీవేంకటేశ్వరునికి మోహాలు గుప్పించండి.

"ఎన్నిమహిమలవాడె యీదేవుడు
కన్నులపండువులెల్లా గదిసినట్టుండెను" (4-177)

ఇన్నిమహిమల యీదేవుని చూచుటకు కన్నులపండువగా వుంది. పాలజలనిధిలో పవళించినందున మేనికి అంటిన మీగడవలె పురుషోత్తముని కప్పురకాపువుంది. రేపల్లెలో చీకటితప్పుచేయగా రాత్రులు మేననంటినట్టు దైవశిఖామణికి తట్టుపునుగు కాపువుంది. కలిమిగల లక్ష్మీదేవి కౌగిట బెనగగా నిలువెల్ల సిరులు నిండినట్లుగ శ్రీ వేంకటేశుడు ధరించిన సొమ్ములువున్నాయి.

"నేడెసుక్కురారము నెలతలాల
పోడిమిసేయరే పుణుగుకాపు" (8-153)

నెలతలాల ! ఈరోజు శుక్రవారము. పుణుగుకాపు చేయండి. కొండవంటి శ్రీహరి మీద పన్నీటికాలువలు జాలువారుతున్నాయి. అభిషేకమంత్రాలు చెప్తున్నారు వినండి. కర్పూర ధూళి రాలుతున్నది చూడండి. నీల మేఘమువంటి ఈ నీరజాక్షునిపై తట్టుపునుగుకాపుఅదిగో. అలమేలుమంగతో కూడి హారాలు ధరించి, పలువిందులారగించిన వేంకటేశునికి తాంబూలాలు ఇవ్వండి శేషాద్రిపతికి తట్టుపునుగుకాపు చేయండి! చెలులార!

## నామమహిమ

నవవిధభక్తులలో సంకీర్తనం ప్రశస్తం. ప్రత్యేకించి కలియుగంలో మానవులకు నామసంకీర్తనమే ప్రాశస్త్యం. ఈ ఉద్దేశంతో అన్నమయ్య తన కీర్తనలలో అక్కడక్కడా సందర్భోచితంగా చెప్పిన నామమహిమకీర్తనలను ఒకచోట గుదిగ్రుచ్చిమాలగా అమర్చే ప్రయత్నిమిది. ఇహపరసాధనమైన నామసంకీర్తన చేసి మునులు, ఋషులు, తపస్వులు తమజన్మ చరితార్థం చేసుకొన్నారు.

"ఇదియేసాధన మిహపరములకును
పదిలము మాపాలి పరమపు నామం" (4-384)

మాకు ఇహపరములకు సాధనమైనది స్వామినామమే ! కలిదోషహరముకైవల్యకరము శ్రీహరినామము. సులభము, సౌఖ్యము, శోభనతిలకము శ్రీపతినామము, పాపనాశనము బంధమోక్షము. భూపతినామము సర్వరక్షకము, నిధానము, వెలిలేనిది, మాధవనామము నియమనిష్టలు, నిత్య కర్మము ఇదే గోవిందునినామం. శ్రీవేంకటేశ్వరు నామమే మాకు బంగారము శరణ్యము కూడా.

"నీనామమేమాకు నిధియు నిధానము
నీనామమే యాత్మనిధానాంజనము" (4-425)

అన్నమయ్య ఈకీర్తనలో కేశవాది నామమంత్రములను మనకు అందించాడు. కేశవ, నారాయణ, మాధవ, గోవింద, మధుసూదన, త్రివిక్రమ, శ్రీధర, హృషీకేశ, పద్మనాభ, దామోదర, సంకర్షణ, వాసుదేవ, ప్రద్యుమ్న, అనిరుద్ధ, పురుషోత్తమ, అధోక్షజ, నారసింహా, అచ్చుత, జనార్ధన, ఉపేంద్ర, శ్రీకృష్ణా! శ్రీవేంకటేశా! నీనామములేమాకు నిదియు నిధానము, ఆత్మనుతెలుసుకోగలిగే అంజనముకూడా నీ నామమే.

"చాలాదా హరినామ సౌఖ్యామృతముదమకు
చాలదా హితవైన చవులెల్ల నొసగ" (1-52)

రామదాసు శ్రీరామ! నీనామమేమిరుచిరా ..... పాలమీగడల కన్నపంచదార

చిలకలకన్న అన్నాడు. హితవైన రుచులుగల హరినామ సౌఖ్యామృతముచాలదా అంటున్నాడు అన్నమయ్య. జన్మజన్మ బంధములను విడిపించుటకు ఒక్కహరినామ నామము చాలదా? పదివేల నరకకూపముల నుండి బయట పడవేయుటకు మంత్రమే చాలు. మన దారిద్ర్యము తొలగుటకు హరినామమనే బంగారుకొండ చాలును. కలుషంపుకటికీ చీకటినిపారద్రోలుటకు హరినామ దీపమేచాలు. వేంకటేశుకీర్తనే ఈ జగములో కల్పవృక్షమువలె నుండగా ఆనందముతో ఉన్నతముగా వుండుటకు స్వామి యొక్క దాసుల కరుణే చాలు.

"ఆకటివేళల అలపైనవేళలను
తేకువ హరినామమే దిక్కు మఱిలేదు" (1-158)

ఆకలి కలిగినప్పుడు, శ్రమకులోనైనప్పుడు, ధైర్యము చేకూర్చిరక్షించునది శ్రీహరినామ మొక్కటే. అదితప్ప మరొకదిక్కులేదు. ఎందుకు కొఱగాని దుస్థితి ఏర్పడినప్పుడు, కులము చెడినప్పుడు ఇతరులచే చెరలో బంధింపబడి కృశించునప్పుడు, ప్రకాశమైన హరినామ మొక్కటే గతి. దానిని మరచినచోమరొక గతిలేదు. ఆపద కలిగినప్పుడు, నిందకులోనైనప్పుడు, పాపముపైకొన్నప్పుడు, భయపడినప్పుడు చాలినంతగా స్మరింపబడిన హరినామ మొక్కటేగతి. దానిని విడచి కడవరకు ప్రత్నించినను ఆదుర్దశలనుండి కాపాడుటకు మరొకమార్గములేదు. సంకెళ్ళతో బంధించినప్పుడు, ఉగ్రతీతకు బిలిచినప్పుడు, అప్పులవారు అడ్డగించి నిలదీసినప్పుడు, విడిపించుటకు శ్రీవేంకటేశ్వరుని నామ మొక్కటేఉపాయము. దానిని వదలి మూర్ఖత్వముతో ఎంత ప్రయత్నించినను మరొకదారి లేనేలేదు.

"సకల సంగ్రహము సకలసంచయము
అకృతసుకృత మిది హరినామం" (1-349)

చక్కగా గ్రహించబడినది. కూడబెట్టబడినది. సర్వపుణ్యాలఫలము ఈహరినామమే. సకలవేదాలసారము, మంత్రరాజము, సకలపురాణసారము పావనమైనది, కుటిలత లేనిది హరినామము మాత్రమే. సకలతత్వాలలోని సంశయములను తొలగించునది, నిశ్చయింపబడినకర్మ ఇదే. సకలవిధులలోని రహస్యముఇదే. హితముకూర్చునది, సకలదేవతలకు ప్రీతికరమైనది. సకల లోకములను రక్షించునది, సకలసంపద అయిన వేంకటపతి నామాంకితమైనది హరినామమే.

"నళినాక్ష ! నీకు నమస్కరించిన
ఫలము పొగడనిక బ్రహ్మకు వశమా" (3-131)

"నళినాక్ష ! నీకు నమస్కరించిన ఫలము తెల్పబ్రహ్మకైనా వశముగాదు పూర్వదోషములు పోగొట్టి సర్వ అపచారములను క్షమించి గర్వము మదములను అణచి నన్ను రక్షించింది

నీనామమే ! నేడు చేసిన నేరములను అణచి ప్రస్తుత కర్మలనుండి విడిపించి వాడియైన దు:ఖములే పరిహరించినది నీనామము, సుఖపరంపరను కలిగించి, జయములను కూర్చి ఓవేంకటేశ్వరా ! నీనామమే రక్షించింది.

"సోదించి రిదియె సురలును మునులును
ఆదికి ననాది హరినామము" (4-334)

సురులుమునులు పరిశోధించి హరినామమునకు మొదలు అనేది లేదు అని తెలియజేశారు. వేదశాస్త్రసంగ్రహము, దురితహరము, భవహరము, దు:ఖనాశము, శత్రువులకు భయంకరమైనది ఈహరినామము. సకలపుణ్యసారము, కళంకములేనిది, ప్రకటితమైనది, సులభము పరమపావనము, కుటిలతలేనిది ఈహరినామము. ఘనమైనది, కైవల్యపదము శ్రీవేంకటేశ్వరునికరుణకు పాత్రమైనది హరినామము.

"ఇహపరసాధనమిదియొకటే
సహజపు మురారి సంకీర్తన నొకటే" (4-16)

సహజమైన మురారి సంకీర్తనొకటే ఇహపర సాధనము. భవసాగరమును దాటించే నావ, భువిలో అజ్ఞానమును పారద్రోలేది, ఆశాపాశములకు కొడవలివంటిది. అదే నవనీత చోర్ణునినామము. చింతఅనేచీకటి పారద్రోలే సూర్యుడు దరిద్రమును హరించే నిధి. మరణభయము నాశనము చేసే మంత్రము. అతిశయించిన దు:ఖములకు సంజీవని. పంచేద్రియములకు అంకుశము వంటిది. శ్రీవేంకటేశుదాసులకు మురారి సంకీర్తనమే సాధనము.

"హరినామమేకదు ఆనందకరము
మరుగవో మరుగవో మరుగవో మనసా" (4-409)

ఓమనసా ! ఆనందకరమైన హరినామమును స్మరించడం అలవాటుచేసుకో! నళినాక్షుని శ్రీనామము కలిదోషములను హరిస్తుంది. కైవల్యము నిస్తుంది. ఫలసారము బంధవిమోచనము. అందువల్ల ఓమనసా! తలచుము.నగధరుని నామము నరకమును పోగొడుతుంది. జగత్తుకువేల్లు చేస్తుంది. అందరికి నమ్మతమైనది.నగుణ నిర్గుణరూపాలను సాక్షాత్కరింపజేస్తుంది. అట్టిహరిపొగడుముమనసా ! శ్రీవేంకటపతినామము సంపత్కరము, సుఖదాయకము. అందువల్ల నామమును అనుసరించుమని అన్నమయ్య మనసును హెచ్చరిస్తున్నాడు.

"నారాయణ నీనామమె గతియిక
కోరికలు నాకు కొనసాగుటకు" (4-388)

నారాయణ నాకోరికలుతీరుటకు నీనామమేగతి. ముందున్నది భవసాగరము. వెనుకనే దు:ఖసాగరము. చాపల్యము నడుమ సంసారజలధి. వీటిన్నిటిని దాటుటకు సాధనము నీనామమనే నావవొకటే ! ఎడమవైపుపాపపురాశి, కుడివైపున పుణ్యపురాశి రెండింటినడుమ సత్యము, రజస్సు, తమస్సు అనెడి త్రిగుణరాశి అనుభవించి నిలకడలేకుండావుంది. క్రిందిలోకములు నరకములు, మీదివిస్వర్గాలు. అంతరాత్మవైన శ్రీవేంకటేశ! నీయందే పరమపదము (మోక్షము). మరొకచోటలేదు.

"ఇన్నిటా నింతటా నిరవొకటే
వెన్నుని నామమే వేదంబాయె" (4-314)

అన్నింటిలో సాధనమొకటే. అదే వేదమైన విష్ణునామము. నళినాక్షుని నామసంకీర్తనమొకటే భజించిన పుణ్యులకు సంజీవని. దురితహరుడైన గోవర్ధనధరుడే నారాయణుడని నమ్మగలిగి, ధీరులు అచ్యుతగోవింద అని తలచుట ఒకటే మార్గము. గరుడధ్వజుని సుఖప్రదమైన నామము నరులకెల్లా ప్రాణమేఅయినది. తిరువేంకటనాధుని నామమే ధరలో ఆధారము.

## "నమోనమో"

"నమోనారాయణాయ నమ:
సమధికానందాయ సర్వేశ్వరాయ" (1-245)

సమధికానందుడు సర్వేశ్వరుడు అయిన ఆనారాయణునికి నమస్కారము. భూదేవి యొక్క కొండలవంటిస్తనములను కౌగలించుకున్నందువలన కలిగిన పరిమళశ్రమజలంతో ఆనందిస్తున్నవానికి నమస్కారం. కమలవాసినివి సేవించుకునే సకలాత్మకుని చరణములకు నమస్కారములు. సత్యభామ ముఖముపై పత్రవల్లికలను రచించడంలో నిపుణుడై, కాత్యాయినీస్తుతుల నందుకునే, ప్రత్యక్ష పరబ్రహ్మస్వరూపునికి నమస్కారము. దేవతాధిపుల కిరీటముల దివ్యరత్నములచే సంభావించబడుతున్న పాదపద్మములు గలిగి కైవల్యము అనే కాంతను పొందిన శ్రీ వేంకటాచలశ్రీనివాసునికి నమస్సులు.

"నారాయణతే నమోనమో
నారదసన్నుతనమోనమో" (4-32)

నారదునిచే స్తుతింపబడుతున్న నారాయణునికి అనేకనమస్సులు. మురహరుడు. భవహరుడు, ముకుందుడు, మాధవుడు, గరుడగమనుడు, పంకజనాభుడు, పరమపురుషుడు, భవబంధ విమోచనుడయిన నరమృగశరీరునికి నమస్కారములు. జలధిశాయి, రవిచంద్ర

లోచనుడు, బ్రహ్మచే కీర్తించబడే చరణములుగలవాడు, బలినిపాతాళమున బంధించినవాడు, గోపవధూవల్లభుడు, పద్మనాభుడైన స్వామికి నమస్కారములు. ఆదిదేవుడు, వేదములచే స్తుతింపబడువాడు. యాదవకులమున మోహనరూపుడు, వేదములచేస్తులింపబడువాడు, యాదవకులమున మోహనరూపుడు, వేదములను ఉద్ధరించినవాడు, నాదప్రియుడైన వేంకటపతికి నమస్కారములు.

"నారాయణాయ నమో నమో నానాత్మనే నమోనమో
యీరచనలనే ఎవ్వరు దలచిన యిహపరమంత్రము లందరికీ" (1-380)

అన్నమయ్యఈకీర్తనలో సర్వాత్మకుడైన నారాయణుని నామమంత్రములను మనకందిస్తున్నాడు. గోవిందా, గోపాలా, భావజగురుదా!, ప్రణవాత్మకా, దేవా, దివ్యగుణా, దామోదరా ధరణీశా, శ్రీపతీ, శిష్టరక్షకా, వామనా, పుండరీకాక్ష, పరిపూర్ణా, ప్రణవాగ్రా, నరకధ్వంసీ, నరసింహా అని నానానామములు ఇహపర సాధకమైనమంత్రములు !

"కందర్పజనక గరుడ గమన
నందగోపాత్మజ నమోనమో" (4-5 అనుబంధం)

మదనజనకుడు, గరుడగమనుడైన నందుని కుమారునకు నమస్కారములు. జలధిశయన, వామన, శ్రీధర, నారసింహ, కృష్ణ, పద్మనాభ, హరి నిగమగోచరుడైన నారాయణునికి నమస్కారములు, పరమపురుషుడు, భవవిమోచనుడు, వరములను ఇచ్చు భూదేవిభర్త, కరుణాకాంతుడు, కాళిందీరమణుడు, నరసఖుడు, అయిన శౌరికి నమస్కారములు. దానవదమనుడు, దామోదరుడు, రవిశశినయనుడు బలదేవుని అనుజుడు (శ్రీకృష్ణుడు)నానాగుణమయుడైన దీనరక్షకుడైన శ్రీతిరువేంకటేశునికి నమస్కారములు.

"ఆహానమోనమో ఆదిపురుషనీకు
యీహల నేనెంతవాడ నెట్టుగాచితివి" (4-97)

ఆదిపురుషా ! నీకు నమస్కారములు అల్పుడనైన నన్నుఎట్లారక్షించావయ్యా ! లోకములన్ననిటిని నీలో ఇముడ్చుకున్నవాడవు ఇక్కడ నాఆత్మలో ఎట్లా అణగివున్నావయ్యా ! వేదములకు అగోచరుడవు ఈనామములో ఎట్లా అణిగి వున్నావయ్యా! బ్రహ్మాదులు చేసే యజ్ఞములకు భోక్తవైన నీవు అన్నపానములు ఎట్లా ఆరగించావయ్యా! పరిపూర్ణుడవైన నీవు నాపుట్టుకలో ఎలాగున్నావయ్యా! దేవతలచే పూజలందుకొనే నీవు నాపూజలెట్లా అందుకున్నావు ? శ్రీదేవితో గూడి వేంకటాద్రిమీద వుండేస్వామివి నాయింట ఎట్లానిలిచావయ్యా !

"గరుడగమన గరుడధ్వజ
నరహరినమో నమోనమో" (2-391)

గరుడగమనుడవు, గరుడధ్వజుడవు అయిన నరహరీ! నమస్సుమాంజలులు. కమలాపతి, పద్మనాభ, పద్మావతీ జననకారకా ! పద్మనేత్ర, సూర్యవంశమువాడవైన హరీ ! నమోనమో,. జలధిబంధించినవాడ, జలధిశాయీ! జలధిమధ్యనున్నవాడా, సముద్రునికి అల్లుడా. సాగరగంభీరుడా హలధరుడైన హరీ! నమోవాకములు దివ్యరూపముతో మహిమలుగల నీలమేఘశరీరుడైన శ్రీవేంకటాధిపుడు అనఘుడు. సరిలేని ఆ హరికి నమస్కారములు.

"జడమతిరహం కర్మజంతురేకోహం

జడధినిలయాయ నమో సారసాక్షాయ" (1-481)

నేనుజడమతిని, కర్మలకు బద్ధుడనైన జంతువును ఓసారసాక్షా! సముద్రనిలయా! నమస్కారము. సింధురహితుడు, పరమపురుషుడు, భక్తసులభుడు, దురితదూరుడు, నరకుని అంతముచేసినవాడు, మురహరుడైన నారాయణునికి నమస్కారములు ! నందగోపసుతుడై గోవర్ధనమెత్తినవాడు, జగదంతరాత్ముడు, సగుణుడు నరమృగశరీరుడు, పన్నగశయనుడైన బ్రహ్మాండనాయకునికి నమస్కారములు. దేవదేవుడు, దివ్యచరితుడు, భావనాతీతుడు పరమేతానైనవాడు, దైత్యాంతకుడు, భూవల్లభుడు, పూర్ణకాముడైన శ్రీవేంకటేశునికి నమస్సులు.

"శ్రీహరినిత్యశేషగిరీశ

మోహనాకార ముకుందనమోనమో శ్రీహరి" (3-527)

నిత్యశేషగిరీశుడవు, మోహనాకారుడవు, ముకుందుడవైన శ్రీహరీ ! నీకు నమస్కారములు. దేవకీసుతుడవైన దేవదేవ, వామన, గోవిందా! గోపగోపీనాథ, గోవర్ధనధర, గోకులపాలక దేవేశా! ఓశ్రీహరి నమస్కారములు. వామనకృష్ణ వాసుదేవా ! రామనారాయణ, విష్ణు దామోదర శ్రీధర ఓశ్రీహరి వందనములు, పురుషోత్తమ, పుండరీకాక్ష, గరుడధ్వజ, కరుణానిధి, శ్రీహరి, చిరంతన, అచ్యుత, నారసింహా శ్రీవేంకటేశ ! నీకు వందనములు

"నవనీతచోర నమోనమో

నవమహిమార్ణవ నమోనమో" (3-24)

నవమహిమార్ణవ నవనీతచోరా ! నమోనమో ! హరి, నారాయణ, కేశవా, అచ్యుత, శ్రీకృష్ణనరసింహా, వామన, మురహర పద్మనాభ ముకుంద గోవింద నరనారాయణరూప నమోనమో నిగమగోచర (నిగమాలతో తెలుసుకోబడేవాడు), విష్ణు(సర్వవ్యాపకుడు) నీరజాక్ష (పద్మముల వంటికన్నులుగలవాడు) త్రిగుణాతీత (సత్వరజస్తమోగుణాలకు అతీతుడు, త్రివిక్రముడు (మూడులోకాలను అధిగమించినవాడు) ద్వారకాధిపతీ నీకు వందనములు! రుక్మిణీవల్లభుడు, చక్రమును ధరించినవాడు. నాకేశవందిత (స్వర్గాధిపతి ఇంద్రుని

చేతపూజింపబడేవాడు) నాకజననుత (దేవతలచే నుతింపబడువాడు) శ్రీకరమైన గుణములచే సంపన్నుడా శ్రీవేంకటేశ్వర! నమస్కారములు.

"ఆదిదేవపరమాతుమా
వేదవేదాంతవేద్యనమోనమో" (1-289)

ఆదిదేవుడవు పరమాత్ముడవు వేదవేదాంత వేద్యుడవవునీకు నమస్కారములు చరాచరజగత్తునకు తండ్రివినీవే. పరాత్పరుడవు భక్తుల భవరోగనివారకుడవునీవే. గదాధరుడవు, సదానందుడవు ప్రసన్నుడవైన ఓ వేంకటగిరి నిలయా నమోనమో !

"నరసింహ రామకృష్ణ నమో శ్రీవేంకటేశ
సరుగ నాశత్రువుల సంహరించవే " (4-454)

నరసింహ! రామకృష్ణ శ్రీవేంకటేశ నమస్కరిస్తున్నాను. నాశత్రువులను సంహరించ వయ్యా. బావ తిట్లకే కోపపడి శిశుపాలుని చంపిన కోపిష్టివాడవు ఇపుడు ఎందుబోయితివి. నీదాసుడనిని నిన్ను నిందించే శత్రువును సంహరించరాదా ! నీదాసుని భంగపరచినపుడు కశ్యపుని చంపిన నీకోపము ఎలా పోయింది. నీలాంఛనములు ధరించిన నన్ను దూషించే శత్రువును సంహరించుము. అసత్యములతో గూబయిల్లు ఆక్రమించిన గద్దజంపిన కోపకాడవు ఎందుబోతివి. శ్రీ వేంకటేశ ! నీమీది పాటలను దూషించు శత్రువులను సంహరించుమయ్యా!

"నమో నారాయణ నా విన్నపమిదివో
సమానుడగాను నీకు సర్వేశ రక్షించవే" (3-199)

ఓనారాయణా ! నావిన్నపము ఇదిగో ! నీకు సరిసమానుడనుగాను. అయినా సర్వేశ్వరా ! నన్నురక్షించు. నా మనసున అధీనము. మాటలు నీవు పలికించేవే! నీవు పుట్టించిన ధనమే తనువు. ఇవన్నీ నీవనుగ్రహించినవే. మరలానాపైనేరాలువేయక నన్ను రక్షించు. ఈ భోగములు బుద్ధులు అన్నీ నీవిచ్చినవే. ఈ విధంగా నాబ్రతుకే నీదయ. నేను నీవుచేసిన మనిషిని. నాఅజ్ఞానమును లెక్కపెట్టుక రక్షించు. నాలోపల వెలుపల నీవేవున్నావు. వేడుక తెల్లానీవే. శ్రీ వేంకటేశ ! కరుణతో నీవేలుకో బంటును నేను, నీదరినుంచుకొని రక్షించుము.

"దేవ నమోదేవా
పావనగుణగణభావా" (2-377)

పావనగుణనిధివైన దేవ నీకు నమస్కారములు. జగదాకారచతుర్భుజుడవు ఆకాశమువంటి నీలమేఘశ్యాముడవు, నిగమపాదయుగపద్మనాభ, అతిశయ లావణ్యాననా ! వేదనుతుడవు. బంగారు శంఖచక్రములను చేతులలో ధరించినవాడవు, రవిచంద్రులు

నే(త్రములుగ గలవాడవు సూర్యబింబము వంటి సాటిలేని అధరముగలవాడవు. మదన జనకుడువు, (బహ్మతం(డివి, శ్రీదేవిపతివి, శ్రీవేంకటగిరి విహారివైన నీకునమస్కారములు.

## నామమే ఔషధము

"కొనరో కొనరో మీరు కూరిమిమందు

వునికి మనికి కెల్ల నొక్కటే మందు ( 1-237)

మనమనుగడకు (ప్రశస్తమైన మందు ఒకటే, దానిని మీరు కొనండి ! ధ్రువుడు, (ప్రహ్లాదుడు తీసుకొన్న చల్లనిమందు, భవరోగములు పోగొడుతుందని పెద్దలు నిశ్చయించినమందు, నారదుడు, జనకుడు స్వీకరించి (బతికినమందు, నాలుగు యుగములందు గొప్ప గొప్ప రాజులు కలకాలముతీసుకొని కడపటిదైన మోక్షమును పొందిన మందు, (బహ్మకు మిక్కిలి ఆయువునిచ్చిన మందు, లోకములెల్లనిండినమందు, మూడులోకములవారికి తెలిసేటట్లు తిరువేంకటా(ద్రిపై కోనేటి దరిని ధ్వజమెత్తినట్లున్న మందేఈవేంకటేశుడు.

"అన్నిటికి నిది పరమౌషధము

వెన్నుని నామమే విమలౌషధము" (4-358)

విష్ణునినామమే అన్నింటికి (శేష్ఠమైన, నిర్మలమైన ఔషధము. చిత్తశాంతికి, భవబంధ విమోచనమునకు, చిత్తజగురుడైన శ్రీపతినామమే సిద్ధౌషధము. రకరకములభవ రోగములకు హరిపాదజలమే ఔషధము. దురితకర్మములు తొలగిపోవుటకు మురహరుని పూజయే ముఖ్యమైన ఔషధము. భువిపై ఇహపరములకు ఇందిరా రమణుని భజన ఒకటే ఔషధము. శ్రీవేంకటపతి శరణనుటే మాకు నిత్యౌషధము.

"సకల జీవులకెల్ల సంజీవి యీమందు

వెకలులై యిందరు సేవించరోయీమందు" (1-468)

జీవులందరికి ఈమందు సంజీవి వంటిది. అందరుఈమందును సేవించండి. (తిలోకములను మించి పెరిగిన నల్లనికాంతిగల ఔషధమిది. శేషా(ద్రిపై చతుర్భుజరూపుడైన ఆస్వామి రూపంలో వున్న మందుయిది. పదివేలు పడగల ఆదిశేషుని నీడలో ఉరముపై శ్రీకాంత స్థిరముగా నిలుచుండగా వేదశా(స్త్రములను పునీతముచేయు అంజనా(ద్రిపై వున్న గరుడమందుయిది. శంఖచ(క్రములు రక్షగా నిలువగా తత్వబోధకమై (బహ్మరు(ద్రాదులను సృష్టించినది ఈ వేంకటా(ద్రిమందు.

## పుష్పయాగం

"పూవుబోణులకొలువేపుష్పయాగము
పూనకపూచె నీకిట్టె పుష్పయాగము" (7-60)

తిరుమలేశునికి సంవత్సరమునకొకమారు పుష్పయాగం ఘనంగా నిర్వహిస్తారు.

కనులపండువుగా జరిగే ఆ పుష్పయాగము కార్తీకమాసమున ముందురోజు అంకురార్పణ జరిగి శ్రవణా నక్షత్రము నాడు పుష్పయాగ మహోత్సవము జరుగును. ఇక్కడ పూబోడుల కొలువులో వున్న స్వామికి నిత్యమూ పుష్పయాగమని అన్నమయ్య ఉపమిస్తున్నాడు. కలువురేకుల కనులతో వారు చూచే చూపులు పుష్పయాగము. వారి శరీరంపై పులకల గుత్తులే పుష్పయాగము. కరకమలాలతో గోపికలు నిను చూపుటే పుష్పయాగము సరసాలాడుతూ నవ్వులు కురిపించుట పుష్పయాగము. కొలని ప్రక్కన సిగ్గుతో వారు స్వామిని నిందించుటే పుష్పయాగము. పూటపూట అలమేలుమంగ రతులతో తేలియాడుటే పుష్పయాగము. ఈరీతిగా మరో పుష్పయాగం జరిపిస్తున్నాడు అన్నమయ్య.

"సకల లోకేశ్వరులు సరుస జేకొనువాడు"
అకలంకముగ బుష్పయాగంబు" (24-209)

సమస్త దేవాధీశులు కొలువగా స్వామి పుష్పయాగ పీఠాదిష్ఠితుడైనాడు. వివిధ పుష్పాలు వేద ఘోషలు, అంగనల ఆటలు, కవిజనుల స్తోత్రాలు, పూజలు, స్వామికి పుష్పయాగము. కర్పూరహారతులతో చందనచర్చలతో ధూపములతో వివిధనైవేద్యములతో స్వామికి ఛత్రచామరలాంఛనాలతో పూజాదులు నిర్వహించారు. అదే పుష్పయాగ కైంకర్యము. వివిధ భక్తులు భిన్న భిన్న సమయాలలో చేసిన పుష్పపూజను అన్నమయ్య ప్రస్తావిస్తున్నాడు.

"పూజలందరు జేసేదీ పుష్పయాగము
ఆజి నర్జునుడు చేసినది పుష్పయాగము" (26-207)

భక్తితో జనులందరు చేసేదే పుష్పయాగము. పాశుపత్రాస్త్ర సంపాదనకై అర్జునుడు చేసినది పుష్పయాగము. శ్రీసతిచేతి మోహన కమలమే పుష్పయాగము. అలమేలుమంగా శ్రీనివాసులను కలపడానికి వదిలే మన్మథబాణాలే పుష్పయాగము. మధురలో మాలాకారుడిచ్చిన పూదండయే పుష్పయాగము. అలమేలుమంగ తురుమునుండిజారి స్వామి ఉరముపై పడిన విరులే పుష్పయాగము.

# కల్యాణ కీర్తనలు

తిరుమలలో నిత్యకల్యాణం పచ్చతోరణం. అలమేలుమంగాశ్రీనివాసుల కల్యాణం పరమరమణీయ సుందరదృశ్యం. అన్నమయ్యనాటికీ, ఈనాటికీ, ఏనాటికీ దేవభూలోకాలలో ఆకల్యాణ ఘడియలను తలచి భక్తాదులుపులకించి పోతారు. తన నరనరానా అమ్మను, అయ్యను ధ్యానించి, కీర్తించి, గుణ గానంచేసే అన్నమయ్య పెండ్లి శుభవేళను వర్ణించే సమయాలలో అన్నమయ్య పులకించిపోయాడు. తానొక పెండ్లి పెద్దయై, తానే చెలియై గుణగానంచేశాడు.

"పిడికిట తలబాల పెండ్లికూతురు కొంత
పెదమరలి నవ్వీనెపెండ్లికూతురు" (5-185)

పెండ్లిఅంటేనే సందడి, సరదాలతో నిండి వుంటుంది. అందులో తలంబ్రాలఘట్టం మరీను. సిగ్గులమొగ్గ అయిన పెండ్లికూతురు పిడికిట తలంబ్రాలతో కొంత ప్రక్కకు మరలి నవ్వుకుంటున్నదట. పేరుప్రఖ్యాతులుగల ఆజవ్వని మెడలో పెద్దముత్యాలపేరులు ధరించివుంది. పేరంటాండ్ర నడిమిన ఉన్న ఆ పెండ్లి కూతురు విభునిపేరు చెప్పడానికి సిగ్గు పడిందట. బిరుదుపెండెము పెట్టెనపుడు, మంగాళసూత్రధారణ సమయంలో పెండ్లి కూతురు ఉత్సాహంగా వుంది. తలనిండా పూలదండలు ధరించింది. స్వామిని అలరించడానికి రకరకాల చీరలను కట్టింది. శ్రీవేంకటపతి కౌగిటిలో ఇమిడిపోయిన ఆపెండ్లికూతురు సరాసరి స్వామి హృదయాన్ని చేరింది.

అన్నమయ్య ఈపెండ్లిపాటలో ఎన్నోవిధముల పెండ్లితంతులను తెలుపుతూ మన కండ్ల ఎదుట శ్రీ వేంకటేశ అలమేలుమంగ కల్యాణవేడుకలు సాక్షాత్కరింపజేశాడు.

"ఆడరో పాడరో అప్సరోగణము
వీడెము లిందరో విభవము నేడు " (22-96)

ఓ అప్సరసలారా! వైభవంగా ఈనాడు ఆడండిపాడండి. ఇవిగో తాంబూలము లందుకోండి. శ్రీరమణుని కల్యాణమునకు గరుడధ్వజము అదిగో రెపరెపలాడుతోంది. దివ్యదుంధుభులు మ్రోగుతున్నాయి. దివిలోని దేవతలారా! గమనించండి. లక్ష్మీవిభునిపెండ్లికి అంకురారోపణము జరుగుతున్నది. శ్రీవైష్ణవులారా ! గంధాక్షతలను అందుకోండి. శ్రీసతీవేంకటనాధుడు తలబ్రాలు పోసుకొన్నారు. తీర్థప్రజలారా !ముదుపులు అందించండి.

"శోభనమే శోభనమే
వైభవముల పావనమూర్తికి" (5-18)

వైభవముల పావనమూర్తికి శుభమంగళములు. నరకాసురుడు సిరులతో చెరబట్టిన పదారువేల మగువలను పెండ్లాడిన సుముఖునికి శోభనము. శిశుపాలుడు పెండ్లాడు దామనుకున్న రుక్మిణిని తానేవచ్చి సందడిగ బెండ్లాడిన సరసుడైన కృష్ణునికి శోభనము. దేవతలు, దానవులు సముద్రమును మథించినపుడు శ్రీమహాలక్ష్మిని పెండ్లాడిన శ్రీవేంకటగిరి శ్రీనిధికి జయమంగళం. నిత్యశుభమంగళం.

"అదె శ్రీవేంకటపతి అలమేలుమంగయును
కదిసియున్నారు తమకమున బెండ్లికిని" (14-365)

అలమేలుమంగావేంకటేశులు పెండ్లికిగా తమకముతో తహతహలాడుతునాన్నరు. దంపతులకు బాసికములు కట్టండి. చేతులలో తలంబ్రాలు అందించండి. పేరంటాండ్రు శుభమంగళములు పాడండి. ముహూర్తము ఎప్పుడో ముందుగా అడిగితెలుసుకొనండి. త్వరగా మంగళాష్టకములను చదవండి. పెండ్లికుమారుడు పెండ్లికమార్తెమధ్య తెరపట్టగా నిక్కినిక్కిచూచుకుంటున్నారట. ఇక తెరతీయండి. ఇద్దరికీ ఇక కొంగుముళ్ళువేయండి. ఇద్దరికీ కంకణదారములను కట్టి పెండ్లి పీటలమీద కూర్చోబెట్టండి. శ్రీ వేంకటేశుని అలువేలు మంగను దీవించి, పానుపు మీదకు పంపండి అని అన్నమయ్య పెండ్లిపనులు చేయండని ముత్తయిదువులను పురమాయిస్తున్నాడు. ఏ సమయానికి జరగవలసిన పనులను ఆసమయంమించకుండా చేయండని హెచ్చరిస్తున్నాడు.

"అలివేణిని పెండ్లాడవయా
చెలుల విన్నపము చేకొనవయ్యా" (19-18)

చెలులవిన్నపమును ఆలకించి అలివేణిని పెండ్లాడవయ్యా అని స్వామిని ఉన్ముఖుణ్ణి చేస్తున్నాడు అన్నమయ్య. తొలిచూపులలోని వలపులు చేసైగలు తలచుకుంటే తలంబ్రాలయ్యాయట. ఆచిరునగవలే బొమ్మలపెండ్లిళ్ళలోని గుజ్జనగూళ్ళయ్యాయి. ప్రియభాషణలే మన్మధుని మంత్రాలయ్యాయట. కౌగిలిలోని చిలిపిచేష్టలు కూడిన కూటపు గురుతులయ్యాయి. ఈవిధంగా అలమేలుమంగను ఏలావు శ్రీవేంకటేశా !

"పెట్టని కోటిందిరికి బెండ్లికొడుకు బొమ్మ
బెట్టె నసురలకెల్ల బెండ్లికొడుకు" (5-186)

ఈవరుడు సమస్త జనులకు పెట్టనికోటవంటిరక్ష. అసురులనందరిని అణచిన వరుడితడు. ఇతడు వేదోద్ధరణకైభూమి నెత్తాడు. శ్రీకృష్ణుడై వేణువు నూదాడు. సకలసంపదలకు నిధి. వధువుకు సరిజోడు ఈపెండ్లికొడుకు. శిరసుపై పాగాను ధరిస్తే ఎంత అందంగా

వున్నాడు? త్రివిక్రమావతారాన్ని ధరించినది ఇతడే. సిరి వలచినదీ ఇతనినే. పాలుపెరుగులు దొంగలించిన దితడే. పశుపాలకుడు వేంకటగిరి నివాసుడు అయిన ఈపెండ్లి కొడుకు చూడముచ్చటగా వున్నాడు.

"పేరంటాండ్రు పాడరే పెండ్లివేళ
సారెసారె నిద్దరికి సంతోషవేళ" (20-182)

ఈసంతోషసమయంలో పెండ్లిలో పేరంటాండ్రు పాటలుపాడండి. మన్మధుని తల్లినిత్వరగా సింగారించండి. ముహూర్తమువేళలో తత్తరపడకండి. నారాయణుని తలబాలు పోయమనండి. ఇద్దరికీ ఇక బువ్వంబంతి వేళఅయింది. పాలవెల్లిలో పుట్టిన ఆమెకు పసుపురాయండి. దేవునికి మెత్తనిపరుపులు పరచండి. ఈనాడు నాల్గవదినము నాగవల్లి. అలమేలుమంగ శ్రీనివాసుల కలయిక వేళలో కర్పూరబాగాలు యివ్వండి. రతిలో అలసినవీరికి గంధము, కస్తూరి ఇవ్వండి ఇద్దరు కలిసికొలువుండే ఈవేళ పేరంట్రాండ్లు పెండ్లి పాటలు పాడండి.

"పసిడియక్షంతలివె పట్టరో వేగమేరారో
దెసల పేరటాండ్రు దేవుని పెండ్లికిని " (3-194)

నానాదిక్కుల పేరంటాండ్రు దేవునిపెండ్లికిరండి. అక్షంతలివి తీసుకోండి. శ్రీవేంకటేశ్వరునికి శ్రీమహాలక్ష్మికి దైవికపు పెండ్లిముహూర్తము ఈనాడే. దేవతలారా ! భేరీలు మ్రోగాయి. గరుడధ్వజం ఎగురుతున్నది. దేవుని పెండ్లికి అందరూ రండి. మన్మధజనకునికి, కమలాదేవికి పెండ్లి. నేడు పందిరిలో తలంబ్రాలు. మునులార! వచ్చి గంధము, వీడెము తీసుకోండి. శ్రీవేంకటపతి అలమేలుమంగకు తిరునాళ్ళ ప్రారంభమైంది. వేదములు పఠించే వారంతారండి. ఈ దంపతులు మీకు వరములిస్తార అన్నమయ్య స్వామిపెండ్లికి ముత్తైదువులను, దేవతలను, మునులను, వేదపండితులను ఆహ్వానిస్తున్నాడు.

"ఎంతభాగ్యవంతుడవో యీకెనీకు దేవులాయ
వింతలుగా నీకు గానె వెదకి తెచ్చితిమి" (28-363)

వింతలుగా నీకొరకే ఈమెను వెదికితెచ్చాము. ఈమె నీకు దేవేరి అవుతున్నది. నీవు ఎంతటి భాగ్యవంతుడవో అంటున్నాడు అన్నమయ్య. ఈ అలివేణి అన్నింటా చక్కని జవరాలు. ఈమె చిలుకపలుకులది. నీకనునన్నల మెదలుతుంది ఈమెను పెండ్లాడవయ్యా! చందురునివంటి ముఖముతో శంఖంవంటి కంఠముతో, చందనపుసువాసనలు వెదజల్లే ఈ సఖిదొరికింది ఈపువ్వుబోణిని పెండ్లియాడుదువు రావయ్యా ! ఈలేమ జక్కవకుచములది. తత్తరించే చక్కెరబొమ్మ. సింగారముల ఈసుదతిని శ్రీవేంకటేశ అక్కరతో పెండ్లియాడుదుదువురావయ్యా

"ఈడగుబెండ్లి యిద్దరిజేసేము
చేడెలాల యిదిచెప్పరుగా" (12-38)

పచ్చికబయళ్ళలో పడతి ఆడగా కృష్ణుడు ముచ్చటగా మోహించి వెచ్చనిపూలదండ వేశాడట. ఆకృష్ణునిఎక్కడైనా చూచారా? చెప్పండి ముత్యాల ముంగిట్లో ముదిత తిరుగుతుండగా చెలి ఉరమున చిత్తరువువ్రాసి వచ్చాడట ఈఉత్తముడు. కొత్తపందిట్లోఈమె నిలబడగా తలబాలు పోశాడట. శ్రీవేంకటేశుడు నవ్వుతూ సతిని కూడినవేళ పాడండి. ఈడు జోడుసరియైన ఈపెండ్లిని యిక్కడచేద్దాం చెప్పండమ్మా అని అన్నమయ్య ఓ చెలిగా చెప్తున్నాడు.

"మీకుమీకు నమరును మిక్కిలివేడుకలెల్లా
కైకొని నేమెల్లా జూడగంటిమిగదే" (24-395)

మీకు అమరిన వేడుకలను మేమంతా చూడాలని కుతూహలపడుతున్నామమ్మా ! సింగారరాయడైన చిత్తజగురుడే నిన్ను పెండ్లాడినాడు. పాలవెల్లికూతురువైన ఓబంగారు బొమ్మా నీవు స్వామికి దేవేరివైనావు. పీతాంబరమును, కౌస్తుభమణిని ధరించినవాడు మంచితనముతో నీమగడైనాడు. సిరుల మించిన పద్మావతీ ! నీవుస్వామి ఉరమెక్కావు ! నాలుగు చేతులవాడైన వేంకటేశుడు ఆత్మగా నిన్నే చేకొన్నాడు. ఎంతో నేర్పరివైన ఓశ్రీదేవి నీవు స్వామికి నిత్యానపాయినివయినావు.

"మంచిముహూర్తమున శ్రీమంతులిద్దరు
చంచులబూవుదండలు చాతుకొనేరదివో" (14-110)

మంచిముహూర్తమున శ్రీపతి, శ్రీదేవి పూల మాలలు వేసుకున్నారు. పేరంటాండ్రు పెండ్లిపాటలు పాడుతుండగా హరియు, సిరియు పెండ్లియాడారు. అంతటా దేవదుంధుభులు మ్రోగగా బాసికములు కట్టుకున్నారు. మునులు మంగళాష్టకములు చదువుతుండగా పోటీపడుతూ ఇద్దరు తలబాలుపోసుకున్నారు. బ్రహ్మమొదలైనవారు కట్నములు చదువగా పెండ్లిపీటమీదవున్నారు. అమరాంగనలు హారతులియ్యగా వీడియ మందుకుంటున్నారు. శ్రీవేంకటేశుడు అలమేలుమంగనుకూడి అందరకు వరములను అనుగ్రహిస్తున్నాడు

"కందువ మీనిచ్చకల్యాణమునకు
అందములాయను అదన నివి" (24-129)

అలవకసొలవక చూచే మీచూపులే కలువలసేసలు. మీమునిముని నవ్వులే మొల్లలసేసలు. మీ ముద్దులమోములే తామరసేసలు గోళ్ళ చెనకులు చేమంతిసేసలు. మీ ఊర్పులే సంపంగిసేసలు. శ్రీవేంకటేశ! చెలితోకలిసి సంపదలతో తేలిన చనవులివి. మీ నిత్యకల్యాణమునకు ఇవన్నీ అందాన్ని చేకుర్చాయి.

"లక్ష్మీకల్యాణము లీలతో బాడే మిదేనేము
లక్ష్మీనారాయణులే లలనయు నీవును" (17-165)

ఆలలన,నీవే లక్ష్మీనారాయణులు. లక్ష్మీకల్యాణమును మేముపాడుతున్నాము. మీచూపులే-బాసికములు. చనుగుబ్బలే-పూజకుండలు. మోవితేనెలే మధుపర్కములు. మీయిద్దరిమాటలే మదనమంత్రములు. మీనవ్వులే తలబాలు. మీ వులకరింతలే కప్పురవసంతాలు, మీకౌగిలియే పెండ్లిపందిరి. కోరికలేపావుకోళ్ళు. వేంకటేశా! అలమేలుమంగా నీవు వేడుకగా పెండ్లాడండి.

## బ్రహ్మోత్సవ వాహనములు

కలౌవేంకటనాయక: అన్నట్లు వేంకటేశ్వరుడు స్వయం వ్యక్తమూర్తిగా కన్యామాసం శ్రవణనక్షత్రంరోజున ఆవిర్భవించాడు. బ్రహ్మ ఆరోజుకు పూర్తగునట్లు తొమ్మిదినాళ్ళ పాటు శ్రీనివాసుని ఉత్సవాలు నిర్వహించినాడు. బ్రహ్మ ప్రారంభించినవే ఈ బ్రహ్మోత్సవాలు. శ్రీహరిసేనాధిపతి విష్వక్సేనులవారి ఆధ్వర్యంలో మృత్సంగ్రహణం, అంకురార్పణ జరుగుతుంది. విష్వక్సేనులవారుబ్రహ్మోత్సవ కార్యక్రమములను స్వయంగా ముందునడచి పర్యవేక్షిస్తాదంటారు. బ్రహ్మోత్సవాలలో బ్రహ్మరథం (విగ్రహంవుండదు) ముందుగా తిరుగుతుంటుంది. పెద్దశేష,చిన్నశేష, హంస, సింహ, ముత్యపుపందిరి, కల్పవృక్ష, సర్వభూపాల, వాహనములు, మోహనీఅవతారంలో మలయప్పవెంట చేతవెన్నముద్దకృష్ణుదు మరో తిరుచ్చిలోవస్తారు. గరుడోత్సవంరోజు ప్రభుత్వం వారిపట్టువస్త్రములు సమర్పిస్తారు. శ్రీవిల్లిపుత్తూరునుండి గోదాదేవి ధరించిన మాలలు, మద్రాసునుండి కొత్తగొడుగులు వస్తాయి. హనుమ, గజసూర్యప్రభ, చంద్రప్రభ, రథోత్సవము, అశ్వవాహనము, చక్రస్నానం ధ్వజాఅవరోహణం జరుగుతాయి. మరి ఆనాటి సంగతి చూద్దాం.

"వీధుల వీధుల విభుడగీ నిదె
మోదము తోడుత మొక్కరో జనులు" (4-286)

వీధులలో ఉత్సవంగా తిరుగుతున్న ఆవేంకటవిభునికి ఆనందంతో మొక్కులు మొక్కండి. గరుడధ్వజముగల బంగారురథములో ఇరువైపుల శ్రీదేవిభూదేవులతో హరి వున్నాడు. జనులారా !పగ్గములు పట్టండి. అప్సరసలు ఆడగా, గంధర్వులు పాడగా సర్వసైన్యాధ్యక్షుడైన విష్వక్సేనులవారు వచ్చుచున్నారు. జనులారా! తిలకించండి. శ్రీవేంకటపతి శిఖరమదె ఆవైభములను తిలకించండి. ఓ జనులారా! గోవిందనామపు ఘోషణలతో స్వామినితలచండి.

"నానాదిక్కుల నరులెల్లా
వానలలోననె వత్తురుగదలి" (1-346)

బ్రహ్మోత్సవాలు వానాకాలంలోనే వస్తాయి. అన్నిదిక్కులనుండి జనులు వానలలోనే వస్తారు అంటున్నాడు అన్నమయ్య. భార్య బిడ్డలు, పరివారం, బంధువులు, స్నేహితులు అందరితో కలిసి దూరదూరాలనుండి ఇదొక వ్రతముగా భావించి వస్తారు. ముడుపులు, జోలెలు, నెత్తిమూటలు, సరిలేని ధనముతో, మంచిమణులు, ఏనుగులు, గుర్రములు, భార్యలతో కదలివస్తారు. రాజులు,మండలాధిపతులు, జగదేకపతులు, చతురులు మొదలైన వారంతా సంపదలతో వేంకటేశుని దర్శించుటకు వర్షాలైనా లెక్కచేయక వస్తారు.

"అమరాంగన లదె యాడేరు
ప్రమదంబున నదె పాడేరు" (4-26)

అమరాంగనలు ఆనందంతో ఆడుతున్నారు! పాడుతున్నారు! గరుడవాహనుడు కనకరథముపై వీధులలో తిరుగుతుంటే సురలు మునులు అందముగా మోకులను కదుపుతున్నారు. భూమినిమోచిన ఆహరి ఇంద్రరథంపై దిక్కులగెలవగా శేషాదులు బ్రహ్మశివాదులు స్వామికి సేవలుచేస్తున్నారు. అలమేలుమంగతో వేంకటేశుడు రథముపైరాగా నారదాదులు ముక్తులు మిక్కిలిగా పొగడుతున్నారు స్వామిని.

"ఎట్టునేరిచితివయ్య యిన్ని వాహనములెక్క
గట్టిగానిందుకే హరి కడుమెచ్చేమయ్యా" (20-105)

ఇన్నిరకముల వాహనములు ఎక్కడం ఎలానేర్చుకున్నావయ్యా! అందుకే నిన్ను ఇంతగా మెచ్చుకుంటున్నాము. పారిజాతాహరణమునకు గరుడునిమీద ఎక్కివెళ్ళావు. బ్రాహ్మణపడచులను ఉద్ధరించుటకు రథమెక్కివెళ్ళావు. చక్కగా సీతాదేవితో అయోధ్యకు మరలివచ్చేటప్పుడు కుబేరుని పుష్పక మెక్కి వచ్చావు. వానరసేనాపతులు చూచుచుండగా ఆంజనేయునిపై నెక్కి రావణునిపై దాడి చేశావు. కల్కి అవతారమున అధర్మమును అణచుటకు రాతి గుర్రంమెక్కావు. శ్రీ వేంకటాద్రిమీద పల్లకినెక్కావు. ఇన్ని వాహనములెక్కి ఇందిరతోడి పెండ్లికి ఎట్లా నేర్చావయ్యా.

"ఎక్కడ నీ ఉద్యోగ మెటు విచ్చేసేవయ్యా
యిక్కువనీ మహిమకు నెవ్వరెదురయ్యా" (4-365)

నీవుండేదెక్కడ? నీ పని ఏది! ఎలా వస్తావయ్యా ! నీమహిమకు ఎవరుసాటి? నీవు గరుడినిపై వెళ్ళి ఇంద్రుని నందనంలో పారిజాతం తెచ్చావు! పారిజాతం ఆనాడే అడవి చెట్టయింది. రుద్రుడు బాణుని వాకిటకావలివుండగా రాక్షసమూక క్షీణదశ ఆరంభ మైంది.

గరుడునిపై నీవువూరేగినపుడు పాలసముద్రము నుండి అమృతముద్భవించింది. నిన్ను ఎదిరించిన కంసాదులు నెత్తురుటేర్ల పాలైనారు. బంగారు గరుడునిపై నీవు వీధులలో ఊరేగగా సిరులునిండాయి, అలమేలుమంగమ్మ సంతసించునట్లు దేవదుంధుభులు మ్రోగాయి.

"దేవ దేవుడెక్కెనదె దివ్యరథము
మావంటి వాకికెల్లమనోరథము" (1-400)

మా వంటివారి కోరికతీరగా దేవదేవుడు దివ్యరథము నెక్కాడు. బ్రహ్మణపుత్రులను బ్రతికించుటకై ఆనాడు వెండిరథముపై సముద్రములు దాటిడు. రాముడై మిగుల కోపముతో దేవేంద్రుని రథముపై రావణుని మీదకు వెళ్ళాడు. దిక్కులన్నీగాలించి సీతాదేవితో పుష్పకరథముపై అయోద్యకు మరలాడు. విష్ణురథము నెక్కి ఆకాశము అదిరేటట్లు నరకాసురునిమీదకు వెళ్ళాడు. శత్రువులను గెలిచి రుక్మిణీదేవితో కల్యాణరథము నెక్కాడు. వేంకటగిరి మీద వేంకటేశుడు అలమేలుమంగతో కలిసి కలకాలము తిరేగేది ఘనమైన రథముపైన.

"వీడుగదే శేషుడు శ్రీవేంకటాద్రిశేషుడు
వేడుక గరుడనితో బెన్నుద్దైనశేషుడు" (3-365)

బ్రహ్మోత్సవాలలో స్వామి మొదటగా పెద్దశేషవాహనముపై శ్రీభూదేవులతో వేంచేస్తారు మర్నాడు ఉదయము చిన్నశేషవాహనముపై అధిరోహిస్తాడు. శేషుడు ఏడువిధములుగ స్వామిని సేవించుకుంటాడు. అందువల్లనేస్వామి రెండుమార్లు శేషుని అనుగ్రహించారట. ఈ కీర్తనలో అన్నమయ్యశేషుని వర్ణించాడు. శేషుడు, గరుడడు బలపరాక్రమాలలో సమఉజ్జీలు వేయి. పడగులతో ఉన్నత ఆశేషుని మేను వజ్రాలవలెమెరుస్తుటుంది. వేయిశిరసుపై మాణిక్యాలతో హరికితోడు నీడగా వుంటాడు. పట్టపువాహనమైన బంగారుశేషుడు చుట్టలు చుట్టుకొని వుంటాడు. వేయి శిరసులతో రెండు వేల నాలుకలతో హరినిస్తుతించడంలో బహునేర్పరి. దేవతలు ఎప్పుడు మొరపెట్టుకోవాలన్నా ఆదిశేషునిపై పవళించిన నారాయణుని వద్దకే వెళ్లతారు. దేవతల మొక్కులుముందు శేషునికే ఆశేషుడే వేంకటపతకి, అలమేలుమంగకు కూడా పానుపైనాడు.

"చక్రమా హరి చక్రమా
వక్రమైన దనుజుల వక్కలించవో" (1-183)

ఈకీర్తనలో అన్నమయ్య స్మామి చేతిలోని సుదర్శనచక్రమును గూర్చి చెబుతున్నాడు. వక్రమార్గమునవుండే దనుజులను దునిమే ఓచక్రమా! హరిచక్రమా! పాతాళమున కున్న హిరణ్యాక్షుని చీరిన చక్రమా! శ్రీహరి చేయి విడువక యీ జగములను రక్షింపుము ఓచక్రమా!

రాక్షసుల నడచేటప్పుడు వారికిరీటమణులచే సానబట్టిన రకరకాలజీవుల(ప్రాణములను గాచి ధర్మమును నిలిపేఓచక్రమా! నీకు భయపడిన బ్రహ్మాదుల చేత కొనియాడబడే చక్రమా! తిరువేంకటద్రీశు వీధుల (మాడవీధులలో) మెరయుచు తిరిగే ఓ చక్రమా! బ్రహ్మోత్సవాల చివరిరోజు రథసప్తమినాడు చక్రత్తాళ్వారునకు తిరుమంజనం తరువాత మూడుమార్లు పుష్కరిణిలో ముంచుతారు. ఆసమయంలో వేలమంది భక్తులు పుష్కరిణిలో మునుగుతారు. రథసప్తమినాడు జిల్లేడాకులు వినియోగిస్తారు.

"వీది వీది వాడే వాడే వీడే వీడే చెలగీని
ఆదిదేవుడు శ్రీ వేంకటాద్రి మీదటను" (3-27)

వేంకటాద్రిమీద ఆదిదేవుడు ఎక్కడ చూచినా తానేయై వెలుగొందుతున్నాడట. ఘన విష్ణురథంమీద గరుడధ్వజముతో పాంచజన్యశంఖము, సుదర్శన చక్రము, శార్ఙమనే వింటితో హరి శత్రువులనెల్ల గెలచి దేవతలను రక్షించుటకుగా అక్కడిక్కడంతా జాగరూకుడైవున్నాడు. సారథితో రణభేంమ్రోగుతుండగా ఇరువైపులా బ్రహ్మాదులు వేదములు వల్లిస్తుండగా శ్రీరమణుడు చిక్కులు తీర్చుటకుగా ప్రకాశించుచున్నాడు. అప్సరసల ఆటపాటలతో అలమేలుమంగతో కూడి శ్రీవేంకటేశుడు కోటాను కోట్లదాసుల కోరికలు తీర్చుటకుగా వేంచేస్తున్నాడు.

"మొక్కరో పరుషలు మోహనమూర్తికి
వెక్కసమగు శ్రీవేంకటపతికి" (12-402)

మోహనమూర్తి అయిన శ్రీవేంకపతికి మొక్కండి. హరిరథమునకుముందు నొగలు కనపడుతున్నది. గరుడ ధ్వజపు గంటలవిగో, తిరుగుతున్న బంగారు చక్రములవే కనబడు తున్నాయి. తిరువీధులలో వేంకపతిని చూడండి. తేరుపడగలవే, తెల్లగొడుగులు అవిగో, రథమునకు కట్టినతోరణము లవిగో, వాడేసారథి, దివ్యమైనహయములను పూన్చిన రథము మేరు పర్వతమువలె మెరుస్తూవున్నది అదిగో. పసిడికొండఅదే పట్టుకుచ్చులవే. ఆనదుమ శ్రీవేంకటేశుడు ఉరమున అలమేలుమంగ. భూమిపై పెండ్లితేరు వచ్చిన దిదిగో!

"తిరు వీధు లేగీని దేవతలు జయవెట్ట
హరివాడె పెండ్లికొడుకై ప్రతాపమున" (3-122)

హరిప్రతాపముతో పెండ్లికొడుకై దేవతలు జయజయ ద్వానములు చేయుచుండగా తిరువీధులలో తిరుగుతున్నాడు. బంగారు కొండవంటి ఘనమైన రథముపై వేంకటేశుడు దేవేరులతో, వేవేలకుచ్చులతో భేరీలు మ్రోగుతుండగా కదిలాడు. సూర్య చంద్రులవంటి బండి చక్రములతో, గరుడ ధ్వజముతో, వేదరాసులే పగ్గాలుగా పట్టి దుష్టులను దునిమి

జయమును చేపట్టాడు. ఎదురులేని వేంకటేశుడు అలమేలు మంగాతో ఆటాపాటల వింటూ సింగారముతో వాకిట నిలిచి కోటానుకోట్ల వరములను తీసుకొమ్మని భక్తులకు యిస్తున్నాడు.

"నేడే నాగవల్లి నేడే యిల్లునింపులు
పోడిమిగోవింద పతి భోగించే నిదివో" (20-558)

నాకబలిని వాడుకలో నాగవల్లి అంటారు. నాకమనగా స్వర్గము. స్వర్గము నందున్న చంద్ర, వసు, రుద్రాదిదేవతలకు బలి అనగా పూజచేయడం. పెండ్లిలో ఇది ఒక తంతు. ఈనాడు గోవిందపతి నాగవల్లి. అదే దేవుని రథము, గరుడధ్వజము. లోకము లన్నింటినిగెలిచారు. లక్ష్మి భూదేవులతో ఒకరి కొకరుసేసలు జల్లుకుంటున్నారు. అదుగుడున ఆరగింపులతో సేనాపతి, దేవతలతో కలిసి నారాయణుడు విలసిల్లి అందరికే వానలవలె వరము లిస్తున్నాడు. దిక్కులంతా చల్లగావున్నాయి. దేవదుంధుభులుమ్రోగాయి. జీవులారా! శ్రీ వేంకటేశుని సేవించిభావించి బ్రతకండి. ఇతడు వేవేల శుభములవేడుకగాడు.

"తిరువీధుల మెరసీ దేవదేవుడు
గరిమల మించిన సింగారములతోడను" (7-192)

మించిన సింగారములతో దేవదేవుడు తిరుమాడవీధులలో మెరిసిపోతున్నాడు. తొలినాడు బంగారు తిరుచ్చిమీద, రెండవనాడు శేషునిమీద మూడవనాడు ముత్యాల పందిరిక్రింద, నాల్గవనాడు పవ్వుల మండపములోను, ఐదవనాడు గురుడుని మీద, ఆరవనాడు ఏనుగు మీద, ఏడవనాడు సూర్యప్రభలోను, ఎనిమిదవనాడు తేరు(రథము) మీద, గుఱ్ఱము మీదను తొమ్మిదవనాడు బంగారు పల్లకిలోను, పదియవనాడు పెండ్లిపీటమీదను శ్రీవేంకటేశు డు అలమేలుమంగతోను, వనితలతోడను, వాహనముల మీదను విహరిస్తున్నాడు.

"నీవు తురగము మీద నేర్పు మెరయ
వేవేలురూపాలై వెదజల్లి తపుడు" (4-38) (అనుబంధము)

స్వామి! నీవు గుఱ్ఱము మీద స్వారీచేయునపుడు వేయివేల రూపాలు వెదజల్లావయ్యా! రెండవైపుల బంగారు అంబులపొదులతో, కౌమోదకము అనేగద, సుదర్శనచక్రము, పాంచజన్య శంఖము, శార్ఙమనేధనుస్సు, నందకము అనే ఖడ్గములతో పదివేల సూర్యబింబములవలె ప్రకాశించావు స్వామీ! ఆదిశేషుని పెద్దచుట్టు చేతిలో దాలువలె మెరయగా, ధూమకేతువు యుద్ధసన్నద్ధుడవైన నీచేతిబల్లెమై ప్రకాశించింది. జడతో రమాకాంత జయలక్ష్మియై మెరుగుకుచకుంభములతో నిన్నుకౌగిట బంధించి, నీ వెన్నుచరచింది.

"శ్రీవేంకటేశ్వరుడు శ్రీ అలమేల్మంగతోడ
కోవిదుడై విహరించే కోడతిరుణాళ్ళు" (14-240)

తిరునాళ్ళలో అలమేలుమంగతో కూడివేంకటేశ్వరుడు కోవిదుడై విహరించాడు. వీధులలో వెన్నెలలు వెల్లవిరియగా చల్లనిపూవుల జడివాన కురియగా, సతులు తనను పొగుడుతుండగా, కొల్లలాడే వలపులతో విహరిస్తున్నాడుస్వామి. ఆటల పాటలతో ఆరగింపుతో, వీడెములు, గంధములు అందుకొనుచూ కోటిభోగాలతో తిరునాళ్ళలో విహరిస్తున్నాడుస్వామి. పన్నీరు, కర్పూరము శిరసున అలరారుతుండగా అందరుకొలువుసేయగా శ్రీవేంకటేశుడు ఇందరుసతులతో కూడి కోరికలు కోడ తిరునాళ్ళలో వెదజల్లుతున్నాడు.

"ఇటు గరుడని నీ వెక్కినను

పట పట దిక్కులు బగ్గన బగిలె " (1-92)

నీవు గరుడుని ఎక్కగా, దిక్కులు బద్దలైనాయి. పైకెగసి గరుడునిపై కెక్కి 'ధా'యని అదిలించిన స్వరానికి వేదములు, ఉపనిషత్తులు, గగనము, జగములు గడగడవణికాయి. నీవు గరుడ వాహనము తోలుతూ  పసిడిగరుడినిపై కోపించగా అఖిలాండము గిరగిర తిరిగింది. పసిడిగరుడినిపై నీవెక్కగానే రాక్షస సమూహాలు నీమహిమలలో మునిగిపోయినాయి.

"భోగింద్రులను మీరు బోయిరండు

వేగన మీదటి విభవాలకు" (1-368)

బ్రహ్మోత్సవాలకు వచ్చిన దేవతలందరికీ వేంకటేశుడు. వీడ్కోలు చెబుతూ మరలా మీదటి ఉత్సవములకు రమ్మంటున్నాడు. శివుని, బ్రహ్మను, సురలు, మునులు, భూసురలనందరితో తిరునాళ్ళలో బాగా అలసినారు. మీదటి తిరునాళ్ళకు రండి. ఓయముడా! పోయిరా! చంద్రా! నీవు వెళ్ళి అన్నిరాసులనుగూడు. దిక్పతులారా! మీమీదిక్కులకు చేరండి. ఆనందోత్సాహములతో ఇన్నాళ్ళు బడలిపోయారు. ఓనారద సనకసనందనాదులారా! వైభవముగా పోయిరండు దూర దూరముగా పోకుండా త్వరగావచ్చి నన్నటనే సేవించుకోండి!

## వివిధ కీర్తనలు

పై విభాగములలోనికి రానివి కొన్ని కీర్తనలున్నాయి. చందమామ, తుమ్మెదా, జాజర, సువ్విసువ్వి, నేరేళ్ళపాటలు కొన్నివున్నాయి. అన్నమయ్య కీర్తనలు శాస్త్రీయసంగీతాన్ని దృష్టిలోపెట్టుకొని వ్రాసినవిగావు. ఆధునికకాలములో వాటిని స్వరపరచిన నేదునూరి, శ్రీపాద, రాళ్ళపల్లి, నూకలవంటివారు లలితశాస్త్రీయ ఫణితులకు వాటిని పొదిగించారు. జానపదశైలిలో అన్నమయ్య వ్రాసిన ఈ పదాలు భావించి ఆనందిద్దాం.

"చందమామరావో జాబిల్లిరావో మంచి

కుందనపు పైడికోర వెన్నపాలు తేవో" (ఉత్సవగాయక ఉపయోగార్థంసంకీర్తన)

తెలుగింట తల్లి ముద్దుబిడ్డకు సాయంవేళ చందమామను చూపుతూ గోరుముద్దలు తినిపిస్తూ చందమామరావో జాబిల్లిరావో 'అంటూ పాడుకునే పాటనే అన్నమయ్య వ్రాశాడని చాలామందికి తెలియదు. తనబిడ్డకు బంగారు గిన్నెలో వెన్నపాలు తెమ్మని చందమామను కోరుతుంటుంది. నగుమోముగల అందగాడు, బ్రహ్మపుట్టించినవాడు, వేదములందుండేవాడు, నీలవర్ణుడు, జగములు ఏలేవాడు, ఇందిరా విభుడు, బ్రహ్మవిష్ణు మహేశ్వరులకు మూలమైన మాముద్దుల మురారి బాలునికి వెన్నపాలుతేరాదా! తెల్లతామరలవంటి కన్నులవానికి, తియ్యని మాటలతో చిలిపి చేతలవానికి, బాలకృష్ణుని చిలిపి చేష్టలే ఎన్నో కథలుగా గల ఈబిడ్డడికి, వంశోద్ధారకుడైన మంచిగుణములు గలవానికి, నిలువెల వయ్యారముతో తన చూపులలోనే నవనిధులను గూర్చే సుగుణునకు వెన్నపాలు తేవయ్యా!

దేవతలను రక్షించే గరుడవాహనునకు, మాబుద్ధిమంతునికి, మాచిన్నికృష్ణునికి, మదనజనకునకు సిరినిమించిన జాణకు మాశ్రీవేంకట నాధునకుఓచందమామా! ఓ జాబిల్లీ ! నాధునికి! వెన్నపాలుతేవో!

"చల్లనైకాయగదో చందమామ నీ
వెల్లగా దిరువేంకటేశు నెదుర"
"మొల్లమీగ నమృతంపువెల్లి గొల్పుచు లోక
మెల్ల నిను గొనియాడగాను" (5-228)

ఓ చందమామా! శ్రీవేంకటేశు నెదురుగ అమృతములు చిందుతూ లోకమెల్ల పొగడునట్లుగా చల్లని వెన్నెలలు కురియరాదా! హితులు, ఆప్తులు, రసికులు, కవులు అందమైన మృదుభాషణచేయగల ఘనులు, తాళమునకు లయబద్ధముగా ఆడే నాట్యగత్తెలు స్వామిని ఇరువైపులా కొలువుగా చల్లనివెన్నెలలు కాయుము. వందిమాగధులు కైవారములు జెప్ప తన దివ్యమందిరమార్గమునకోనేటిముందర ఇందిరారమణుడు ప్రకాశిస్తూ నెమ్మది నెమ్మదిగా పయనిస్తుండగా వెన్నెలలుకాయి. మానవాళి సేవింపగా, హస్తములకంకణ మ్రోతలు చెలగ వింజామంలు వీవ, అందమైన మణిమయమైన ఆలవట్టములు చేతబట్టి కొలువగ సకలలోకేశ్వరుడు ప్రకాశిస్తున్నాడు. బంగారుప్రతిమలకు సరియైన దేవలోకాంగనలు గొప్ప విమానము నందుండి చెంగలువలను, మంచి చేమంతి రేకులను ఇరువైపుల చల్లగా మంగళాత్మకమైన వేదవేదాంగవిద్యలకు ప్రియమంది గైకొనుచు శ్రీవేంకటేశ్వరుడు కదు వేడుకలతో తిరువీధుల విహరించగా చందమామా! చల్లని వెన్నెలలుకాయ రాదా!

"సందెకాడ బుట్టినట్టి చాయలపంట యెంత
చందమాయ జూడరమ్మ చందమామ పంట" (4-342)

సందెవేళ బుట్టిన వెన్నెలపంట ఎంత అందముగా వుందో ఈ చందమామ పంట.

పూర్వం పాలవెల్లి (Milky Way)లో మొలిచి పండినపంట. దేవతలకు నచ్చినపంట. హరికీగంటి చూపుల పంట, (స్వామికి రవిచంద్రులు కన్నులు) ఆకాశవీధిలోని వెన్నెలపంట. మన్మధుని వలన పండిన పంట, పున్నమినాటి జాజరపంట. లక్ష్మీదేవితోబుట్టువు, తమలోనిమత్తిమాని పంట.విరహార్తులకు వెగటైన వెన్నెలపంట. నక్షత్రరాశికి భాగ్యముపంట. తూరుపు కొండపై పండినపంట ఈ వేంకటేశుని యింటిలోనిపంట.

"తొల్లింటివలెగావు తుమ్మెదా యింక
నొల్లవుగా మమ్మునో తుమ్మెదా" (6-9)

ఓ తుమ్మెదా ! నీవు మునుపటివలె ప్రియుడివికావు. ఇకపై మమ్ము స్వీకరించవు. నీ సరసాలతో ఎన్నో గొందులు దూరావు. మమ్ము ఓరగంటితో చూడకుము. నీవు మా తొలిప్రాయపు మిండ గానివి. నీవు తొలకరి మెరుగువలెమమ్ము చూచి ఉలిక్కి పడుతున్నావు. వేంకటగిరి దొరవైన నీవు మాకొప్పు ఏల సవరిస్తావు. నీ చనవులన్నీ ఇతరులకు తెలియనివా? ఇక్కడ తుమ్మెద నెపంతో దక్షిణ నాయకుడైన వేంకటపతిని జంకిస్తున్నారు.

"ఏ లే ఏలే మరదలా చాలుజాలు చాలును
చాలు నీతోడి సరసంబు బావ" (5-163)

జానపదులైన బావా మరదళ్ళు ఎకసెక్కములాడుతున్నారు.

బావ : మరదలా ! నీతోడిప్రియం యింకచాలు
మరదలు : బావా! నీతో సరసాలిక చాలు.
బావ : నీటైన మాటలతో నీ చనుగుబ్బలు కదిలిస్తూ కులుకుతావెందుకు?
మరదలు : బావా ! నీవు చీటికి మాటికి నన్ను కౌగిలిస్తావు ! ఇంకనీ బూటకాలు అపు.
బావ : అన్నిచోట్ల నన్ను అదిలిస్తున్నావు ! మేలపు మాటలతో మరదలా !
మరదలు : నీవు సందు సందు తిరుగే మోసగాడవు. ఇంక నీతో పొందు చెల్లు.
బావ : నీ గిలిగింత చూపులతో నీతో మక్కువ సేసిన ఓ మరదలా !
మరదలు : నన్ను కూడి దక్కించుకొని నాకు తగులమైనావు ఓబావా !

సంభాషణాత్మకమైన రీతిలో బావా మరదళ్ళ సరస సంభాషణలు ఇందులో రమ్యంగా చిత్రించబడ్డాయి.

"జగదప చనవులజాజర
సగినల మంచపు జాజర" (5-274)

రతి క్రీడా జగడంలో సగినలమంచంపై చనవులు పోతున్నారు సతీపతులు, మొల్లలు తురుములో ముడిచి మురిపంలో అవి పుప్పొడిజారగా వనితలు పతిపై వాటిని చల్లుతున్నారు.

ఘనకుచభారంపై ఉన్న గంధవొడి పతిపై చిందేటట్లుగా పడతులు మాటిమాటికీ చల్లుతున్నారు. బిగి కౌగిలింతల చెమటలలో మైపూతల పరిమళాలు జవ్వాదులుగా పూస్తున్నారు.

"చాలు చాలు నీ జాజర, నన్ను
జాలిబరచే నీజాజర" (5-332)

ఓ ప్రియా! నీతో సరసాలిక చాలు వలపు వేదనలతో వాడిపోయి తలనొప్పు లధికమయ్యాయి. పులకించిన మేనితో నేను పొర్లాడుతున్నాను. నిన్ను చూడగానే నీ చిల్లర చేష్టలకు ఉడికిపోతున్నాను. నన్ను మరీవేధించకు. నాశరీరంపై గంధపొడి నీవు చల్లుతుంటే మేను కాగుతోంది. నీ కౌగిటిలో కరిగిన చెమటలు నాకు రుచికరములైనాయి.

"వాడలవాడల వెంట వసంతము
జాడతో చల్లేరు నీపై జాజరజాజరజాజ" (26-18)

వాడల వాడల నీపై వసంతాలు చల్లుతున్నారు. ఆకలికినవ్వులే నీకు కర్పూరవసంతము. వలచూపే కలువలవసంతము. సరసపుమాటలే - కుంకుమవసంతము. జంకెన చూపులే కస్తూరి, వసంతము, మోహము - నీటివసంతము. సరసాలు -పుప్పొడివసంతము. అధరమే - అమృత వసంతము రతిస్వేదము ముత్యాలవసంతము. మీ యిద్దరికి ఆవిధంగా వసంతోత్సవాలు జరుగుతున్నాయి.

"పొదలె నిండు కళలపున్నమి నేడు
అదను దప్పక జాజరాడుదువురావయ్యా" (29- 434)

శ్రియ:పతీ! ఈనాడు నిండు పున్నమి శ్రీసతితో జాజరలాట లాడటానికిరావయ్యా! నిండుకల పున్నమి ఎలా అయిన దంటే - జలజాక్షి మోమున చంద్రోదయమైంది. నవ్వుల వెన్నెలలు కాశాయి. కన్నులనేనల్ల కలువలు వికసించాయి. యవ్వనోదయంతో వసంతకాలం వచ్చింది. దానికి సూచకంగా మోమి చిగురులు, కొప్పున తుమ్మెదల గుంపులు వచ్చాయి. చనుకొప్పెరలపై కుంకుమచెమట నిండుకుంది. గోళ్ళు బుఝటకొమ్ములైనాయి. ఇంక అన్ని పొద్దులా నీవు ఆమోతో నిండుకళల తేలియాడు. ప్రబంధకవులను మించి అన్నమయ్య యిక్కడ ఉపమానాలు వాడాడు.

"అల్లదె నీరమణి అయిత్త మైయున్నది
పెల్లుగజాజరాడ పిలిచీ పోవయ్యా" (11-172)

ఓ వలకాడా ! నీరమణి వసంతాలాటకు సమాయత్తమై నిలిచి పిలిచింది. జాజర లాడటానికి వెళ్లు. మరీ వసంతా లెక్కడ? వనిత చూపులే కలువల వసంతాలు, మోహమే గంధపు వసంతము. కోర్కెలే మంచినీళ్ళవసంతము. నవ్వులే కర్పూరవసంతము. ఆమెనిలిచినకళలు వెన్నెలవసంతములు. పలుకులు బంగారు వసంతము. చేయికెందామర

వసంతము మేనివులకులు ముత్యాల వసంతాము. ఇన్ని వసంతములు జతగూడి ఆమెనుకూడావు.

"లెండో లెండో మాటా లించరో మీరు
కొండలరాయనినే పేర్కొన్నదిదిజాలి" (4-166)

రాత్రి స్వామి పవళించినవేళ అప్రమత్తులై తలారులు, కావలి వారలు కటికవారు నిద్రాభంగము చేయకుండా వుండమని కోరుతున్నాడు అన్నమయ్య.

"రావేకోడలా రట్టడి కోడలా
పోవేపోవేఅత్తాయ్య పొందులు నీతో చాలును" (5-313)

లక్ష్మీసరస్వతులు అత్తాకోడళ్ళుగా యిక్కడ సంవాద మాడుతున్నారు.

అత్త : ఓ గడుసు కోడలారా !
కోడలు : నీతో పొందు యిక చాలు అత్తయ్యా !
అత్త : రాజసభలలో నీవు జంకు గొంకులేక రంకెలు వేస్తావు (పండితగోష్ఠులు)
కోడలు : నీవు సంపన్నుల యిండ్లలో అంటి పెట్టుకొని తిరుగుతావు
అత్త : నీవు నాలుగుముఖాల (నలుగురితో) సిగ్గులేకుండా తిరుగుతావు
కోడలు : నీవు అందరి చేత వలపించుకొని అక్కడ కూడా తిరిగే తిరుగుబోతువు
అత్త : బొడ్డున పుట్టిన బిడ్డకోసం నిన్ను తీసుకు వచ్చాను.
కోడల : కొండలకోనేటి రాయణ్ణి నీవు అద్దగించుకున్నావు.

"సువ్వి సువ్వి సువ్వని సుదతుట దంచెద రోలాలా " (5-363)

ఇది దంపుళ్ళపాట. మరిఏమి దంచుతున్నారు. వనితలు తమ మనస్సు అనే కుందెనలో వలపులనే ధాన్యాన్ని నింపారు. కనుసన్నలనే రోకళ్ళతో కన్నెలు దంచుతున్నారు. పట్టు చీరలకొంగులు రెపరెపలాడగా వేడుకతో దంచుతున్నారు కొప్పుముడిజారగా చనులపై సరాలు కదిలి ఆడగా ముద్దులు గురివున్నా దంచుతున్నారు. ఘల్లుఘల్లుమని గాజులు చప్పుళ్ళు చేయగా నడుములు ఊగులాడగా దంచుతున్నారు. పూలచప్పరాలలో రతి ఆటలలో కోనేటిరాయని గుణగానం చేస్తున్నారు.

"నెయ్యములల్లో నేరళ్ళు
వొయ్య వూరెడి వువ్విళ్ళు" (5-179)

నెయ్యముతో వువ్విళ్ళురుతున్న సతీపతులు ఇలావున్నారు. బాహుమూలముల చెమటలు చెలువములకు చెలమలయ్యాయి. ముత్యముచెరగు నీళ్ళతుంపిళ్ళతో దులిపే సురటిలాగుంది. కన్నులలో ఆనందబాష్పాలతో బాటు అలుకల చిరు నగవు వెల్లివిరుస్తోంది.

మ(ద్రిపండువలె వున్న నీ వన్నెలమోవికి గుటకలతో గుక్కిళ్ళు తీరుస్తున్నాడు. కౌగిటి పరిమళాలతో మదన బాణాల గురి తగిలి ఇనుప గుగ్గిళ్ళులావుంది.

## ఊయల పాటలు

ప్రతి రోజు మధ్యాహ్నం 2 గం॥లకు కల్యాణం చేసుకున్నస్వామి దేవేరులతో అద్దాల మండపంలో డోలోత్సవం జరుపుకుంటారు. ప్రతిరోజు సాయంత్రం 5:30 ని॥లకు ఆలయం వెలుపల ఆగ్నేయములలో 'సహస్రదీపాలంకరణసేవ' అనబడే ఊంజలసేవ జరుగుతుంది. ఇవి ఆర్జిత సేవలు, భక్తులు పాల్గొనవచ్చు.

"తొల్లియును మఱ్ఱాకు తొట్టెలనెయూగెగన
చెల్లుబడి నూగీని శ్రీరంగశిశువు" (4-1) (అనుబంధము)

ప్రళయకాలమున జలార్ణవ మైన సమయమున వటపత్రశాయియై నీటిపై తేలియాడిన ఈశ్రీరంగశిశువు ఇప్పుడు కూడా ఊయలలూగుతున్నాడు. ఈ శ్రీరంగశిశువు కావేరీకన్య తరగలనే బాహులతలతో రంగమధ్యపుతొట్టెలలో వూచిపాడగా పెదవి అంచున పాలు గారగా ముద్దులొలుకు తున్నాడు. బ్రహ్మ తిరువారాధన సమయంలో బ్రహ్మాండమనే తొట్టెలో సముద్రపు తరగలు వూచగా చెరగని సిరులతో వూగుతున్నాడు. నాలుగువేదాలు వూయలకు నాలుగువైపులా గొలుసులుకాగా ఆదిశేషునిపాదు తొట్టెకాగా శ్రీదేవితో కూడి వేంకటేశుడు (శ్రీరంగశిశువు) సేద దీరుతున్నాడు.

"జో అచ్చుతానందజోజో ముకుంద
రావె పరమానంద రామ గోవింద" (పీఠిక 61)

ఇది ప్రసిద్ధమైన జోలపాట. అచ్యుతమైన ఆనందాన్ని కలిగించే ఓముకుందా! గోవిందా! ఇటురా! మదనుని గన్న మాయన్న బంగారు గిన్నెలో పాలుపోసితెచ్చాను ఇటురా! నీవు దొంగవని గోపికలు చెప్తున్నారు. ఇక్కడ నాముంగిటనే ఆడు. దేవకీపట్టివైన నీవు గొడుగుగా గోవర్ధన్నాన్ని ఎత్తి పట్టి, తొడగొట్టి కంసుని కావరాన్ని అణచి, మధురాపురాన్ని జయించి, ఠీవితో తిరిగే ఓముకుందా యిలారా! తాళ్ళపాక అన్నమయ్య హంగుతో ఈ జోలను శృంగార రచనగా చెప్పాడు. సమస్త సంపదలను అందించే ఓ మదనగోపాలా నీకు మంగళము.

"ఉయ్యాల బాలునూచెదరు కడు
నొయ్యనొయ్య నొయ్యనుచు" (5-246)

బాలాగోపాలుని మురిపెంగా ఉయ్యాల లూస్తున్నారు. పసిడివుయ్యాలలో వున్న బాలుని వద్ద యువతీమణులు 'లాలి లాలి' అనిపాడుతున్నారు. తమ క్రీగంటి చూపులతో

మదనోద్దీపితలైన వారు తమనడకలలో వయ్యారాలు చూపుతూ పాడుతున్నారు. అందెఘల్లు ఘల్లు మనగా రేపల్లె బాలునిపై వలపుచూపులు చల్లుతూ పాడుతున్నారు.

"లాలనుచు నూచేరు లలనలిరుగడల
బాలగండవర గోపాల నినుచాల" (పీఠిక -63)

ఊంజలపాటగాప్రసిద్ధమైన దీనిని వాణీ జయరాం సుస్వర మధురస్వనంలో రికార్డుచేసింది. వనితలు గండవరగోపాలుని లాలి పాటలతో బడలికి దీరుస్తున్నారు. చనుగుబ్బల సరములు వూయలలూగగా, కంకణరవాలు మారుమ్రోగగా, కొప్పులు వీడగా, ముంగురులపై ముదురు చెమటలు మెరయగా, కనుచూపులు ఇరువైపులా తుమ్మెదల ఝుంకారాలకు ప్రతిగా నిలువగా కోయిలజంటలు మదనుని గురుతులను గురుతు చేయగా జంగలు చాచి, సరసపదాలు  ముందుకు సాగగా కుచ్చెళ్ళు మీగాళ్ళపై రాయగా బాహుమూలములకాంతి తొణికిసలాడగా, పూలవాసనలు ఎదురురాగా ఒకరినొకరు మెచ్చు కుంటూ నునుమేనుల లతకూనలు మెలకువతో వుండగా, చిత్తరువులలోని బొమ్మలు తలలూచగా, తాంబూలము సేవించిన దంతాలకెంపులు కనిపించగా, చిరునవ్వులు చిందు లాడగా, మలయమారు తము మంద మందంగా సాగగా, కర్పూరపు తావి వ్యాపించగా, గానలహరికి రాలు కరుగగా, వినేవారి చెవుల బడలిక తొలగగా ఓపరమాత్మరూపా! మునుల ఆత్మలలో మెలిగే తత్వప్రదీపా!లాలి లాలి అని ఇరువైపులా నిలిచిపాడుతునాన్నారయ్యా!

"అలర చంచలమైన ఆత్మలందుండ నీ
అలవాటు సేసెనీ వుయ్యాలా"
పలుమారు నుచ్ఛ్వాస పవనమందుండ నీ
భావంబు దెలిపెనీ వుయ్యాల" (1-67)

చంచలస్వభావులైన ఈజీవాత్మల ఉచ్ఛ్వాస నిశ్వాసాలలో పరమాత్మ ఉయ్యాల లూగుతున్నాడు. ప్రాణచైతన్యశక్తి ఉచ్ఛ్వాసనిశ్వాసలరూపంలో వుంటుంది. ఆ భావాన్నే ఉయ్యాల తెలియ జేస్తున్నది. ఉదయాద్రి పశ్చిమాద్రి ఆవూయలకు స్తంబాలు. నక్షత్రమండలము వూయలనుమోస్తున్నది. ఆకాశమార్గము అడ్డధూలమైనది వేదాలు బంగారు గొలుసులై పట్టుకొనుటకు భయమేస్తోంది. ధర్మదేవత పీఠమైంది. ప్రతికదలికలోనూ శ్రీభూసతులు నిన్నుకౌగిలించుకొనేలా చేస్తున్నది. అమరాంగనలకు నీ హావభావ విలాసములు అందంగా కనిపిస్తున్నాయి. కమనీయ మూర్తివైన నీ వూయలసేవ బ్రహ్మాదులకు కనులపండుగ అయింది.

"నిద్దిరించిపాల జలనిధిఫలెనే
ఒద్దిక శ్రీరమణునికి వొత్తరే పాదములు" (5-343)

శ్రీరమణుడు పాలసముద్రములోవలె నిద్రించాడు. ఓ సతులారా! ఆయన పాదాలొత్తండి. తెల్లవారిని దాకా భక్తులను చిత్తగించి వేదాలను ఆదరించి కృపా రసాన్ని పంచి శ్రమపడి పవళించాడు. భోగించాడు. ఆయన శ్రమ పోయేలా వూచండి. క్రీగంటి రెప్పల వడదెబ్బ సోకి నిట్టూర్పులకు శరీరం వేడెక్కగా ఆనీలవర్ణుని మీకన్నుల చల్లని చూపులతో దోమతెర కప్పండి. యోగనిద్రను చాలించి లోకాలను కరుణించటానికి ఈ వేంకటగిరిపై వెలసిన ఆస్వామికి ఆలవట్టాలు విసరండి.

"జోజో యని మీరు జోలపాడరో
సాజపుజయంతి నేడే సఫల మిందరికి" (3-461)

పుట్టినరోజు వేడుకలు జాతకర్మాదిశౌచములతో ప్రారంభమౌతాయి. షోడశోప చారములు చేద్దామని అన్నమయ్య చక్కనివూహ చేశాడు. మనందరికీ స్వామి జయంతి జరుపుకునే ఫలం కలిగింది. చంద్రోదయాన హరి అవతార మందాడు. జాతకర్మలు చేయండి. పుణ్యహవాచనము చేసి, పుత్రోత్సవ సమయంలో నామకరణం చేయండి. బిడ్డనుదేవకి చేతికిచ్చి వసుదేవునికి గంధాక్షతలు వీడెము ఇవ్వండి, గాడిదకు దానాపెట్టి చుట్టాలకు మర్యాదలు చేయండి. షోడశోపచరములతో పాడండి. కౌరవులను ఓడించి, కంసాదులను చంపి, పాండవులను కాచిన అతనికి అర్ఘ్యము ఇవ్వండి.

"ఉయ్యాల యూపులు ఓముద్దులయ్య
వెయ్యారు గోపికలు వేడుకనూచెదరు" (27-27)

ఓ వేంకట రమణా ! పదహారువేలగోపికలు వేడుకతో వూయలలూస్తున్నారు 'భోగీంద్రశయన, భువన విఖ్యాత గోపరక్షక, అచ్యుత, అనంత, ఆగమసన్నుత, నీవు యోగనిద్రపోవయ్య ఎనిమిది దిక్కుల దేవ ఋషులు వెలిగిపోతున్నారు. బంగారు భవనంలో నిద్రించవయ్యా. అని పాడుతున్నారు. భాగవతులు సన్నుతిస్తున్నారు. శ్రీభూసతులు పాదాలొత్తు తున్నారు. ఇంక సుఖంగా నిద్రపోవయ్యా !

"జోజో దీనజనావనలోలా
జోజో యదుకులతిలకా గోపాలా ? (27-25)

ఓ దీనబంధు గోపాలా పవళించమయ్యా ! వేదాలు రత్నాలగొలుసు లైనాయి. వేదాంతము అపరంజి తొట్లయినాయి. ప్రణవనాదముపానుపయింది. ఓకాంకరరూపుడవై పవళించు. చిత్రంగా దశావతారాలలో చతుంశ భువనాలనను రక్షించావు. జన్మరహితుడవైన నీవు ప్రతియుగంలో జన్మించావు. శాంతిదాంతుల మణిహారము, కుసుమమాలికగా మెరయగా నీవు వేంకట రమణుడ వయ్యావు.

## తెప్పోత్సవాలు

ప్రతి యేటా శ్రీస్వామిపుష్కరిణిలో పాల్గుణ పౌర్ణమికి పూర్తగు నట్లుగా ఐదురోజులు తెప్పోత్సవాలు జరుగుతాయి. మొదటిరోజు ఏకాదశినాడు శ్రీసీతారామలక్ష్మణులు, రెండవరోజు ద్వాదశిన రుక్మిణీశ్రీకృష్ణులు, చివరి మూడురోజులు శ్రీదేవిభూదేవి సమేత శ్రీమలయప్పస్వామి తెప్పోత్సవంలో పాల్గొంటారు. అది ఆర్జితసేవ.

"సింగార మూరితివి చిత్తజ గురుడవు

సంగతి జూచేరు మిమ్ము సాసముభా!" (2-471)

మదనజనకుడవైన నీశృంగారమూర్తిని తాపంతో అందరూ చూస్తున్నారు. పూల తెప్పలపై నీవు నీవనితలు ఎక్కి ఆకాశమంటేలా పూలు చల్లుకుంటున్నారు. దేవ దుంధుభులు మ్రోగుతున్నాయి. సావధాన అమరభామినులు అంగరంగ వైభోగంగా ఆడిపాడుతున్నారు. దేవతల సంగీత నృత్యవాద్యాలతో మీరు తేలియాడు తున్నారు. కోనేటిలో పసిడిమేడపై కనుల పండువుగా నీవూ ఇందిర సరసాలాడుతున్నారు.

"దేవునికి దేవికిని తెప్పలకోనేటమ్మ

వేవేలు మొక్కులు లోకపావనీ నీకమ్మా" (2-426)

ఓ కోనేరు తల్లీ! దేవునికి దేవికి తెప్పలవేళ నీకు వేలవేల మొక్కులు. చతుర్విధ పురుషార్థాలైన ధర్మార్థకామ మోక్షాలు నీశోభనాలు. నాలుగు వేదాలు నీదరులు. నీజలమే సప్తసాగరాలు. కూర్మమునీలోతు, గంగాదితీర్థాలు నీకడళ్ళు, దేవతలంతా నీజలజంతువులు, పుణ్యలోకాలు నీదరినున్న మేడలు. నీచుట్టూవున్న చెట్లుమునులు. వైకుంఠనగరవాకిలి నీఆకారము. పుణ్యములే నీజీవ భావము. నీలో తీర్థమాడి మేము పుణ్యులమయ్యాము.

"ఎందునీకుప్రియమూఈతెప్ప తిరునాళ్ళు

దిందువడె సిరులతో తెప్పతిరునాళ్ళు" (2-143)

నీకు అనేకరకాల తెప్పోత్సవాలు జరిగాయి. నీకు ఏది ప్రియమో చెప్పవయ్యా! పాలసముద్రంలో పామునే తెప్పగా చేసుకొని తెప్పతిరునాళ్ళచేసుకున్నావు. ప్రళయకాలమున జలధిలో మర్రిఆకుపై తేలాడావు. అమృతమథన సమయంలో మంథరాన్ని తేలియాడింపజేశావు యమునా నదిలో కాళింగుని పడగలపై నర్తిస్తూ తేలావు. పదారువేల భామల చెమటల తెప్పలలో తేలియాడావు. నేడు పుష్కరిణిలో తెప్పతిరునాళ్ళ చేసుకుంటున్నావు. నీకు వీనిలో ఏదియిష్టమో చెప్పవయ్యా!

"మరలి మరలి జయమంగళము
సొరిదినిచ్చలును శుభమంగళం" (1-448)

మరల మరల జయమంగళము నిత్యశుభమంగళము. పద్మావతికి, పద్మాక్షునకు మమతల జయమంగళం. దేవతలజననికి దేవవంద్యునకు శుభమంగళం. జలధికన్యకు, జలధిశాయికిని శుభమంగళం. శ్రీదేవికి సిరివిభునకు శుభమంగళం. చిత్తజుని తల్లికి శ్రీవేంకటకపతికి జయమంగళం. ఇద్దరికౌగిటి రతులకు శుభమంగళము.

"చిత్తజగురుడ నీకు శ్రీమంగళం నా
చిత్తములో హరి నీకు శ్రీమంగళం" (20-189)

చిత్తజగురునకు నాచిత్తములోని శ్రీహరికి! మంగళము. బంగారుబొమ్మ వంటి లక్ష్మీదేవిని ఉరము మీద సింగారించు కొనిన నీకు మంగళము. పీతాంబరధారికి మంగళం. గంగను పాదాలచెంత పుట్టించిన నీకు శ్రీమంగళం. కౌస్తుభమణిని ధరించి భక్తులపాలిటి చింతా మణివైన నీకు శ్రీమంగళం. అరిది పచ్చలవంటి అంగన శిరసుమీద సిరుల (కల్యాణముల) దాల్చిన ఘనసంపదలు గలిగిన శ్రీవేంకటేశానీకు ఇవే మంగళాశాసనములు.

"జయమంగళము నీకు సర్వేశ్వరా
జయమంగళము నీకు జలజవాసినికి" (2-431)

సర్వేశ్వరుడవైన నీకు పద్మావతికిని జయమంగళము. శరణాగతులపాలిటి పారిజాతము, అసురాంతకుడవు. సృష్టికి ఆదిమూలమవు. పరతత్వమువైన హరి నమో నమో! సకలదేవతా చక్రవర్తివి, విశ్వమంతానిండిన విష్ణుడవు, పరిపూర్ణ కరుణానిధివి, విధాతను నిర్దేశించిన వాడా! కొలిచినవారి కొంగు బంగారమా! దాసులమైన మాకు శ్రీవేంకటేశా విధేయుడవు!

"మాధవునకు మంగళము
సాధు ప్రియునకు మంగళమూ" (17-287)

సాధుప్రియుడైన మాధవునకు మంగళము. మదనగురునకు, మామదిలోని హరికి మంగళం. మరదిపువారునకు మంగళం. వేదమూర్తికి మంగళం. మహిమాధిపునకు, మహామహునకు, భూదేవిభర్తకు, తేజస్వికి, మాయారహితునకు మాఇలవేల్పునైన శ్రీవేంకటేశ్వరునికి శ్రీ సతికి జయమంగళం నిత్య శుభమంగళం.

"అంగనలీరే యారతులు
అంగజగురునకు నారతులు" (19-346)

అంగనలారా! మదనగురునికి హారతు లివ్వండి. శ్రీదేవితో కూడివున్న ఆది పురుషునకు ఆరతులు. భూదేవితో సరసములాడే సూర్యతేజునకు ఆరతులు. సురలకు అమృతము నందించిన హరికి బంగారుహారతులు. దుష్టదనుజుల నడచిన అరిభయంకరునకు హారతులు. నిత్యం కల్యాణమూర్తిగా తిరిగే అచ్చుతునకు ఆరతులు. శ్రీవేంకటేశుడు అలమేలుమంగ వచ్చి నిలచారు. అంగనలారా! హారతులివ్వండి.

"ఎత్తరే హారతు లీపె కింతు లాల
హత్తెను శ్రీవేంకటేశు కలమేలుమంగ" (8-84)

శ్రీవేంకటేశుడు చేపట్టిన ఈఅలమేలుమంగకు హారతులివ్వండి. హరి తన ఉరముపై తాళివలె ధరించివున్నాడు. స్వామికి సాటిలేని సంసారఫలము ఆమె. సంపదలకు పుట్టినిల్లు సింగారములకు విత్తువంటిది, ఈ మెరుగు బోడి అలమేలుమంగమ్మ పరమాత్ముని అంతరంగమున గల బొమ్మ, స్వామిబోగములకు మేడ, సరసపు సంద్రము, సత్యమైన కొంగుబంగారము, అరుదైన సంపదల ఆ అలమేలుమంగ. శ్రీవేంకటేశుని దేవేరి. చిత్తజునకు తల్లి అయిన ఆమె ఈవల ఆవలకూ తానేయై విభుని కౌగిటిలోని కళయైన పెండ్లి నిధానము.

"సుముఖమంగళము శుభమంగళము
శమదమగత తే జయమంగళం" (16-419)

మంగళకరమైన స్వామికి మంగళములు పలుకుతున్నాడు. ఎలాంటి స్వామి ఆయన? శమదమ గుణాలను ప్రసాదించే వాడు (శాంతి, దాంతి), గంభీరగుణుడు, కమలారమణుడు, పార్వతిచేనుతింపబడినవాడు, జలదిశయనుడు, పీతాంబరమును ధరించినవాడు, దనుజశరణుడు, రాక్షసాంతకుడు, విశిష్టచరిత్ర గలవాడు, సనకాదులచే స్తుతింపబడినవాడు, చతుర్భుజుడు, మకరిని సంహరించినవాడు, శరణాగత వత్సలుడు అయిన ఆస్వామికి జయ మంగళం నిత్యశుభమంగళం.

"క్షీరాబ్ధి కన్యకకు శ్రీ మహాలక్ష్మికిని
నీరజాలయమునకు నీరాజనం" (20-295)

క్షీరసాగరకన్యయైన శ్రీమహా లక్ష్మికి, పద్మ జాలయకు నీరాజనం. ఈసందర్భంలో ఆమె అంగాంగములకు భక్తితో నీరాజములను, నతి సకలకళలకు నీరాజనమున ముఖచంద్రబింబానికి, జక్కవకుచములకు, కర్పూర నీరాజనం ఆమో కొప్పునకు, కరకమలములకు మాణిక్య నీరాజనం. చరణపల్లవాలకు అరటి బోదెలవంటి తొడలకు ముత్యాల నీరాజనం. జ ఘనానికి, నాభికి నానార్ఘనీరాజనం. వేంకటేశుని పట్టపురాణియైన ఆతల్లి కళలకు నీరాజనం. చక్కదనాల చుక్క యైన అలమేలుమంగకు శోభనపు నీరాజనం. అన్నమయ్యతోపాటు మనమూ అమ్మకు హారతులిద్దాం.

ఉ॥ ఓ కమనీయ కంజముఖి యోవలరాయనితల్లి యోసుదా
సైకత చాతురీ జఘన చక్రిణి యోయల మేలు మంగ నీ
వేకరుణించి కావు మని వేడ్కల నింద్రపురంధ్రులందఱున్
బైకొని నీలతాప్రతిమ బ్రస్తుతి సేతురు వేంకటేశ్వరా!

(శ్రీవేంకటేశ్వర శతకము, పద్యసంఖ్య - 36)

ఉ॥ మంగళమమ్మకున్ సకల మంగళ మంబుజ నేత్రికిన్ జయా
మంగళ మిందిరా సతికి మంగళ మీ యలమేలుమంగకున్
మంగళ మందు నేమతియు మంగళ ముందును దేవలోక ది
వ్యాంగనలెల్ల నీ సతికి నారతు లిత్తురు వేంకటేశ్వరా!

(శ్రీవేంకటేశ్వర శతకము, పద్యసంఖ్య - 28)

ఈ మంగళ పద్యములను పి.సుశీలగారు' అన్నమయ్య అంతరంగంలో అలమేలు మంగ' క్యాసెట్‌లో పాడారు.

# ఉపయుక్త గ్రంథాలు


1. అన్నమాచార్య సంకీర్తనామృతం - డా॥ సముద్రాల లక్ష్మణయ్య
   1,2 భాగాలు
2. అన్నమయ్య సంకీర్తన స్వరమాలిక - తి.తి.దే. ప్రచురణ.
   1,2,3 భాగాలు
3. పదసాహిత్య వైభవం - ఆచార్య జి. చలపతి
4. అన్నమాచార్య పదకవితలు
   –మధురభక్తి - డా॥ రెడ్డి శ్యామల, వై.
5. అన్నమయ్య పదామృత వర్షిణి - సుజన రంజని ప్రచురణ
6. కీర్తనా కౌముది - డా॥ పి. లీలావతి
7. అన్నమాచార్య సంకీర్తన వైభవము - జి. నాగేశ్వర నాయుడు
8. అన్నమయ్య వ్యాసావళి - డా॥. సి. గోవిందరాజులు
9. అన్నమయ్య సంకీర్తన సంపుటాలు - తి.తి.దే. ప్రచురణ
   1–29 సంపుటాలు.



[illegible]

(Senior Fellow, Dept. of Cu
Govt. of India-2009-11)

శ్రీవారు : డా॥ ఆర్. అనంత పద్మనాభరావు, M.A., Ph.
ప్రిన్సిపాల్, నారాయణ I.A.S. అకాడమి

కుమార్తె : శ్రీమతి కె. శైలజ, M.Sc. B.Ed.
ప్రిన్సిపాల్, Best School, బళ్ళారి.

కుమారులు : ఆర్. రమేష్‌చంద్ర, M.Tech, MBA
వైస్ ప్రెసిడెంట్-ఆదిత్య బిర్లా మినాక్స్
బెంగుళూరు

ఆర్. జనార్దన్, B.Tech., MBA
సీనియర్ మేనేజర్, HP, బెంగుళూరు

తమ్ముడు : ఐ. పూర్ణచంద్రరావు, B.Tech
చీఫ్ మేనేజర్-పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, చెన్నై